
సంక్రాంతి ప్రత్యేక సంచిక:

ఆంధ్రప్రదేశ్

Regd. No. H. 373

సంపుటి 5 జనవరి 1961 పుష్యం, 1882 శకము సంచిక 3





హరిదాసు— చిత్రకారుడు వీరిశెట్టి అమృతరావు

ఆంధ్రప్రదేశ్

సంక్రాంతి ప్రత్యేక సంచిక

సంపుటి 5 | జనవరి 1961 | సంచిక 3
పుష్యం, శకము 1882

విషయసూచిక

1.	ఆత్మ రహస్యములు	బూర్గుల రామకృష్ణారావు	1
2.	పల్లవు లాంధ్రులా ?	పోతుకూచి శ్రీరామావధాని	5
3.	పెండ్లి లగ్నం	రాయప్రోలు సుబ్బారావు	7
4.	సంక్రాంతి	రోణంకి అప్పలస్వామి	9
5.	అఖిలాంధ్రోదయం	శనగన నరసింహస్వామి	11
6.	నాగార్జునాచార్యుడు	సందూరి రామకృష్ణమాచార్య	15
7.	సర్వశుక్ల	మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి	17
8.	హేమంతము-మకర సంక్రాంతి	చిలుకూరి పాపయ్య శాస్త్రి	18
9.	దంపతులు	మిన్నికంటి గురునాథశర్మ	23
10.	చీకటి నవ్వింది	ఎ. మురళీధర్	25
11.	గాలి మేడలు	కందుకూరి రామభద్రరావు	30
12.	నిరర్థక పదప్రయోగం	మునిమాణిక్యం నరసింహారావు	33
13.	నిష్క్రమణము	శ్రీపాద లక్ష్మీనారాయణమూర్తి	39
14.	తెలుగుభాషలోని నాటక విమర్శ	పోణంగి శ్రీరామ అప్పారావు	44
15.	లగ్గము	వై. వెంకటరావు	52
16.	ప్రబంధాలలో పండుగ భోజనాలు	ఉత్పల సత్యనారాయణాచార్య	53
17.	పొదుపు ఉద్యమం	క. లక్ష్మీనరసయ్య	56
18.	అనర్గళ భార్గవము	మోచెర్ల రామకృష్ణకవి	58
19.	నీలకంఠుని వక్రోక్తి	కుంటిమద్ది శేషశర్మ	63
20.	సంస్కృత కవుల వ్యాకరణ చమత్కారాలు	శ్రీనివాస సోదరులు	68
21.	హేమంత సంక్రాంతి	పైడిపాటి సుబ్బరామ శాస్త్రి	70

22. బాపిరాజు కవితామాధురి	...	అడపా రామకృష్ణరావు	...	78
23. ఎగుమతి బాండ్లు	...	—	...	77
24. మూడవ ప్రణాళిక ఆశయాలు	...	—	...	78
25. ప్రగతి పథంలో	...	—	...	81
26. ప్రశ్నోత్తరావళి	...	—	...	83
27. పెద్ద దిక్కు	...	మధుశ్రీ	...	84
28. పుష్యలక్ష్మి	...	బొడ్డు బాపిరాజు	...	94
29. పారిశ్రామిక విశేషాలు	...	—	...	95
30. పొదుపు గ్రామం	...	—	...	96
31. ప్రభుత్వ నిర్ణయాలు	...	—	...	96
32. ముఖ్యవార్తలు	...	—	...	97

ముఖచిత్రం : సంక్రాంతి చలిమంట-చిత్రకారుడు : మారేమండ శ్రీనివాసరావు (గుంటూరు).

వెనుకఅట్ట : హైదరాబాదులో బాలల దినోత్సవం. (14-11-1960). ఈ సందర్భంలో ప్రదర్శించబడిన కురుపాండవ యుద్ధం.

చందా వివరాలు

సంవత్సరానికి	—	2 రూపాయల 16 నయాపైసలు
విడి ప్రతి వెల	—	18 నయాపైసలు

Edited & Published by the Director of Information & Public Relations, Andhra Pradesh, Hyderabad-1
Printed at Yuva Press, Public Garden Road, Hyderabad-1

ఆత్మ రహస్యములు

బూర్గుల రామకృష్ణారావు

(ఇక్బాల్ మహాకవియొక్క 'అస్రారెఖుదీ' అను పారసీక
కావ్యమునందలి కొన్ని పద్యములకు అనువాదము)

రాతిరి త్రోవలందున, పరాఙ్ముఖుండై చనె భాస్కరుండు, నా
చేత గులాబిరేకు లభిషేకము నందెను బాష్పధారలన్,
నాతడి కంటినీరు నయనంబుల జారగ నుల్కి పంకజ
ప్రాంతము నిద్ర మానె మదవారిత గర్జనచేత పచ్చికల్
ఘంతలమందు మేల్కొనియు, పూలవనంబున తోటవాడు నా
గీతములన్ పఠించి పరికించి పదంబులఁ బాడి ఖడ్గమున్
చేకొనుబూనె, నా కనులఁ జిందెను నక్షత్రకణాళిఁ దప్ప వే
రొకడు పైరు వేయజన డాతరశోకసమృద్ధమౌ పనిన్

గీ. అణువె యైనను నాలోనె యణఁగియుండె
దివిజ విభ్రాజ భాస్కర తేజమెల్ల;
విశ్వసమ్మోహనంబు తా వివిధ మంత్ర
తంత్రజాలము నోటిలోన దాచియుంచె.
విశ్వదర్శనియౌ 'జము' వింతపాత్ర
కంటె నా మట్టి పాత్రయే కాంతియుతము
జనన మందనివారల చరిత లెల్ల
గాన మొనరించు మర్మవిజ్ఞాని యగుట.

సీ. నా భావపాశంబు నా స్తిత్వగతి దాఁటి
గంతు వేయని లేడిఁ గట్టివైచు;
నా పుష్పవనముల నర్తించు నెప్పుడు
మొలవని పలు పచ్చికల బయళ్లు;
నా రొదుల్ నింపును నానావిధంబులౌ
కొమ్మల దాగిన కుసుమచయము;
నా వీణ మీటిన, నాదించి జగమెల్ల
విశ్వనాదులు మ్రోఁగ విరతిఁ జెందు;

గీ. భవ్యపరిమళశోభితభావగతులు
కమ్రరాగాత్మకములైన గానగతులు
లలితసంపద లెన్నియో గలిగియుండు
తెలియనేరరు సహచరుల్ తెలివిమాలి.

చ. జగమునఁ గ్రొత్తఁగాఁ బొడమి జాగృతి సందిన భానుమూర్తినిన్
గగనపుఁ దీరులున్ నదులుఁ గాంచఁగలేను, భ్రమించు టెట్లో? నా
మగటిమిఁ జూపి తారలను బ్రుందిలఁ జేయఁగఁబోవ నెన్నఁడున్
భుగభుగ మంచుఁ బారదము పొంగఁగలేదు మదీయ దృష్టిచేన్.

ఉ. సాగరవీధి నా విమలసత్త్వమరీచులు తాండవింపఁగా
మ్రోఁగఁగలేదు; నా యరుణమోహనవర్ణము లింకఁ జిందలే
దే గిరిసానుసీమతలి, నెట్లు భరింతు నటంచు విశ్వమే
దాగిలిమూత లాడెడిని, దాయ వడంకును నన్ను గాంచినన్.

శా. నా సౌధాగ్రము భానుమండలము, నాన్యక్కారముం జేసియే
పోసెన్ రేయి, హిమాంబుబిందువులచే వాసిల్లె పృథ్వీ సుమం,
బాసన్ బ్రాగ్దిశఁ జూతు నుజ్జ్వల శుభారంభంబుకై నెమ్మిమై
నే సందేహములేక అర్ఘ్యములకై యేతెంచు పూజారతుల్.

ఉ. ఏ నొక రాగమన్; స్వరము లీనుదు నే 'నఖి' మీటకుండఁగా;
నే నిదె భావిగీతికల నింపునఁ బాడు కవీంద్రు సుశ్రుతిన్;
ఈ నరులే రహస్యముల నెప్పు డెఱుంగరు; కాలబద్ధులై
కానరు "యూసఫున్"; విలువ గానఁగలేరు బజారువారలున్.

చ. వెనుకటి మిత్రులెల్ల నను వీడిరి; నాకు నిరాశ హెచ్చె; నా
ఘన మగు "తూరు" కొండ నిదె కాల్చుచునుంటిఁ గలీమురాకకై
వనరుచు; మిత్రవారినిధి వారిచయంబులు నిశ్చలంబులై
తనరెడు; నా హిమాంబు లగుఁ దామ్రతరంగములన్ మహాబ్ధులున్.

ఉ. వేఱొకలోకమందుఁ బ్రభవించె మదీయమనోజ్ఞరాగముల్;
వేఱొకసార్థవాహమును వేఁకువగంటలు మేలుకొల్పెడిన్;
ఆరయ నెందరో సుకవు లంతము నొంది జనించినారు; వే
మాఱులు కన్నుమూసికొని మా కనుమూఁతలు విప్పి రెంతయున్.

ఉ. నాశమునుండి తీసినవె నా దెవుసంపదలున్ హోయళ్లు; రో
ఝాసుమముల్ జనించు నిజశల్యసమాధులమృత్తికావశిన్;
ఈసున నీయెడారిఁ జనె నెన్ని బిడారులో యొంటెపోల్కి, నా
వేశవిహీన నా నడుగు వేయుచు నల్లరిఁ జేయకుండఁగన్.

ఉ. ఏ నొక పాంథుఁడన్; జగములెల్ల మదీయవియోగవేదనా
ధ్వనిముచేత నింపుటయె ధర్మము నాకు; లయోగ్రవహ్నులన్
గానఁగఁ బ్రౌఢి రేపెదను; గానముతంత్రులశక్తి మించినన్
నేను జలింపఁ, జూడెదను నిక్కము వ్రక్కలుగాఁగ పిడుగుల్. 11

గీ. నాదువాహిని నంటఁగా లేదు లేదు
జలధికల్లోలమధ్యమున జడతఁ దాల్చి
మొలఁగుటయె మేలు; నా గాధజలధిపరగ
చిన్ని సెలయేటిపరదలఁ జేరఁగలదె ?
ఎన్నిసంద్రములైనను నెనయలేని
నాదుసంక్షోభమున కీడు గాప వెవ్వి. 12

ఉ. మొగ్గలదెల్వు చూపినను బొందికఁ బూయనిపుష్పవాటికన్
నిగ్గగునావసంతనవనీరదవుల్ గురియంగలేదు; ఈ
దగ్గరె నాదుజీవనుని దాగి సుషుప్తినిఁ జెందె నెన్నియో
యగ్గిపిడుంగు; లీగిరిగుహాటవు లెల్ల మదీయకేళికల్. 13

ఉ. ఈవె యెడారివేని, వెసనీఁదుము నాదునగాధవారిధిన్
నీ వొక మేరువేని పడి నింపుము నీయెద నాపిడుంగులన్
చావిక లేదు ముంచితిని సర్వజగం బమృతంపుసోనలన్
జీవితమర్మసూత్రములసిద్ధరహస్యములెల్ల దాచితిన్. 14

చ. వినుము మదీయశోకమున వెల్గుదవానలరాగదీప్తిచేఁ
దనువు ధరించి యయ్యణువు దర్పమెలర్ప వెలింగె భానుఁడై
ఘనుఁ డెవఁడేని నా తెఱఁగు గాఢరహస్యములెల్ల విప్పెనే ?
మనసరి యర్థభావముల మౌక్తికహారము లిట్లు గూర్చెనే ? 15

ఉ. కోరిన, నిత్యసౌఖ్యములగూఢరహస్యములెల్లఁ దెల్పెదన్
జేరఁగ రమ్ము భూతలముఁ జేరుదువో మఱి యాకసంబొ ? నీ
కోరికఁ గూర్తు; కాలగురుకోవిదసూక్తిరహస్యబోధనల్
సారెకు మిత్రులుగా వినఁగఁ జాటెద; దాపగ నేల సత్యముల్. 16

చ. కలశము నింపు రమ్ము సఖి, కమ్మనితేనియ లూరఁ ద్రాపు, మీ
సలలితమాధవీమహిమసర్వయుగాంతరబాధ లెల్ల హృ
జ్జలజమునుండి మాయ మగు; స్వర్నది జాహ్నవినుండి ప్రాకె నీ
సలిలము వహ్నిసంయుతము, శ్రద్ధమెయిన్ నిరతంబు సేవనల్
సలుపఁగ భిక్షుకుండయిన సంపద లొంది "జము" ప్రభుం డగున్. 17

ఉ. అనవసీమఁ జేయు సముదంచిత నిశ్చిత జ్ఞాన సంపదు, స
ఖ్యానములచే వివేచనమున వర్ధిలు కన్నులు దీప్రకాంతి వి
న్యాసి మొనర్చు, నేత్రయుగము నైనను మేరువు గౌరవంబుచే
భాసిలఁ జేయు, నక్కటకును బ్రాకట సింహాచలం బొసంగినన్. 18

ఉ మానిన పట్టికేని సురమాన్యత గల్గఁగ సత్యలోక సం
వాసముఁ గూర్చు, బిందువును వార్ధిగభీరభయంకరాంబుసం
భాసముఁ దార్చు; మౌనమును మాన్పును సుగ్రలయస్వనంబుగా
నీసున డేగరక్తమున నెత్తుగఁ బిచ్చుకకాళ్ళఁ జేసెడిన్. 19

ఉ. తెమ్ము మదీయ పాత్రమున తీరఁగ నింపుము దుర్లభంబు నో
కమ్మని మాధవీసుధను; గాసిలి చీకటి నున్న నాదిశన్
జిమ్ము శశాంక దీధితులు, చేరగ గూర్తు సుదృక్పథంబులై
యిమ్ములఁ బర్వ కోరికల నిచ్చలు పారెడు నాదు చూడ్కులన్. 20

ఉ. క్రొత్తపరీక్షలన్ వివిధకోవిదశోధనలన్ నవీన మో
నెత్తురు దాల్చి క్రొత్తగిలి, నిత్యము నూతనమైన యాశలన్
మత్తిలెదన్, వివేకజనమాన్యత నొందెదఁ గంటిఱెప్పవై
మొత్తుచు, విశ్వకర్ణమున నాడెద శబ్దముపోల్కి లీనమై. 21

చ. ధర పెరిగింతు వాక్కుకు, సుధామధురోక్తులసొంపు నింపుచున్
నవములు గూర్తు కన్గవల జారిన ముత్తెపుఁ జిన్నిచుక్కలన్
మఱియొకసారి "రూము" గురుమాన్యుని భక్తిమెయిన్ దలంచి త
త్వరమరహస్యశాస్త్రముల భావసుబోధల నుద్ధరించెదన్ 22

చ. అతఁ డొకదివ్యకాంతియుతుఁ డాతనిజ్యోతి వెలుంగు నెల్లెడన్
సతముగ; విస్ఫులింగగతిఁ జల్లబడున్ క్షణమందు నా ప్రభల్;
అతని సుదీపికోజ్జ్వలశిఖాళినిఁ గాల్చితి నాదు ఱెక్కలన్;
అతని సుధాప్రవాహ విలయంబుల ముంచెను నాదు పాత్రలన్. 23

పల్లవులు ఆంధ్రులా?

పోతుకూచి శ్రీరామావధాని

శిలావిన్యాసాలలో భారతీయ శిల్పకళను మహోజ్జ్వల పరిణామము నొందించారు శాతవాహన చక్రవర్తులు. ఆంధ్రత్వాన్ని యావద్భారతాన మారుమ్రోగించారు వీరు. శాతవాహనుల తరువాత భారతదేశ చరిత్ర అంధకార బంధురం. ఈ సమయంలో ఆంధ్రదేశమున చిన్నచిన్న రాజ్యాలుద్భవించినై. వారి వంశోత్పత్తి మరుగున పడియున్న సమస్య. ఈ రాజవంశాలను గూర్చి విపులంగా పరిశోధించినవారు లేరు. మూడవశతాబ్దానంతరపు ఆంధ్రదేశ చరిత్ర తెలుసుకోవాలంటే ఆ కాలపు రాజవంశాలు పరిశీలనార్హములు.

ఆంధ్రదేశానికి సంబంధించిన సమస్యలలో పల్లవవంశోత్పత్తి ఒకటి. వీరినిగురించిన పుక్కిటిపురాణములు చాలా వున్నై. వాయువ్యదేశాన్ని పరిపాలించిన పహ్లవుల (పార్థియనులు) తెగవారే పల్లవులంటారు కొందరు పరిశోధకులు. 'పహ్లవులు', 'పల్లవులు' అను నీ రెండు శబ్దములకు పోలిక యుండుట చేత ఈ భ్రమ కలిగినదేమో. మణిపల్లవ నాగరాకుమారికి చోళరాజ కుమారునకు కలిగిన సంతతివారని మరికొందరి అభిప్రాయము. ఈ అభిమతానికి కావలసిన దృష్టాంతాలు కనుపించవు. వాకాటక రాజులు బ్రాహ్మణసంతతివారేమోనని జయస్వాల్ వంటి విజ్ఞులు అంటారు.

అయితే, వీరెక్కడివారు? ఏదేశాలను పరిపాలించారు అనే ప్రశ్నలు కలుగుతై. పల్లవులు తమిళులు అంటాడు శ్రీ నీలకంఠశాస్త్రిగారు. తమిళదేశాన్ని పరిపాలించినంత మాత్రాన, కాంచీ వీరి రాజధానులలో ఒకటిగా ఉన్నంత మాత్రాన వీరు తమిళులని నిర్ణయానికి రావటం సమంజసం కాదేమో! ఎవరికివారు పల్లవుల వంశోత్పత్తి వారిదేశంలోనని భ్రమించటం కద్దు. ఇటువంటి సమస్యలు సవినయంగా పరిష్కరించి, ఇదమిత్థమని సాపేతంగా నిర్ణయానికి రావలసిన అవసరం వుంది.

కనుక పల్లవులను గురించిన మరుగుపడియున్న కొన్ని అంశాలను చదువరులకు, చారిత్రక పరిశోధకులకు మనవిచేస్తాను.

శాతవాహనరాజగు వాశిష్ఠీపుత్ర పులుమావి కాలంనాటి పాండులీనగుహాశాసనం వీరిని తెలుపుతున్నది. శాతవాహనుల అనంతరము ఆంధ్రదేశంలో చిన్న చిన్న రాజ్యాలు బయలుదేరిన సంగతి అందరకు తెలిసిన విషయమే. పల్లవులకు శాతవాహనులకు వైవాహిక సంబంధాలున్నట్లు విశదీకరించాడు డుబ్రాల్ పండితుడు. దీనివల్లనే పల్లవులకు రాజ్యం లభించినట్లు చెప్పినాడు డుబ్రాల్. కాగా క్రీ. శ. 325లో తూర్పు తీరమున పెన్నా, పేలార్ నదుల మధ్యనుండు ప్రదేశమును పల్లవులు పరిపాలించినట్లు ఒక సంప్రదాయం. దీనినిబట్టి చూస్తే పల్లవులు ఆంధ్రులేమో ననే ఊహకు తావిస్తున్నది. ఇప్పటికిని పల్లవుల నాడు పల్నాడని ఆంధ్రదేశంలో ప్రతీతి.

పల్లవచరిత్రకాధారములు మూడు తామ్రశాసనములు. అవి గుంటూరుజిల్లాలోను, బళ్ళారిజిల్లాలోను దొరికినై. వాటినే మైదవోలు శాసనములు, హీరహడగల్లి శాసనములు అంటారు. అవి ప్రాకృతంలో ఉన్నవి. తలగుండ శాసనం పరిశీలిస్తే పల్లవ లిపికి, ఉత్తరహిందూస్థానపు లిపికి పోలిక వున్నట్లు ఆనాడు కాంచీపురాన్ని దర్శించిన చీనా యాత్రికుడు యువాన్‌చ్వాంగు చెప్పినట్లు తెలుస్తుంది. పై పేర్కొన్న శాసనాలను శిలాశాసన సమీక్షవారు మూడు నాలుగు శతాబ్దాలకు సంబంధించినట్లు నిర్ణయించారు. ఆనాటి శాసనాలు ప్రాకృతంలో ఉన్నట్లు గమనార్హము. ఆనాడు శాతవాహనులు యావద్భారతాన్ని పరిపాలించారు. వీరి శాసనాలు ప్రాకృతంలో ఉన్నట్లు విజ్ఞులకు విదితమే. భారతదేశమంతట ప్రాకృతం ప్రాధాన్యాన్ని అలంకరించింది. దీనినిబట్టి చూస్తే డుబ్రాల్ ఊహ నిజమేమోననిపిస్తుంది.

కాగా ఈ శాసనాల్లో బప్పదేవుడు, శివస్కందవర్మ, బుద్ధి, వీరవర్మ మొదలగుపేర్లు కలవు. బప్పదేవుడు ధాన్యకటకం రాజధానిగా చేసికొని తెలుగుదేశాన్ని, కాంచీపురం రాజధానిగ తమిళ తొండమండలాన్ని ఏకచ్ఛత్రాధిపతిగా పరిపాలించాడు. బప్పదేవుడే పల్లవరాజ్య స్థాపకుడేమో! ఈ నామములు తెలుగువారివే.

బప్పదేవుని కుమారుడగు శివస్కందవర్మ రాజ్యమును దక్షిణమునకు విస్తరింపచేశాడు. అందుమూలమున నితడు అశ్వమేధ, వాజపేయ, అగ్నిష్టోమ యాగాలను చేశాడు. శివస్కందవర్మ దక్కనువరకు విస్తరింపచేసిన రాజ్యంలో శాతవాహనులకు సంబంధించిన 'సాతాహాని' పేర్పబడియున్నట్లు గమనార్హము.

పల్లవుల కట్టడాలను పరిశీలిస్తే ఆంధ్రుల కళానైపుణ్యం ఉట్టిపడుతూంది. ఆంధ్రశిల్పుల సాంచీస్తూప దిగ్ద్వార శిలా విన్యాసాలు జ్ఞప్తికివచ్చును. ఈ కట్టడాలలో ఒక మహోన్నత శిల్పసంప్రదాయం కనుపిస్తుంది. ఈ సంప్రదాయాన్ని సృష్టించారు ఆంధ్రులైన శాతవాహనులు.

ఈ అంశాలన్నిటిని క్రోడీకరించి చూస్తే పల్లవులు ఆంధ్రులని. పల్లవ వంశోత్పత్తి ఆంధ్రదేశమని చెప్పడం అతిశయోక్తి కాదేమో !

శుభాశంసనము

సంతల నెల్లఁ దీర్చి, భగవన్నుతి కెంతయు వీలు గూర్చి, వి
శ్రాంతియె లేని గ్రామజన సంతతి కిమ్మగు శాంతిఁగూర్ప హే
మంతను నందుఁ బుష్యమున మంజుగతిన్ జనుదెంచు "స్వర్ణ సం
క్రాంతి" శుభావహం బగునుగాక నవాంధ్రవసుంధరాస్థలిన్ !

— విశ్వనాథ కవి

మీకు తెలుసా ?

1. ప్రపంచంలోకెల్లా పెద్ద సరస్సు సుపీరియర్. (ఉత్తర అమెరికా) వైశాల్యము 31,200 చ. మై.

2. ప్రపంచంలోకెల్లా అతి ఎత్తయిన శిఖరము ఎవరెస్టు, (హిమాలయము) 29,141 అడుగులఎత్తు.

3. ప్రపంచంలోకెల్లా పెద్ద ఎడారి సహారా, (ఆఫ్రికా), వైశాల్యము 2 కోట్ల చ. మై.

4. ప్రపంచంలోకెల్లా పెద్ద ద్వీపం గ్రీన్‌లాండ్, వైశాల్యము 8,27,300 చ. మై.

5. ప్రపంచంలోకెల్లా పెద్ద కాలువ సూయజ్ (ఈజిప్టు) పొడవు 104½ మైళ్ళు; లోతు 30½ అడుగులు.

6. ప్రపంచంలోకెల్లా పెద్ద రైల్వేవంతెన లోయర్ జాంబుసీ; పొడవు 12,064 అడుగులు.

— సేకరణ : టి. కృష్ణారావు

పెండ్లి లగ్నం

రాయప్రోలు సుబ్బారావు

౧

వెండిలాంతరు వెలిగించి వెడలె రజని —
ఒడలు తెలియక నిదురించుచున్న జీవ
కోటి నరసి కాపాడ — పక్షులను బోలె
చెట్లునున్ కదలవు సొమ్మసిలిన యట్లు

౨

చలి ముదురలేదుగాని, వానలను తడిసి
చెమ్మగిల్లెను నాలుగు చెరగు లవని —
మీద కార్తిక జ్యోత్స్న ప్రామిన కతాన
రేలు శీతము లనిపించె కాలగతిని —

౩

పండలేదు పునాసలు పాలుగూడ
పొల్లుపోయెను వరిచేలు నీళ్ళులేక,
ముదురు సేద్యము గడ్డిలో మునిగె; వెనుక
చిక్కుపడ్డవి వానలు సేద్యమునకు —

౪

చెరువు నిండిన దీ యేడు కరువురాదు,
మిరపతోటల కిందాక పురుగు లేదు,
అతికినవి పైరు లన్నియు అచ్చటచట
సుంకు పోయుచున్నది మొక్కజొన్న యపుడె

౫

పడ్డది విశాఖకార్తెలో వరిగె విత్తు
రాలితే క్రొత్త పాతళ్ల త్రవ్వవలెను —
పూతపట్టిన కొత్తిమేర పొలము చాలు
కార్తె కడల మంచానక కాసెనేని —

౬

ఎదిగినది పిల్ల పెండ్లికి — ఎట్టులయిన
యెడ్ల కొట్టు మీదేడు నేయింపవలయు
వానలకు కారిపోయిన పడమటింటి
గోడ కండ వేయకయున్న కొంప కూలు —

౭

శిస్తుకోసము నిరుడు వ్రాసితిని నోటు
పెరిగె నది పాము పగవలె — పెయ్యదూడ
నమ్మి తీర్చెద మన్న ప్రాణమ్ము రాదు —
మేపుకొన్నారు పిల్లలు తీపితోడ —

౮

వెల్లవన్నెలో చనుకట్టు పిరుదు సొగసు
కుదిరి — కొమ్ము వాటము గల గోవు దొరక
దెందు కొక మగదూడ జనింపరాదు —
గోవు మాణిక్య మన్నారు కులమువారు

౯

అనుచు తలపోయుచుండె ‘రామన్న’ — చుక్క
పొడిచి బారె డెక్కె — ఇరుగు పొరుగులందు
చల్ల చిలుకు చప్పుళ్ళు — కావళ్ల మ్రోత
లును కలిసి చెట్లమీది పక్షులను లేపె

౧౦

పసుల మేతల సవరింపు — పాడిగొడ్ల
కుడితికోసము విడుచు సందడి, అరకలు
కట్టు రభసములును చెలంగె — కాడిక్రింద
రాక మార్మసలెడి కోడె రంకె లదర

౧౧

పేరు భూదేవి రామన్న పెండ్లియాడి
ఇరువదేండ్లాయె — ఇల్లాలు ఇల్లు దిద్దె
నేర్పుతో వెల్తి బయట రానీక — కడుపు
పండె దోసపాదు విధాన నిండ గృహము

౧౨

బక్కపలచని నెమ్మేను పచ్చి పసుపు
కొమ్మువలె మంగళచ్ఛాయ క్రమ్మరింప —
ఇంత లేసి కాటుకకండ్ల యింపుతోడ
మగువ ఆకలిదప్పుల మాయచేయు

౧౩

ఇల్లు మాయనీయ — దిల్లాలు పోయదు
కొప్పుగాని కట్టుకోకకాని —
అబల కబ్బె నిర్మలాభ్యాసములు — తన
నిర్మలాత్మ వృత్తి నీడలట్లు —

౧౪

పడమటి పొలాని కేగి పాపటము తోలి
తిరిగివచ్చె రామన్న — ఎదురుగ పరుగు
లెత్తి కన్నులతో కౌగలించుకొనియె —
‘నాగరత్తి’ ఆయాస మంతయును జాఱ

౧౫

ముల్లుగట్టు మూటున దోపి — పిల్లిపెసర
పచ్చికను మెయ్యమంటిర వైచి నిమిరె
మూగముద్దులు పెట్టగా మోర నెత్తి —
వావులకు పసిబిడ్డలు వారె పసులు

౧౬

కడవతో నీళ్ళు తోడి, ముక్కాలిపీట
వేసి, చాకింటిగోవలి తీసియుంచె,
భర్త కుపచారములు చేయ ప్రాలుమాల
వెంతపని యున్న భూదేవి యింటిలోన

* * *

౧

ఇంతలో వచ్చి రాతని యింటి — కూరి
పెద్ద కాపులు పెండ్లికి పిల్ల నడుగ —
బ్రాహ్మణుండు చెప్పినవేళ పాయకుండ —
గ్రామమునసబు వెంటరా గౌరవముగ —

౨

మనువునకు వచ్చినాము రామన్న యనుచు
మీస మొత్తుచు మునసబు మేలమాడె —
'రాండి రాండని' పంచలో రాట మెత్తి
మంచములు వాల్చి తెల్లకంబళిని పరచి

౩

నిలువుచెంబులతో వేడినీళ్ల తెచ్చె —
పసుపు గనిపెట్టి భూదేవి అంతలోనె —
కిర్రుచెప్పులు విడిచి — కాళ్ళను కడిగి
కూరుచుండిరి వారును కుశల మడిగి

౪

మాయమర్మా లెఱుంగక. మంచి చెడ్డ
లాడుకొని రింతసేపు మర్యాదకొలది —
సేద్యముల నష్టకష్టాలు — చేలు చెట్లు
పైరు పంటలు — పశువుల పాడికథలు —

౫

అందరికి భోజనంబు లాయత్తపఱచె
గరియలోపల భూదేవి — కామధేను
విచ్చినట్టు రిష్టాన్నము లింపితముగ —
ఇరుగు పొరుగులన్ తాలింపు పరిమళింప —

౬

తోడిన జలాల స్నానము లాడి కట్టి
విందుకువచిరి జిహ్వ లువ్విళ్ళుగొనగ
తెల్లగా తోమిపెట్టిన పళ్ళెములను
వరుసగాడుచు కూర్చున్న బంధుజనులు

౭

వడ్డనలు చేసె చవులూరు వంటకములు
క్రొత్త సొంపారుకారముల్ కొసరి కోర
పైరవంకాయ తాలింపు — దోరవేపు
కందిపప్పు కమ్మదనాలు చిందుచుండ

౮

ఇంట కాచిన కపురముపంటి నెయ్యి —
జిడ్డుమీగడ గట్టిన గడ్డపెరుగు —
చవులు తెలిసిన భూదేవి స్వాదుపాక —
మే పదార్థ మింపితముగా దెవరికేని —

౯

పంచలో కొన్ని — నిండారు బయల కొన్ని
అంచుదుప్పట్లు పరచిన మంచములను
వేసిరి సుఖాన సందఱు విశ్రమింప —
పచ్చపువ్వువలె వెన్నెల విచ్చికాయ

౧౦

ఇంతలో వేడుకలు విన నిరుగుపొరుగు
పేరటాండ్రును పెద్దలు చేరవారి —
రిల్లు నవరించి భూదేవి పిల్లతోడ
వచ్చి కూర్చుండె రాటముప్రక్క నెలమి.

౧౧

సాటివారలు నవ్వుచు సంబరమున
మేలమాడ గోవిందనామాలు పాడి
కొనుము రాటము త్రిప్పసాగెను శుభాంగి
లచ్చి సౌభాగ్యచక్రము లాగినట్లు

౧౨

పసుపు తెచ్చిన పెద్దలు — మాటలాడ
వచ్చినట్టి పెత్తనదా ర్లుభయజనులకు
నచ్చచెప్పి పెట్టిరి ప్రధానంబు నాడె
పందు పసుపును శుభ మని బంధు లాడ

౧౩

రంగువిరె — బజారు వరాల పసిడి —
ఉభయ గృహయోగ్యము లటంచు నొప్పుకొనిరి
యుక్తమైన సమీప ముహూర్తమునకు
పెండ్లిలగ్నము పెట్టిరి పెద్ద లంత

సంక్రాంతి

రోణంకి అప్పలస్వామి

నేను శ్రీకాకుళం జిల్లాలో పుట్టిపెరిగాను. మా ప్రాంతంలో పండుగదినాలు మిక్కిలి సందడిదినాలని చెప్పాలి. నా బాల్య దశలో మా అవ్వ 'పండుగ పదిముఖాలతో వస్తూన్నాది' అనేది. ఆవిడ మాటల్లోని సత్యం అప్పట్లో నాకు సరిగా అవగతం కాలేదు. పదిముఖాల దేవతను దర్శించే భాగ్యం నాకెప్పుడూ కలుగలేదు. కొంతకాలమైన తర్వాత ఆవిడ మాటల్లోని కవితాపటిమ సువ్యక్తమైంది.

అవును నిజమే! పండుగ పదిముఖాంతో ప్రకాశవంతంగా నాట్యమాడుతూ తెలుగుదేశంలో ఆబాలగోపాలన్నీ ఆనంద పరవశుల్ని చేస్తుంది.

అభినవ తిక్కన తుమ్మల—

"కదలి వచ్చెను భాగ్యాలకడలి వోలె,
మకరసంక్రాంతిలక్ష్మి హేమంతవీథి."

అని చమత్కరించారు. పంటలు పుష్కలంగా పండుతవి. డిశంబరు యిరువదియొకటవ తేదీ రావడంతో దక్షిణాయనం పూర్తవుతుంది. సూర్యుడు ఉత్తరోన్ముఖుడౌతాడు. ఉత్తరాయణం ప్రవేశిస్తుంది. పండుగనాటికి సూర్యుడు మకర రాశిలోకి వస్తాడు. అప్పుడు మనం పండుగ వేడుకగా జరుపుకుంటాం. మా పెద్ద పండుగ నెలరోజు లుందంటే 'నెలగంటు' పెట్టారని అంటారు. అప్పటితో ధనుర్మాసం ఆరంభమవుతుంది. ధనుర్మాసంలో దివంగతులైనవారికి పుణ్యగతు లుంటాయని పెద్ద లంటారు. అప్పుడు వైకుంఠద్వారాలు తెరిచి ఉంటాయట.

చిన్ననాటి అనుభవాలు స్మరణకొస్తున్నై. ధనుర్మాసంలో ప్రతిదినం జంగాలు మా గ్రామాలకి జట్టులు జట్టులుగా వస్తూండే వారు. గంటనాదంతో మా చెవులు గింగురుమనేవి. వీరి వెంట బాలబాలికల మంతా ఇంటింటికీ వెళ్ళేవాళ్ళము. ఒక్కొక్క జట్టులో ముగ్గురు నలుగురు జంగము లుండేవారు. వారిలో పెద్ద శరీర మంతా విభూతి పూసుకొనేవాడు. తలపైని రుద్రాక్ష లమర్చినకిరీట ముండేది. దండలకుచుట్టిన ఇత్తడినాగులు మమ్ములను కరవవచ్చినట్లుండేవి. వక్షస్థలాన ఇత్తడి ఈశ్వరుని ప్రతిమ్మ ధరించేవాడు... జరుస్సు రాజాస్యమగస్తూండేది. చేతుల్లో గంటలు వాయిస్తూ ఈశ్వరుణ్ణి స్తుతించేవారు. ఆస్తోత్రం మాకెంతో ఉత్సాహ కారిగించేది.

"జయము! జయము! రా! శిద్ధేశా!
జయ! పరమేశా! శిద్ధేశా!"

అని పాడేవారు. వారికి బిచ్చం పెడితే సరిపడేది కాదు. ఏడుగురు వెళ్ళిపోయేటప్పు దీవించేవారు కాదు. ఆ దీవనల్ని ఎన్నిసార్లు విన్నా మాకు తనివి తీరేది కాదు. నాయకుడు 'హరో — హరా!' అనే వాడు. మిగిలినవారు 'మహాదేవా!' అని వెనుక వంతుపాడేవారు. తుదకు అందరూ ఏకకంఠంతో "మీ రేళ్లు వర్ధిల్లాలి.... శిద్ధేశా!" అనేవారు. అలా అనిఅంటే వారిమాటలకు తిరుగు లేదనిపించేది.

పండుగ కోలాహలం చెప్పనలవికానిది. తెల్లవారుజామునే మేలుకొలుపులవాళ్ళు పాటలు పాడుతూ మనలను నిద్రలేపుతారు. పగ లంతా ఎక్కడచూచినా యాచకులు, అడుగుకునేవారు అసంఖ్యాకంగా వస్తూ పోతూ ఉంటారు. ఆడువారు రంగవల్లికలను తీర్చిదిద్దుటలోనూ, గృహాలంకరణ కార్యకలాపాలలోను నిమగ్నులై ఉంటారు. ఏ యింట్లో చూచినా— కూతుళ్లు — అల్లుళ్లు — కోడళ్లు ఉండి కన్నులపండువ చేస్తూంటారు. కొత్తబట్టలు కొనడం, డబ్బుండేవాళ్ళు ఆభరణాలు చేయించుకోవడం అతిజోరుగా సాగుతుంది. విద్యార్థులకు శలవు లివ్వడంవలన స్వగ్రామాలకు పోతారు. జీవిత మొక దివ్య స్వప్న మనిపిస్తుంది.

ప్రకృతి శోభాయమానంగా ఉంటుంది. రంగు రంగుల పువ్వులు సువాసన తోనుయు ఆకర్షణీయంగా ఉంటై. కూరగాయలు విశేషంగా లభిస్తాయి. గుమ్మడిపళ్ళు, బూడిదగుమ్మడి, వంకాయలు, చిక్కుడుకాయలు, టొమాటోలు, కాలీప్లవర్లు, క్యాబేజీలు — మొదలైన ఇంగ్లీషుకూరల్ని ఈరోజుల్లోనే మన మనుభవించేది.

పండుగ ప్రవేశిస్తూంది. భోగినాడు, తెల్లవారకముందే పిల్లలుకూడా లేచిపోతారు. భోగిమంటల్ని అందరూ వేస్తారు. తలంటుకొని స్నానం చేయనివా రుండరు. చిన్నపిల్లలకు భోగి

వళ్లు పోస్తారు. పాయసాలు, పిండివంటలు ఆరగించడంతో దినమంతా గడిచిపోతుంది. ఇది పండుగనాటి కోలాహలం వర్ణించే రెట్లు! అందరూ కొత్త దుస్తులు ధరించేవారే! పిల్లలు-పెద్దవారు - స్త్రీలు - పురుషులు క్రొమ్మెరుంగులు జిమ్ముతూ ఉంటారు. విందు లారగించే దిన మిదు. పనివా రందరికి బాగా భోజనము పెట్టే దిన మిది. కొత్త బట్టలుకూడా యిచ్చే దిన మిది. పుణ్యస్త్రీ లంతా పిరింటినుంచి వారింటికి, వారింటినుంచి పిరింటికి పేరంటానికి పోయే దిన మిది. గొబ్బెమ్మను ప్రతిష్ఠించి పూజించే దిన మిది. ప్రతియింటిలోనూ 'పితృతర్పణ' జరిపించే దిన మిది. విధుల నన్నిటినీ నిర్వర్తించేందుకు పుణ్యకాల మెప్పు డొస్తుం దని అందరూ నిరీక్షిస్తారు. పుణ్యకాల మొచ్చినప్పుడు పిచ్చుకలకు సం కెళ్లు పిడుతా యని మా అవ్వ చెప్పేది. రెండు కాళ్లూ విడిపిడిగా చేసి నడిచేప్పుడు - మనం చూచేట్టయితే పుణ్య మట. కాని సమయానికి ఎక్కడా పిచ్చుకలు కనిపించేవికావు. ఈ దినమంతా అడుక్కునేవారు పాటలు పాడుతూ వస్తూ వుంటారు; పోతూవుంటారు. సాతాని వైష్ణవులు, హరిదాసులు, భట్రాజులు, కోతు లాడించేవారు, ఎలుగుగొడ్లాడించే వాళ్లు, గంగిరెద్దు లాడించేవాళ్లు - ఇంటింటికీ తిరుగుతూ ఉంటారు. ఇక మూడవదినం కనుగు. మాంసాహారుల కిది మహాపర్వదినం. కోయవారు వస్తారు. వింతవింతగా నృత్యం చేస్తూ స్త్రీలు, పురుషులూకూడా వస్తారు. అందులో నాయకుడు రంగువేసిన పెద్దకర్ర ముఖాన్ని ధరించి ఆడిస్తుంటే - ప్రతి నాయకుడు వెదురుబద్దల గుర్రాన్ని స్వారి చేస్తుంటాడు. ఈ వేడుక చూడటానికి నా చిన్నతనంలో నే నెదురుచూస్తుండే వాణ్ణి. ఈ ప్రదర్శనం దురదృష్టవశాత్తూ మా ఊరికి రాక పోయినట్టయితే, మా బాలబాలికల ముఖపద్మాలు వాడిపోయేవి. ఆరుబయట కోడిపందేలు, పొట్టేళ్ల పందేలు జరుగుతై. ఆ రోజుల్లో ఊళ్లోని మాలమాదిగలు మద్యాన్ని తెగత్రాగి - వీధులలో చిందులు త్రొక్కేవారు. ఒక చింకిచొక్కావో, చింకిపంచో యివ్వకపోతే ఇల్లు విడిచిపెట్టేవారుకాదు. సాత్వికులకు ఈదినం కొద్దిగా బీభత్సంగా ఉంటుంది. నావంటి మాంసాహారాని కలవడిన కొందరికి వైరాగ్యం కలిగి మాంసం తినడం మానెయ్యా లనిపిస్తుంది. గాంధిమహాత్ముని ధర్మమా అంటూ మద్యపానం చాలావరకు తగ్గిం దనే చెప్పాలి.

పింగళి, కాటూరివారి 'సంక్రాంతి' అను కావ్యఖండిక చదువనివా రుండ రనుకుంటాను. సంక్రాంతి రావచ్చు, పోవచ్చు, ఈఖండికను హృదయమున పదిల పరచుకొని వారు ఎప్పుడైననూ సంక్రాంతి దర్శనము చేసుకొన గలుగుదురు.

"రండు మా యింటి కీరు పేరంటమునకు
బొమ్మరెత్తగ మా పెల్లయమ్మలార!
ముద్దు చేమంతిపూవులు ముడిచినట్టి
జడలతో, క్రొత్తవల్లెతో, నడుగులందు
చిందులం ద్రొక్కు పరికిణీ చెలువుతోడ
కాళ్ల పారాణి, హాటుక గన్ను గవను
దిద్దికొని, మురిపెమ్మును ముద్దుదొలక
నగుమొగమ్ములతోడ గన్యకలు నీకు
నచ్చ లొసగంగ నిలిచి, రీ వరుగునపుడు
పచ్చిపోవమ్మ, మా యింటి పజ్జ కీవు,
పరమకళ్యాణి, మా తల్లి, పౌష్యలక్ష్మి!"

పింగళి - కాటూరి.

వృథా! వృథా! వృథా!

1. చెరువులేని ఊరు
చెట్టులేని అడవి
చెమ్మలేని పొలం
వృథా! వృథా! వృథా!

2. మాతలేని శిశువు
చేతగాని పశువు
రాతరాని మనిషి
వృథా! వృథా! వృథా!

3. పంటలేని చేను
పండ్లివ్వని చెట్టు
ఫలంలేని వనితనం
వృథా! వృథా! వృథా!

— టి. కృష్ణారావు.

అఖిలాంధ్రోదయము

శనగన నరసింహస్వామి

★

ఆంధ్రాకాశము నావరించిన తమోఽహంకార హుంకారకృత్
కంధ్రానీకము జీల్చి బైటపడి స్వాతంత్ర్యార్కు డున్ముక్తనీ
రంధ్రారక్తసహస్రభానువులతో రాజిల్లుచున్నాడు; స
ర్వాంధ్రుల్, సాగుడు తత్ప్రకాశవశరథ్యానందపాథేయులై.

2

అఖిలాంధ్రోదయ కారణ
శిఖరము మనవాడు పొట్టి శ్రీరాముం డీ
సుఖ మతని నిరశనవ్రత
మఖమునకు ఫలం బటన్నమాట మఱతురా?

3

సర్వాంధ్రము సాధించిన
గర్వముతో, ముందుచూపు కలిగి, భవిష్యత్
పర్వదినమ్ములు జరుపుడు
పూర్వాంధ్ర మహేంద్ర విభవ పుణ్యస్మృతితో.

4

శ్రీమద్భాగవతమ్ములో గలదు ప్రాచీనాంధ్ర సమ్రాట్కథా
సామగ్ర్యం బది మున్నె పుట్టె నని నిశ్వాసింతువా? వేదకా
లామోదాంకము నైతరేయ కథన మ్మాలింపవో? వైభవం
బేమి? యందువటోయి! సాక్ష్య మిదిగో, యీసారి దర్శింపుమా!

5

దక్షారామమునందు భీమపతిగా దర్శించి; శ్రీభూమిభృత్
వక్షోవాటిని మల్లికార్జునుడుగా వాసించి, శ్రీకాళహ
స్తిక్షేత్రమ్మున నీశ్వరాహ్వయుడుగా దీపించి, ముప్పొద్దు సం
రక్షించున్ శివు డీ త్రిలింగధరణీరాజ్యం బజేయమ్ముగా.

6

ఒక మొకమ్మున వేదనికరమ్ము వల్లించి
చతురాస్యు నున్మత్తు సలిపినారు;
శితహేతి ముందుగా ప్రతిఫలించిన జయేం
దిరకు నెత్తురుబొట్టు దిద్దినారు;

సంక్షోభగాధను డున్న జాతికి కిన్న రే
శ్వరులవలె ధన వృష్టి కురిసినారు;
భుజభూపాలురం బల్చు నిరుపాలవర్మల బల
భద్రు నాగలి భంగపరచినారు;

ఇచటి బ్రాహ్మణపుంగవు, లిచటి క్షత్రి
యేంద్రు, లిచ్చటి వైశ్యులు, నిచటి శూద్రు
లిది ప్రబంధావళీ ముఖగదితపినులి
మాత్ర మనబాడ కిది యున్నమాట సుమ్ము!

7

మగధదేశముదాక మనమాట చెల్లెను
'శాతవాహనుల' దోశ్శౌర్యగరిమ;
బుద్ధదేవుని కీర్తి పొంగి దిక్కులు ముట్టె
'నిక్ష్వాకు రాజుల' యీవులందు;
వేదమతము పునర్వికసించి ఫలియించె
'విష్ణుకుండినుల'యు వేళయందు;
శిలకు జీవము వచ్చి జలధి లంఘించె 'శా
లంకాయనుల' సుపాలన దినముల;

లబ్ధశాసన లిపిమాత్ర లాంఛనములు,
శిథిల శిల్పావశేష విచిత్రగతులు,
కాలవేగ విలీన గాథా లహరులు;
ఆ మహావైభవములు నేడర్థ మగునె!

8

రాకొమరున కొకధర్మము
లోకుల కొకధర్మ మన్న లుబ్ధులు గారీ
క్ష్మాకాంతు ; లపుడు తడిసిరి
ప్రాకృతులును కనకవర్ష పాతమునందున్.

9

భారత భారతీ విభవపారగ మైన బృహత్కథాసుధా
వారిధి కేత మెత్తిన తపస్వి గుణాఢ్యుడు తెల్గువాడు ; శృం
గారవిలాసలాస్యజని కావ్యపి, "సప్తశతి ప్రబంధ" మాం
ధ్రోరు వసుంధరా జనపదోజ్జ్వల జీవనసారమే సుమా !

10

కవికులగురు లీలాసన
సవిధాసన మందు ఠివి సారించు మహా
కవి మునిమణికోటీరుడు
భవభూతి, జనించినట్టి ప్రాంతం బిదియే.

11

సారకవితోదయ సవ
భారవి, రోదోంతరాళ భాగ్యములయోళి
భారవి, సదర్థగౌరవ
భారవి, జనియించినట్టి ప్రాంతం బిదియే.

12

కవితాగంగా లహరి
జవమున యవనేందు వేల్పుజాలిన రసిక
ప్రవరుడు, పండితరాయలు
భవ మందిన పుణ్యభూమి భాగం బిదియే.

13

భారతాంధ్రీకృతి ప్రథమావతారకా
రణకీర్తి, చాళుక్య రాజరాజు;
తౌరుష్కవాహినీ దారుణోల్బణ సేతు
రూపుండు; కాకతి రుద్రరాజు;
ప్రాకృతాంధ్రామర భాషావనీ మధు
రేఖ, శ్రీ కోమటి రెడ్డిరాజు;
సాహిత్య సమరనిష్ఠాసవ్యసాచిత్వ
గేయుండు, తుళువ శ్రీకృష్ణరాజు;
ఒకరితరువాత నొకరుగా నుర్వి నిలుపు
సాహితీరణ దిగ్జయ స్తంభపాళి;
నేటికిని మొక్కవోవక నిలిచి పిలిచి
తెలుగు వారికి దిటవు నందించునోయి !

14

నన్నయ్య, వాగర్థనవవైభవాద్వైతి;
నన్నెచోడుడు, రసామ్నాయగాత;
తిక్కన్న, కవిరాజు తెలుగుల జీవనం;
బెజ్జన్న, ప్రతిభామహేశ్వరుండు;
శ్రీనాథు, డనవద్యసిద్ధశయ్యాశాలి;
పోతన్న, జాతికి పుల్కరింత;
కృష్ణరాయడు; కళాకేళీవిలాసమ్ము;
పెద్దనార్యుడు, సుధాపీనవృష్టి;
రామభూషణు, డపరనీరజభవుండు;
చేమకూర, చమత్కృతిస్తోమభూమి;
తారతమ్యపరీక్షకు తగరు పూర్వ
కవివరేణ్యులు వారగ్రగణ్యు లెపుడు.

15

ఏవంవిధ పూర్వాంధ్ర మ
హావైభవ మెల్ల కాలహతమై పునరు
జ్జీవించుచున్న దిప్పుడు
రావోయీ! ఆంధ్రసోదరా! కనుగొనగా.

16

భవ మందె దక్షవాటీ
కవిరాజును డొకడు పూర్వకాలమ్మున, సం
భవ మందె విజయవాటీ
కవిరాజును డొకడు నేడు కవిశాసకుడై.

17

తల్లిబాసను మోసి తరియింపగా నుద్భ
విలి, "వేయిపడగలు" విప్పినాడు;
సెలయేటికన్నెలు చెలగి నర్తనమాడ,
సీటుగా "కిన్నెర" మీటినాడు;
"కల్పవృక్షము"ను నాకమునుండి కొనితెచ్చి,
తెలుగుపూదోటలో నిలిపినాడు;
ఆర్షధర్మము ముంచు నబ్ధిజృంభణమును
గని, "చెలియలికట్ట" గట్టినాడు.
వివిధముఖనవ్యకవి "హైకవీరు" డాత,
డత డదృష్టపూర్వాధ్వమహోధ్వ నీను,
డతడు పుంభావవాణీసహస్రరాశి;
విశ్వకవిరాజు, ద్విజరాజు, 'విశ్వనాథ'.

18

వాటము లైన పూర్వకవివాక్కుల తత్త్వ మెఱింగి, యాంగ్లవాగ్
ఝాటపరీమళోర్మికల సారము లాని, యుదాత్తభావనా
పాటవవత్కవిత్వములు బల్కుచు, వాణికి మల్లెపూల క్రొం
బాటలు దీర్చు నవ్యకవివర్యు లలంతుల బోవువారలే!

19

బహుముఖముఖాభిముఖముగ
నహరహము గమించుచుండె నహమహమిక నీ
మహితాంధ్రజనపదమ్ములు;
విహరింపగ రమ్ము! కనులు, వీను లలరగా.

20

అది నాగార్జునసాగర, మ్మది విశాలాంధ్రావనీ సుప్రజా
త్రిదశప్రాగ్భవపుణ్యలబ్ధఫలసాంద్రీభూతసారమ్ము, దు
ర్మదదారిద్ర్యదవాగ్ని సేచకసుధాంభఃపూర, ముత్సాహివై,
పదవోయీ! యిక తత్ప్రదేశవిభవప్రాగ్భార మీక్షింపగా.

నాగార్జునాచార్యుడు

నండూరి రామకృష్ణమాచార్య

'నాగార్జునుని కొండ' అనే పేరు నాగార్జునాచార్యులవల్లనే వచ్చింది. సుప్రసిద్ధ టిబెట్టు పండితుడు నాగార్జునుని నివాసస్థలం 'శ్రీపర్వతం' అని పేర్కొన్నాడు. నేడు ఆంధ్రప్రదేశంలో గుంటూరు మండలంలో కృష్ణాతీరంలో ఉన్న నాగార్జునుని కొండకు ప్రాచీన నామధేయం శ్రీపర్వతం. క్రీస్తుశకం భారత దేశం సందర్శించిన చీనా యాత్రికుడు — ఫాహియాన్ శ్రీపర్వత విహారమును పేర్కొన్నాడు. దక్షిణమున "పాపురం" విహారం ఉన్నదని అతని వర్ణన. చీనా యాత్రికుడు సర్వ సాధారణమైన "శ్రీ" వదలి 'పర్వత' శబ్దమును "పారావత" శబ్దముగా భ్రమించినా డనుట స్పష్టము. ఆంధ్ర బౌద్ధము ప్రాగశోక మనీ, ఆంధ్రదేశంలో అమరావతి, నాగార్జునకొండ, భట్టిప్రోలు, ధాన్యకటకం — శాలిహుండం మొదలైన బౌద్ధవిహారాలలో వేలకొలది భిక్షుకు లుండేవా రనీ చరిత్రలో ఋజువైన విషయాలు. ప్రాచీనాంధ్రంలో విశ్వవిఖ్యాతిని ఆర్జించిన విశిష్టత నాగార్జున విహారానికి దక్కింది. అక్కడ ఆచార్యపీఠ అధిష్ఠించిన కులపతి ఆర్య నాగార్జునుడు.

బౌద్ధమత ప్రపంచంలో మాధ్యమిక వాదం ప్రవచించిన తత్త్వవేత్త నాగార్జునుడు. హీనయానం బౌద్ధమత ప్రాచీన స్వరూపం. అర్వాచీనశాఖ మహాయానం - ఈ మహాయాన శాఖకు మూలపురుషుడు నాగార్జునాచార్యు అని నిష్కర్షగా చెప్పటం సాహసం కావచ్చుగాని నాగార్జునాచార్యుల కాలంలోనే మహాయానం సర్వతోముఖ నూత్నచైతన్యం ధరించిన దనటం సత్యదూరం కాదు. నాగార్జునుని నాగలోకయాత్ర ప్రజ్ఞా పారమిత సిద్ధాంతానికి మూలం. భారతీయ వేదాంత క్రమపరిణామ వికాసంలో నాగార్జునాచార్యులవారి మాధ్యమిక వాదానికి ఒక విశిష్టస్థానం ఉన్నది. అద్వైత వేదాంత ప్రవక్తయైన శంకరాచార్యులవారి మతాన్ని పరశైవులు మున్నగువారు "ప్రచ్ఛన్న బౌద్ధ"మని నిరసించారు. అటు బుద్ధుని "శూన్యవాదానికి" ఇటు శంకరుని మిథ్యావాదానికి మధ్య, నాగార్జునుని మాధ్యమిక వాదం విజ్ఞులకు గోచరించే ఒక వేదాంత సేతువు నాగార్జునుని వేదాంతం.

బుద్ధభగవానుని భూతదయాపరత్వమునకు 'అహింసా పరమోధర్మః' అన్న సిద్ధాంతానికి యవనికాంతర ధ్రువాగానంగా వినిపించే వేదాంతం

"సర్వం దుఃఖం దుఃఖం
సర్వం క్షణికం క్షణికం
సర్వం శూన్యం శూన్యం"

బుద్ధుని వేదాంతంలో కాషాయాంబరాలకూ — త్యాగానికీ — పరోపకారానికీ మాత్రమే చోటున్నది. నాగార్జునాచార్యుల కాలంలో బౌద్ధమతంలో సౌందర్యారాధనగూడ వచ్చికలిసింది. లలితకళలు బౌద్ధమతంలోని భూతదయను అహింసా ధర్మాన్ని ఆరాధించసాగినాయి. అందుచేత నాగార్జునుడు "సమన్వయ వేదాంతి"గా సాక్షాత్కరించాడు. అప్పటికే ఉత్తరబౌద్ధం దక్షిణబౌద్ధం అనే వాదాలు వినిపిస్తున్నవి. బౌద్ధం హిమాలయాలాలలోని లుంబనీ వనంనుండి సింహళంలోని అనూరాధపురంవరకూ వ్యాపించి సముద్రాలను దాటి చీనా, యవ, సువర్ణద్వీపం, చంపా, బర్మా రాష్ట్రములలోనికి వ్యాపించింది- ఇటు ఉత్తరానికి అటు దక్షిణానికి - ఇటు తూర్పుకు అటు పడమరకు మధ్యగా ఆంధ్రదేశంలో నిలిచి సమన్వయ వేదాంతం సమకాలీన సంఘానికి ప్రసాదించిన తత్త్వవేత్త నాగార్జునాచార్యుడు 1.

1 సమన్వయ వేదాంతం ప్రాచీనకాలంనుండి తెలుగుగడ్డలోని విశిష్టత. తిక్కనమహాకవిగూడ - అటు వీరశైవవైష్ణవమతాలకు సమన్వయం సాధించి "విష్ణురూపాయ నమశ్శివాయ" అనగలిగిన వేదాంతి. కవయిత్రి సరోజినిదేవిగూడ, "అటు ఔత్తరాహుల ఆవేశం - ఇటు దాక్షిణాత్యుల ఆలోచన - అటు వంగీయుల భావశబలత - ఇటు తమిళుల క్రియాశూరత తెలుగుగడ్డపై గడ్డకట్టిన" దని ప్రశంసించింది.

'ఔత్తరాహ రసార్ద్రహృదయం । దాక్షిణాత్య విదగ్ధ మేధా
తవ శుభగళే తరళమంగళ । సూత్ర యుగళదశే' అని తెలుగుతల్లికి నీరాజన మెత్తినాడు ఒక నవీనకవి.

"ఈ జగత్తు కేవలం మిథ్యగాదు కేవలం సత్యంగాదు. ఈ జగత్తు ఒక పరిమిత సత్యం. ఏ పదార్థానికి నిరపేక్షమైన అస్తిత్వం లేదు. ఈ జగచ్చక్రం ఈ సత్యాన్ని కేంద్రంగా చేసుకొని సదా పరిభ్రమిస్తూవుంటుంది. సృష్టి — లయం, అస్తిత్వం — నాస్తిత్వం; ఈద్వంద్వభావా లన్నీ మిథ్యలే కాబట్టి అవే మన భ్రమలకు ఆద్యప్రవృత్తులు. అశాంతి, దుఃఖానికి ఆలవాలమైన ఈభ్రమల్ని మానవుడు విడలేనంతకాలం సుఖదుఃఖాలాంకితమైన జీవితంనుండి విముక్తి కల్గదు. పరిమిత్వ మున్నచోట సత్యం ఉండదు. సత్యాన్ని చేరాలంటే యీ పరిమిత్వంనుండి విముక్తి కల్గాలి. అప్పుడు సత్యం శూన్యరూపంలో సాక్షాత్కరిస్తుంది. శూన్యమే పైరుధ్యా లన్నీ అదృశ్యమైన అపరిమితత్వం. ఈ అపరిమితత్వమే నిర్వికల్పమైన నిర్వాణం[2]

నాగార్జునుని కాలం

నాగార్జునుడు శాతవాహన చక్రవర్తుల కాలంలోనివాడు. శాతవాహనులు క్రీస్తుపూర్వం రెండవశతాబ్దినుండి క్రీస్తుశకం రెండవశతాబ్ది వరకూ పాలించినారు. నాగార్జునుని కొండలోని శాసనాలలిపి ఆలంకారిక లిపి. దీనినిబట్టి నాగార్జునుడు శాతవాహన రాజ్య చరమదశలో ఉన్నట్లు ఊహించవచ్చు. నాగార్జునుని శిష్యుడు ఆర్యదేవుడు. సింహళరాజ వంశచరిత్ర 'మహావంశంలో' క్రీ॥ శ 3 వ శతాబ్దిలో పరిపాలించిన విహారతిష్యునికి అభయునికి సమకాలీను డని ఉన్నది. చీనా వాఙ్మయ చరిత్రలో నాగార్జునుని ప్రజ్ఞామూలశాస్త్రం క్రీ॥ శ 196-221 సంవత్సరాల మధ్య హ్యూకన్ పరివర్తించినట్లున్నది[3]. నాగార్జునాచార్యుడు శాతవాహన రాజునకు వ్రాసిన సుహృల్లేఖ — ఛందోబద్ధమైన కవిత - ఇట్సింగు (చీనా యాత్రికుడు - 7వ శతాబ్ది) సింహళ ద్వీపంలో చీనా భాషలోనికి అనువదించాడు. క్రీస్తుశకం నాలుగవ శతాబ్దిలో కుమారవిజయుడు - చీనా దేశానికి వెళ్లి — అక్కడ నాగార్జునుని గ్రంథాలను చీనాభాషలోనికి అనువదించాడు - దీనినిబట్టి నాగార్జునాచార్యుడు క్రీస్తుశకం రెండవ శతాబ్ద్యంతంలో జీవించినట్లు నిర్ణయింపవచ్చు.

నాగార్జునుని గ్రంథాలు

నాగార్జునుడు ఎన్నో గ్రంథాలు సంస్కృత భాషలో వ్రాశాడు. అవి మనదేశంలో ఒకటీ దొరకటంలేదు. కాని చీనా వాఙ్మయంలో అనువదింపబడిన వాటినిబట్టి అతని గ్రంథాల పేరులు కొన్ని మనకు దొరుకుతున్నవి.

ప్రజ్ఞాపారమిత శాస్త్రం — ప్రజ్ఞామూల శాస్త్రటీక — ప్రజ్ఞాప్రదీపశాస్త్ర కారికలు — మూలమాధ్యమిక శాస్త్రం — శూన్యసప్తాధిమధ్యంతానుగమశాస్త్రం దశభూమివిభాష శాస్త్రం, ద్వాదశనికాయశాస్త్రం, వివాదసమానశాస్త్రం, ప్రమాణవిధ్వంసనం, ఉపాయకౌశల్య హృదయశాస్త్రం, విగ్రహవ్యావర్తి కారికలు మున్నగునవి చీనావాఙ్మయంలో ఉపలభ్యమానాలయ్యే నాగార్జునుని గ్రంథాలు —[4]

నాగార్జునుడు పూర్ణపురుషుడు —

టిబెట్యం నాగార్జునుని సర్వజ్ఞు డని ప్రశంసిస్తోంది. ప్రాచీన వైద్యగ్రంథా లెన్నో నాగార్జునుని స్మరించాయి. అతడు సుశ్రుతాన్ని పునరుద్ధరించాడు. అతని నేత్రనిదానం చీనాలో సుప్రసిద్ధం. విషవైద్యంలో నాగార్జునుని చికిత్సను బాణుడు ప్రశంసించాడు. చీనాదేశంలో వివిధరోగాలకు నాగార్జునుని చికిత్సలు శిలాశాసనాలుగా ప్రకటించారు. నాగార్జునుడు భారతీయ రసాయనికశాస్త్ర పితామహు డని చెప్పవచ్చు [5]. అన్నభేధిని (Iron sulphate) ప్రపంచంలో మొట్టమొదట తయారుచేసింది నాగార్జునుడే అంటారు.

నాగార్జునుడు వేదాంతి: కవి :రసాయనిక విద్యానిష్ణాతుడు: ఖనిజశాస్త్ర పరిశోధకుడు తార్కికుడు : ప్రాచీన భారతచరిత్ర ప్రసాదించిన పూర్ణపురుషులలో నాగార్జునాచార్యు డొకడు. ఆ నాడు నేల నాలుగు చెఱగులనుండీ నాగార్జునుని కొండవద్ద గల శ్రీపర్వత విహారానికి విద్యాభ్యాసానికై జిజ్ఞాసువులు తరలివచ్చేవారు - తారానాథుడు అమరావతీ స్తూపంలో బుద్ధ ధాతువును నాగార్జునుడే ప్రతిష్ఠ చేసినట్లు వ్రాశాడు.

నాగార్జునాచార్యుడు శంకరాచార్యులవారికి పూర్వరంగ ప్రవర్తకుడు.

ఒకనాడు విశ్వవిఖ్యాతి నార్జించిన విశ్వకళా పరిషత్తుగా వర్ధిల్లిన నాగార్జునుని కొండ తిరిగి విశ్వవిఖ్యాతిని ఆర్జించి ప్రాచీన వైభవాన్ని పునఃప్రతిష్టించుకొనేరోజులు వస్తున్నాయని ఆంధ్రు లందరు ఆనందించవచ్చు. నేడు నిర్మాణంలో వున్న నాగార్జున సాగరం — ప్రాజెక్టు పూర్తిఅయితే అది ఆంధ్రప్రదేశానికిమాత్రమే గాక యావత్ భారతదేశంలో యాత్రాస్థలాలలో నాయకమణి కావచ్చు - పురాతత్వశాఖవారి అమూల్యకృషివల్ల, ఎన్నోఅద్భుత రహస్యాలు బయట పడుతున్నాయి - అద్యతన భవిష్యత్తులో అక్కడ తిరిగి నాగార్జున విశ్వవిద్యాలయం ఒకటి ఏర్పడి తిరిగి విశ్వవిఖ్యాతి నార్జిస్తుందని ఆశించవచ్చు.

---

2. S. C. విద్యాభూషణంగారి భారతీయ తత్వశాస్త్ర చరిత్ర.
3. గైల్సు - రచించిన చీనా వాఙ్మయ చరిత్ర ఆంగ్లగ్రంథము.
4. గైల్సు చీనావాఙ్మయ చరిత్ర.
5. పి. సి. రే గారి భారతీయ రసాయనికశాస్త్ర చరిత్ర.

సర్వశుక్ల

మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి

*

ఎది! యేదీ!! యొకసారి యొక్కపరి తల్లీ! చల్లనౌ నీదు కన్
తుదఁ గ్రోధారుణిమంబు చిందు మదె విందుల్వోయు నాబోటి క
ర్మదరిద్రాయకునోట; నీ కినుకచాలల్ గుర్తుగా నమ్రతన్
ముదమారన్ భవ దంష్ట్రులం దడవికొందున్ సర్వశుక్లాకృతీ!

*

కనరా దెచ్చటనేని నీ పదనఖాగ్రచ్ఛాయ నె ట్లాశ్రయిం
తును దల్లీ! కను లుండి గ్రుడ్డి నయిపోదున్, నీ పళకుంపు వె
ల్గును లక్ష్యంబుగ నిల్పనేరని పరాకున్ నాకుఁ బోఁజేసి చి
ద్ఘనచింతామణి చేతి కీఁగదవె మాతా! వేదశృంగస్తుతా!

*

వెలిదమ్ముల్ నలరేలు మల్లెవిరులున్ బెంపారు ముత్యాలప్రో
వులు క్రొమ్మించులు మంచుపొంగులును నీ రూపంబుగా నెంచి క
న్నులలో వత్తిడికొంచు నిన్నుఁ గనుఁగొందుఁ నీ పదాబ్జాత రే
ఖలు మత్ఫాలతలంబు సోఁకి యెటు పెక్కన్ జక్క దీవింపవే!

*

అనలేకుండఁగ లేను నేల విడి సామా! సామ గానైక మూ
ర్ఛనలోలాచ్ఛరుచిస్ఫుటాస్ఫుటసమంచత్స్ఫోటవాదానువ
ర్తనమూర్తీ! జనయిత్రి! త్వచ్చరణపద్మశ్రీగళన్మాధ్వి చి
ల్కున నా యౌదల పండి యెన్నటికి నాలో నిన్ను మన్నింతునో!

*

ఈ కళ లీ కవిత్వములు నీ కథ లన్నియు జీవనవ్యథా
నీకము లేశమే నుడుపనేరవు; నే నది గుర్తెఱింగియున్
లోకపుఁ జీకటింబడి వెలుంగు సహింపని గూబ నైతిఁ ద
ల్లీ! కలి కారునల్పు శమియింపదె! నిత్యపురస్కృతాకృతీ!

హేమంతము - మకర సంక్రాంతి

చిలుకూరి పాపయ్యశాస్త్రి

కవివరేణ్యుల భావనలో సృష్టియందలి విషయ మేదియైనను మనోహరము దృష్టిప్రియము నగుచుండును. సామాన్య మానవుని చూపులోన కించిత్కరమైన వస్తువు, కవి భావనలో మహత్తరమై యెసలారును. అందును ప్రకృతి వితానమునఁ జూపట్టు ప్రత్యణువును ఆతని భావనామయమైన నూత్నసృష్టిలో మేరుకల్పమై వెలయుచుండును. ఋతువులు మాఱునపుడెల్ల ప్రకృతిలో నేదియో కొంతమార్పు తప్పక యేర్పడుచునేయుండును. దైనందిన జీవికను పరిశ్రమముతో నిర్వహించుటలో మునిఁగితేలు మానవునకుఁ బ్రకృతి వికాసమున నేర్పడు మార్పులను కలయఁ జూచి యానందించుట కవకాశ మంతగ లభింపదు. అతఁడు ఋతువుల మార్పువలన నేర్పడు శీతోష్ణాది తాపములను గూర్చి 'తనకు దుస్సహము' అను ననుభూతిని మాత్రమే తీరికగలిగిన తఱిని వెలుపుచుండును. ఈ యనుభూతికూడ నవకాశమునుబట్టి పెరుగుచు తరుగుచు నుండును. ఇఁకఁ గవి యన్ననో గ్రీష్మకాలపు వేఁడిమిలోను, వర్షాకాలమందలి ముసురులలోను, హేమంతమునందలి చలిలోను సహృదయులకు సుఖానుభూతిని గలిగింపఁ జేయును. ఇట్టి పట్టులలోఁ గవికిఁ గల యలౌకికప్రజ్ఞ పరిస్ఫుటమగును. ఆతని భావనలో ప్రపంచమునందలి ప్రతివిషయము సుఖమయమే.

ప్రాణిసామాన్య మెండవేఁడిమికి వడగాడ్పులకుఁ దాళలేక సతమత మయ్యెడి గ్రీష్మకాల దివసములను పరిణామ రమణీయములనుగాఁ జిత్రించిన కాళిదాస కవివరుని యీ క్రింది శ్లోకము పై విషయమునకు నిదర్శనము.

శ్లో॥ సుభగసలిలావగాహాః
పాటలసంసర్గసురభి వనవాతాః
ప్రచ్ఛాయ సులభ నిద్రా
దివసాః పరిణామ రమణీయాః

గ్రీష్మదివసములలో చల్లని నీటిలో నిలిచియుండుట యెంతేనియు సుఖ మనిపించును. కలిగొట్టు పూవుల సంపర్కముచే వనవాతములు పరిమళభరితములై వీచుచుండును. దట్టమైన నీడలు గల చోటులలో సులభముగ నిద్రపట్టును. సాయంకాల మైనకొలఁది ప్రకృతి రమణీయముగఁ జూపట్టును. ఈ విధమైన సుఖానుభూతి కేవలము కవి హృదయముననే పొడకట్టును. ప్రాణిసామాన్యమునకుమాత్రము గ్రీష్మకాలమున తాపానుభూతిచేఁ గ్లేశమే గోచరించును.

వర్షాసమయము గాలికి వర్షమునకుఁ దట్టుకొనఁజాలిన యాశ్రయములేనివారికి బాధాజనకమే యైనను, కవికిమాత్ర మా సమయమున నబ్బురపాటు నొదవించెడి ప్రకృతి రామణీయకమే చూపట్టును. సౌందర్యద్రష్టయైన కవి దుఃఖదాయకమైన సామగ్రి నుండిసైతము సుఖానుభవయోగ్యమైన సామగ్రినే గ్రహించి, ఆనందానుభూతికై యత్నించి సాఫల్యము నందుచుండును. అట్టి దృష్టియే ప్రకృతి రామణీయక ప్రదర్శకమై వెలయుచుండును. నన్నెచోడుని కుమారసంభవము నందలి వర్షాకాలవర్ణన క్రమము నందలి యీ క్రింది పద్యమును బరికించిన నీ విషయము తెల్లమగును.

చలిగాడ్పుల ముసురుల మెయి
వలిగొని ధాత్రీపురంధ్రి వడఁ బచ్చని కం
బళిఁ గవిచికొన్న విధమునఁ
బొలుపుగఁ జిప్పరుపు గలిసె భూతల మెల్లన్.

చలిగాలితోఁ గూడిన ముసురులు పట్టినపుడు ప్రాణులన్నియుఁ గ్లేశములకే పాల్పడును. ఆమాటను దలపెట్టక, కవి యీపద్యమున వర్షారంభమున భూమి నంతట నలముకొనిన చిప్పగడ్డి నూఁతఁగొని, భూమి యనుసతి, ఆచలిని పోఁగొట్టుకొనుటకై ఆకుపచ్చని కంబళి గప్పుకొనిన ట్లుండెనని చిత్రించి, తృణసమూహమునుండి యొక మధుర దృశ్యము నుద్భావింపఁజేసినాఁడు. కాళిదాసు మేఘసందేశ కావ్యమునఁ బ్రథమసర్గయందు వర్ణించిన వర్షాసమయ విభవ మంతయు పై విషయమునకుఁ దార్కాణము. వర్షావర్ణనమున కుపక్రమించిన కవి యెవ్వరయినను ప్రకృతిసౌందర్యమునే సాధారణముగఁ బ్రదర్శించును.

ముసురులు ముసురుకొనినపుడు, ఇంధన తృణక్లేశము లనుభవించు గృహస్థుల యిడుములను, పాడి పశువులకుఁ గలిగెడి క్లేశములను వర్ణించుటకుఁ బూనుకొనిన కవులను మన మేనాఁడ

యినను అలఁతిగనే చూచెదము. ప్రాణి సామాన్యాభిలషితమైన సుఖ నిరూపణతత్పరతయే యీ యుపేక్షకు మూలము. దుఃఖ వర్ణనమునందుసైతము సుఖము నను భవింపఁజేయు కవి ప్రవృత్తియే యిట్టిది. వియుక్తులయిన ప్రేయసీ ప్రియులకు వర్షాసమయమును గడుపుట దుర్భర మని తెలుపు ఘట్టములందుఁ గూడ, ప్రకృతి సౌందర్యము నూహాతీతముగఁ జిత్రించిన వాల్మీకి రామాయణమునందలి వర్షా వర్ణనమే యిందులకుఁ దార్కాణము. కాళిదాస విరచితమైన ఋతుసంహార కావ్యమునందును నట్టిదే యందును సుఖానుభూతియే ప్రదర్శిత మైనది. ప్రాచీన కవులు సర్వలోకానంద దాయకమైన వసన్తవర్షా శరదృతువులను వర్ణించుటలోఁ గొంత విశేష ప్రణిధానమును గాన్పింపజేసియున్నారు. హేమంత శిశిరముల కొంతకుఁ బోయినవా రంతగఁ గానరారు. హేమంతమున చలిబాధ హెచ్చగుట మూలముననేమో, దాని వర్ణించుటకుఁ జాలమంది మౌనమునే వహించుచు వచ్చినారు. ఉత్తరదేశమున మిక్కుటమగు చలిచే బాధనందుచుండెడి కవులు, ఆఋతువుపై శీతలదృష్టిని వేసిన వేయవచ్చును. చలిబాధ నంతగ ననుభవింపని దాక్షిణాత్య కవులైనను దానిజోలి కంతగఁ బోయినట్టుల గానరాదు. ఆ ఋతు వర్ణనము కవి మార్గపరిక్షిణ్ణము కాదనియేమో? తెలుఁగువారికిఁ జలిబాధ యంతగ లేకయో, ఆ సమయమున ప్రకృతి యంతయు పంటచేలతో నిండి పచ్చగఁ గాన్పించుట మూలముననో, తెలుఁగువారు సైతము హేమంత వర్ణనమునఁ గొంత మౌనముద్ర వహించినా రనుట తెల్లము. కాని యీశ్వరార్చన కళాశీలుఁ డయిన శ్రీనాథుఁడు, తన సహజ ధోరణిలో నీ హేమంతమును గొంత వింతగనే వర్ణించియున్నాఁడు. శివరాత్రి మాహాత్మ్యమున శిశిరర్తు ప్రస్తావమునకుఁ బూర్వరంగముగ హేమంత విభవము నతిమనోజ్ఞముగ నాసూత్రించినాఁడు. ఆ క్రమ మెట్లు సాగెనో కొంచెము పరికింతము.

బలుసు ల్పండెను, దొండ ముక్కుపడియెం బ్రాసంగుచేలొప్పెఁ బ్రేమో
కలపూఁబాళల తావిఁ గ్రోలి పొదలెం గౌబేర దిగ్వాయువుల్
ఫలిసీవల్లిమతల్లివల్లరులపైఁ బైపై నలిప్రాతముల్
వొలసె న్మంచులు రాలె రాత్రి కరిణీఫూత్కార వార్బిందువుల్.

హేమంత సమయమునందే బలుసుతుప్పలు పండ్లు పండును. పండ్లతో నిండిన బలుసులు చూడ ముచ్చటగా నుండును. ఆ వేళ వాని యాకు లన్నియు రాలి, పచ్చనిపండ్లుమాత్రమే నిలిచియుండును. ప్రాసంగు వరిచేలు పండఁబాఱి గింజల ముక్కు వెళ్లివడి యుండును. అప్పటి వరిచేల యొయ్యారముకూడ మిక్కిలి ప్రేక్షణీయముగనే యుండును. ఈ సమయమున కౌబేరదిక్ (ఉత్తర దిక్కునుండి) వాయువులు వీచును. వీనిని కొండగాలు లందురు తెలుఁగువారు. అవి పోఁకపొత్తులలో నిమిడియున్న పూవుల తావిని గ్రోలివచ్చు ననినాఁడు. శ్రీనాథున కా పూవుల పరిమళము నందు ప్రీతి హెచ్చని తోఁచును. ఏ తావున గాలి వీచిన దనినను దానిని పోకపూవులలోని తావిని గొనివచ్చువానినిగాఁ జిత్రించి వదలును. ఈ యుత్తరదిశనుండి వచ్చు చలిగాలిని తెలుఁగువారు కొండగాలి యనుట వపపత్తి నీ క్రింది పద్యమునఁ దెలిపి యున్నాఁడు.

> వలనుగాఁ జంపకారణ్యావాటి దరిసి
> కాశి యొరసి కళింగాంధ్ర దేశసరణి
> దక్షిణము సాఁగెను సపాదలక్షశైల
> కటకబంధుఁడు దగ్ధిశాగంధవహుఁడు.

అలకాపట్టణము మొదలు ఆంధ్రదేశ పర్యంతము నుత్తరము నుండి దక్షిణమునకు సాగు నీ వాయువు లక్షపాతికవేల పర్వత ప్రదేశములకు బంధు వనుటలో నీ గాలి కొండగాలి యగుట తెల్లమగుచున్నది. ప్రియంగుల తలపై తుమ్మెదలు చేరిన వనినాఁడు ఈ హేమంతమున తుమ్మెదలకు నిత్యనిలయములైన పద్మములు రూపులేని వగును. కావుననే యపుడు పూవులతో నిండిన ప్రియంగుల తలపై నవి మూఁగుట. హేమంతమున సరోవరములందు సరోజములు లేకుండు నను విషయమును కాళిదాస నన్నెచోడులు తమ కుమారసంభవకావ్యములందు పార్వతీ తపశ్చర్యా ప్రకరణమునఁ జిత్రముగఁ జిత్రించినారు.

> శ్లో॥ ముఖేన సా పద్మ సుగంధినా నిశి
> ప్రవేపమానాధరపత్త్రి శోభినా,
> తుషార వృష్టి క్షతపద్మ సంపదాం
> సరోజ సంధాన మివాకరోదపామ్.

పార్వతి, పరమేశ్వర వర లాభమునకై ఘోరమైన తపము గావించు పూనికలో, హేమంత రాత్రులం దుదకమునందు వాసము సేయుచు, పద్మమువలెఁ బరిమళించుచు చలిచే వణకుచున్న పెదవులు గలదైన తన ముఖముచే, మంచు వర్షముచేఁ బద్మసంపద సమసిపోయిన నీటికి పద్మము నొకదాని గూర్చి, సరోజ శోభను గూర్చె ననినాఁడు. మంచు పడినంతనే పద్మములు రూపు మాసిపోవుట సహజమైన విషయము.

> తనరి హేమంత మగుడుఁ బద్మంబు లడఁగి
> పోవఁబోయినఁ గొల నొక్కపువ్వు తనకు
> విత్తుగా దాఁచికొనియున్నవిధము తోఁప
> శైలసుత ముఖముదకవాసమున నొప్పె.

వనజము లెల్ల మంచు గొని వాడినచో నొకపువ్వు నిల్చినన్
గని యళు లన్నియు న్నెలవు గైకొని, దీనికి ముచ్చు వచ్చునో
యను వగ, మీఁదఁ బిండుకొని యడ్డము నిల్చెను నాఁగ, నంబుజాననముపయిం జటావళి పెనంగి నగాత్మజ కొప్పు నత్తఱిన్.

ఉదకవాసము చేయుచున్న పార్వతి ముఖము, హేమంత సమయముచే పద్మము లన్నియు నణఁగిపోవఁగా సరోవరము విత్తసమున కొక పద్మమును దాఁచిపెట్టుకొనిన ట్లుండె నని మొదటి పద్యమునకు భావము. మంచుపడి పద్మము లన్నియు వాడిపోయి ఒక్క పద్మమే నిలిచియుండుట చూచి, దీని కేమి ముప్పు వచ్చునో యను బాధచే తుమ్మెద లన్నియు గుమిగూడి, పార్వతీ ముఖ పద్మముమీఁద మంచు పడకుండ నడ్డము నిల్చెనో యనునట్లు, జడలవరుస యొప్పియుండె నని, కవి రెండవపద్యమునం దుత్ప్రేక్షించియున్నాఁడు. మఱియు రాత్రులందు మంచుబిందువులు పడుట, రాత్రి యను నాఁడేనుఁగు పూత్కారమునఁ జిమ్మినట్లు రాలుచుండెనఁట. హేమంతమున హిమబిందుపాతముకూడ సహజవిషయమే.

ఈ సమయమున చలి యధికముగ నుండుననుట నేవిధముగఁ జిత్రించెనో కొంచెము పరికింతము.

కలమవనాళికా కణిశకంటకకోటులచేతఁ జూడ్కి కిం
పలవఱిచె న్దరిత్రి తుహినాగవేళఁ దటాకసారణీ
సలిలమువాఱి పండిన యజాంగలసీమము లెన్ని యన్నిటం
దలముగు సీతుపేర్మి గరుదాల్చినభావము ప్రస్ఫుటంబుగన్.

హేమంతవేళ చెరువుల కాలువలనీరు పారి పండిన పొలములలో పరిమున్నగు ధాన్యముల వెన్నులకుఁ జరిచిన నూగు, చలి మిక్కుట మగుటచే నాపొలములు గగుర్పొడిచెనో యనునట్లు చూడ ముచ్చట గొల్పునఁట. ఇది యొక మధురమైన కల్పన. వరివెన్నులమీఁద జొన్నకంకెలమీఁద నూఁగు చరిచిన, అది పంటవలంతికి చలిచే నేర్పడిన గగుర్పాటునుగా భావించుటలోఁ గవికిఁగల ప్రకృతి సౌందర్య పర్యవేక్షణ నైశిత్యము మనకు గోచరించును. వెన్నుమీఁది నుండెడి నూఁగుకూడ ప్రేక్షణీయ మనుటలో కవిదృష్టి యెంతటి సూక్ష్మాంశములమీఁద సైతము ప్రసరించునో యను వింతను గొలుపకమానదు. ప్రాణిసామాన్యమునకు కంటకరూపమైన యా నూఁగు హేయమేగాని యుపాదేయము గాదుగదా ! అది కవికి మధురభావోన్మేషమునకు మేరుకల్పమైనది. ఈ వర్ణన పరిపాటిని బట్టి కవి తననాఁటి పంటల తీరును పరోక్షముగఁ దెలియఁజేసి యున్నాడు.

ఈ కావ్యమునం దీనాఁటి చలినిగూర్చి కొంత విపులముగనే ప్రస్తావించియున్నాఁడు. పట్టణముల మేడలమీఁది కప్పులందు లోనున్న పావురములు ధ్వని చేయుచుండ, చలియే గుల గుల కూయుచున్న ట్లుండె నని చిత్రించినాఁడు. వలభీ గర్భములందు కపోతములు చలిచే కూఁతలు పెట్టుట సహజమే యయినను, దానిని చలియే గులగుల కూయుచున్న ట్లున్న దనుట శ్రావ్యమైన విషయము. పద్యమునందు సైతమా ధ్వని కొంత వినిపించును.

కల పింక కలకలాకుల
వలభీగర్భములు సౌధవాటములు పురం
బులయందుఁ దుహినవేళలఁ
జలి గులగులఁ గూయునట్టి చందం బొందెన్

చలి ప్రవేశించుట నిష్క్రమించుట యను నీరెండిటిని సహజముగఁ జిత్రించి గట్టి చలియుండు సమయము నీక్రిందివిధముగఁ దెలిపినాఁడు

చలి ప్రవేశించు నాగులచవితినాఁడు
మెఱయు వేసవి రథసప్తమీదినమున
నచ్చుసీతు ప్రవేశించుఁ బెచ్చుపెరిగి
మార్గశిర పౌషమాసాల మధ్యవేళ.

నాగులచవితి పండుగ కేవలము తెలుఁగువారిదే. ఆనాఁడు నాఁటికి నేఁటికి పల్లెలలోను పట్టణములలోను పామరులు నాగరికులుకూడ నాగ నివాసములందు (పుట్టలందు) పూజోపహారములు సమర్పించుట బహుకాలముగా వచ్చు పరిపాటి. ఆవిషయము నొక్కమాటలోఁ దెలిపినాఁడు. ఆపర్వమునాఁటికి కొలఁదిగనైన చలి ప్రవేశింపక తప్పదు. ఈపర్వము దీపావళికి సమీపమున కార్తిక శుద్ధ చతుర్థినాఁటిది. రథసప్తమినాఁటికి ఉత్తరాయణ ప్రవేశమై వేసవి మెఱసి. చలి కొంత వెనుకఁబట్టును. నాగులచవితి మొదలు రథసప్తమివరకు తెలుఁగువారి కన్నియు పర్వదివసములే. కార్తిక శుద్ధ ఏకాదశి ఉత్థానైకాదశి. ద్వాదశి క్షీరాబ్ధిద్వాదశి. ఆనాఁడు తులసీ బృందావన సన్నిధిని విష్ణుభక్తులు లక్ష్మీనారాయణ పూజ దీపమాలికలు వెలిఁగించుట గావింతురు. కార్తిక శుద్ధ పాడ్యమి మొదలు ఆ మాసాంతము శివకేశవాలయములందు ఆకాశదీపము నక్షత్రమాలికా దీపమాలికలు వెలయింతురు. కార్తిక శుద్ధ పూర్ణిమనాఁడు జ్వాలాతోరణోత్సవము దక్షారామమునం దీ జ్వాలా తోరణమును దూరిన వానికి యమపట్టణద్వారతోరణము దూర నక్కరలే దనినాఁడు శ్రీనాథుఁడు.

కార్తికిక వేళ భీమశంకరుని నగర
దూరు నెవ్వాఁడు చిచ్చుఱ తోరణంబు
అతఁడు దూరఁడు ప్రాణనిర్యాణవేళ
ఘోరయమపట్టణద్వార తోరణంబు.

చలి దట్టమై పెచ్చుపెరిగెడి మార్గశిర పౌషమాసముల మధ్యవేళయే ధనుర్మాసము. ఈ మాసమున సూర్యుఁడు వృశ్చికరాశినుండి ధనూరాశిలోఁ బ్రవేశించును. ఈ మాస మంతయు విష్ణుభక్తులు దివ్య క్షేత్రములందు భక్తిసమన్వితమై ప్రసాదబహుళమైన భగవత్సేవలు నెఱపుచుందురు. ఈ కైంకర్యము భక్తులకు భుక్తి ముక్తి ప్రదమై వెలయుచుండును. విష్ణుభక్తులకీ ధనుర్మాస దివసము లన్నియుఁ బరమపుణ్యప్రదములు. ఈ నాఁటి చలి నతిచిత్రముగఁ జిత్రించియున్నాఁడు శ్రీనాథుఁడు.

ఇనుఁడు కోదండరాశి మీఁ దెక్కునపుడు
నిఱుకోదండవల్లి నెక్కిడు మరుండు
సమద వేదండ సమ మహాసత్త్వుఁ డయ్యు
జనుఁడు కోదండమును బోలెఁ దనువు వంచు.

సూర్యుఁడు కోదండరాశిలోఁ బ్రవేశించునప్పటికి మన్మథుఁడు చెఱుకు విల్లు నెక్కువెట్టునఁట. ఇట్టి చలివేళ యువప్రాణులకు మదనవికారము వెలయు ననుట కీ మాటకాదు. ఆనాఁటికిఁ జెఱుకు తోఁటలు ముదరఁబాఱు నని తెలుపుటకే. వక్రోక్తి భంగిమలో తెలుఁగునాఁటి సస్యసమృద్ధిని వర్ణించు పరిపాటి యాతని రచనలలో నడుగడుగునకుఁ గానవచ్చును. ఇచ్చటఁగూడ నా పద్ధతియే పాటింపఁబడినది. ఇట్టి ధనుర్మాసమున మదపుటేనుఁగువంటి మహాబలవంతుఁ డైనను శరీరమును వింటిబద్దనువలె వంచితీరు ననుట సర్వప్రసిద్ధము. ఇట్టి దట్టమైన చలి మనుజుని గుమ్మడిమూట గట్టివైచు నని క్రీడాభిరామమున వల్లభరాయఁ డిట్లు చిత్రించినాఁడు.

ప్రక్కలు వంచివంచి, మునిపండ్లను బండ్లనురాచిరాచి, ము
మ్ముక్కిలఁ జేసి చేసి, తలయల్లనఁ గాళ్లకు నందియందిలో
చక్కికి నొక్కినొక్కి, యిరుచంబడ గుమ్మడిమూటఁ గట్టి, పీ
పెక్కి దువాళి.చేసి, చలి యిక్కడనక్కడఁ బెట్టు వేకువన్

చలి పీపెక్కి దువాళి సేయునపుడు మనుజుఁడు శరీరమును ముడుచుకొనుట, యిటునటు తిరుగుటయుఁగూడ సహజము. దానిని చలి చేయు పనులనుగాఁ జిత్రించుటలోఁ గొంత కవితారామణీయక విషయము గోచరించును.

క్రీడాభిరామమునందును పుష్య మాఘమాసములందలి చలిని దట్టుకొనుటకుఁ గొన్నిసామగ్రు లుండిననాఁడేగాని శక్యము కాదనినాఁడు.

స్థూలద్విత్రిపటావగుంఠనములున్ ధూపోపచారంబులున్
గాలాగు ర్వనులేపనంబులు వధూ గాఢోపగూహంబులున్
గేళీగర్భనికేతనంబులును గల్గెంగాక లేకున్న నీ
ప్రాలేయాగమ మెవ్విధంబున భరింపన్వచ్చురా? టిట్టిభా!

ఈ విధమైన శీతాపనోదక సామగ్రి యందఱకు సులభముగాదు. దళసరి దుప్పట్లు రెండుమూడు కప్పుకొనుటకుఁ గొందఱకే లభించును. ధూపోపచారములు కృష్ణాగరు మైపూఁతలు వధూగాఢోపగూహనములు నదృష్టవంతులకేగాని యందఱకు లభింపవు. గాలిచొఱని మిద్దెటిండ్లలో మృదుశయ్యలు లభించుటయు నరిదియే. ఇట్టి వన్నియు సమకూడినఁగాని హేమంతమునాఁటిచలిని భరించుట యెట్టివారికిఁ గష్టమే. ఈ క్లేశములను వర్ణించిన తీరునందుసైతము కవులు మన కానందమునే గలిగింతురు. శాలివాహన సప్తశతిలో పశువును గొనుటకై పచ్చడ మమ్ముకొన్న హాలికుని గూర్చి యనుశయమును వెలయించు శృంగారభావానుసంధానమున హాలుఁడు మన కుల్లాసమునే గలిగించును. కనుఁ డా దృశ్యము.

శ్లో॥ విక్రీణీతే మాఘమాసే
పామరః ప్రావరణం బలీవర్దేన
నిర్ధూమ ముర్మ్మర నిభౌ
శ్యామల్యాః స్తనౌపశ్యన్.

శా. స. శ. సంస్కృతచ్ఛాయ.

మాఘమాసంబు పులివలె మలయుచుండ
బచ్చడంబమ్మి కొన్నాఁడు పసరమునకు
ముదితచన్నులు పొగలేని ముర్మురములు
చలికి నోరఁగోయ కేలుండు సైరికుండు.

క్రీడాభిరామము.

ఈవిధమైన చలితో నిండిన హేమంతమునందే మకర సంక్రాంతి పుణ్యకాల మేతెంచును. తెలుఁగువారి కీ సంక్రాంతి పెద్దపండుగ. ఆనాఁటికిఁ దెలుఁగునాఁటఁ గల కర్షకు లందరకు సస్యములు పండి ధాన్యాది రాసు లిండ్లలో నిండుచుండును. ముఖ్యముగఁ బల్లెలలోని జనులు, ఎవరి యిండ్లకు వారు శక్తికొలఁది క్రొత్తశోభలను గొనివత్తురు. పల్లెలలో నీ పండుగ అలుకులతో ముగ్గులతో చుక్కలతో వెల్లలతో పసుపుకుంకుమ రేఖలతోఁ గలకలలాడుచుండును. ఈసమయమున నలికి ముగ్గు వెట్టిన మట్టియిండ్లకుఁ గల శోభ, గచ్చుచేసిన యిండ్లకేపాటియుఁ గలుగఁబోదు. సూర్యుఁడు ధనూరాశినుండి మకరరాసిలోఁ బ్రవేశించు పుణ్యకాల మిది. ఇది ప్రధానముగ ఉత్తరాయణ ప్రవేశసమయముగావున దేవతలకుఁ బితృదేవతలకుఁ బ్రీతిని గలిగించుట కనువైన పుణ్యకర్మము లాచరించు సమయము. నేఁడుకూడ వైదికాచార నిరతులు దేవపితృదేవ ప్రీతికై భోజనాదికములు గావింపఁజేయుదురు. అన్నిజాతులవారు పెద్దలకుఁ బెట్టుట యనుపేర తండుల శాకాది దానములు నెరపితీరుదురు. ఈ సంక్రాంతి బియ్యము లిచ్చుట, అన్నము పెట్టుట మున్నగు పరిపాటులలో ప్రాచీనమైన భారతీయ సంస్కృతిసూత్రము లెట్లు తలదాఁచుకొని యున్నవో సూక్ష్మముగఁ బరిశీలించిన గోచరింపకపోవు. ఈ మకరసంక్రాంతినాఁటి ముచ్చటలను శ్రీనాథుఁడు గొంత చిత్రించినాఁడు.

ఇండ్ల మొదలను నీరెండ నీడికలను
నముఁగుఁదమ్ముఁడు నన్నయు నాటలాడు:
నత్తయును గోడలును గుమ్ములాడుఁ గుమ్ము
గాచుచోటికి మకరసంక్రాంతి వేళ.

మకరసంక్రాంతి సమయమునకుఁ జలి యెప్పుడును మిక్కుటముగ నుండుటచే, ఇండ్ల ముంగట నీరెండులు సాగునప్పుడు, అన్నదమ్ములు వైరములు వదలి ఈడికలతో నాటలాడుకొందురు. కుమ్ములున్న చోటికి చలికాఁగుటకై వచ్చి అత్తకోడండ్రిద్దరుఁ గుమ్ములాడు కొందురు. వీని నీనాఁటికిని మనము పల్లెలలోఁ గాంచఁగల్గెదము.

మకర సంక్రాంతి ప్రవేశమునకు ముందటిదివసమును భోగి యని యందురు. ఈనాఁడాబాలగోపాలము నభ్యంగ స్నానము లాచరించుటయే గాక భోగిమంటలను మహాసంరంభముతో నెరపుదురు. దానిని సాగించుటకై యాబాలవృద్ధము నెరపు యత్నమెంతయు ముదావహమై యుండును. యథాశక్తి భోగిమంటలకుఁ గట్టెలను గూర్చుట పుణ్య మని కొందరు, గొబ్బిళ్ల పిడుకలదండలు మంటలోఁ బడవైచిన సుకృత మని చిన్నిబాలికలును నెలరోజులు ముందునుండియు యత్నముచేసి వానిని సిద్ధము చేసి కుమ్మున కర్పించి కృతార్థత నందెదరు. ఈ సంక్రాంతిపండుగ పల్లెలలో నత్యుత్సాహమును వెల్లివిరియఁజేయుచుండును. ప్రతి యింటికి ముందు వెనుకలలో బంతిపూల మొక్కలు, ద్వారములందు బంతి పూవులదండలు, సీమంతినుల జడలలో బంతిపూల చెండ్లు నిండి యెక్కడఁ జూచిన నక్కడ బంగారు రంగులు వెలయుచుండును.

వెనుకటి కవు లీవేళ చేమంతులను గొంత వర్ణించిరే గాని రేక బంతి ముద్దబంతి ఊకబంతి కుంకుమబంతి సీమబంతి యని పలువిధములఁ బలురంగులలోఁ గానవచ్చెడి యీ బంతిపూవుల శోభను వర్ణింపరైరి. ఇవి యీమధ్య నవతరించినవియేమో? లేక దీనిలో పరిమళ మంతగ లేదనియో? కాని పూచిన బంతి మొక్కలతోను ఆవమొక్కలతోను నిండిన పొలమును జూచిన సహృదయునకు దృష్టిమాత్ర మిటునటు చెదరఁబోదు. సంక్రాంతి పండుగను వెలయించు మూఁడు దివసములు ఇంటి ముంగిళులు ముగ్గులతోడను. ద్వార బంధములు పసుపు కుంకుమ రేకలతో నిండి చూడ ముచ్చట గొల్పును. గృహస్థుల లోపలియిండ్లు ఆడుపడుచులతో క్రొత్తయల్లుండ్రతో నిండి, పిండివంటల గుమగుమలతో గుబాళించును. ఏ వయసువారియందైన నానందమే వెల్లివిరియుచుండును. కావుననే తెలుఁగువారి కీ సంక్రాంతి పెద్ద పండుగ. ఈసంక్రాంతికి నూత్నవస్త్రములను గట్టుకొనని మానవులే గానరారు. ఈ నాఁ డీ మకరసంక్రాంతి యింత వినోదభరితమై కానవచ్చుచుండ నున ప్రాచీన కవు లెవ్వరు నీ విభవము నంతగ వర్ణించి నట్టులు గానరాదు. ఆ నాఁ డీ పండుగ కేవలము వినోదవిషయము గాక, దేవతాప్రీతి సంపాదకముమాత్రమే యై యుండెడిదేమో?

ఒకవిధముగ యోజించిన, నీ మకరసంక్రాంతి యనంతరమున మాఘమాసము సమీపించుటచే, అపుడు స్నాన దానాది క్రియలచే సుకృత మార్జించుటకు వలసువడును గాన, శూన్యమాసమయిన పుష్యమాసము పొంతకు ధర్మైకదృష్టి గల కవులు పోలేదేమో యని యనిపించును. ఈ క్రిందిపద్యము నారయుదము.

కాశిలోఁ జక్రపుష్కరిణి దుష్కరశుష్క
గహనావళీ దావదహనశిఖ్యాఁ
గుక్కుటేశ్వర వరకుండిపీఠపురి శం
కాతమస్కాండచండాంశుదీప్తి
దక్షవాటంబు సప్తర్షి గోదావరి
కలిదోషపాషాణకులిశధార
గౌతమీ తటిని మార్కండేయపురి బ్రోల
దురితాహిసంఘాతగరుడమూర్తి
నిన్నిటను దీర్థ మాడంగ నేఁగుదెంతు
రఖిలమునులుఁ బ్రభాత సంధ్యాగమముల
గ్రహగణేశుఁడు కోదండరాశిఁ బాసి
మకరమున కేఁగుదేరంగ మాఘవేళ.

సూర్యుఁడు మకరరాశిలో ప్రవేశించునరికి మాఘవేళ యేతెంచును ఈ వేళఁ బుణ్యతీర్థములందు ప్రాతః సంధ్యాసమయములలో స్నాన మాచరించుట కలుషహర మని మునులందఱు గంగాది పుణ్యతీర్థముల కేతెంచెద రనినాఁడు. కాశీలోఁ జక్రపుష్కరిణీ స్నానమెట్టిదో పిఠాపురమున పాదగయా క్షేత్రమున కుక్కుటేశ్వరునెదుట నున్న తీర్థమునందు, దక్షారామమున భీమేశ్వర సన్నిధిని సప్తగోదావరితీర్థమున, రాజమహేంద్రవరమున మార్కండేయస్వామియెదుట అఖండగౌతమియందు స్నాన మాచరించుట యట్టిదని నిరూపించియున్నాఁడు. మన ప్రాచీనకవు లేవిషయమును దెలిపినను దానిని ధర్మానుబద్ధము చేయుటయేగాని, దానికి దూరము చేయు పరిపాటియే యుండదు. మకరసంక్రాంతినాఁటి ప్రకృతి విభవము నీ క్రిందివిధమునఁ జిత్రించినాఁడు.

పలిపోయెం దుహినంబు, పండె వరి, యిప్పల్పూవ సెశైలంబులన్
గలిగట్టె, న్వలరాజు తేఁటి యొలకం గాండప్రకాండంబులన్
జలపించెన్ గ్రహరాజు మాతరకునిం జక్రాద్రికూటంబునం
దలఁ గౌబేరదిగంతరిక్షపథయాత్రాజైత్రదుస్తంభమున్.

ఉత్తరాయణ ప్రవేశమైనతఱిని సూర్యుఁ డుత్తర దిగ్యాత్రాభేరిని అరుణునిచేఁ జఱిపింపఁగా, మంచు మాసిపోవుట, వరి పండుట, ఇప్పచెట్లు పూచుట, తుమ్మెద లా పూలపై వ్రాలుట జరుగు నని భావము. కవిభావనలోనే నాఁటి ప్రకృతివిభవమైనను ప్రేక్షణీయమే.

దంపతులు

మిన్నికంటి గురునాథశర్మ

ఉ॥ అమ్మ కుఱంగట న్మెలఁగునప్పుడు నవ్వుచుఁ జూడ, వొక్కవా
క్యమ్మును బల్క, నేను దఱియంగఁ దొలంగుదు, వీనిసుంగుఁ గై
కొమ్మనఁ జేయి సాఁప, వరిగూడను నీవలె నుండఁ. డట్టి నీ
కమ్మకచెల్ల! ఒక్కరిత నైనపు డెక్కడలేని ప్రేమమా? 1

చ॥ నలుగురు తారు వేళఁ దగునా ? యిటు పైఁటచెఱంగు లాఁగ నే
వలనుకుఁ జన్న నడ్డముగ వచ్చెద వెంతటి పిచ్చి! యయ్యొ! గా
జులు చిటులుం గయి న్విడువు; చూడకు నా మెడప్రేలు హారముల్;
పిలిచెద రేరొ చూడు; మని ప్రేయసి యచ్చోటు వాసి పర్విడెన్. 2

చ॥ వదినె యసాధ్యురాలు మన వాసన పట్టదె? అత్త గన్న నా
బ్రదుకును బైటవేయదె? మఱంద లెఱింగిన సిగ్గు మూటగ
ట్టదె? యదె మామ దగ్గెడిఁ, దటాలున వచ్చునొ యేమొ యేరొ వ
చ్చెద రని పైఁట లాఁగుకొని చేడె చనెం గదినుండి నవ్వుచున్. 3

తే॥ నానగా రింటిలోన నున్నారు; చదువు
కొను మనుచుఁ గొట్టు; నాడుకోఁ జనుము తండ్రి!
యనుచు బెల్లము పెట్టి పుత్రు నటు పంపి
తరుణి గదిఁ జేరె నవ్వుచుఁ దలుపు మూసి. 4

కం॥ తమ కేమి తెలియనట్టులు
తమ కక్కఱ లేని యట్లు తాము బలాత్కా
రమువలన నొప్పినటు లు
త్తమకులకన్యలు నటించెదరు పతి కవయన్. 5

తే॥ అవల కేగుఁడు మీ చేతు లాడుచుండు
నొద్ద నున్నచో నెప్పుడు నూరకుండ
రదిగొ బియ్యము చెరుగుట కంత సేపె!
తెరిలె నెస గంచు నత్తయ్య యఱచుచుండె. 6

కం॥ ఈ సొమ్ము మీది గా దటు
గాసిం బెట్టెదరు; చాలుఁ గైదీయుఁడి యు
ల్లాసము కూడదు రే పిటు
సాఁగిన బిడ్డ యేడ్పులేగద చెపుఁడీ. 7

చ॥ పడమటిగాలి సాఁగె; నిలువంగలమే? కిటికీని వేయు, మె
ప్పుడు కనుమబ్బునో వలుపు మూసి గడెంగ విగియింపుమన్న నా
పడఁతి స్మితాస్యయై చెమట పట్టెను పీనసతోడ పీవు మం
చడుగకయున్న నీ నుడివినన్ని యొనర్చెద నాథ! యంచనెన్. ౮

సీ॥ తీర్చిన కుంకుమ దీసి వే దిడి దానిఁ దుడిచి కస్తురిబొట్టు తడవుదిద్దు
దువ్వెన ముంగురుల్ దువ్వను గోసగోళ్ళ సటు గీఁటు నఱచేత నదిమిపట్టు
వేసిన క్రొవ్వెద విప్పి క్రొమ్ముడి వేసి సరిగ లేదని వాలుజడ నమర్చు
విరిసరుల్ ప్రేలాడఁ జెరివి కాదని విఱువంపుగా నొందల పట్టు గట్టు

పొన్ను నలుమూల ఒూరక పట్టితిరుగుచుఁ
దాను గూర్చుండి నిలువుటద్దంబు సూచు
గాజులు కదల్చు మొలనూలు గజ్జె లంటు
చీమ చిటుకన్న సటు చూచుఁ జిగురుఁబోఁడి 9

మ॥ ఇదిగో! యిప్పుడె వత్తు నే ననుచుఁ బోయెం దాను; దారిం గన
న్మదితా! కన్నులు వాచె; రాత్రి రది యేమో పోవ, దీ కోడి కూ
య, దయో వేఁగురుఁజుక్క రాదు; మసి దివ్వల్ కాంతులం బాయ వే
నెదిచేయ న్మది దోఁప, దీ బెడఁద సెల్లే దాఁటుటల్ చేటికా! 10

ఉ॥ సారమునందు నున్నపుడు దుఃఖము మూలము పెల్లగిల్లునే
తారుచునుండ నింట నమితం బగు ధైర్యము మిన్నుముట్టునే
చేరఁగఁ గేళికాగృహము చిత్తము చిందులు ద్రొక్కునే, తదీ
యోరువు నెక్క సంస్మృతియు నుండదె; నాథుఁడు గారడీఁ డకే. 11

ఉ॥ పడువకయ్య; తండ్రికోలి కేడ్వకు నాయన! తల్లితోడ మా
టాడకొనంగనిమ్ము; తదనంతరమేగద నేను నీవు; పా
రాడెడునప్డు పోయి నడయాడెడు నప్పుడు వచ్చె నిన్నినా
శ్వీడిచి యీడ్వలేమటర యీ ఋణ, మింతనె చచ్చిపోదుమా? 12

చ॥ వెలఁది వయస్సు నంకమున వెల్గుచుఁ గ్రొవ్వెదఁ దీర్చి గిల్కుటం
దెలమెలి సీల లూడ్చి నినదించెడి గజ్జెల యొడ్డియాణ మ
వ్వల నిడి ప్రేలుచున్న పఱుబన్నసరంబులఁ దీసివైచి న
వ్వులు పరిహాసముల్ చెలఁగఁ బొల్చె ననంగుని భైసిమాలునో. 13

శా॥ అదియే మెవ్వరు పిల్తు? రంతమున 'కో' యన్నట్లు విన్పించె దు
ర్మదుఁడా తామ్రశిఖుండు గాఁడుగద; యామాత్రంబు ప్రాక్పుణ్యసం
పద నావంటి యభాగ్యురాలికె? అయో! ప్రాణప్రియా! యిప్పు డే .
గద నీ రాక త్రియామకుం గినుకయే కల్గెం జుమీ నా పయిన్. 14

చీకటి నవ్వింది

ఎ. మురళీధర్

(ఈ కథకు "ఆంధ్రప్రదేశ్" కథానికల పోటీలో మూడవ బహుమతి లభించింది.)

వర్షం వచ్చినప్పుడు మూసీనదిలోకి నీళ్లు పొర్లి పొర్లి వచ్చినట్లుగా ఉంది రాష్ట్రపతి రోడ్డుమీద జనం. ఎక్కడినుంచి వస్తున్నారో తెలియదు, చీమలు పుట్టలోంచి వచ్చినట్లు.

ఎప్పుడూ చార్‌మినార్ ఐనా చూడని శంకరయ్య కుటుంబం కూడా ఆవులమంద బస్తీలోంచి బయటకు వచ్చింది. రోడ్డుమీదకు వచ్చిపడిన కుటుంబం ఈ శంకరయ్య ఒక్కడిదే కాదు. పగలంతా చాకిరీ చేసుకోవడం, చీకటి పడేముందు రెండు బొట్లు పుచ్చుకొని కాళ్ళు పారజాపుకొని పడుకోవడం — యిదీ వరస దాదాపు అందరిదీను.

ఒక పుష్కరం క్రితం 'పోలీసు చర్య' జరిగినప్పుడు ఆ సెప్టెంబరు పద్దెనిమిదో తారీకున ఒక్కసారి ఎడారి నవ్వింది. ప్రతివాడి గుండెలమీద బరిశ నిలబడింది అప్పటిదాకా. ఆక్షణంలో ఒక్కసారి లావా లాగా బయటకు వచ్చేశారు.

మళ్లా ఆ రోజు స్మృతిపథంలో తిరిగింది. విశాలాంధ్రం అవతరించిందని, ఒక ఋషి ఆత్మత్యాగం ఫలించిందని అందరి ముఖాల్లో హర్షం వర్షిస్తోంది.

అందరూ ఒక్కచోటికి వచ్చారని, హైదరాబాదు మళ్లా నిజంగా భాగ్యనగరంగా మారుతుందని ఎంత ఆశ.

"గదేందే" అని కనిపించిన ప్రతిదాన్నీ గుచ్చి గుచ్చి పిల్లలు అడగటంతో శంకరయ్య విసుగు పుట్టి "ఊకె యిదది అడిగి దిమాక్ ఖరాబ్ చెయ్యకు" అన్నాడు. నరసమ్మ మాత్రం "పిల్లగాడు అడిగితే గట్ల సీదరించుకుంటవు?" అని అదో రకంగా చూసింది.

"గందుకనే తీసుకురానంట మల్ల. ఇశాలాంధ్ర అయింది గంద, ఇంక అందరు ఒకచే పో" అని వ్యాఖ్యానం చేసాడు.

''ఇసాలేంద్రేందే, ఇసిత్రంగున్నది?''

''అట్లడుగు మల్ల, ఎనక ఆంద్ర ఏరు, ఐదరాబాద ఏరు. తెలుగోళ్లు కలిసిపోయిండ్రనుకోరాదు."

''నుసుపు ఏరున్నదెట్ల? బెజవాడలో మా చెల్లెమ్మ ఉండనే ఉండె. మా అన్న బామ్మరిది ఇశాఖపట్నంలో అదేందో నూనె కంపినిల ఉండె, నువ్వేమో ఏరంటవు?''

దీనికి శంకరయ్య దగ్గర సమాధానం దొరకలేదు. అటు ఆంధ్ర తెలంగాణా కలవటమేమిటి? ఒకటేగదా ననే తనకులేని భావం నరసమ్మకు ఏ విధంగా కలిగిందో అర్థంకాలేదు శంకరయ్యకు. తన ఆధిక్యతను పోగొట్టుకోవటం యిష్టంలేక యిట్లా అన్నాడు.

''అది సరే. ఆంద్రోళ్లొచ్చింరంటె మరి హుకూమత్ బదలాయించిందన్నమాటేగద, ఈ ఆంద్రపైస లొచ్చినయి గద, దీన్ల బరకత్ లేదంటే'' అని విషయం మార్చేశాడు. విషయం అయితే మార్చాడు గాని బుర్రలో అదే తిరుగుతోంది. ఇంతలోకే మహబూబ్ కాలేజీ ఆవరణ వచ్చింది.

''ఈడకి పెద్దమంత్రి వస్తుండు. తఖ్రీర్ జబర్‌దస్తుగ ఉంటదనుకోరాదు.''

''గట్లనా, నువ్వు యాడకైన తీసుకెత్తగదా''

మీటింగు అయిపోయేదాకా ఓపికగా కూర్చుంది శంకరయ్య కుటుంబం.

ప్రతి పది నిమిషాలకీ ''గదేందే నాయన'' అని కొడుకు అడుగుతూ ఉండడం, "గమ్మున ఊకోరాదు" అని శంకరయ్య ఊరుకోబెట్టటం జరిగింది.

చివరకు బయటకు వచ్చేస్తూ ''ఏందే సీటికి మాటికి నేరూ నేరూ అంటరు'' అని అడిగింది నరసమ్మ. దొరికిన అవకాశం విడిచిపెట్టడం ఇష్టంలేని శంకరయ్య ఒక్కసారి పక్కుమని నవ్వాడు.

"నేరూ కాదది నెహురూ. ఇది ఎరుకలేదా? నెహురూ దేశానికి పెద్దగాదె? అందుకని ఆయన పేరు మరి మాటిమాటికి ఏదైనా వస్తాంటది" అని తన సర్వజ్ఞత్వం వెల్లడించుకున్నాడు.

''జర్రి చా తాగి పోదమా ?''

"యీ వోచెల్లి నేను దాగ, మంచిగ ఇంటికాడ దాగినంగద, మరేంచెసె"

ఇంటికి వచ్చా దన్న మాటేగాని శంకరయ్యకు ఏమీ పాలు పోలేదు. తెలంగాణా వేరుగావుంటే దాగుంటుందనీ, ఆంధ్ర తెలంగాణా ఒకటైతే రాగటానికి వీలులేదనీ, అక్కడివాళ్లంతా పెత్తనం చెలాయిస్తారనీ చెవిదగ్గర గూడుకట్టుకుని చెప్తున్నారు తన తోటివాళ్లంతా.

తను పనిచేస్తూన్న ఆఫీసులో యిద్దరు చెప్రాసీలు పొరుగు రాష్ట్రానికి బదిలీ అయిపోయారు. వాళ్లస్థానే విశాఖపట్నంనుంచీ, శ్రీకాకుళంనుంచీ అప్పలనరసయ్యా, శ్రీరాములూ అనే యిద్దరు వచ్చారు. వాళ్ళకీ తనకీ పడటంలేదు. ఆఫీసరుకూడా బదిలీ అయిపోయి విశాఖపట్నంనుంచి చక్రపాణి అనేఆయన వచ్చాడు.

ఇవన్నీ జరిగి పట్టుమని పది రోజులు కాలేదు. అయినా జరిగిన ప్రతి రోజూ ఒక్కొక్క అధ్యాయంగా జ్ఞాపకం ఉండిపోయింది శంకరయ్యకు.

వచ్చిన మొదటిరోజునే ఆఫీసరుగారు, అధికారం చూపించాలని మామూలుగా ఉండే కోర్కెతో ''ఎవడురా అక్కడ?'' ఇటువంటి పిలుపుకి, యింత గౌరవంగా పిలిపించుకోవటం అలవాటు లేకపోవడంచేత కొంచెం విడ్డూరంగా చూశాడు శంకరయ్య.

"ఆదేటి? అట్లా దిక్కులు చూస్తావేటి? అయ్యగోరు పిలుస్తా వుంటే?" అని అప్పల నరసయ్య అంటూంటే, ''అయ్యయ్యో, అయ్యగోరికి మహాకోపం వెళ్లసె'' అని యిద్దరూ ఒకళ్ల కొకళ్లు వంత పాడుకుంటూ లోపరికి వెళ్లారు. "వా దేడీ" అని అడిగాడు. "మరిగంటే, మరిగంటే" అని నీళ్లు నమిలాడు అప్పల నరసయ్య, శ్రీరాములు అంతకుముందే శ్రీకాకుళంలో ఈ ఆఫీసరుగారి దగ్గర పని చెయ్యడంవల్ల యింకా చనువుగా 'ఏరా, వా దేడీ. నవాబుగారు ఇంకా రాలేదేమిటి? ఈ వేషాలు కుదర వని చెప్పు. ఇది ఆంధ్ర గవర్నమెంటు !'' ఈ మాటలు వింటూనే లోపలికి వెళ్లాడు శంకరయ్య "క్యాసాబ్'' అంటూ, "సాబూలేదూ గీబూలేదు. తెలుగులో ఏడవరాదూ ఆ ఏడిచే దేమిటో?"

శంకరయ్యకు నిజంగా మనిషికి రావలసినంత కోపం వచ్చింది. ఒక్కసారి మనిషైపోయాడు.' తను ఆఫీసు ఫ్యూన్ను అనే అతి ముఖ్యంగా పాటించబడుతూన్న విషయాన్ని మరచిపోయాడు.

"మంచిది దొరా" అనగలిగాడు అహంకారాన్ని చంపుకుని. ఇంకా చల్లబడని చక్రపాణి ''ఈ దొరా గిరా మనదగ్గర నడవవు తెలుసా. ఆఫీసు అయిన తరువాత బజారు పని చూసుకుని యింటికి రావాలి. అక్కడ అమ్మగారు చెప్పిన యింటి పనిచేసి...''

"మేం చేస్తాం అయ్యగోరూ, అడికేం తెలుసుద్ది?" అన్నారు అప్పల నరసయ్య, శ్రీరాములు ముక్తకంఠంలో,

మామూలుగా ఉంటే ఏమనేవాడో గాని, కనీస సభ్యతకు కర్చు రాసేసిన చక్రపాణి ఆఫీసరుగా మాత్రమే కనిపించలేదు. తను ఒక ఆఫీసు చప్రాసీగా మాత్రమే అనిపించలేదు.

అయినా ఇంకా సభ్యత హద్దులు దాటటం నేర్చుకోని శంకరయ్య అన్నాడు.

''దొరా, ఎందుకట్లా కోపం చేస్తవు? నేను దఫ్తర్ చెప్రాసీని గదా, ఇంటి నౌకరైతె కానుగదా !''

"ఆ......అంతదాకా వచ్చిందీ వ్యవహారం? బంట్రోతు వెధవకి ఇంత పొగరేమిట్రా?"

ఈ సంభాషణ పూర్తి కాకుండానే రామచందర్ అనే ఒక ఆఫీసు సూపరెంటెండెంటు లోపలకు వచ్చాడు, ఫైలు సమేతంగా, ఈ జరుగుతూన్న వ్యవహారం అర్థంకాక అటూ యిటూ చూశాడు.

''ఆ......నీకేం కావాలయ్యా'' అన్నాడు అదే ధోరణిలో.

రామచందర్ కొంచెం సూరేకారపు పాలు ఉన్నవాడేమో వెంటనే అన్నాడు.

"నా కేం అక్కరలేదండి — ఆఫీసుపని. మీరు చూస్తా నన్న ఫైలు..."

"ఓహో అదా సంగతి? మీ రెక్కడినుంచి ట్రాన్స్ఫర్ అయివచ్చారు?"

"నేను తెచ్చిన ఫైలుకూ దాని సంబంధం లేదనుకుంటా."

"మీరు లా చదివినట్లున్నారు పాపం !"

"నేను లా డిగ్రీ తీసుకున్నందుకు విచారించడంలేదు."

"విచారించవలసింది నువ్వుకాదయ్యా, మేము."

"ఇదేం మర్యాదండీ? మీకు మీరు 'మేము' అని సంబోధించుకుంటూ ఎదటివాళ్ళని నువ్వ అంటున్నారు."

ఇంతలోకే రామయ్యఅనే ఒక యు. డి. సి. లోపలికి వచ్చాడు.

"నీకేం కావాలయ్యా"

"నాలుగురోజులు సెలవ"

"ఇంకేం వద్దూ ?"

"ఏం యియ్యగలరు ?"

"ఏమిటండి ఓ. యస్. గారూ, వీళ్ళని యిట్లా తయారు చేసారు ? ఈ హైదరాబాదు పద్ధతే ఇంత అనుకుంటా."

"ఆంధ్రవాళ్ళలాగ మర్యాద చెయ్యడం మాకురాదు" అని రామయ్య అంటూన్న మాటను ఆపుచేస్తూ—

"రామయ్యగారూ, మీకు సెలవ కావలసివస్తే అప్లికేషను యివ్వండి. నేనున్నానుగా పైకి పంపించడానికి. మీకు సెలవ వుంటే యివ్వటానికి అభ్యంతరం ఏముంటుంది? యీ మాత్రం దానికి ఇక్కడకు ఎందుకు వచ్చినట్లు?" అన్నాడు సూపర్నెంటు.

"యస్సర్" అంటూ వెళ్ళిపోయాడు రామయ్య.

చప్రాసీలు బయటకు వెళ్ళినతర్వాత చక్రపాణితో అన్నాడు రామచందర్—

"చూడండి చక్రపాణిగారూ, మీరు అక్కడనుంచి వచ్చి ఆధిక్యాన్ని చూపించబోయి అధికారాన్ని రుద్దబోతే హైదరాబాదులో మొదటినుంచీ ఉంటున్నవాళ్ళకు కొంచెం కష్టంగా ఉంటుంది. నేనూ అక్కడివాడినే అనుకోండి. అయినా ఇక్కడ మంచి అలవాట్లు ఉంటే ఎందుకు చేసుకోకూడదనీ అని అలవర్చుకున్నాను. ఇక్కడ 'లంచ్అవర్'లో చప్రాసీలు, గుమాస్తాలు, ఆఫీసర్లతోసహా ఒకేచోట కూర్చుని భోజనంచేస్తారు. ఒకళ్ళను ఒకళ్ళు 'తమరు' అని సంబోధిస్తారు."

"ఇంకా"

"మీరు కోపగించుకొని లాభంలేదు."

"చాలాబాగుంది కాని యిక మీరు వెళ్ళవచ్చు" అని ''అప్పల నరసయ్యా'' అని పిలిచాడు. అమాంతంగా వచ్చిపడ్డాడు అప్పల నరసయ్య.

"మరి ఫైలు చూడరూ?"

"చూస్తా. కాస్త వేరే పనుంది. మళ్లా పిలుస్తానులెండి"

రామచందర్ బయటకు వెళ్ళిపోవడము చూసి శ్రీరాములు కూడా లోపలికి వచ్చాడు.

"అమ్మగోరు కూరలు తీసుకురమ్మన్నా రండి"

"మంచిది తీసుకురా. అది సరేకాని వీళ్ళు ఏమి గూడుపురాణీ చేస్తున్నారో భోగట్టా తెలుసుకుని నాకు చెప్పాలి తెలిసిందా?"

"అట్లాగేనయ్యా"

మర్నాటినుంచీ ప్రతి చిన్నవిషయానికీ కీచులాడటం అలవాటు అయిపోయింది. ఆ ఆదివారం ఆఫీసర్స్ క్లబ్‌లో కలుసుకున్నారు ఆంధ్రనుంచి ట్రాన్స్‌ఫర్ అయి వచ్చిన కొందరు ఆఫీసర్లు. అనుకోకుండా సుందరం, రంగనాథం, చక్రపాణి కలుసుకున్నారు.

"నువ్వు ఎప్పు వొచ్చావురోయ్" అని ఒకళ్ల నొకళ్ళు పలకరించుకున్నారు.

"అబ్బ ఎంతకాలానికి కలుసుకున్నామోయ్" అన్నాడు సుందరం.

సుందరం, చక్రపాణీ తోడళ్ళుళ్ళు. ఒకేసారి పబ్లిక్‌సర్వీస్ కమీషను పరీక్షకు వెళ్ళి అమాంతంగాపాస్ అయిపోయి ఆఫీసర్లై పోయారు. ఒకళ్ళు శ్రీకాకుళంలో ఉంటే మరొకళ్లు నరసాపురంలో ఉంటూవచ్చారు. ఇంక రంగనాథం చక్రపాణీ క్లాస్‌మేట్స్. అందువల్ల ఇటువంటి విడిపోయిన వాళ్లందరూ ఒకచోట కలుసుకోవడంకోసం ఏర్పాటు చేసారా ఈ క్లబ్ అనిపించేలాఉంది.

"ఏమోయ్, రంగనాథం, మీ ఆఫీసు సంగతులేమిటి?" అన్నాడు చక్రపాణి.

"క్లబ్‌లో ఆఫీసు సంగతు లేమిటి నీ ముఖం?"

"నీ స్టాఫ్ నీతో సహకరిస్తున్నారా? నాకు బలేచావుగా వుందోయ్; ఇక్కడివాళ్లకు వెధవ నవాబీవేషాలు, జాగీర్లు పోయినా జాగీరుదార్లు పోనట్లు."

"చక్రపాణీ, నువ్వు ఒట్టి పసివాడి లాగున్నావే? నీ పద్ధతే తప్పు. సుందరంకూడా యిదే అవస్థేమో? అసలు నా కర్థంకాదు, మీరు కొన్ని అభిప్రాయాలు పెట్టుకు బయలుదేరుతారోయ్."

వెంటనే సుందరం అందుకొని 'అవునోయ్, మాకు అభిప్రాయాలంటూ ఉండటమే తప్పా. నయం, నీకు అంతా గమ్మత్తుగా ఉంటుంది. రేపు నెత్తిమీద ఎక్కి పిండికొడితే తెలుస్తుంది. చప్రాసీగాడినీ 'సాహబ్' ఆఫీసర్నయినా 'సాహబ్'; ఏమిటోయ్ ఈ వ్యవహారం?

తనకు మద్దతు దొరకంగానే అందుకున్నాడు చక్రపాణి—

"మనం నేర్చుకోవాలిటోయ్ వీళ్లదగ్గర. ఇష్టం వచ్చినప్పుడు ఆఫీసుకు రావడం, ఇష్టం వచ్చినపుడు పోవడం, ఎక్కడికి కెళ్లావంటే చాయ్ తాగడానికి వెళ్ళాడనటం — ఏమి టిది?"

ఈ జోరులో ఏమి చెప్పినా అర్థంకాదని అప్పటికి ఆ విషయం మీద చర్చ మానేసాడు రంగనాథం.

"ఎల్లుండి ఒకసారి మా ఆఫీసుకు రావోయ్, చక్రపాణి, ఆఫీసు అయిపోయే టైముకు, నువ్వుకూడా రా సుందరం, మనలో మనకి పట్టింపు లేమిటి మర్యాదలకి? పిక్చర్‌కు పోదాం.''

మర్నాడు సుందరం చక్రపాణి ఆఫీసుకు నాలుగు గంటలకే వచ్చేసాడు. సుందరం వచ్చేసరికి తుమతుమ లాడుతున్నాడు చక్రపాణి.

''ఏమిటోయ్ గిరాకీ?''

''ఏం లేదు. ఈ ఆఫీసు నా కొక హెడేక్ అయిపోయింది సుందరం. ప్రతివాడూ తా నేదో పొడిచేస్తా నంటాడురా?"

"కొట్టుకొనేదాకా వస్తోందిరా వ్యవహారం?''

"సరే పద పోదాం మనవాడిదగ్గరకు" అంటూ లేచాడు కుర్చీలోంచి చక్రపాణి.

ఇద్దరూ రంగనాథంఆఫీసుకు వెళ్లేసరికి రంగనాథం, యింకా ఎవరో యిద్దరు ఆఫీసు గుమస్తాలూ 'టీ' తీసుకుంటున్నారు.

ఇదేమిటి చోద్యం? ఆఫీసులో తనకింద పని చేసే గుమాస్తాలతో కలిసి 'టీ' తీసుకుంటున్నాడు?

క్వశ్చెన్ మార్కు ముఖాలతో చూస్తున్నవాళ్లను చూశాడు రంగనాథం.

"రావోయ్ రా, మీకోసం వెయిట్ చేస్తున్నా. మర్చిపోయా..." అంటూ బెల్ నొక్కాడు. ఒక ప్యూన్ ఎంతో నమ్రంగా లోపలకు వచ్చి రంగనాథం ఇచ్చిన సైగను అర్థంచేసుకుని రెండు నిమిషాలలో రెండు కప్పుల టీ తీసుకొచ్చాడు. ఇంత మార్పేవాలా పద్దా అనేది యింకా తేల్చుకోలేదు వీళ్ళిద్దరూ.

"అల్లా నిలువుజీతం ఇచ్చినట్లు నిల్చున్నారేమోయ్" అని బలవంతంగా కూర్చోపెట్టాడు రంగనాథం. అక్కడ కూర్చున్న వాళ్ళను పరిచయం చేసాడు. అందరూ గుమాస్తాలు, ఉట్టి ఆఫీసు గుమాస్తాలు. అందు వల్ల కొంచెం మొగమాట పడ్డారు.

వీళ్ల గాబరా పడటం చూసి అందులో ఒక అతను అననే అనేసాడు "ఇంకా క్రొత్త అనుకుంట రెండి — అందరూ అంత దబ్బున కలిసి పోలేరు." అని.

ముఖంలో నెత్తురు చుక్కలేదు.

"మనం వెడదామనుకున్నాం కదూ" అన్నాడు, సుందరం.

"టీ తీసుకు కుని వెడదాం."

గుమాస్తాలు అక్కడనుంచి వెళ్లిపోయారు. టీ తీసుకువచ్చాడు ట్రేలో ప్యూన్

అంతా గమ్మత్తుగా కనిపించింది; ఏమిటి వీళ్ళందరూ యిట్లా వున్నారు. వీడు మనలాగే అక్కడనుంచి వచ్చినవాడేగదా? ఇందులో ఏదో కిటుకు వుంది?

అందరూ ఆఫీసు బయటపడ్డారు. బస్సుదగ్గరకు నడచారు మౌనంగా. బస్టాప్ దగ్గర 'క్యూ' లేకుండా ఒకళ్ళ నొకళ్లు తోసుకుంటున్నారు.

కొందరి నోళ్ళల్లో పెద్ద పెద్ద చుట్టలున్నాయి. తుబుకు తుబుకు ఉమ్మేస్తున్నారు. కండక్టరు క్యూలో రమ్మంటున్నాడు. "ఈ ఆంధ్ర అయినంక ఎక్కడలేని మంది వచ్చి జమ అయింద్రు" అంటున్నాడు ఒకడు.

"ఏ బాబుసొమ్ము దాచిపెట్నావు హైదరాబాదలో" అంటున్నాడు యింకొకడు.

"పెద్ద న్యూసెన్సు అయిపోయిందోయ్" అని సుందరం అంటూండే వెంటనే చక్రపాణి అందుకొని "మెల్లిగా అంటావేమిటి, చస్తాంలేను?" అన్నాడు.

ఈ గొడవలో బస్సుకాస్తా వెళ్ళిపోయింది.

మళ్ళీ బస్సు వచ్చేసరికి అరగంట పట్టింది. ఎట్లాగో తోసుకుని ఎక్కారు, బస్సులో కూర్చున్న తర్వాత కూడా ఇదే గొడవ.

సికిందరాబాదు పాట్నీ దగ్గర దిగి, తాజ్‌మహల్ హోటల్లో కాఫీ తీసుకున్నారు. "ఏరా, ప్లాజాలో మంచి ఇంగ్లీషు పిక్చర్ ఉంది వెడదామా?"

"ఇంగ్లీషు పిక్చర్‌కు వెళ్ళచ్చు గాని, మా ఊరికు ట్రాన్స్‌ఫర్ చేయించేసుకుందా మనుకుంటున్నానురా" అన్నాడు సుందరం.

"ఏమీ పాలుపోవటంలేదు. మరీ పొగరుపోతువాళ్ళతో వేగటం ఎట్లాగో!" అన్న చక్రపాణి మాటలు సరిగ్గా పట్టించుకో లేదు రంగనాథం.

"ఏమిటోయ్, ఆఫీసులోనూ, క్లబ్‌లోనూ, రోడ్డుమీదా అన్ని చోట్లా అ గొడవేనా? కాస్త మార్కెట్టుకు వెడదాం పద" అని మార్కెటువైపుకు దారి తీశాడు.

కూరల మార్కెట్టు మహారద్దీగా వుంది. ఒక గూడపట్టు కట్టుకున్న అసామి కొన్ని పావలాబేరలకే ఒక కొత్తిమీరకట్ట నొసరు వెయ్య మంటున్నాడు.

"పోపో,...మహా కొన్నావు. ఈ ఆంధ్రోళ్ల కంజూసు లెక్కలనె" అని విసుక్కున్నాడు.

"మాటలు చిన్నగా రానియ్. పళ్ళూడతయ్."

ఇద్దరూ చెయ్యీ చెయ్యీ చేసుకునేదాకా వచ్చింది వ్యవహారం. అతి కష్టంమీద ఒక పెద్దమనిషి విడిపించాడు.

ఎవరో పళ్ళు బేరమాడుతున్నారు. ఇద్దరికీ ఘర్షణ వచ్చింది.

"ఈ ఆంద్రోళ్ళు వచ్చినంక అన్నిటికీ భావ్ బడాయించి పోయిందనె" అంటున్నాడు ఆ పళ్ళమ్మే వాడు.

ఎటుచూసినా తీరని అసంతృప్తి. ధరలు పెరిగిపోయాయి. పాలూ, పెరుగూ, కూరలూ, యింటిఅద్దెలూ, సమస్తమూ తెగ పెరిగిపోయాయి. ప్రతిదానికీ ఇదేకారణం చూపిస్తున్నారందరూ. పాలు రూపాయకు రెండుశేర్లల్లా శేరే ఎందుకైనా యంటే "ఆంధ్రోళ్ళొచ్చిండ్రు — అన్నీ మండిపోతున్నా యనుకోరాదు" అంటున్నారు. చివరకు పిల్లలు పాలు తాగకపోతేకూడా యిదే కారణం చూపిస్తున్నారు.

మార్కెట్‌లో టూర్ వేస్తూ, అదీ కొనుక్కొని బయటపడ్డారు. బయటకు వచ్చారన్నమాటే గాని అందరి బుర్రల్లో మార్కెట్టే తిరుగుతోంది. రాష్ట్రపతి రోడ్డుమీద శంకరయ్య కనిపించి, పోయేవాడు ఊరికే పోక చక్రపాణికి సలాం చేశాడు. చక్రపాణి తల పంకించాడు. తిరిగి సలాం చెయ్యకపోవటం చూసి అదో రకంగా బాధపడ్డాడు శంకరయ్య.

వెంటనే రంగనాథం, జబ్బుకు మందువేసినట్లు అనేసాడు "అతను మీ ఆఫీసులో ప్యూన్ అనుకుంటాను" అని.

"నువ్వు సరిగ్గానే అనుకున్నావు. లేకపోతే ఆఫీసరను కున్నావా?"

"లేదులేవోయ్, పుట్టావు నువ్వొక్కడివే ఆఫీసరుగాను ఎట్లాగైతేనేం? అతను సలాంచేస్తే నువ్వు గంగిరెద్దులాగ తలకాయ ఊపకపోతే కాస్త చెయ్యి విసురుతే ఏమైంది? బొత్తుగా యిక్కడి మర్యాదలు తెలియవు. ఇక్కడకు వచ్చి ఎన్నో మంచివిషయాలు నేర్చుకున్నాను. అంటే అన్నీ మంచివనికాదు. ఇక్కడివాళ్లకు కొంచెం బద్ధకం. నిజమే. అది వదలగొట్టాలంటే వాళ్లమీద ఎగరటంకాదు. మనంకూడా వాళ్లతోపాటు పనిచెయ్యడమే. పై అధికారులు కుర్చీల్లోంచి కదలకుండా మిగతావాళ్లను పనిచెయ్యమంటే ఇంతే. ఇక్కడకు నేను క్రొత్తగా వచ్చినప్పుడు నాకూ ఎట్లాగో అనిపించింది. చప్రాసీలూ, గుమాస్తాలూ, ఆఫీసర్లూ కలిసి టీ త్రాగడం, ఒకళ్లకూ ఒకళ్లకూ తేడా లేకపోవడం చూసి చాలా ఆశ్చర్యపడ్డాను. మంచిపద్ధతి. నేను వచ్చిన క్రొత్తలో అందరూ 'ఆంధ్రానుంచి వచ్చాడు' అని దూరంగా ఉంటూవచ్చారు. కాని నేనే వాళ్లల్లో కలియడంతో వాళ్లు తప్పించుకోలేక పోయారు. ఇదీ కిటుకు."

"బాగుంది నాయనా, నీ ఉపన్యాసం. చప్పట్లు కొట్టనా?" అన్నాడు సుందరం.

"పాపం ఆయాసపడ్డట్టున్నాడు, మళ్ళీ కాఫీ తాగుదామా" అన్నాడు చక్రపాణి.

"అదిసరేకాని మీరు ఈ రకంగా ఉంటే ఎవడోఒకడు చెయ్యి చూసుకుంటాడు."

"అయితే మనం పిక్చర్‌కు వెళ్లటంలేదా?"

"అక్కడికేగా మనం వెళ్లటం."

ప్లాజాలో పిక్చర్ చూసి యింటికి వెళ్లిపోయారు.

తరవాత ప్రతివారం క్లబ్‌లోనో మార్కెట్‌లోనో కలుసుకునేవాళ్లు ముగ్గురి సంసారాలూను.

గిరుక్కున తిరిగి రెండేళ్లు వెళ్లాయి. 1958 నవంబరు ఒకటవ తారీకు వచ్చింది. అంతకు ముందురోజే రంగనాథం, సుందరం, చక్రపాణీవాళ్లని టీకి రమ్మని పిలిచాడు.

తీరుబడిగా సాయంత్రం అందరూ కలుసుకున్నారు.

"ఏమిటోయి సంగతులు" అని రంగనాథం అడిగాడు.

"ఇద్దరం ఒకేసారి చెప్పాలా?" అన్న సుందరం మాటకు అందరూ నవ్వేసారు.

"ఫర్వాలేదురా రంగనాథం. అన్నీ సద్దుబాటు అవుతున్నాయి."

"సాధించా వన్నమాట."

"ప్రిస్క్రిప్షన్ నీదే ననుకో. ఆ క్రెడిటూ నీకే రావాలి."

"ఇంతకీ ఏం చేసావో ఒక కప్పు టీ మీద చెప్పుదాబూ"

చక్రపాణి ఎంతో ఉత్సాహంతో చెప్పటం మొదలెట్టాడు.

"అబ్బే. ఏం లేదోయ్, నా ఎక్స్‌పరిమెంట్ నాతో మొదలెట్టాను. నన్ను ఎవరైనా విష్ చెయ్యంగానే మళ్లా విష్ చెయ్యడం మొదలెట్టాను. చిటచిటలాడే ముఖం తీసేసి నవ్వు ముఖం పెట్టడం మొదలెట్టాను. కొంచెం పరిస్థితి మారుతున్నట్లు అనుమానం వేసింది. మా శంకరయ్య లేడూ వాడిని యింకా కొంచెం గౌరవంగా చూడటం, అప్పు డప్పుడూ టీ తాగు మని డబ్బులియ్యటం, శ్రీరాములు, అప్పల నరసయ్యల్ని వీడి మీద పెత్తనం చెలాయించ వద్దని చీవాట్లు వెయ్యడం — ఇవన్నీ ఒక్కొక్క ప్రకరణం అనుకో నా 'సక్సెస్' అనే పుస్తకం......"

"ఒక్క గుక్కలో చెప్పేశావే. సుందరం నీ సంగతేమిటో చెబుతావా? దానికి ఇంకొక కాఫీ కప్పు లంచం కావాలా?"

"అబ్బే...యిస్తే అభ్యంతరం ఏమిటి గాని, మా యిద్దరి అనుభవాలు వేరైన వేమీకావులే. మేమిద్దరమూ ప్రతి వారమూ కలుసుకుని, నీతో చెప్పలేదుగాని సంగతులు మాట్లాడుకునే వాళ్లం."

"అబ్బ, ఎంత మారిపోయార్రా, మీ రిద్దరూ" అని ఆశ్చర్యపోయాడు అరగంటసేపు రంగనాథం.

1959 నవంబరు ఒకటో తారీకు వచ్చింది. ఈ లోగా సుందరానికి ట్రాన్స్‌ఫర్ అయింది. సుందరం అంటే మునుపు అసహ్యించుకునేవాళ్లంతా యిప్పుడు పెద్దపార్టీ యిచ్చి పార్కర్ పెన్ ప్రజెంటు చేశారు. చక్రపాణీకూడా ఎంతో మారాడు.

ఒకటోతారీకు. 1959 వ సంవత్సరం. నవంబరు. అంతా క్రొత్తగావుంది. ఎటుజూసినా నా కోలాహలం, ప్రజల్లో ఉత్సాహం. అందరిముఖాల్లో జాతీయపతాకలు ఎగురుతున్నాయి.

ఆ సాయంత్రంలో ఇంతకుముందు మూడేళ్ల-బట్టీ వస్తున్న వైషమ్యాలు అంతర్థాన మైపోయాయి.

అందరి ముఖాల్లోనూ ఉత్సాహం మెరుస్తోంది. మూడేళ్ళ క్రితం ఉన్న అనుమానాలూ, వైషమ్యాలూ చీకటిలో లీనమైపోయాయి.

ఇంక ముందున్నది మనరోజు లనే ధీమా కనిపిస్తోంది. రామయ్య తన కుటుంబంతోపాటు హాయిగా రాష్ట్రపతిరోడ్డుమీద తిరుగుతున్నాడు. చక్రపాణి కనిపిస్తే ఒకళ్లకొకళ్లు విష్ చేసుకున్నారు.

సాయంత్రం అయిపోయింది. చీకటి ఒడిలోకి నగరం ఒరిగింది. చీకటి నవ్వింది.

గాలిమేడలు

కందుకూరి రామభద్రరావు

ఒకముహూర్తము విశ్రాంతి యుండవలెను
కాని, యొకమహాశిల్పియై, గాలిమేడ
లెన్నిలోకాలమేరల, నెన్ని యెన్ని
తీరు లొలయంగ నిర్మింప దివురు మనసు.

సృష్టిలోలేని యెంత విశిష్టఘటిత
నిమిషమాత్రాన నూర్ధ్వమార్గమున కెత్తు
కోటి శిఖరాల హర్మ్యాలు కోటి కోటి
భాస్కరాంశువుల వెలుంగు కొసరి కొసరి.

వివిధవర్ణాశ్మసందీప్త భవనమార్గ
తోరణ లతాంత మాలాప్రసూత గంధ
లహరులే వ్యోమమార్గ విలాసవతుల
నాసికాపుటంబులకు మన్ననలు సలుపు

చూచుచుండంగ హర్మ్యాల సొబగు రూపు
మారి కట్టడము లనంతమై, వికాస
నాశముల క్రీడయై, గణనమ్ములేని
కల్పనాశ్రయ భాగ్యాన గ్రాలుచుండు

మందిరాళిందభూముల మంజులముగ
వ్రేలు స్వర్ణపటాంతరశ్రీలఁ గదలు
ఊహ కందని చిత్రసమ్మోహనము, ల
వెన్నికుంచెలు ముంచి రచించినవియొ.

అవని యాధారమేలేక ఆకసమ్ము
పైని కప్పగ గొడుగు విప్పని విలంబ
సౌధజాల జాలకముల స్వచ్ఛకాంతి
పుంజములు సాగు ప్రాంగణమ్ములు వెలుంగ

ఉల్లిపొరలకు సన్నమై యుల్ల మలరు
తెల్లవల్వల కొంగులు తేలిపోవ
అంచవన్నెకుచ్చెళుల, రాయంచనడక
క్రింద మోపక సుందరాకృతులు తిరుగు

ఆ మహలులందు నెమలిసింహాసనముల
ప్రభువు లేకొల్వు దీర్పగ, పండిత కవి
గణిక గాయక నర్తకగణము లెన్నొ
తమకు ఛామయి క్షణికమాత్రమున వెలయు

ఒక్కలోకమా, దేశమా, ఒక్కమండ
లంబ, పల్లియా అది పట్టణంబ, విజన
సీమయా, జనసంకీర్ణభూమియా, వి
చిత్ర విత్ర దృశ్యముల విశేష మెసగు !

ఆ సుధామయహర్మ్య పర్యంక పాళి
కెన్ని యెన్ని విమానమ్ము లెగసి, పెన్ని
ధులు వెలార్చు గడియలోన, జలజగర్భు
డే యెరుంగని సృష్టి ఫలించువాని

కనులు నవ్వగ, వెల్గ రాకాసుధాక
రాననమ్ములు, రెలిచీరలల నెత్త,
కేలిదమ్ముల హారముల్ వ్రేల, లీల
తేలి తారాడు దేవతాబాల లెవరో ?

చెమటబిందువు రాలక శ్రీలు రాసు
లయి ఖజానాలు నిండి విస్మయము గొలుప,
ఊహమాత్రాన బరువెత్తు నొక్క మొగిన
ప్రథితమార్గాల రెక్కలు వచ్చినట్లు.

పాట పరవళ్లు త్రొక్కిన బాట నాట
ఆట తన్మయ మెసగినచోట పాట
జంత్ర గాత్ర సమ్మేళనస్థాయి గొన్న
రత్నశాలలఁ జను నొక్కనూత్నఫణితి

ఆ మహాభవనాభ్యంతరాలయముల
గాలి వెల్తురు చొరలేని శాలలందు
ఎందరని మహామంత్రుల కెన్నియెన్ని
రాచకార్యాల గూఢనిర్వహణ లెసంగు

ఆ మహాసౌధపాళుల నంటిపారు
బహుజలాలు, ప్రకాశించు బహువనాలు,
మిన్ను కెగయు బహునగాలు, తన్ని పఱచు
బహుళమై యెడార్లు క్షణిక వైభవమున

ఒక మహాప్రళయార్భటి నొక్కమారు
కారుకొని మూగు మేఘ ఘుర్ఘరల జారు
నుప్పువానలు ముంచెత్తి యూడ్చివైచు
సర్వ మనుసంత, కాంతి స్వచ్ఛతలు విచ్చు

కొంత పొగ క్రమ్మి, సునుమబ్బు కొంత మూగి,
కొంత సొన్నవుడువానగా గురిసి కురిసి,
నిమిషమాత్రాన సర్వము నిర్జన మయి
దిగులుగా మూల్గు మూలల నగళు లన్ని

ఆ మనోహార్మ్యజీవితవ్యాపృతులకు
అవధు లాంక్షలు, పాపపుణ్యముల గోడు,
శక్త్యశక్తుల గణనమ్ము, జనన జన్య
తారతమ్యవిభాగమ్ము, చేరరావు

ఆ మహోన్నతపదవులు నా మహద్వి
భవము. నా లిప్తమాత్రసంభవజగత్తు,
ఆ సకలలోకసామ్రాజ్యశాసనాధి
పత్య, మైంద్రజాలమ్ముగా పరిఢవిల్లు

ఇంత వైచిత్రి పండిన సృష్టి యెల్ల
క్షణికపరిన రత్నభ్రాంతిసంపద గొని
మాయ మైపోవు మన సింత మరలునంత
శుద్ధశూన్యప్రదేశ మేన్ స్ఫురణ లేదు.

ధనమున్నదన్న మదమున
ననయము దుర్వ్యయము సేయ నంతయు దరుగున్
దినమొక్క యిటిక బెరికిన
ఘనసౌధంబైన నేల గలయదె మిత్రా.

—— దుప్పాంరి.

పోస్టు తర్వాత త్వరితగతి



తపాలును త్వరితంగా సార్టుచేసి, బట్వాడా చేయడానికి వీలుగా పెద్ద పెద్ద పట్టణాలు దాదాపు అన్నీ పోస్టల్ జోన్‌లకింద విభాగించబడినవి. మీ ఉత్తరాలు అతి తొందరగా బట్వాడా అయ్యేటట్టు చూసుకోండి; జోన్ నెంబరుతో సహా పూర్తిగా చిరునామా వ్రాయండి.

మీరు వ్రాసే దానిలో మీ చిరునామాలో మీ జోన్. నెంబరు కూడా దయచేసి ఉదహరించండి.



జోన్ నెంబరు

చిరునామాను పూర్తి చేస్తుంది

మీకు ఇతోధికంగా సేవచేయడానికి మాతో సహకరించండి

తంతి - తపాలా శాఖ

DA 60/475




"ప్రణాళికా ప్రగతి" నాటకంలో ఒక దృశ్యం. ఈ నాటకానికి, 1960 నవంబరు 25, 26 తేదీలలో పశ్చిమ గోదావరి జిల్లాలో జరిగిన సంగీత నాటక గోష్ఠిలో ప్రథమ బహుమతి వచ్చినది. దీనిని పాలకొల్లు ఎమ్. ఎమ్. కె. ఎన్. మునిసిపల్ హయ్యర్ సెకండరీ స్కూలు విద్యార్థులు ప్రదర్శించారు.




శ్రమదానం—పంచాయతీ రాజ్య దినోత్సవాన కడపజిల్లా రాయచోటి ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.




విచిత్ర వేషధారణ—విశాఖపట్నం జిల్లా భీముని పట్నం పంచాయతీ సమితిలోని చిట్టివలసలో బాలల దినోత్సవం సందర్భంగా బాలికల మధ్య యీ పోటీ నిర్వహించ బడినది.




టోకియో హూజుల్గీ దేవాలయం చీఫ్ ప్రీస్ట్ రివరెండ్ రిరి నకాయామా 8-12-60న నాగార్జున కొండను దర్శించారు.




రామప్ప చెరువు




రామప్ప దేవాలయం, వరంగల్లు.



రామప్ప దేవాలయం మీద శిల్ప చిత్రాలు



సికింద్రాబాదు గాంధీ హాస్పిటల్ కొత్త అనెక్సీ, ఐ. ఎస్. ఐ. బ్లాక్—26.11.1960న తెరువబడినది.



హైదరాబాదులోని జూబిలీహాలులో ప్రైజ్ బాండ్లు రెండవసారి 'డ్రా' చేయబడినది.

శబ్దాశ్రయ హాస్యము - (2)

నిరర్థక పదప్రయోగం

మునిమాణిక్యం నరసింహారావు

శబ్దాశ్రయ హాస్యంలో నిరర్థక పదప్రయోగం ఒక ప్రకరణం. అర్థంలేని పదాలను కొన్నిటిని అర్థవంతంగా ఉండే పద్ధతిలో కూర్పు జేయడమే ఇందులో జరిగేపని. ఆ కూర్పులో ప్రతి పదానికీ అర్థం ఉంటుంది. ప్రత్యేకంగా ఆపదాలకు ఆ అర్థం ఉన్నప్పటికీ సాముదాయకంగా సాధింప నగిన అర్థవిశేషము ఏమీ ఉండకపోవుటమే ఈ హాస్య ప్రక్రియలో ఉండే వైచిత్రి.

ఆ కూర్పులో ఉండేవి అన్నీ సుశబ్దాలే కాని ఆ రచన మాత్రం వికృత భావప్రతిపాదకంగా ఉంటుంది. ఏ వాక్యానికా వాక్యము విడిగా చూస్తే అర్థవంతంగా ఉంటుంది. కాని మొత్తంమీద భావం అగమ్య గోచరం. విశిష్టమైనట్టీ రమణీయమైనట్టి ఒక భావాన్ని వ్యక్తంచేయడానికి ఇందులో ఉండే శబ్దాలు తోడ్పడడం లేదు కాబట్టి ఈ రచన నిరర్థక పద సంకలనం అయింది. తత్ఫలితంగా స్ఫురించే హాస్యము అనుభవ సాక్షికమే గాని లక్షించి వివక్షించి వివరించడానికి వీలుఅయింది కాదు.

ఒక చిత్రంలో ఇది ముక్కూ ఇది చెవీ ఇది కన్నూ అని తెలుస్తునే ఉన్నా మొత్తంమీద అది మానవాకృతి అని తెలియక పోవడంలో ఎల్లాంటి నిరర్థకత్వము ఉందో ఈ రచనలోనూ అల్లాంటిదే ఉంది. ఈ పద్యంచూడండి "కాకి కేమి తెలుసు సైకో ఎనాలిసెస్సు, ఆట వెలది ద్విపద కర్తగారు, అయిదు నాల్గు మూడు ఆముక్తమాల్యద, విశ్వదాభి రామ వినుర వేమ."

ఈ రచనలో ఏమాటకు ఆమాటకు అర్థం ఉన్నా, సాముదాయకంగా సాధింపబడిన అర్థం ఏమీలేదు. కాని ఇందులో ఒక చమత్కారము భాసిస్తూ ఉన్నది. మనకు స్ఫురించని అర్థ విశేషము ఏదో ఉన్నదీ అనిపిస్తుంది. ఎవరినో వెక్కిరిస్తూఉన్నట్లూ దేనినో పేళన చేస్తూఉన్నట్లూ లీలగా తోస్తుంది. ఈ రచన చదివిన మీదట నీ పెదవులపై రేఖా మాత్రంగా నయినా చిరునగవు భాసింపక మానదు. నిరర్థక పద ప్రయోగ జన్యమైన హాస్యానికి ఇది ఒక ఉదాహరణ.

కవి ఉద్దేశించిన అర్థవిశేషము మనకు తెలియనపుడు రచనలో ఉండే రమణీయ భావము మన ఊహకు అందనపుడు ఆ రచన అర్థంలేని కూర్పు అని అనేస్తాము.

అయితే అర్థంలేని మాటలు కూర్చినంత మాత్రాన హాస్యం ఉత్పన్నంకాదు. ఆ కూర్పులోకూడా ఏదో చమత్కారం ఉండాలె. ధ్వనినిక్షిప్తమైన రామణీయకత మనకు గోచరించవలె. అప్పుడే అది ఈ రకమైన హాస్యముక్రిందికి వస్తుంది. లేకపోతే పిచ్చివాగుడు అవుతుంది.

"ఇస్పేటు జాకీలం ఎగేసిన బాకీలం। మృత్యువు సినిమాలో మూడుభాషల టాకీలం, భగవంతుని టోపీలం, కవిత్రయపు కాపీలం!" ఈ పద్యానికి కవి అనుకొన్న అర్థం ఏమిటో భగవంతుడికే తెలియాలె. కాని ఇందులో ఏమో చమత్కారం ఉంది.

"గుడుగుడు గుంజాలం రెక్కల మంచాలం! మృత్యువు ఇనప్పెట్టెలో జర్మన్‌సిల్వర్ కంచాలం! భగవంతుని పోర పాట్లం! పొగలుగ్రక్కే సిగరెట్లం! కట్టె ఉల్లిపాయలం! కొండలమధ్య లోయలం! భగవంతుని కోతులం! పలుకరాని బూతులం!" ఇది ఇంకొకపద్యము. ఈ రచనకూడా అటువంటిదే! తాత్పర్యం తెలియకపోయినా ఏదో తమాషాగాఉంది!

ఈ నిరర్థక పద ప్రయోగానికి ఇంకొక ఉదాహరణ. నన్నొకసారి మిత్రులు బలవంత పెట్టారు. మీరు వ్రాసినపద్యం ఒకటి చదవండీ అని! నేను పద్యాలు వ్రాసేవాణ్ణి కాదు. అయినా ఆ మాట ఎందుకు చెప్పాలె అని ఈ పద్యం గడగడా అనేశాను.

"ఆశ్రిత పక్షవిచక్షణ కృతక్షణ రక్షితా! దుర్నిరీక్ష భక్ష్యాంతర దక్షిణా క్షోణీభరా! కమలాక్షా ఈక్షణ యక్షీకృత పక్షీంద్ర లక్ష్యా, వైరిస్తుతకీర్తి సాంద్ర వసుధాపాలచంద్రా!" అర్థంలేని ఈ కూర్పును జూచి మిత్రులంతా విరగబడి నవ్వారు.

ఇంతవరకు గునం, ప్రతిపదానికి అర్థం ఉండి మొత్తంమీద అర్థంలేని పద్ధతిలో వ్రాయబడిన హాస్యస్ఫోరకమైన రచనా విశేషాలను గురించి పరిశీలించాము.

ఇంకొకరకం కూర్పు ఏమిటీ అంటే పదాలకుకూడా అర్థం లేకుండా చేయడం! శబ్దాశ్రయ హాస్యాన్ని సాధించటంలో ఇది మరొకపద్ధతి.

ఒకసారి నేను రైలులో ప్రయాణం చేస్తున్నాను. సెకండు క్లాసు కంపార్టుమెంటు అది. నేను వెళ్లేటప్పటికే ఒక పెద్దమనిషి ఆపెట్టెలో కూర్చుని ఉన్నాడు. ఎక్కడో అయనను చూచి నట్లుంది గాని ఎవరైందీ జ్ఞాపకం రాలేదు

సరే నని లోపల కెళ్ళి కూర్చున్నాను. బైట ప్లాట్ ఫారం మీద నిలబడి ఉన్న ఓ కుర్రవాడితో ఆయన ఏదో మాట్లాడు తున్నాడు. ఎందుకో గట్టిగా కోప్పడు తున్నాడుకూడాను. ఆయన అన్న మాటలు ఇవి.

"అల్లాగ తెల్లపోయి చూస్తావేంరా స్కెనాజర్ ఒకటి తెచ్చి పెట్టమంటే. స్కెనాజర్ రా. స్కెనాజర్ అంటే తెలియదురా సన్నాసీ! ఒరే ఇంత మాత్రం తెలియని వాడవు ఎట్లాగ బ్రతుకు తావురా! సరి సన్నాసీ ఇప్పటికైనా వెళ్లి ఓ స్కెనాజర్ కొనుక్కురా!"

ఇదీ ఆయన అంటూన్న మాటలు ఆమాటలు విని నేనూ ఆశ్చర్యపడ్డాను.

ఆ పెద్దమనిషి నా వంక తిరిగి, "బాబూ చూశారా! ఈ కాలపుపిల్లల తెలివితేటలు! ఒక స్కెనాజర్ తెమ్మన్నానండీ మామూలు స్కెనాజర్ సుమండీ! అయినా వాడికి అదిఏమిటో తెలియడంలేదు. ఇంకా వీడు ఎందుకైనా పనికొస్తాడంటారా?"

నే నేమని చెప్పేది! ఆ స్కెనాజర్ ఏమిటో నాకూ తెలియదు నిజానికి!. అదేమిటో మీరైనా చెప్పండి మా వాడితో, అని ఆయన అంటే నా పని ఏం కావాలె. నిజానికి, ఈ కాలపు కుర్రవాళ్లు వాడే వస్తువులు కొన్ని నాకు తెలియవు.

ఈయనఇల్లు బంగారంగానూ అదేమిటో చెప్పమని నన్ను అడుగుతా డేమోనని నేను భయపడుతునే ఉన్నాను. ఆయన అనగనే అడిగాడు.

అయితే స్కెనాజర్ అంటే ఏమిటో చెప్పమని అడుగలేదు గాని, "చూడండీ ఇంతమాత్రం తెలియకపోతే ఎట్లాగండీ కుఱ్ఱ వాళ్లకూ! ఈ సజ్జను పెట్టుకొని కాపురంచేయడం ఎట్లాగండి" అని అన్నాడు.

చచ్చానురా బాబో అనుకొన్నాను. మౌనం వహిస్తే వదిలి పెట్టే రకంలాగ లేదు. ఎందుకంటే ఆయన నా వంకే చూస్తూ ఊరుకొన్నాడు జవాబుచెప్పమని గట్టిగా అడుగుతూ ఉన్నట్లు! ఇక మర్యాద దక్కేలాగునలేదు. నేను అన్నానూ!

"నిజమేనండి. ఇటువంటివాళ్ళతో కాపురం కష్టమే" అన్నాను. ఆయన నావంక చిరాకుగా చూస్తూ, "పైగా వీడు స్కూలు ఫైనలు ప్యాసైనాడుకూడాను" అని అన్నాడు వాడి అజ్ఞానానికి నేనేదో బాధ్యుణ్ణైనట్లు! అంతటితో ఊరుకోక, "వెధవ చదువులు వెధవ చదువులని!" అన్నాడు నా వంక కొరకొర చూస్తూ.

వీడియిల్లు బంగారం గానూ నన్ను పట్టుకున్నా డేమిటి. ఈదుస్థితికి నే నేదో కారణ భూతుణ్ని అయినట్లు! అను కున్నాను.

"నిజమేనండి వెధవ చదువులు కావుటండీ ఈ కాలపు చదువులూ! మీరన్న మాట నిజమే! స్కెనాజర్ అంటే తెలియక పోతే ఇంక వాడు ఎందుకు పనికొస్తాడండి. అటువంటి వాళ్లు చూశారూ అడుక్కుతింటూ పోవాలసిందే" అన్నాను నేను ఏదో కసితీర్చుకొన్న తృప్తితో.

ఈ మాటమీద ఆయన "అడుక్కుతింటానికి మాత్రం ఎల్లాగా పనికొస్తాడండీ, వెధవది స్కెనాజర్ అంటే ఏమిటో తెలియక పోతే" అన్నాడు.

నేను ఏం చెప్పేది! అడుక్కు తింటానికి కూడా స్కెనాజర్ అంటే ఏమిటో తెలియాలె కాబోలును అనుకొన్నాను.

ఆయన నన్ను ఇంకా అనేక ప్రశ్నలు వేసేటట్లు ఉన్నాడు. నా తెలివి తక్కువ తనాన్నికూడా బైట పడేయాలనే ఆయన ఆలోచిస్తూ ఉన్నట్లుంది. ఆయన వ్యవహారం చూస్తే ఆయన అడిగే ప్రశ్నలకు నేను చెప్పే జవాబులలో ఎక్కడో ఒక్కడ నా అజ్ఞానం బైటపడక మానదు. అయితే ఒక్క ఉపాయంతోచింది. ఆయన చెప్పిందానికల్లా "నిజం, నిజం లం తేనండి మరి" అని తప్పదాట్లువేస్తే, ఆయన నన్ను పట్టుకోలేడు అనుకొన్నాను.

అక్కడనుంచి ఆయన ఇష్టంవచ్చినట్లు మాట్లాడాడు. ఎదుట ఆయన, ఆ మాటకు అర్థం తెలియనివాడు ఎందుకు పనికిరా కుండా పోతాడు, అంటే నేను నిజమే అటువంటివాడు ఎందుకు పనికివస్తాడండీ! అంటూ దీర్ఘాలు తీశాను.

అటువంటి తెలివితక్కువ దద్దమ్మను గిలో మెట్టకాయ వేస్తారు. ఆయన కచ్చితంగా చెపితే వెయ్యాక ఊరుకొంటారు టండీ అని ఆమోదసూచకంగా నవ్వాను.

ఆయన చెప్పిందానికి నేను అంగీకరించడంవలన ఆయనకు ఉత్సాహం కలిగి, "చూడండీ భూమి గుండ్రంగా ఉందనీ, స్కెనాజర్ నల్లగాపుందనీ తెలియకపోతే ఇంకేముందిచెప్పండీ, అంతా నవ్వుతారా నవ్వరా?" అన్నాడు. తప్పకుండా, చచ్చి

నట్లు నవ్వుతారు అంటూ తార్కాణంగా నేను విరగబడి నవ్వాను.

"ఆ మాత్రం జ్ఞానం లేనివాడు వట్టి వెధవ" అని ఆయనంటే, "ఇంకానయం మెల్లగా అంటారేం! అటువంటివాడు వెధవేమిటి, వెధవన్నర కుండాను!" అన్నాను. ముఖం చిట్లించి కనుబొమ్మలు ముడివేసి అటువంటి మనిషియందు నాకుగల ఏహ్యాభావాన్ని వ్యక్తపరుస్తూ.

ఆతరువాత అక్కడుంటే లాభంలేదని తోచిందినాకు. ఉంటే నాచేత అవాచ్యాలన్నీ వాగిస్తూ ఉంటాడని తోచి మూటాముల్లే తీసికొని దిగిపోదామని లేచాను.

ఆయన నా రెక్కపుచ్చుకొని, మర్యాదగానె దిగకండీ మాస్టారూ. రైలు కదులుతున్నది అంటూ లోపలికి తీసికెళ్లి కూర్చోబెట్టాడు.

మాస్టారూ అని సంబోధించడం వల్ల ఆయన నా విద్యార్థి ఏమో నన్న అనుమానం కలిగింది కాని ఈరోజుల్లో ప్రతీవాణ్ణి మాస్టారూ అని అంటున్నారు గదా అని సరిపెట్టుకొని ఊరుకొన్నాను.

చూస్తే, ఆయన ఇంకేదో ప్రశ్నలు వేసేలాగున్నాడు. అందుకని ఏదో విషయమై తీవ్రంగా ఆలోచిస్తున్నట్లు ముఖం పెట్టాను; ఏదో ఆలోచిస్తూఉంటే ఆతని మాటలు నాకు వినిపించవు గదా అని నా ఎత్తు.

ఆయన ఇంకా ఏదో స్కైనాజర్ ప్రసంగం చేస్తూనేఉన్నాడు. ఆయన ఈప్రసంగం చేస్తున్నంత సేపూ నాకు ముళ్ల మీద కూర్చున్నట్లుంది.

చివరకు ఆయన, ఏమండీ మెస్టారూ స్కైనాజర్ రూపాయి కంటే ఎక్కువ ఖరీదు ఉంటుం దంటారా, అని సూటిగా అడిగారు.

నాకు దానిఖరీదు తెలియదాయె! అయితే నాకు తెలియదూ అని నా నోటితో నేను ఎట్లా అనేది? క్షణంముందు స్కైనాజర్ అంటే ఏమిటో తెలియనివాడు ఎందుకూ పనికిరాకుండా పోతాడనీ, శుద్ధ తెలివితక్కువ దద్దమ్మ అనీ ఒప్పుకొని ఇప్పుడు దాని ఖరీదు ఎంతో తెలియ దని ఎట్లా అనేది. చచ్చినట్లు దాని ఖరీదు ఇంత అని చెప్పి తీరాలెగదా!

అయితే ఆయన దానిఖరీదు రూపాయకంటే ఎక్కువ ఉంటుందండీ అని కదూ అడిగింది. దానికి జబాబుగా ఏదో తెలిసినవాడిలాగ "ఎబ్బె రూపాయకంటే ఎక్కువ ఉండదండీ. ఇంకా కాస్తో కూస్తో తక్కువే అయివుంటుంది" అని, మళ్లీ ఎందుకైనా మంచి దని, "కాకపోతే ఈమధ్య అన్నివస్తువుల లాగే దీనిఖరీదుకూడా పెరిగిందేమో" అన్నాను.

దానితరువాత ఆయన నన్ను, స్కైనాజర్‌ను గురించి రకరకాల వాక్యాలు పలికించాడు. యుద్ధానంతరం మంచి స్కైనాజర్‌లు రావటంలేదంటే నిజం అనీ, ఏ వస్తువ మంచి నాణ్యమైనది రావడంలే దనీ, ఓ చిన్న ఉపన్యాసం ఇచ్చాను. "పూర్వము ఒక్కొక్క స్కైనాజర్ నెలా రెండునెలలు పనికి వచ్చేది" అంటే "నెలేంకర్మం అండీ, ఒక్కొక్కటి దానిని ఆరు నెలలదాకా వాడేవారు" అన్నాను.

ఇల్లాగ పదినిమిషాలు నాచేత రకరకాలుగా అనిపించి విరగబడి నవ్వడం సాగించాడు. ఆనవ్వడం ఎందుకో నాకు అర్థం కాలేదు.

కానేవు నవ్వి "మాస్టారూ స్కైనాజర్ మీ రెప్పుడైనా చూశారా అండి?" అన్నాడు నవ్వు ఆపుకొంటూ.

నేను తెల్ల ముఖం వేశాను.

"నేను మీ విద్యార్థినండీ మాస్టారూ. మీతో హాస్యం ఆడుదామనుకొన్నాను. మీరు నన్ను గుర్తించక పోవడంవల్ల మరీ సులువుగా ఈ నాటకం ఆడగలిగినాను." ఇల్లా అని, తాను ఎవరో, ఎక్కడ, ఎప్పుడు, నాదగ్గర చదువుకొన్నాడో ఆవిషయం అంతా నాకు జ్ఞాపకం చేశాడు.

నేనూ నవ్వుకొని, "అయితే ఇంతకూ స్కైనాజర్ అంటే ఏమిటో చెప్పావు కావూ?" అన్నాను.

"ఏమో, నాకూ తెలియదండీ, ఏమన్నా తెలిస్తే మీకే తెలిసి ఉండాలె. ఆమాటకు అర్థం తెలియనివాడు ఎందుకూ పనికి రాకుండాపోతాడని మీరేగా అన్నారు?" అన్నాడు.

"ఆమాట నిజమేనయ్యా నేను ఎందుకూ పనికిరాని వాణ్ణే"—అన్నాను నవ్వుతూ.

"అంతమాట అనకండి క్షమించండి, మాస్టారూ. మీరూ... హాస్యప్రియులూ, ఏమీ అనుకోరు అనే ధైర్యంతో మిమ్ములను నవ్వులాట పట్టించాను."

"ఏమీ అనుకోకపోవడమే కాదు ఇంత తమాషా చేయగలిగిన నీవు నా విద్యార్థివి అయినందులకు నేను గర్వపడుతున్నాను" అన్నాను నిజంగా సంతోషాన్ని పొందుతూ.

ఇంతకూ నేను చెప్పొచ్చింది ఏమిటీ అంటే ఒక నిరర్థక పద ప్రయోగం వలన హాస్యము సాధించడము జరిగిందీ అని!!

౨

నిరర్థక పద ప్రయోగంవల్ల హాస్యసాధన ఎల్లా జరుగవచ్చునో చూపడానికి ఇంకొక కథకూడా ఇక్కడ ఉదహరిస్తున్నాను.

కీ.శే. మాధవపెద్ది బుచ్చిసుందరరామశాస్త్రిగారు గొప్పకవి. ఆయన హాస్య ప్రసంగాలు చేసేవాడు కూడాను. అది అందరికీ తెలిసిన విషయమేకద !

ఆయన తండ్రికూడా హాస్యప్రసంగ కుశలుడు...ఒక రోజున డోలు వాయించే వాద్యగాళ్లు ఇద్దరు వచ్చారు ఆయన దగ్గరకు. తమ ఇద్దరిలో ఎవరు నేర్పరి, ఎవరు సమర్థుడు, అనే ప్రశ్నపై వారు తగాదా పడ్డారు.

బుచ్చిసుందరరామశాస్త్రిగారి తండ్రికూడా చిన్న చిన్న గేయాలు దరువులూ వ్రాస్తూ ఉండేవారు. ఆయనకు లయ జ్ఞానము బాగా ఉన్నదనీ, సంగీతశాస్త్రంలో కొంత చెప్పుకోదగిన పాండిత్యం ఉందనీ అంతా అనుకొనేవాళ్లు.

అందుకని ఆ వాద్యగాళ్ళు ఇద్దరూ శాస్త్రిగారి దగ్గరకు వచ్చి, బాబూ మేము ఇద్దరం ఒక దరువు వాయించి చూపుతాము. మాలో ఎవరు రమ్యంగానూ శాస్త్రయుక్తంగానూ వాయించ గలిగినామో మీరు చెప్పండి అని కోరినారు.

అసలు ఆయనకు ఈవిషయంలో తగినంత శాస్త్ర పరిజ్ఞానము లేదు నిజానికి. కాని ఆమాట చెప్పితే తనకు అప్రతిష్ట కాబట్టి ఎవరో ఒకరు గట్టివారూ అని తేల్చి చెప్ప వలసిన అగత్యం ఏర్పడింది.

"సరే, వాయించండి'' అన్నారు శాస్త్రిగారు. ఆ ఇద్దరు వాద్యగాండ్రూ తమ తమ శాస్త్ర జ్ఞానాన్ని ఉపజ్ఞను ప్రదర్శించారు. "సరే ఇప్పుడు చెప్పండి" అన్నారు.

శాస్త్రిగారు "అబ్బాయీ మీ ఇద్దరూ ప్రతిభా వంతులే! అయితే మీ ఇద్దరిలో ఇతడే కాస్త మెరుగు అనాలిసి వస్తుంది'' అన్నాడు అందులో ఒకరిని చూపిస్తూ.

ఆ రెండోవాడు. "ఎందుచేత అల్లా అన్నారండి! అతగాడి గొప్ప ఏమిటో చెప్పండి'' అని బలవంత పెట్టాడు.

శాస్త్రిగారు అన్నారూ, 'అబ్బాయ్ నీవు "గాత్ర సంవాహ శైరాశ్య సంకోచః" అనే పద్ధతిలో వాయించావు' అన్నారు ఈ మాటలు విని తాను ఏదో మంచి పద్ధతిలోనే వాయించి ఉండాలె అనుకొన్నాడు మొదటి వ్యక్తి. తన పద్ధతికి సంస్కృతంలో ఒక లక్ష్యం ఉందిగదా అని తృప్తినికూడా పొందాడు.

శాస్త్రిగారు మళ్లీ ఇట్లా అన్నారు. "కాని వాడు 'భయ సంగ్రామయాదిభిః' అన్న సూత్రానికి అనుగుణంగా వాయించాడు. ఏమంటావు నిజమా అబద్ధమా?"

"నిజమే" అన్నాడు పాపం అతడు.

"అయితే మరి వాడు మెరుగన్న మాటేగా?'' కాదని ఎట్లా అంటాము సంస్కృతంలో అల్లాగ స్పష్టంగా కనబడుతూ ఉంటే? అయినా సందేహంతో, "అయితే మీరు అనడం 'దిభిః' అనే పద్ధతే మంచిదనా?" అని అడిగాడు.

శాస్త్రిగారు పెద్దగానవ్వి "దిభిః అక్షరద్వయ ప్రళయస్య దుఃఖాభ్యాం చేష్టాజ్ఞాన నిరాకృతిః' అన్నాడు శాస్త్రిగారుడు. అల్లా శాస్త్ర ప్రవచనం ఉంటూవున్నప్పుడు నివ్వేంజేస్తావు? నేనేంజేస్తాను!'' అని తెగేసి చెప్పేసేసరికి 'నిజమేలెండి, నిజమేలెండి', అని అనుకుంటూ ఇద్దరూ వెళ్లిపోయారు.

ఇందులో నేర్పు ఎక్కడవుందీ అంటే శాస్త్రిగారు తాను శాస్త్రోక్తులు బోధిస్తున్నట్లుకాక, వాళ్ళకు ఊరికే జ్ఞాపకం చేస్తున్నట్లు మాట్లాడాడు.

ఇందులో శాస్త్రిగారు అన్నమాటలకు అర్థంలేదు. నోటికివచ్చిన సంస్కృతం ముక్కలో అల్లా ధ్వనించే వేవో అన్నారు.

దేశ కాల పాత్రలను మనస్సులో ఉంచుకొని హాస్యాన్ని పిండాలనే నిశ్చయంతో ఉచితమైన పద్ధతిని నేర్పుగా, చమత్కారంగా నిరర్థకపదాలను ప్రయోగించి, ఈ మోస్తరు హాస్యకల్పన చేయవచ్చు.

3

నిరర్థక పదప్రయోగమువలన హాస్యము సాధించే విధానాలలో గొణుకుడు అనేది ఒకటి. సంభాషణలో, మాట లన్నీ స్పష్టంగా పలుకక కొన్నిటిని మింగి కొన్నిటిని చప్పరించి, మాట్లాడినట్లు నటించటం ఈ హాస్య ప్రక్రియ యొక్క లక్షణాలు.

కోపంవచ్చినపుడు ఆడవాళ్ళు గొణకడం సణకడం మనము చూస్తూవుంటాము. కాని అది హాస్యప్రసంగం క్రిందికిరాదు. అది ఒకరకమైన కోపప్రదర్శన. హాస్యాత్మకమైన గొణుకుడు మరొకవిధంగా నడుస్తుంది. కొన్నిమాటలు స్పష్టంగా ఉచ్చరిస్తాడు. కొన్ని అస్పష్టంగా ఉచ్చరిస్తాడు. మొత్తంమీద అవతలమనిషిని గాభరాపెట్టి తాను ఆనందిస్తాడు.

ఒకమారు కీ॥ శే॥ ముట్నూరు కృష్ణరావుపంతులుగారు నన్ను పిలిచి "ఏమయ్యా నీ భార్య.... మోటారు.... బజారు".... అంటూ కొన్ని మాటలు స్పష్టంగానూ కొన్ని అస్పష్టంగానూ పలికారు. స్పష్టంగా వినిపించిన మాటలనుబట్టి నా భార్య బజారులో మోటారుక్రింద పడ్డదని, ఆ సంగతి ఆయన చెప్పలేక పోతున్నాడని నాకు తోచింది.

"ఏమిటండీ మీరు అంటున్నారూ?'' అని నేను ఆదుర్దాగా అడిగాను. ఆయన ఏదో చెప్పలేకపోతున్నట్లు ముఖంపెట్టి మళ్ళీ అల్లాగా ఏవో మాటలు గొణిగాడు. బిక్కముఖంతో నేను

సుళ్ళీ "తమరు ఏమంటున్నారో నాకు తెలియడంలేదు" అన్నాను. ఆయన దుఃఖం ఆపుకొంటున్నవాడిలాగ చూస్తూ నన్ను వెళ్ళి పొమ్మని సంజ్ఞచేశాడు.

నేను ఏమిచేద్దామా అని చూస్తూ నుంచున్నాను. ఇంతలోకి అక్కడున్న మిత్రులు అందరూ ఒక్కసారి గొల్లున నవ్వారు. ఎందుకంటే, కృష్ణారావుగారు నిజంగా చెప్పబోయింది "మీ భార్య మోటారులో బజారుకు వెళ్ళి గొడుగులు కొన్నది" అని మాత్రమే. ఈహాస్యప్రక్రియను మంబ్లింగ్ అంటారు ఇంగ్లీషులో.

కృష్ణారావుగారు దర్బారు జరిపే రోజుల్లో ఒకసారి ఒక శాస్త్రాపాలుడు వచ్చాడు కృష్ణాపత్రికా ఆఫీసుకు.... కృష్ణారావుగారు అప్పుడు అక్కడ లేరు. లోపల ఎక్కడో ఉన్నారు.

ఆ ఆగంతకుడు నన్ను ప్రశ్నించాడు : "క్యా తుం హిందీ భాషా జానతేహో" అని. నాకు రాదు అన్నట్లు తలతిప్పాను. "సంస్కృతభాషా జానతేహో" అన్నాడు. వచ్చు నన్నట్లు తల ఊపాను.

ఎందుకంటే హిందీ రాదని ఎట్లాగూ చెప్పాను; సంస్కృతం కూడా రాదు అని ఎక్కడచెప్పేది ? అందుకని ఏదో సంస్కృతం ముక్కలు అందాము అనుకొంటూ ఉండంగానే ఆయన "కృష్ణరాయ మహోదయాః మహనీయః ఇతి శ్రుత్వా తామ్ ద్రష్టుమ్ ఉత్తరదేశా ద్వయమాగతాః కింతే సంతి గృహే?" అన్నాడు.

నాకు అర్థంకావడంలేదు ఆ సంస్కృతం. దిక్కుమాలిన అవస్థలో పడ్డాను. ఆయన ధోరణి కాస్త ఆగంగానే నేను ఎత్తుకొని గుక్కతిప్పకుండా గడగడా మాట్లాడాను - ఈ విధంగా.

కృష్ణరాయః గృహేణ వసంది సత్వరమ్ ఆగయేత్

పరంతు త్వం తిష్టది. కృష్ణారావు శర్మనః వర్తమానః సద్భావ ప్రేతుకః సమయః యుక్తి ప్రయుక్తి రసతామేతి యస్య మస్య యేవతః కించన్ రసః తదామి సంభవన్. కూర్జతే సర్వ శాస్త్రజ్ఞః నిర్మితాణి సంస్కృతభాషాయోషాణాం మనీషిః అత్ర సర్వేషాం ఏర్హవాదాని సమాగతాం పండితప్రకాండః పఠత్ భవనేగచ్ఛతి.

అని ఒక గుక్కలో అన్నాను. ఆ అనడంలో ఏశబ్దంగాని సరిగా ఉచ్చరించక పెద్ద ఉపన్యాస ధోరణిలో అనేసరికి ఆయన విస్తుపోయి ఏదో అన్నాడు. "నీవు చెప్పేది నాకు సరిగా తెలియడం లేదు" అని ఆయన అన్నాడని నాకుతోచింది.

వెంటనే నేను "అనుభావ వర్గః కార్య నిర్వహణ భారతే స్థానిక విద్యాలయామ్ భవద్దర్శనేన పులకోత్కరించిత సూచిత కిం తృప్తి భవతః తదనుకూలః ప్రభేవ కారణాత్ గచ్ఛతిత్వం తిష్టయంది తిష్టయంతి" అన్నాను. అప్పటికి ఆయనకు అర్థం అయింది కాబోలు నేను ఆటలు పట్టిస్తున్నానని. నవ్వాడు — ఇంతలో పంతులుగారు రావడం నేను వెళ్ళిపోవడం జరిగింది. కృష్ణారావుగారుకూడా నవ్వడం విన్నాను.

అర్థంలేని మాటల పోగు అదంతా ! ఆ మాటలు అనే పద్ధతిలో సొగసు వస్తుంది - అనే వాళ్ళకు నవ్వురాక మానదు—

ఈ రకం హాస్యాన్ని ఇంగ్లీషులో డబుల్ టాక్ అంటారు. నిరర్థక పదప్రయోగమువలన సాధించే హాస్యము ఇల్లాగ ఉంటుంది.

భమిడిపాటి కామేశ్వరరావుగారు - నలుగురూ కూర్చుని మాట్లాడుకొనేటప్పుడు ఈ Mumbling, Double talk అనబడే హాస్యప్రక్రియలను విస్తృతంగా వాడుతూ ఉండేవారు కాని ఎందుచేతనో గ్రంథాలలో ఎక్కడా ప్రయోగించినట్లు లేదు. ఇదియొక హాస్యప్రక్రియ అని దీనికి హాస్యక్షేత్రంలో సాహిత్యాత్మకమైన విలువ ఉందనీ వారివలననే నేను తెలుసుకొన్నాను. ఆ మహానుభావుణ్ణి ఇంకా కొంతకాలము భూమిమీద ఉండనిచ్చి నట్లైతే ఈ హాస్యక్షేత్రంలో వ్యవసాయం సాగించి, ఎల్లాంటి ఎల్లాంటి హాస్యపు పలుకుబడులను సాధించేవారో ఎంత బంగారాన్ని పండించేవారోగదా అని దుఃఖం వస్తుంది.

ఆరోజు ఒక సభజరుగబోతున్నది రాజమండ్రిలో. నేను చెప్పవలసినది, అంటే చెప్ప దల్చుకొన్నది అంతా ఒక వ్యాసం లాగ వ్రాసుకొన్నాను. ఆ వ్యాసం ఆయనకు చదివి వినిపించాను. తరువాత అడిగాను. "ఏమండీ మీరు అప్పటి కప్పుడు తోచినట్లు మాట్లాడుతారా ? లేక నా మోస్తరుగా వ్రాసుకొన్నారా ?" అని అబ్బే అప్పటి కప్పుడు నోటి కొచ్చినట్లు మాట్లాడేయడం నాపద్ధతి గాదు, అంతా వ్రాసి అట్టి పెట్టుకొన్నాను అన్నాడు. "అయితే చదవండి వింటాను" అన్నాను. ఆయన తనకు సహజమైన ఊపులలో విరుపులలో ఈ విధంగా (సరిగ్గా ఇదేకాదు) గడ గడ చదివేశాడు కొన్ని మాటలు మ్రింగుతూ, కొన్ని నములుతూనూ !

"ద్రావిడ సోదరులకు (మనమంతా ద్రావిడులము కాబట్టి) నమస్కారాలు - అయ్యా లోకోభిన్న రుచిః అన్నారు. ఊరికే అనడమేకాదు. సంస్కారులూ సంసారులు సాహితీ పరులు, సంఘక్షేమ సంరక్షకులు అంతా నొక్కి వక్కాణించారు ఎలుగెత్తి అరచారు అందరికి విన పడేలాగున పెద్దగా చెప్పారు. ఇది చిన్న వాక్యమే కాని ఆలోచిస్తూ పదు నాలుగు లోకాలు తలబద్దలు చేసుకొని, అతలా మతలం అయినా నక్షత్ర లోకాన్ని దూర వీక్షణ మాత్రం చెయ్యాలిసిందే గాని అంతకు మించి చేయగలిగింది ఏమీలేదు. గత్యంతరం లేదు యథాశక్తిగా అగమ్యాలను వదలుకొని రుచి విషయంలోనూ అభిరుచి విషయంలోనూ కూడా మధురీకృత, మంజల మనోహరమైన కృతక వీక్షణములను అనుక్షణము ఉపభుక్తమైన చంద్ర, శుక్ర అంగారక, రవి బుధులు నీచ గతులైనను పాశ్చాత్యులు పాతాళ వాసులు ప్రహ్లాదులు పతితులు పవిత్ర మానసులు

వలస నిమిత్తం వెళ్లి స్థావరాలు వదిలేసి జంగమాలలో భూజల వాయువుల్లో పిచ్చి వాళ్ళనుగా ఉన్మత్తులనుగానే కాక ప్రమత్తులనుగా చేసి రుచుల్ దోసంబంచు పోనాడి గ్రహాదింద్రియం మీద మానవుడు సామ్రాజ్యం స్థాపించగల సంచలనం ఉన్నా ఒక వెండిస్తంభం చంద్రుడిలోనికి విసిరివేయ డానికి వేసిన పది రోజులలో అవి అందులో పడడానికి ఏర్పాట్లు జరుగుతున్నవి.

ఒకానొక వస్తువుగాని విషయంగాని హంరాయించు కోటానికి రుచి కనిపెట్ట బడింది భుక్తి యొక్క జఠరాగ్ని అమితం కావడం లేక్తగా తగ్గిపోవడం అనేది పదార్థము యొక్క రుచిపై ఆధారపడి ఉంటుంది. తప్తమైన ప్రణీతంబైన భక్ష్య భోజ్య చోష్య లేహ్య పానీయములు స్వతః భక్ష్య యుక్తంబులే రైనను, ఆకలి లేని వానికి అవి రుచించవు.

ఇంకొక్క విషయంకూడా ఉంది. అన్నాతురుడు మోక్షార్థుడై ధర్మాచరణకు ఉద్యుక్తుడైనట్లు కనుపించకపోయినా, బుద్ధిమంతులైనవారు లేకపోలేదు. రోషంగల వ్యక్తిని కాళ్లు పట్టుకొని నిర్బంధుడా స్వతంత్రుడా భయస్థుడా తొందరవాడా అని విచారించి పురుషార్థం అపరాహ్ణం సాధించి అంకెల లెక్కలతోసహా నిరూపించగలను. ఉపన్యాసం చెయ్యడానికి సన్యాసం పుచ్చుకోనక్కరలేదు. ప్రతిఫలం ఆశించక పాపపరిహారార్థం ప్రమేయ అప్రమేయ ఉచితా నుచితములు ఆనుషంగికంగా పరామర్శించినప్పుడే మానవాళి విజ్ఞానపు మట్టం కొన్ని అంగుళాలు పెరుగుతుంది.

కాబట్టి విద్యార్థులు, ప్రాతఃకాలములో ప్రత్యూషపవనాంకురాలు పైగొనువేళ అఘమర్షన స్నాన మాచరించి, ధౌతవస్త్రధారులై, సకాములై నిర్వికారులై నిరంతరం విద్యా వ్యాసంగముచే విజ్ఞానవంతులు కాగలరని ఆశిస్తున్నాను. ఇతి శివం.

మరొక్కవిషయం. తృప్తియైన భోజనం చెయ్యడానికి తద్దినపు బ్రాహ్మణార్థం చెయ్యాలా! విజ్ఞానవంతుడగుటకు పుస్తక పఠనం అగత్యమా! మంత్రిపదవిని అలంకరించడానికి మంచితనం ఎందుకూ! ఎక్స్‌ప్రెస్ పేపర్ చదవడానికి 'పట్సు' రీడరు చదివియుండుట అవసరమా! కాబట్టి సోదరులారా తొందరపడి తొట్రుపాటుపడి పుస్తకాలు చదివి చెడిపోకండి. ఉపాధ్యాయుల ఉపన్యాసాలు విని ఉరిపోసుకోకండి."

ఈ ఉపన్యాసం విని విస్తుపోయి మాస్టారూ నాకు ఏమీ అర్థం కాలేదు అన్నాను. ఆయన విరగబడి నవ్వి నాకుమటుకు అర్థం అయ్యి ఏడ్చిందా అసలు అర్థం కావాలని వ్రాసిందై లేకద నీకు అర్థం కావడానికి! అన్నారు.

ఈ రకము నిరర్థక పదప్రయోగము నిష్ణాతులైన హాస్యవేత్తల రచనలలో మనకు కనపడుతుంది. ప్రసిద్ధులైన ఇద్దరి రచనలలోనుండి ఉదాహరణాలు చూపి ఈ వ్యాసం ముగిస్తాను.

కన్యాశుల్కంలో గిరీశం తన శిష్యుడైన వెంకటేశాన్ని వెంటబెట్టుకొని వాళ్ళ ఊరు వెళ్ళుతాడు. వెంకటేశం తల్లిదండ్రులు అడుగుతారు. "అబ్బాయి, నీవూ మేస్టారూ ఇంగ్లీషులో కాసేపు మాట్లాడండిరా, వింటాము" అని! పాపం, అమాయకులు!

ఆ ప్రకారంగా గురుశిష్యులు సంభాషణకు పూనుకుంటారు. గిరీశం - Of man's first disobedience and the fruit of the forbidden tree, sing, my dear Venkatesam, sing అంటాడు.

వెంకటేశం, There is a white man in the tent అంటాడు.

ఒకరి మాటకు మరి యొకరి మాటతో సంబంధం లేదు.

మరి యొక ఉదాహరణ గోల్డుస్మిత్ వ్రాసిన వికార్ ఆఫ్ వేక ఫీల్డులో ఒక జమీందారుడు మత విషయికంగా ఏదో ప్రతిపాదన చేస్తాడు. వికార్ కుమారుడు మోజెస్ దానిని అంగీకరించడు జమీందారుడు తన సిద్ధాంతాన్ని నిలబెట్టు కొంటానికి ఈ విధంగా వాదేస్తాడు,

"మోజెస్, అయితే నా ప్రతిపాదనను నీవు అంగీకరించవన్నమాట! సరే అయితే నా వాదన సరియైనదని నీచేతే ఒప్పిస్తాను. ముందు ఈసంగతి చెప్పు - Relatives are related అన్నాడు అరిస్టోటిల్ ఆవిషయం నీవు ఒప్పుకొంటావా ?" అని అడిగాడు. "ఆఁ ఒప్పు కొంటాను" అన్నాడు కుర్ర వాడు.

"ఒప్పు కొన్నావు గదా. అయితే The three angles of a triangle are equal to two Right angles అని కూడా అంగీకరిస్తావా?'' 'ఆ' అన్నాడు మోజెస్''

ఆరెండూ ఒప్పుకొన్న తరువాత ఇంకా నా ప్రతి వాదనకు ఎందుకు ఒప్పుకోవు అని నవ్వాడు జమీందారుడు.

"ఏం'' అన్నాడు కుర్రవాడు "ఇంకా "ఏం" అంటున్నావా?— Secundun anandrum Matrimonium, wallus Bellum. అని అరిస్టోటిల్ ఘంట వాయించి చెపుతూఉంటే నీవు కాదని ఎట్లా అంటావు? Barbara Celerant Ciano Dametrius సిద్ధాంతానికి వ్యతిరేకంగా మాట్లాడుతావా, అన్నాడు వెక్కిరింతగా.

అదేమిటో తెలియని కారణాన కుర్రవాడు నిరుత్తరుడై ఊరుకొన్నాడు. తెలియడానికి ఆ మాటలకు అర్థం ఉంటేగా!

నిరర్థక పద ప్రయోగ జన్యమైన హాస్య స్వరూపాన్ని సమగ్రంగా నిర్వచించా ననే అనుకొంటున్నాను.

నిష్క్రమణము

శ్రీపాద లక్ష్మీనారాయణమూర్తి

★

నాఁడు యశోధరారమణినందను జన్మదినమ్ము; కోటలో
వేడుక లుత్సవమ్ము లిలవేల్పులకొల్వులు దానధర్మముల్
పోడిమిమీఱె; పూర్వభవపుణ్యము మా యువరాణి దంచు పూ
బోఁడులు పాడి రారతులు ముచ్చట గొల్పెడు పాపఁ జూచుచున్.

2

లౌకికసౌఖ్యరాశికి పరాఙ్ముఖు డైన కుమారు జూచి చిం
తాకులమానసుం డగు ధరాధిపు డిచ్చిన యాజ్ఞ దాల్చి జ్యో
త్స్నాకమనీయహాసినులు నాట్యము చేయదొడంగి రంత బి
బ్బోకవతీమణుల్ నిజవపుర్ద్యుతి నిర్జితదేవకాంత లై.

3

అర్ధనిశీథవేళ భవనాంతరమం దెటుజూచినన్ వినో
దార్ధము నృత్యగానములు హాయిగ సాగుచునుండ, సత్యమా
ర్గార్థిగ నొక్కరుండె సముపాంతవనీస్థలిగూరుచుండె సి
ద్ధార్థుడు చింతనాపరత దైన్యపరీతముఖాంబుజాతుడై.

4

కనులు లోతుకు చొచ్చుకొనిపోవ శల్యావ
శిష్టుడై పడియున్న ముష్టివాడు
చూచినంతనె రోత దోచు భీకరరుజా
వికలాంగు డైనట్టి బిచ్చగాడు
నిండుజవ్వనమున పండుటాకును బోలె
వసుధపై రాలు నిర్భాగ్యజీవి
తెలివెన్నముద్దచెక్కులు రక్తసిక్తమై
ఆర్తిరూపము గొన్న అంచకూన

ఎదురుగా వచ్చి నిల్చి ప్రశ్నించుచుండ
నలుదెసల చిట్టచీకటు లలముకొన్న
భంగి యేమార్గమైన గన్పట్టకుండ
అటమటిల్లె నెడంద సిద్ధార్థు డపుడు.

5

క్షణికాకర్షణ శక్తిమంతమగు నీ శారీరసౌందర్యభూ
షణరత్నాంబరభోగభాగ్యతతి మోక్షం బిచ్చునే? కామినీ
మణులున్ బిడ్డలు గేహముల్ సతతమే క్ష్మామండలిన్? హృద్విదా
రణముం జేయుచు నున్న యీ బ్రతుకు సారం బేమొ? చింతింపగన్.

6

పొంచి గోడల సంచరించుచు పురుగుల
దిని ప్రాణములు నిల్పుకొనెడి బల్లి
మిలమిల మెఱసి నీళ్లల దేలు చేపల
బట్టి భక్షించుచు బ్రతుకు కొంగ
అందాల చూపుల హరిణశాబకముల
నిసుమంత దయలేక మెసవెడు పులి
ఎంతో ముచ్చట గొల్పు జంతుపక్ష్యాదుల
ద్రుంచి జీవితము సాగించు నరుడు

ఎన్ని చూచిన తనకంటె చిన్న ప్రాణిఁ
జంపుటయె పెద్దప్రాణి లక్షణ మదేమొ!
ఇంత హింసామయంబైన యీ జగాన
ప్రేమరసధార లింక వర్షించు టెట్లు!

7

అని తీవ్రదుఃఖితాంతరంగు డయి సిద్ధార్థుండు తర్కించి నె
మ్మనముం గప్పిన చీకటుల్ చనఁ దపోమార్గానురక్తాత్ముడై
తన కర్తవ్యము నిర్ణయించుకొని నిద్రాముద్రితాంతఃపురం
బును చొచ్చెం దుదిసారిగా దన సతిన్ పుత్త్రున్ విలోకింపగాన్.

8

ఏ యువరాజు నెమ్మనము నీ యిహలోకసుఖాళి లగ్నముం
జేయుగ నెంచి శాక్యపతిచే పిలువంబడి వచ్చినట్టి లే
బ్రాయపు మోహనాంగు లతిరమ్యముగా నటియించి పాడిరో
ఆయువరాజు చిత్తమురసంతయు మారక నిల్చె దీక్షమై.

9

తమ నృత్యమ్మును గానసంపదయు వ్యర్థమ్మై శరీరమ్ములం
జెమటల్ గ్రమ్మగ డస్సి మైమఱచి యోషిద్రత్నముల్ నిద్రమాం
ద్యమునన్ నేలఁ బరుండియున్నతఱి సిద్ధార్థుండు సత్యార్థియై
విమలాంతఃకరణుండు మెల్లగ సమీపించెన్ నిశీథమ్మునన్.

10

మిరుమిట్లు గొలుపు నెమ్మేని అందంబేది!
చిఱుచెమ్మటలచేత జిడ్డువడియె
తిలకమ్ము తీర్చిదిద్దిన మోము సొగసేది!
చెదరిన ముంగురుల్ చిక్కువఱచె
హృదయ ముయ్యాల లూగించెడు స్వరమేది!
మోహమైన గుటకల గ్రమోహ నిండె
లయతాళయుక్తమై రంజిల్లు పదమేది!
నిద్దురమైకాన మొద్దు దేరె

బాహ్యసౌందర్యములు క్షణభంగురములు;
శాశ్వతానందసౌందర్యసాధనంబు
నిర్జనారణ్యములఁ దపోనిష్ఠ నెఱపి
తెలిసికొను టుత్తమం బని దృఢత నెంచి.

11

చని సిద్ధార్థుడు గాంచె దివ్యమణిభూషాలంకృతమ్మైన పా
న్పున మాతృత్వపవిత్ర కాంతులు ముఖాంభోజమ్మునన్ మూర్తశో
భను జేకూర్పగ ప్రేమతో తన సుతున్ వక్షస్స్థలిన్ హత్తి తీ
యని స్వప్నమ్ముల దేలిచొక్కెడు మనోజ్ఞాంగిన్ సతీరత్నమున్.

12

ఈ లతాంగి మనోజ్ఞఫాలభాగమున
విలసిల్లు కాశ్మీరతిలకమునకు
ఈ నీరజాక్షి నెమ్మేని కాంతుల సాహ
చర్యమ్ము గాంచు భూషణములకును
ఈ విరిబోడి కెమ్మోవి సాంగత్యమ్ము
వడసి రంజిల్లెడు విడియమునకు
ఈ యంబుజాతాస్య ఆయతవేణిపై
పొలుపార గులికెడు పూవ్వులకును

అధికమౌ శోభ, అందమ్ము, అరుణిమయును,
పరిమళమ్మును చేకూర పరిఢవిల్లు;
ఈ పతివ్రత మెట్టిన యీ నృపాల
వంశమే పూజనీయత బడయగలిగె!

13

ఒకసారి సద్దుసేయక కొంత ముంగురుల్
సవరింపగా నెంచి జంకిపోవు;
ఒకసారి పసిపాప నోడి చేర్చి ముద్దాడు
కాంక్షతో సాగి వెన్కకు దొలంగు;
ఒకసారి ప్రేమతో యువరాణి వీక్షించి
తనివొందగా నేగి వెనుక దిరుగు;
ఒకసారి అనుగుబిడ్డ కపోలముల ప్రీతి
నిమురగా నెంచి వెన్వెంట మఱలు;

ప్రేమ దృఢతరబంధంబు వెనుక కీడ్వ
జ్ఞానసంపాదనాసక్తి సాగబోవ
మందిరము వీడి పోలేక యందు నిలువ
జాలక యొకింత తడబడె శాక్యమౌళి.

14

కనుగవ మూసి ఒక్కత్రుటి గౌతము డల్లన నిల్చునంతలో
మనసు విభిన్న భావములసంఖ్యను ఘర్షణ పొందుచుండగా
తన సతి నిద్ర లేచిన విధమ్మున చెంగట నిల్చి జాలిగా
మనవి యొనర్చుచున్నది మానసముం గరిగించువాక్కులన్.

15

"పతియే దైవము భారతీయసతికిన్ ప్రాణాధికం బాతడే
క్షితి నీ సత్యము సర్వదా నిలుచు; నా చిత్తమ్ము నీ కిచ్చి జీ
విత మెల్లన్ భవదీయ పాదయుగళిన్ పీడంగ రాదంచు ని
శ్చితబుద్ధిన్ దలపోయు న న్విడిచి వేంచేయంగ న్యాయమ్మొకో

16

"అనుగుంబిడ్డను, గేహలక్ష్మి యగు నిల్లాలిన్, జరాభారసం
జనితార్తిశ్రముడైన తండ్రిని, ప్రజాసందోహమున్, శోకవా
ర్ధిని దాక్షిణ్యములేక ముంచు టది యేదృష్టిన్ విలోకించినన్
జను నే లోకహితార్థమైన పరమజ్ఞానం బనన్ చూడుమా!

17

"మంటన్ మింటిని గల్పు ధారగ స్రవింపన్ బాష్పతోయమ్ము, వా
ల్గంటిన్ నీ యెడబాటు ఘోరకులిశాఘాతంబటుల్ చంపదే?
వింటం ద్రెళ్లిన పిట్టకంటె నధమంబే యుష్మదర్ధాంగి? నీ
యింటన్ హింస యొనర్చి లోకులకు నేవేవో ప్రబోధింతువా"

18

కన్నులు విప్పి చూడగ నెరాయెకి కాంత యదృశ్య యయ్యె ని
ష్ఖిన్నత నిద్రపోవుచో కకేలను బిడ్డను హత్తికొంచు రా
నున్న విపత్తునాట నెద యోచన సేయని యిల్లె కన్పడం
ద న్నికటమ్ము వీడి గవద్వారము దాటి తలంచె నీ గతిన్.

19

"మోహము సర్వదుఃఖసుఖల మూలము, బుద్ధివినాశకంబు, సం
దేహపరంపరాస్పదము; దుష్కృతసంకటఘోరకంటక
వ్యూహము; మోహపాశముల బూర్తిగ ద్రెంచిన మానవుండె ప్ర
త్యూహము లన్నిటిం దొలగద్రోసి విరాజిలుచుండు బుద్ధుడై"

20

కపిలవస్తుపురమ్ము కదలివచ్చి సగౌర
వముగ స్వాగతమును పలుకునట్లు
తన యశోధర ముద్దుతనయు గైకొని వచ్చి
అడుగుల బడి భిక్ష మిడినయట్లు
వివిధ దేశమ్ముల విద్యార్థికులు వచ్చి
బౌద్ధధర్మమును చేపట్టినట్లు
తన అహింసాసూత్ర మనుసరించి యనేక
మానవుల్ బలులను మానినట్లు

సుందరీవల్లభుం డగు నందునకును
దివ్యదీక్షావిధిని ప్రసాదించినట్లు
స్పష్టముగ గోచరింపగా సాగిపోయె
కంటకాశ్వాధిరూఢుడై గౌతముండు.

★

తెలుగుభాషలోని నాటకవిమర్శ

పోణంగి శ్రీరామ అప్పారావు

క్రీ. శ. 11 వ శతాబ్దినుండియు సంస్కృతమునుండి తెలుగుభాషలోనికి పురాణేతిహాస కావ్యాదులనూదితము లగుచున్నను రూపకములు మాత్రము యథాతథముగా అనూదితములు కాలేదు. క్రీ. శ. 15 వ శతాబ్దిలో వల్లభరాయడు 'ప్రేమాభిరామ' మనెడి సంస్కృత రూపకమును 'క్రీడాభిరామము' అను పేర అనువదించెను; కాని, ఇందు దృశ్యకావ్యలక్షణములకంటె శ్రవ్యకావ్య లక్షణములే అధికముగా కన్పట్టుచున్నవి. ఇట్టి ప్రయత్నములే మరికొన్ని కూడ జరిగినవి. కాని, అటుపిమ్మటనైనను సంస్కృత రూపకములను యథాతథముగా ఆంధ్రీకరించుట కెవ్వరును ప్రయత్నింపలేదు. మొత్తముమీద, కారణము లేవియైనను. క్రీ శ. 19 వ శతాబ్ది తృతీయ పాదమువరకును, అనగా ఆంగ్ల సాహిత్య ప్రభావము ప్రసరించు వరకును - సంస్కృత రూపకముల అనువాదములు కాని, తల్లక్షణానుసారములైన సంస్కృత రూపకములు కాని తెలుగులో వెలయలేదు. (ఇది ఒక తెలుగుభాషకే కాక, తక్కిన దేశభాష లన్నింటికిని సమానధర్మమే ।)

ప్రాచీనకాలమున తెలుగులో మార్గనాటకములు లేకపోవుటచేత తద్విమర్శయును (అనగా లక్ష్యము లేకపోవుటచేత లక్షణమును) వెలయలేదు. ఒక్క చిత్రకవి పెద్దన (క్రీ. శ. 1550 ప్రాంతములు) మాత్రము తన 'లక్షణసారసంగ్రహము'లో సంస్కృత నాటకాదులకు లక్షణములను చెప్పుటకు ప్రయత్నించెను. కాని, ఇది చాల అసమగ్రమైన వివరణము; ప్రయోజనమును అత్యల్పమే. అటుపిమ్మటకూడ ఎవ్వరును ఇందులకు పూనుకొనినట్లు కన్పట్టదు.

క్రీ. శ. 1880 ప్రాంతముల తెలుగు దేశమున ఆధునికనాటకముల ప్రదర్శనము లారంభమైన పిమ్మట నాటి పత్రికలలో ఆయా నాటకములను గూర్చియో లేదా ప్రదర్శనములను గూర్చియో స్థూల వివరణములు లేదా ప్రకటనములు వెలుపడుచుండెడివి. ఇట్లు క్వాచిత్కముగా వెలువడెడి వివరణాదులే కాక కొందరు నాటక కర్తలు తమతమ నాటకములకు పీఠికలను వ్రాసికొనుచు నాటక సమస్యలను గూర్చి కొంత విమర్శ వెలయించుచు వచ్చిరి; ధర్మవరం కృష్ణమాచార్యులుగారి చిత్ర నళీయ పీఠిక, గురజాడ వేంకట అప్పారావుగారి కన్యాశుల్క పీఠిక మొదలగునవి ఇందుల కుదాహరణములు. మరియు, వ్యక్తిగత దోషములు తదితరములు కారణముగా నాటకము లందలి దోషములను వెదకి చూపించుటకు కొందరు ప్రయత్నించెడివారు. 1898 లో, వేదము వేంకటరాయ శాస్త్రిగారు, కొక్కొండ వేంకటరత్నం పంతులుగారి ఆంధ్రీకృత ప్రసన్న రాఘవమును విమర్శించుచు మూలమునకు నాలుగింతలు విమర్శ గ్రంథమును ప్రకటించియుండుట ఇట్టి విమర్శలకు పరాకాష్ఠ.

1900 లో వెల్లాల సదాశివశాస్త్రిగారు భట్టుమూర్తి కావ్యాలంకార సంగ్రహ మందలి రస - నాయికా - నాయక ప్రకరణములను సహేతుకముగా విమర్శించుచు ఒక గ్రంథమును ప్రకటించియున్నారు. బహుశః లక్షణ గ్రంథములపై ఇట్టి సమీక్ష వెలువడుట కిదియే ప్రారంభమని చెప్పవచ్చును. 1903 లో శృంగార కవి సర్వారాయుడుగారు 'నాటక లక్షణము' అనెడి గ్రంథమును ప్రకటించినట్లు ఆంధ్రవాఙ్మయసూచిక వలన తెలియుచున్నది. ఇంచుమించుగా ఇదే కాలములో కొమాండూరు అనంతాచార్యుల వారు ధనంజయుని దశరూపకమును సంగ్రహించి అనువదించి, 'దశరూపక సంగ్రహము' అనుపేర ప్రకటించి యున్నారు; ఇది విద్యార్థుల యుపయోగార్థము చేయబడిన రచన.

1908 లో కోలాచలం శ్రీనివాసరావుగారు ఒక అపూర్వ గ్రంథమును 'The Dramatic History of the World' – ఆంగ్లమున ప్రకటించియున్నారు. ప్రపంచ నాటకచరిత్రను వ్రాయుటకు పూనుకొనినవారిలో బహుశః శ్రీనివాసరావుగారే ప్రథములై యుండవచ్చును. ఇది తెలుగువారికి నిజముగా గర్వకారణము. దీనికి అనుబంధముగా వీరు కొన్ని సూచనలను సంతరించియున్నారు; అవి నాటక రచయితలకు, నటులకు, నాటకసమాజములకు, ప్రేక్షకులకు సంబంధించిన సిద్ధాంత సూత్రములు. నాటకరచనా-ప్రయోగ విజ్ఞులైన శ్రీనివాసరావుగారు స్వీయానుభవమును పురస్కరించుకొని పై సూత్రములను చక్కగా కూర్చియున్నారు. వీనిపై నాటి పత్రికలలో విమర్శ ప్రతి విమర్శలుకూడ వెలసినవి.

1910 లో 'నాటకసంఘ మార్గప్రదర్శిని' అనెడి గ్రంథమును కొండిపర్తి సూర్యనారాయణగారు ప్రకటించినట్లు 'ఆంధ్రవాఙ్మయ

సూచికవలన తెలియుచున్నది. 1912 లో కోలాచలం వేంకట సుబ్బారావుగారి ' ఆంధ్ర శాకుంతల విమర్శ నిరసనము వెలువడి నది; శ్రీ కందుకూరివారి అభిజ్ఞానశాకుంతలానువాదముపై చేయ బడిన విమర్శ కిది సమాధానము. ఇట్టి విమర్శలు ప్రతివిమర్శలు ఆ నాడు చాల వెలసిన వని చెప్పవచ్చును.

1913 లో తల్లాప్రగడ సూర్యనారాయణరావుగారు ఆంధ్ర సాహిత్యపరిషత్పత్త్రికలో 'ఆంధ్రనాటకములు' అను పేర ఒక పెద్దవ్యాసమును ప్రకటించినారు. తెలుగునాటకముల పూర్వాపర పరిస్థితులపై వెలువడిన ప్రథమసమీక్ష ఇదియేయని చెప్పవచ్చును. 1913 లోనే ప్రకటితమైన పానుగంటి లక్ష్మీనరసింహారావుగారి 'సాక్షి' ప్రథమసంపుటమునుగూర్చికూడ ఈసందర్భమున పేర్కొన వలసియున్నది. ఇందులో, తెలుగునాటక రచనా-ప్రదర్శనములను గూర్చిన వ్యాసములు నాలు గున్నవి. నాటకశైలి యెట్లుండవలెను, పాత్రౌచిత్య మనగా నేమి, యుక్తి ప్రతియుక్తివైఖరి యెట్లుండ వలెను, నాటకమున పద్యముల స్థాన మెట్టిది, ఎట్టిపద్యము లుండ వచ్చును. శుభాంత-దుఃఖాంత నాటకముల తారతమ్య మెట్టిది మున్నగు సంశము లిందు చర్చింపబడెను.

1914 లో, పింగళి సూరనార్యుని కృతుల నాధారముగా చేసి కొని కట్టమంచి రామలింగారెడ్డి గారు రచించిన "కవిత్వ తత్త్వ విచారము" వెలువడినది. తెలుగులోని సాహిత్య విమర్శకు నూత్న దృక్పథమున రూప కల్పన చేసిన ప్రథములు రెడ్డిగారే యని చెప్ప వచ్చును. అంతవరకును కావ్యగతగుణ దోష—అలంకారాది విచారణలకు మాత్రమే తమ విమర్శలను పరిమితము చేసికొను చున్న తెలుగు విమర్శకులు కొందరు నాటినుండి ఒక్కొక్క కావ్యమును అఖండ స్వరూపముగా భావించి. అదృష్టితో పరిశీలించి, పాత్ర పోషణాది విషయములను గూర్చి చర్చించుట కారంభించి నారు. 1916 ఆంధ్రపత్రిక ఉగాది సంచికలో ఆచార్య తణికెళ్ళ వీరభద్రుడుగారి 'చిత్రాంగి పాత్రపోషణము' అనెడి వ్యాసము ప్రకటిత మైనది. శ్రీధర్మవరమువారి 'చిత్రనళీయము' లో 'చిత్రాంగి' పాత్ర పరిపోషిత మైన విధానమును వీరభద్రుడుగారు చాల విపులముగా, తార్కికముగా ఇందు చిత్రించి యున్నారు. రెడ్డిగారి గ్రంథమును. వీరభద్రుడుగారి యీవ్యాసమును తెలుగు కావ్య-నాటక విమర్శలకు క్రొత్త బాటల నేర్పరచినవి; కాగా, ఈ రచనలు రెండును తెలుగు విమర్శ సాహిత్య చరిత్రలో చిర స్మరణీయము లగుచున్నవి.

1915 ప్రాంతములలో మల్లాది సూర్యనారాయణ శాస్త్రిగారు దశరూపకమును సమగ్రముగా వచనములో ఆంధ్రీకరించి ప్రక టించినారు; ఇందువలన ప్రాచీన సంస్కృత నాటక లక్షణముల నెరుంగుటకు చాలమందికి అవకాశము కలిగినది. అటుపిమ్మట సంస్కృతములోని ప్రాచీన నాటక లక్షణ గ్రంథములు మరికొన్ని తెలుగులోకి అనూదితము లైనవి.

1913లో ప్రారంభమై, 1915-18 మధ్య కాలములో తెలుగు దేశము నలుమూలలను వ్యాపించిన నాటకపు పోటీ పరీక్షలు తెలుగు దేశమున నాటక విమర్శకు మరికొంత ప్రోత్సాహమును కలిగించిన వని చెప్పవచ్చును. 1915లో, బందరులో, కానుకొలను వేంకట్రామయ్య గారిచే నెలకొల్పబడిన 'ఆంధ్ర నాటక ప్రోత్సాహక సంఘము' పక్షమున పోటీపరీక్షలు జరిగినవి. ఈ సంఘమునే అప్పుడు 'ఆంధ్ర నాటక పరిషత్తు' అనెడివారు. 1916లో శ్రీ పురాణం సూరిశాస్త్రిగారు ఈ పరిషత్తునకు కార్యదర్శులై రెండు సంవత్సరముల పాటు తెలుగు దేశమున. నాటక కళావిషయమున, ఒక అపూర్వ మగు సంచలనమును కలిగింప జేసినారు. శ్రీకోలా చలమువారు తమ ప్రపంచ నాటక సాహిత్య చరిత్ర కనుబంధముగా చేర్చిన సూత్రములను తెలుగులో ప్రకటింపజేసి, దానిపై ఇతర విమర్శకుల అభిప్రాయముల నర్థించి. వాని నెల్ల కృష్ణా పత్రికలో ప్రకటింప నారంభించిరి. అంతియేకాక, సూరిశాస్త్రిగారు తెలుగు దేశములోని పెద్ద పట్టణము లన్నింటిని సందర్శించి నాటక పరీక్ష లను గురించియు. నాటక సంస్కరణములను గురించియు ఉప న్యాసముల నొసంగిరి, బందరులోను, ఇతర ప్రాంతములందును నాటక సాహిత్య సభలను ఏర్పాటుచేసి పలువురు పండితులచేత ఉపన్యాసము లిప్పించి, వారిని గౌరవింపుచు వచ్చిరి.

ఈ కాలముననే శ్రీపాద కామేశ్వరరావు ప్రభృతులు ఆంధ్ర నాటకసంస్కరణాదులను గూర్చి బహుళవిమర్శలు ప్రకటింప సాగిరి. నేటికిని ఆంధ్ర నాటక సంస్కరణ వాదులను కలవర పెట్టుచున్న నాటక సమస్య లెల్ల ఆనాడే శ్రీయుతులు కోలాచలం, పానుగంటి. శ్రీపాద గార్ల వ్యాసములందు ప్రాధాన్యమును వహించిన వనుట అతిశయోక్తి కాదు. వీరితోపాటు పేర్కొనబడవలసిన వారు శ్రీ వి. టి. రాఘవాచార్యులు గారు. వీరేకాక మరి కొందరు విమర్శకులుకూడా తరచుగ కృష్ణా పత్రిక, ఆంధ్ర పత్రిక మొదలగు వానియందు విమర్శవ్యాసములు ప్రకటింప సాగిరి.

బందరు నాటకపరిషత్తునకు కార్యదర్శిగా నున్న సమయమున 1916లో సూరిశాస్త్రిగారు పరిషత్తు పక్షమున 'ఆంధ్ర నాటక నామా వళి' అనెడి చిన్న పుస్తకము నొకదానిని ప్రకటించిరి. ఇందు 1901 మొదలు 1916 వరకును ప్రకటితములైన తెలుగు నాటకముల వివరములు ప్రాంత-రస-ఇతివృత్తభేద సహితముగా కలవు. ఆ యా భేదములను గ్రాపుల మూలముగా కూడ వివరింప బడినవి. దీనిని బట్టి ఏ సంవత్సరమున ఏ యే జాతి నాటకములు ఏయే ప్రాంతములందు ఎన్నెన్ని బయలుదేరినవో ఏ ప్రాంతముల వారి కెట్టి నాటకములు రుచించునో స్పష్టముగా తెలియుచున్నది. మరియు, దీనివలన నాటక కర్త లొకరినొక రెరుంగుటకును,

నాటక సమాజములవారికి నాటక వాఙ్మయము సంపూర్ణముగా తెలియుటకును అవకాశ మొదవినది. తెలుగు నాటక చరిత్ర పరిశోధనకు శాస్త్రిగారి విధముగా నాందీపాఠ యొసర్చినా రని చెప్పవచ్చును.

ఇప్పట ఒక సత్యమును గుర్తింపవలసి యున్నది. ఒకప్రక్క సినీమాల వలనను, ఇంకొకప్రక్క విదేశీయ నటుల నాటక ప్రదర్శనముల వలనను, మరియొకప్రక్క పత్రికల వలనను గ్రంథముల వలనను దేశ-విదేశీయ నాటకకళా రీతులను అవగాహనము చేసికొనుటకు అవకాశములు లభించుటతో తెలుగు దేశమున విమర్శకులలో నూతన భావతరంగము లుత్పన్నము కాసాగినవి. అంతియేకాదు. భరతశాస్త్రాదర్శముల ననుసరింపవలె ననెడి జాతీయాభిమాన మొకటి మొలకెత్తి నాటక కర్తలను, విమర్శకులను కలవరపెట్టసాగెను. ఈ భావ సంక్షోభము భారతదేశములోని తక్కిన రాష్ట్రములందుకంటె తెలుగు దేశములోనే మిక్కిలి ప్రబలముగా కన్పట్టినది — అప్పటి కింకను భరతశాస్త్రపారంగతులగు భాగవతులు తెలుగు ప్రజల ఆదరాభిమానములను పొందుచునే యుండుట ఇందులకు ప్రధాన హేతువు. కాగా, నవ్యభావోదయముతో పాటు భారతీయ కళలసాంకేతికాధ్యాత్మికతత్త్వములు ఆంధ్రులలో సమ్మేళనము పొందినంతగా ఇతరులలో పొందలేదనుట అతిశయోక్తి కాజాలదు.

· 1922 లో శ్రీమదజ్జాడాదిభట్ల నారాయణదాసుగారిచే రచింపబడిన 'నవరస తరంగిణి' వెలువడినది. ఇది షేక్స్పియర్—కాళిదాసుల కవితా విశేషముల కనువాదము. దాసుగారు ఇరువురి నాటకములలోని రసపద్ఘట్టముల నేరి, రస విభాగ పూర్వకముగా మూలములతోపాటు అనువాదములనుకూడ ప్రకటించిరి. ఇది ఒక అపూర్వ ప్రయత్నము. ఈ గ్రంథమునకు వీరు విపులమైన ఆంగ్ల పీఠికను సంతరించి, అందు అనేక నాటక సమస్యలను చర్చించినారు.

1923 తెలుగు నాటక విమర్శ చరిత్రలో చిరస్మరణీయమైన సంవత్సరము. ఈ సంవత్సర ప్రారంభముననే కవిరాజ మల్లాది వేంకట విశ్వనాథశర్మగారి సంపాదకత్వమున 'నాటక కళ' అనెడు మాస పత్రిక కేవలము నాటకకళా విమర్శనార్థము బయలుదేరినది. తెలుగులో ఇట్టి పత్రికల కిదియే ఆరంభము. (కాని, ఇది కొలది కాల మైనను సాగకపోవుట విచారకరము) — "సారస్వత చరిత్రమున నాటక యుగ మారంభమైనది. కొన్ని మంచి నాటకములు బయలువెడలకపోలేదు. కాని పెక్కులు నాటక నామసర్వస్వములై నవి యున్నవి సలక్షణములగు నాటక రంగస్థలములు లేనినాడు నాటక వాఙ్మయము వర్ధిల్లనేరదు. రూపక గ్రంథములకును నాటక సమాజములకును అవినాభావ సంబంధ మున్నది. వీని రెంటింటిని సంస్కరించి, యభివృద్ధిపరచు నుద్దేశముతో నీ పత్రిక వెలిబుచ్చుచున్నాము" అని శ్రీ శర్మగారు ప్రథమ సంపాదకీయములో ఈ పత్రిక యొక్క ఆశయమును వివరించియున్నారు. ఇదే సంవత్సరమున, అనగా 27-1-1923 తేదీన పోలాకి గ్రామమున గంజాం మండల ఆంధ్ర నాటక పరిషదుత్సవము బుర్రా శేషగిరిరావుగారి అధ్యక్షతలో జరిగినది.

1923 లోనే పురాణం సూరిశాస్త్రిగారు తమ చిరకాల నాట్యవ్యాసంగఫలముగా 'నాట్యాంబుజము'ను ప్రకటించినారు. ఇందు ఎనిమిది దళము లున్నవి —. 1. నాటకానుభవములు; 2. ఆంధ్రనాటకములు; 3. నాటకసమాజములు; 4. ప్రసిద్ధనటులు; 5. ప్రదర్శన విమర్శనములు; 6. ఆంధ్రనాటక విమర్శనము; 7. నాటకసమస్యలు; 8. నాటకవిమర్శనము. ఈ గ్రంథమున ప్రధానముగా నాటి ప్రసిద్ధ సమాజముల ప్రదర్శనా విధానములును, నాటి ప్రసిద్ధనటుల అభినయకౌశలములును హృదయంగమముగా విమర్శింపబడినవి. తెలుగునాటక విమర్శకులలో సూరిశాస్త్రిగారు ప్రథములు ప్రధానులుకూడానని నిస్సందేహముగా పేర్కొనవచ్చును. "ఈ పద్ధతిలో నాంధ్రదేశపు నలుదెసలనుండి నాలుగైదుపుస్తకము లిట్టివి వెలువడినగాని ఆంధ్ర నాట్యరంగము సంపూర్ణముగ తెలియనేరదు" అని శాస్త్రిగారు నాట్యాంబుజావతారికలో పేర్కొనియున్నారు. వా రాశించినట్లుగానే ఆ తరువాత పెక్కు విమర్శ గ్రంథములు తెలుగులో వెలసినవి.

శాస్త్రీయ దృక్పథముతో నాటకములు, నాటకములను ప్రదర్శింపవలెననెడి దృష్టి నటులకు లేకపోవుటయు, సంగీతముమీద మోజు ఇటు నటులకు, అటు ప్రజలకు మితిమీరుచుండుటయు గమనించి, నటులకు శాస్త్రీయమగు శిక్షణ మొసంగవలె ననెడి ఆశయముతో బి. టి. రాఘవాచార్యులుగారు, గూడపల్లి రామబ్రహ్మంగారు 'భరతమునిబృందము' అనెడి పేరుతో 1924 లో బెజవాడలో ఒక నాటకపాఠశాలను స్థాపించి చాలమంది యువకులకు శిక్షణ యిచ్చినారు. ఆంధ్రదేశమునందే కాక భారతదేశమునందే బహుశః ఇదియే ప్రథమ నాటకపాఠశాల అయియుండును. (కాని, ఇందులో శిక్షణపొందిన నటులు, పాఠశాల వదలినతరువాత వ్యామోహములోపడి మరల పాతదారినే నడచియుండుట విచారకరము.) ఈ పాఠశాలలో శిక్షణము పొందుచున్న నటుల యుపయోగార్థము రాఘవాచార్యులుగారు 'నాటక దీపిక' యనెడి చిన్నలక్షణ గ్రంథమును సూత్రప్రాయముగ రచించి ప్రకటించినారు. వైశాల్యమున చిన్నదైనను, ఎనిమిది అధ్యాయములుగా విభజితమైన ఈ గ్రంథము సూత్రపద్ధతిలో నటులకు, సమాజములకు, రచయితలకు పెక్కువిషయములను బోధించుచున్నది. రాఘవాచార్యులుగారు మరిరెండు విమర్శలనుకూడ రచించి ఆ కాలమందే ప్రకటించి యున్నారు — ఇందు మొదటిది 'బలేచింతామణి'; తెలుగులో తొలి ప్రకరణ మని పేరుపడసిన 'చింతామణి' నాటకమును గూర్చియు,

చింతామణీ నాటకప్రపోటీలను గూర్చియు, అందలి నటుల అభినయములను గూర్చియు వ్రాయబడిన విమర్శ యిది. ఇంక రెండవది 'సంగీత ఇంద్రసభ' అనెడు మూడంకముల ప్రహసనము. దైవానుగ్రహము కలిమిని ఇంచుకంత గానమునకనుకూలమైన కంఠనాదము ఇంత కూడుపెట్టుచుండగా దాని గౌరవమును పాడుచేసి 'నటన'మను క్రొత్తదాని నాశ్రయించుటకు నటులొల్లకుండిన దినములవి. ఇంక ప్రేక్షకుల యభిరుచులును అట్లే యున్నవి. నటు లొకపద్దెము పాడి 'యిది శృంగారము', ఒకగంతువేసి 'ఇది రౌద్రము', ఒక కులుకు కులికి 'ఇది ఘోరము' అని భావింపుడనగా అసమర్థులగు ప్రేక్షకులు కాబోలు నని సంతసించి వారికి పెక్కు సన్మానాదు లొనరించుచున్న కాలమది. రాఘవాచార్యులుగారు ఈ ఇరుతెగలవారిపై ధ్వజ మెత్తి, సంగీతనాటకములవలన తెలుగు నాటకరంగ మెట్లు చెడుచున్నదో నిరూపించుటకై ఈ 'ఇంద్రసభను' రచించినారు. ఈ విధముగా నాటి నాటకప్రదర్శన రీతులను విమర్శించుచు అంతకుముందే కె. చినరఘుపతిరావుగారి 'నాటక కోలాహలము' (1921), తిరుపతి వేంకటకవుల 'రసాభాసము' ప్రకటితము లైనవి.

1924 లో బయలుదేరిన ఇంకొక విమర్శ గ్రంథము గొల్లపూడి శ్రీరామశాస్త్రిగారి 'ఆంధ్ర నాటక రంగము'. ఉగాది సంచికలలో ప్రకటితములైన శ్రీపాద కామేశ్వరరావు గారి నాటక విమర్శలు వీరికి ప్రేరకములు కాగా, చిత్తూరు రామవిలాస సభ్యుల ప్రోత్సాహముతో 650 పుటల గ్రంథమును మూడుభాగములుగా రచించినారు. వానిలోని మొదటి భాగము 'ఆంధ్ర నాటక రంగము'. ఇందు చతుర్విధాభినయముల స్వరూపమును, పెక్కు నాటక సమస్యలను ప్రాచ్య - పాశ్చాత్య దృక్పథ సమన్వయ పూర్వకముగా చర్చింపబడినవి. ఇంక తక్కిన రెండు భాగములును - అనగా 'నాటక జిజ్ఞాస' (నాటక రచనా విమర్శ). 'కావ్య నాటక మీమాంస' (కావ్య నాటక లక్షణ వివేచనము) అనెడివి ప్రకటితము లైనట్లు కన్పట్టవు.

బందరులో 4-6-1924 తేదీ మొదలు నాలుగు రోజులపాటు 'ఆంధ్ర నట సాహిత్య సభలు' జరిగినవి. ఇందు కాశీ కృష్ణమాచార్యులుగారు సాహిత్య పర్యాలోచన మందును, చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రిగారు నాట్య సమస్యా విచారణ మందును బ్రహ్మత్వమును వహించిరి. నాడు జిజ్ఞాసువులను కలవర పెట్టుచున్న నాటకరంగ సమస్యల నన్నింటిని, పెద్ద లందరును ఒకచోట చేరి, ముఖాముఖిగా చర్చించుకొనుట కవకాశము కల్పించిన వీ సభలు. సభల యంతమున సభాభిప్రాయ మీ క్రిందివిధముగా వ్యక్తమైనది.- "సంగీతము చాలవరకుతగ్గిపోవలెను. నాటకరచనయందు వచనము నధికముగా నుపయోగించవలెను. అభినయమును భావప్రకటనానురూపముగ నభివృద్ధి జేయవలెను. పాత్రౌచిత్యమైన వస్త్రులు, ధరింపవలెను" (ఆంధ్ర నాటక సంస్కరణము పుట 11) ఈ సభలలోనే భమిడిపాటి కామేశ్వరరావుగారు నాటకములు వచనములలో నుండవలయు ననియు, సంగీత మనవసర మనియు, పద్యములను వచన ధోరణిలో రసవంతముగ నభినయ విస్పష్టతతో జదువవచ్చు ననియు సప్రయోగముగ నుపన్యసించి, తమ సిద్ధాంతములను నిదర్శించి చూపిరి. వారి యీ ఉపన్యాసము 1957 లో 'ఆంధ్ర నాటక పద్యపఠనం' అను పేర గ్రంథరూపమున వెలువడినది.

సూరిశాస్త్రిగారు 1924 లోనే తమ 'నాట్యోత్పలము'ను ప్రకటించినారు. 12 అధ్యాయములతోడి యీ గ్రంథము పాశ్చాత్య దేశములందలి నాటకోత్పత్తి వికాశములను జిజ్ఞాసాదృష్టితో వివరించుచున్నది. వీరి 'ఆంధ్ర నాటక సంస్కరణ'—'విమర్శక పారిజాతము' లు 1925 లోను, 'నాట్యాలోకము' 1917లోను వెలువడినవి. 'నాట్యాలోక' మందు 'తాటాకులలో పచార్లు' అనెడి పేర తంజావూరు యక్షగాన నాటకములనుగూర్చిన వ్యాసము కలదు, స్వయముగా తంజావూరు వెళ్ళి, ఈ వాఙ్మయమును గూర్చి పరిశ్రమించిన ప్రథములలో సూరిశాస్త్రిగా రొకరనెడి విషయము చాలమందికి తెలియదు. తెలుగులోని విమర్శన గ్రంథములను రచనా రీతులను సూరిశాస్త్రిగారు ముత్రివిధములుగా విభజించి యుండుట పరిశీలనార్హము (విమర్శక పారిజాత పీఠిక)—

1. స్వీయ ప్రపంచానుభవమును, కళా పరిజ్ఞానమును, భావములను, రుచులను విస్తరించుచు, ఆత్మీయానుభవ నిరూపకములగు స్వతంత్ర గ్రంథములను రచించుట (రామలింగారెడ్డి, సూరిశాస్త్రి ప్రభృతుల రచన లిట్టివి).

2. ప్రామాణిక లాక్షణికుల గ్రంథములను జదివి అందలి ప్రమాణములను వాదప్రతివాదములను విస్తరించుచు తా నభిమానించెడి సిద్ధాంతములకు అనుకూల ప్రతికూలముల నేర్పరచి చూపుచు నేదో యొక సిద్ధాంతమును తేల్చి చూపుట (శ్రీరామశాస్త్రి ప్రభృతుల రచన లిట్టివి).

3. ఇట్టి వేమియును చేయక ప్రామాణిక లాక్షణికుల, రసికవిమర్శకుల భావములను వివిధాంశములపట్ల విభజించి, సంతరించి చూపుట (సూరిశాస్త్రిగారి 'విమర్శక పారిజాతము' మున్నగు రచన లిట్టివి).

పై మూడేకాక, మరికొన్నిరీతుల రచనలుకూడ కలవు — ఆంధ్రేతర భాషలలోని విమర్శనముల యథాతథానువాదములు ; లేదా అనుసరణములు. ఇందు ఆ యా విమర్శలను తెలుగు కావ్య-నాటకరీతులకు సమన్వయించి చూపెడి ప్రయత్నముకూడ నుండును. ఇంతవరకును కేవలము వ్యాసములనే ప్రకటించుచున్న శ్రీపాద కామేశ్వరరావుగారు 1926 లో 'సాహిత్య మీమాంస' యను గ్రంథమును, 1927 లో 'నాటక మీమాంస' యనెడి గ్రంథ

మును ప్రకటించియున్నారు. ఇందు మొదటిది పండిత రామదహిన మిశ్రుని హిందీగ్రంథమున కనువాదము; ఇందు ప్రాచ్య - నాటక సమస్య లనేకములు చర్చింపబడెను. ఇంక రెండవది ద్విజేంద్ర లాల్‌రాయిగారి 'కాళిదాస భవభూతులు' అనెడి గ్రంథమున కనువాదము. శాకుంతల ఉత్తరరామ చరితముల నాధారముగా గొని ప్రాచ్య-పాశ్చాత్య నాటక సిద్ధాంత చర్చలకు దొరకొనిన గ్రంథమిది. ద్విజేంద్రుని భావములతో తాము అంగీకరింపలేని ఘట్టముల నేరి, గ్రంథాంతమున 'సింహావలోకనము' అను పేర పెద్ద అధ్యాయము నొకదానిని చేర్చినారు. నాటక రచనకు సంబంధించిన మూలతత్త్వములను సాలంకషముగా చర్చించిన తెలుగువారిలో శ్రీ శ్రీపాదవారే ప్రథము లని చెప్పవచ్చును.

1926 లో వేపమాళ్ళ అచ్యుతరావుగారు 'ఆంధ్ర నాటకములు' అనెడి చిన్న విమర్శన గ్రంథమును ప్రకటించిరి. ఇందు స్థూలముగా నాటక తత్త్వము, కథానిర్మాణము, పాత్రముల శీల ప్రతిష్ఠాపనము, సుఖాంత దుఃఖాంత విభాగ విచారము, ప్రదర్శనప్రక్రియనెడు నైదంశములు చర్చింపబడినవి. దీనికి మానవల్లి రామకృష్ణ కవిగారు చక్కని 'ప్రస్తావన' రచించియున్నారు. బరోడావారు ప్రచురించిన నాట్యశాస్త్ర ప్రథమ సంపుటమును శ్రీ కవిగారు సంపాదించుచున్న కాలమది.

నాటక రచనా - ప్రయోగములనుగూర్చి తెలుగుభాషలో అధికారికమైన సర్వగ్రంథము నొకటి వెలువరింపవలెనని తీవ్ర ప్రయత్నము లొనరించి కృతకృత్యులైనారు పసుమర్తి యజ్ఞనారాయణ శాస్త్రిగారు. తెలుగు దేశపు నాట్య చరిత్ర నంతటిని లక్ష్య-లక్షణ సమన్వయ పూర్వకముగ ఉద్గ్రంథ రూపమున వెలువరింపవలెనని వీరి తలంపు. అందుకొరకు అందరు నటుల అభినయ విశేషములను, అన్ని నాటకముల ప్రదర్శనములను చూడవలె ననెడి తలంపుతో ప్రసిద్ధులను చాలమందిని బందరు రప్పించి 'నాట్యవిద్వత్ప్రదర్శనము' అను పేర కొన్ని నాటక ప్రదర్శనముల నేర్పాటు చేసినారు. తత్ఫలమే 1930 లో వెలువడిన వారి "ఆంధ్ర నట ప్రకాశిక". ఇందు పది ప్రకరణము లున్నవి—1. గాంధర్వము, అభినయము; ఆహార్యము; 2. సంగీతము; 3. నాయికా నాయకులు; 4. రసములు; 5. రూపక లక్షణము; 6. ప్రయోగము; 7. రంగము (తెలుగు సమాజముల చరిత్ర). 8. కావ్యము. (తెలుగుకవుల నాటకముల విమర్శ); 9. నటుడు (వివిధనటుల అభినయరీతులు); 10. పాత్రము (కొన్నినాటకములలోని ప్రసిద్ధ నాయికా-నాయకుల విమర్శ). ప్రథమ ప్రకరణములో ఆహార్యవిషయమున ఆధునికమైన 'మేకప్' విధాన మంతయును వివరింపబడియుండుట గమనింపదగిన విషయము. తెలుగునాటక విమర్శకులలో సూరిశాస్త్రిగారికి వలెనే యజ్ఞనారాయణశాస్త్రిగారికిని విశిష్టమైన స్థానము కలదు. 'ఆంధ్ర నటప్రకాశిక' సచిత్ర మగుటకూడ ప్రత్యేకముగా పేర్కొనవలసిన విషయము.

మద్రాసు విశ్వవిద్యాలయము స్థాపింపబడినప్పటినుండియు దక్షిణదేశమందలి ఆంగ్ల విద్యావంతు లందరకును బాగుగా తెలిసినవి షేక్స్పియరు నాటకములే. అటుపిమ్మట షెరిడన్, మోలియర్ ప్రభృతుల నాటకములుకూడ కొంత ప్రచారము నందినవి; అందు కొన్ని తెలుగులోనికికూడ అనుసరింపబడుట గమనించియున్నాము. అంతియేకాని ఇబ్సెన్, బెర్నార్డుషా ప్రభృతుల ప్రభావము మనవారిమీద పడలేదని చెప్పవచ్చును. గోమఠం శ్రీనివాసాచార్యులవారి 'ఆంగ్లహరిశ్చంద్ర'కు వ్రాసిన ప్రస్తావనలో గురజాడ వేంకట అప్పారావుగారు ఇబ్సెన్ సిద్ధాంతప్రసక్తి తెచ్చినను, వారు దానియం దాదరణము కలిగియున్నట్లు కన్పట్టదు. 1927 లో పొణకా పిచ్చిరెడ్డిగారు ఇబ్సెన్ నాటకము- The grand ను 'భీష్ముడు' అనుపేర ఆంధ్రీకరించిరి. ఇబ్సెన్ సాహిత్యము తెలుగులోనికి అనూదితమగుటకు, బహుశః ఇదియే ప్రారంభము. ఆ తరువాతి సంవత్సరమే ఇబ్సెన్ శతసంవత్సర జన్మదినోత్సవము జరిగినది. ఆ సమయమున కె. వి. గోపాలస్వామిగారు 'హిందూ' పత్రికలో 26-4-1928 తేదీన 'Ibsen Centenary Estimate' అనుపేర ఒక ఆంగ్లవ్యాసమును ప్రకటించిరి. అప్పటినుండియే 'ఇబ్సెన్‌సొసైటీ' మద్రాసులో ఏర్పడి కొంతకాలము సాగినది.

మొత్తముమీద, 1930 నాటికి తెలుగు నాటకరచయితలలో ఒకవిధమైన సంచలనము కలిగినది. ప్రాచీన నాటక సిద్ధాంతములపై తిరుగుబాటు ఆరంభమైనది. వాస్తవికతకు ప్రాధాన్యము వచ్చినది. సోషలిష్టు సిద్ధాంతములు వ్యాప్తిలోనికి రాసాగినవి. జాతీయోద్యమము ఉచ్ఛదశలోనున్నది. ఈ పరిస్థితులన్నియును తెలుగునాటకరంగమున ఒక నూతనాధ్యాయమునకు దారితీసినవి. అంతకుముందే సాటిలేని మేటినటుడు బళ్లారి రాఘవాచార్యులుగారు విదేశపర్యటనను ముగించుకొనివచ్చి క్రొత్తనినాదములతో తెలుగునాటకరంగమును ప్రభావిత మొనర్చినారు. సరిగా ఆ సమయములోనే పాకాల వేంకటరాజమన్నారుగారి మూడంకముల సాంఘికవచన నాటకము 'తప్పెవరిది?' వెలువడినది. బళ్ళారి రాఘవాచార్యులుగారు, రచనాశిల్పమున క్రొత్తదారులు త్రొక్కిన ఈ రచనను చేపట్టి, విజయవంతముగా పలుతావుల ప్రదర్శించినారు. దీనితో వచననాటక రచయితలకు, క్రొత్తపోకడలకు యత్నించు నటులకు స్థైర్యము చిక్కినది.

క్రొంగ్రొత్త నాటకయుగ మారంభమగుటతో ఫలాని సమాజంవారి ఫలాని నాటకమును చూడవలెననెడి భావము ప్రజలలో నశించి, ఫలాని నటుని ఫలానివేషమును చూడవలెననెడి భావము

బలసినది. నటుల నామములను విని నాటకప్రదర్శనములకు పరుగులెత్తుట, వెట్టిమొట్టి ఆంగికాభినయమును గాంచి అదియే నటన మనుకొనుట అధికమైనది. ఇట్టిస్థితిలోని నటులను సమాజములను ప్రేక్షకులను పరిహసించుచు శ్రీయుతులు చింతా దీక్షితులు, గుడిపాటి వేంకటచలం, వేదుల సత్యనారాయణశాస్త్రి గారు 'నాటక ప్రహసన' మను పేర ఒక విమర్శను రూపక రూపమున ప్రకటించి, దానికి విపులమైన ఉపోద్ఘాతమును సంతరించినారు. పోరంకి వేంకట సుబ్బారావుగారి 'నాటక మర్మము' కూడ ఇట్టి రచనయే.

1929లో 'ఆంధ్ర నాటక కళాపరిషత్తు' నెలకొన్నది. ప్రతి సంవత్సరమును వార్షికోత్సవ సభలు, ఉపన్యాసములు జరుగ సాగినవి. ఆయా ఉత్సవములందు పరిషత్సభల కధ్యక్షులైన ప్రముఖులు సంగుచు వచ్చిన అధ్యక్షోపన్యాసములు నాటకరంగస్థితిపై చేయబడిన అమూల్యమైన విమర్శలుగా పరిగణింపదగి యున్నవి. 1934లో ఆంధ్ర నాటక కళాపరిషత్తు పక్షమున నీలంరాజు వేంకట శేషయ్యగారి సంపాదకత్వమున 'నాట్యకళ' త్రైమాసిక పత్రిక ప్రారంభమైనది. ఇది విజయవంతముగా చిరకాలము కొనసాగక పోయినను వెలువడిన సంచికలలో మంచిమంచి వ్యాసములు వెలువడినవి. నాటక రచనా - ప్రయోగములను గూర్చి విమర్శ వ్యాసములను ప్రకటించువారికి ఈ పత్రిక మంచి ప్రోత్సాహ మొసంగినది. దీనితోపాటు మరికొన్ని సాహిత్య పత్రికలు కూడా నాడు నాటకవిమర్శకు అవలంబము లైనవన్న సత్యమును స్మరింపవలసియున్నది - భారతి, శారద, జయంతి, సఖి, ఉదయిని, వీణ, జ్వాల, కళ మొదలగునవి.

1935లో రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి 'నాటకోపన్యాసములు' వెలువడినవి. బళ్ళారిలో మ్యునిసిపలు హైస్కూలువారి యాజమాన్యమున జరిగిన కృష్ణమాచార్య - శ్రీనివాసరాయల స్మారకోత్సవసందర్భమున చదువబడిన రెండు వ్యాసము లివి. మొదటి వ్యాసమున ప్రధాన నాటక సమస్యలును, రెండవ వ్యాసమున ఆ యిరువురి నాటక రచనారీతులును చర్చింపబడినవి. సంస్కృతాంధ్రాంగ్ల సాహిత్య పరిశీలనా దక్షులై లక్ష్య లక్షణముల విషయమున ఆధికారికముగా మాటాడకల్గిన విమర్శకులు కొలదిమంది మాత్రమే ఉందురనుట సాహసము కాజాలదు. ఆ కొలదిమందిలో ముఖ్యముగా స్మరింప వలసినవారు రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ గారు, పింగళి లక్ష్మీకాంతంగారు, విశ్వనాథ సత్యనారాయణ గారు మొదలగువారు. లక్ష్మీకాంతంగారు ఆంధ్ర విశ్వవిద్యాలయాంధ్ర శాఖా ప్రధానాచార్యులై సాహిత్య విమర్శను ప్రాచ్య - పాశ్చాత్య సిద్ధాంత సమన్వయ పూర్వకముగా బహువర్షములు శిష్యగణములకు బోధించియున్నారు. (వీరు ఉత్తమనటులకోవకు చెందినవారనుట కూడ స్మరణీయము) 1937లో ఆరవ ఆంధ్ర నాటక కళా పరిషత్తున కధ్యక్షులై వీ రొసంగిన ఉపన్యాసము అమూల్యమైనది. వీరి పర్యవేక్షణలో దివాకర్ల వేంకటావధానిగారు 'ఆంధ్ర నాటక పితామహుడు' అను విషయముపై పరిశోధనము చేసి ఒక ప్రత్యేక వ్యాసమును వెలయించినారు. ఒక తెలుగు నాటకకర్తనుగూర్చి సమగ్రమగు పరిశోధనము జరుగుట కిదియే ప్రారంభము. ఇందు, వీరు ఆచార్యులవారి నాటక తత్త్వాదులను గూర్చియే కాక ఆంధ్ర నాటకోత్పత్తి చరిత్రమును, విషాదాంత నాటక స్వరూపమును కూడ చర్చించి యున్నారు. ఈ పరిశోధనా వ్యాసము గ్రంథ రూపమును దాల్పలేదు గాని, ఇందలి పెక్కు విషయములు వ్యాసముల రూపమున వివిధ పత్రికలలో ప్రకటితము లైనవి. విశ్వనాథ సత్యనారాయణగారు తమ వివిధ రచనలలో ప్రాసంగికముగా వివిధ నాటక సమస్యలను చర్చించుటయే కాక, అధికారికముగ పెక్కు వ్యాసములను ప్రకటించియున్నారు.

జయంతి రామయ్యపంతులుగారి 'ఆధునికాంధ్రవాఙ్మయ వికాస వైఖరి' 1937 లో ప్రకటితమైనది. (1934 లో ఆంధ్రవిశ్వవిద్యాలయమున నొసంగబడిన ఉపన్యాససంపుటి యిది) ఇందలి 2 వ అధ్యాయము తెలుగునాటక వికాసమునుగూర్చి వివరించుచున్నది. ఇందు శ్రీ చిలకమర్తివారి 'గయోపాఖ్యానము'పై విపుల మగు విమర్శకలదు. నాటకసమస్యలను చర్చించుచు వేదము వేంకటరాయశాస్త్రిగారు రెండు చిన్న పుస్తకములను ప్రకటించియున్నారు- ఒకటి 'గ్రామ్య భాషాప్రయోగ నిబంధనము'. ఇందు నాటక రచనలో పాత్రోచిత భాషాప్రాధాన్యము నిరూపిత మైనది. ఇంక రెండవది 'భారతాభారతరూపకమర్యాదలు'; ఇందు మరికొన్ని నాటకసమస్యలు ప్రమాణ పూర్వకముగా చర్చింపబడినవి. దువ్వూరి రామిరెడ్డిగారు నాటకసమస్యలపై వెలయించిన వ్యాసముకూడ ఈ సందర్భమున పేర్కొనవలసియున్నది. శిష్టా రామకృష్ణ శాస్త్రిగారి 'నాటక విమర్శ'లో కొన్ని ప్రసిద్ధ సంస్కృత నాటకములు విపులముగా విమర్శితము లైనవి. వీ రిటీవల మద్రాసు విశ్వవిద్యాలయ పత్రికలో మరికొన్నివ్యాసములను ప్రకటించి యున్నారు.

వివిధ రచయితల నాటికలను సంపుటీకరించి, 1943 లో తల్లావఝ్ఝల శివశంకరశాస్త్రిగారును, ('ఏకాంకికలు'). 1944 లో శ్రీపాద గోపాలకృష్ణమూర్తిగారును ('నేటి ఉత్తమనాటికలు') రెండునాటికల సంపుటములను వెలువరించినారు. 1957 లో కె. వి. గోపాలస్వామిగారింకొక సంపుటిని సంతరించినారు. ('ప్రసిద్ధ నాటికలు'). ఈ సంపుటముల కీ సంపాదకులు మువ్వురును వ్రాసిన పీఠిక లుదాత్తములుగా నున్నవి. ఈ మువ్వురునుకూడ నాటకకళపై, నాటికలపై ఆ యా సందర్భములను పురస్కరించుకొని విమర్శ వ్యాసములను ప్రకటించియున్నారు; ఇట్టివానిలో ముఖ్యముగా పేర్కొనదగినది గోపాలకృష్ణమూర్తిగారి 'తెలుగు

ఏకాంకిక' (భారతి - విరోధిపుష్యము). 1952-53 లో 'కిన్నెర' పత్రికలో వరుసగా వెలువడిన ఘాపరి లక్ష్మీనారాయణరావుగారి నాటకవ్యాసములు ఈ సందర్భమున స్మరింపవలసియున్నది. ఇందు ప్రాచీననాటక లక్షణములు సమన్వయదృక్పథముతో వివేచింప బడినవి. కేతవరపు రామకోటిశాస్త్రిగారు ప్రసిద్ధాంధ్ర నాటకము లగు విషాద సారంగధరము, కన్యాశుల్కము, గయోపాఖ్యానము లపై ప్రచురించిన వ్యాసములు నాటకకళాభిమాను లెల్లరు తప్పక పరిశీలింపవలసియున్నది. నాట్యశాల (1946) నటన (1953) అనునవి. శ్రీనివాస చక్రవర్తిగారి తొలిరచనలు ఇంక 'అభినయం' (1957) అనునది వీరి కృషికి పతాక. 'యాన్ యాక్టర్ ప్రిపేర్స్' అనెడి స్టానిస్లావిస్కీ రచనకిది అనుసరణము. స్టానిస్లావిస్కీ సిద్ధాంతములు కొంతవరకు భారతీయ దృక్పథమునకు సన్నిహిత ములుగా నుండును ప్రాచ్య పాశ్చాత్య రంగస్థలములు రెండింటి కిని సంబంధించిన సిద్ధాంతపరిజ్ఞానముతో శ్రీనివాసచక్రవర్తిగారీ గ్రంథమును తెలుగుపాఠకులకు సుబోధ మొనర్చినారు.

శ్రీ తల్లావఝ్ఝుల కృత్తివాసతీర్థులుగారి 'గీర్వాణ రూపకము' 1952 లో ప్రకటితమైనది. ఆ సంవత్సరమే 'నెల్లూరు నాటకకళ' అనుపేర శ్రీ కొమాండూరు పార్థసారథిఅయ్యంగార్ ఒకచిన్న గ్రంథమును ప్రకటించియున్నారు. ఒక ప్రత్యేక ప్రదేశమునకు చెందిన నాటకరంగస్థల చరిత్రను తెలుపుటకు ప్రయత్నము చేసినవారిలో శ్రీ అయ్యంగార్ ప్రథములని చెప్పవచ్చును. బందారు రామస్వామినాయుడుగారు గుంటూరు పట్టణ నాటక రంగస్థల చరిత్రను సమగ్రముగా వివరించుచు నూరుపుటల గ్రంథ మును వ్రాసియున్నారు. (ఇది ఇంకను అముద్రితము.) ఇట్టి రచన లింకను అనేకములు వెలువడవలసియున్నవి. మిక్కిలి నేని రాధాకృష్ణమూర్తిగారు 'నాటక కళ' అనెడి బృహద్గ్రంథమును రచించి, 1957 లో తెలుగుభాషా సమితివారి బహుమానమును పడసినారు. తెలుగులోనికి ప్రాచీనాధునాతన నాటకరంగచరిత్రను సంతరించుటకు ఇందు ప్రయత్నము జరిగినది (ఇదియును అముద్రితమే.)

1957 లో భమిడిపాటి కామేశ్వరరావుగారి 'ఆంధ్ర నాటక పద్య పఠనం' వెలువడిన విషయమును పేర్కొనియున్నాను. ఈ సం వత్సరమున వెలువడిన మరియొక గ్రంథము 'ఆంధ్ర నాటక కర్తలు' ప్రథమ భాగము. ప్రసిద్ధాంధ్ర నాటకకర్తల జీవిత విశేషములను, వారి రచనా రీతులను, తత్తద్వైశిష్ట్యతలను తెలుగుప్రజల కందింప వలె ననెడి ప్రయత్నమున కిది తొలి ఫలము. ఈ సందర్భమున మూడు పరిశోధనా వ్యాసములనుగూర్చికూడ పేర్కొనవలసి యున్నది — 'తెలుగు సాహిత్యముమీద ఆంగ్ల సాహిత్య ప్రభావము' అనెడి విషయముపై జి. నారాయణస్వామి రెడ్డిగారు, కొత్తపల్లి వీరభద్రరావుగారు రెండు పరిశోధనా వ్యాసములను రచించి యున్నారు. ఈ రెండింటి యందును తెలుగు నాటక వాఙ్మయ చరిత్ర స్థూలముగా పరామృష్టమైనది. ఇంక మూడవ పరిశోధనా వ్యాసము యస్వీ జోగారావుగారి 'యక్షగానము'; ఇందు యక్షగాన - వీథినాటక స్వరూపములపై సమగ్ర పరిశీలనము జరిగినది.

ఆంధ్రనాటక సమాఖ్యవారు 1956 లో విజయవాడలోను, 1957 లో రాజమహేంద్రవరములోను ప్రయోగ నాటక పాఠశాల లను నిర్వహించి, సమర్థులచేత పెక్కు ఉపన్యాసముల నిప్పించి యున్నారు. వీనిలో వెంటనే ముద్రణ భాగ్యమును పొందిన ఉపన్యాసము కుమార్‌గారి 'ఆహార్యం'. కుమార్‌గారు దీనినే బాగుగా విస్తరించి, 1958 లో 'మేకప్' అను పేర గ్రంథరూప ముగా ప్రకటించినారు. 'ఆంధ్ర నట ప్రకాశిక' లోని ఆహార్య ప్రకరణము తరువాత తెలుగులో ఇట్టి ప్రత్యేక రచన వెలువడుట కిదియే ప్రారంభము. రోహిణిగారి నాటక వ్యాసములు తొలుత కృష్ణాపత్రికలో వరుసగా ప్రకటితములై ఇటీవల గ్రంథ రూప మున వెలువడినవి.

1957 లో శ్రీనివాస చక్రవర్తిగారి సంపాదకత్వమున 'నాట్య కళ' పునరుద్ధరింపబడినది. ఇందు ఉత్తమవ్యాసములు వెలువడు చున్నవి. తెలుగు నాటక రంగమునకు సంబంధించిన ఏకైక పత్రిక నేడు ఇది యొక్కటియే. 1948 లో పి. యస్. రామాచారి గారి సంపాదకత్వమున వెలువడిన 'నటన' తెలుగు నాటక రంగమునకు చేసిన సేవకూడ ఈ సందర్భమున స్మరింపదగినది. ఆయా నాటకోత్సవములను పురస్కరించుకొని కాని, ఆయా నటు లకు లేదా నాటక కర్తలకు సన్మానములు జరుగునప్పుడు కాని, సమాజముల వార్షికోత్సవాదులు జరుగునప్పుడు కాని ప్రత్యేక సంచి కలు నేడు వెలువడుచున్నవి — ఇట్టివానిలో ముఖ్యముగా పేర్కొన దగినవి సురభి నాటకసమాజముల వారి 'సురభి సప్తతి స్వర్ణో త్సవ సంచిక' (1960), 'ఆంధ్ర నాటక కళాపరిషత్తు రజతోత్సవ సంచిక' (1960), మరియు, 'పరిశోధన' సంపాదకులు వెలువ రించిన 'ఆంధ్ర నాటక పితామహ సంస్మరణ సంచిక'యు, 'గురజాడ అప్పారాయ సంస్మరణ సంచిక యు కూడ ప్రత్యే కముగా పేర్కొన దగినవి. ఈ వ్యాసకర్త 1958 లో 'స్రవంతి'లో 'ప్రథమాంధ్ర నాటక కర్తలు' అను శీర్షికతో ఆరు వ్యాసములను ప్రకటించి యుండెను.

19‾8 నవంబరులో ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనంగారి పర్యవేక్షణలో ఉస్మానియా విశ్వవిద్యాలయము నందలి తెలుగు శాఖ విద్యార్థులు 'రూపక సమాలోచనము' అను పేర 17 సెమినార్ ఉపన్యాసముల నొసంగి యున్నారు. నాటక విషయమున విశ్వవిద్యా లయములవా రిట్టి పనికి పూనుకొనుట కిదియే ప్రారంభ మని చెప్ప వచ్చును. ఇందలి కొన్ని వ్యాసములు పత్రికలలో వెలువడినవి.

ఇటీవల ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడెమీవారు రెండు ప్రత్యేక సంచికలను ప్రచురించి యున్నారు - ఒకటి 'కూచిపూడి నాట్యసదస్సు సంచిక' ఇంక రెండవది 1949లో శ్రీ రాజా రంగయ్యప్పారావుగారి అధ్యక్షతలో పనిచేసిన 'నాటక పునరుద్ధరణ సూచన సంఘము' వారు రచించిన రిపోర్టు. ఈ సంఘమువారు తెలుగు దేశమందంతటను సంచరించి, పెక్కు వివరములను సేకరించి యున్నారు. ఈ సంఘమువారి పర్యటనలతో తెలుగు నాటక విమర్శ చరిత్రలో ఒక క్రొత్తశక మారంభమైన దని చెప్పవచ్చును. తెలుగు నాటక చరిత్రను, రంగస్థల చరిత్రను సమగ్రముగా వ్రాయవలెనని కొందరు పూనుకొనినారు. ఇట్టివారిలో కొప్పరపు సుబ్బారావుగారు ముఖ్యులు; కాని, తలపెట్టిన రచనలో పదియవ వంతు అయినను పూర్తి కాకుండగనే వీరు మరణించుట ఆంధ్రుల దురదృష్టము. అటుపిమ్మట చెప్పదగినది మిక్కిలినేని రాధాకృష్ణమూర్తిగారి కృషి. చాగంటి సన్యాసిరాజు గారుకూడ ఇట్టి పనికి పూనుకొని యున్నారు; వీరి ప్రయత్న మిప్పుడు తుదిమెరుగులు దిద్దుకొనుచున్న దని తెలియుచున్నది. శ్రీనివాస చక్రవర్తిగారు తెలుగు నాటక కర్తల, తెలుగు నాటకములు సమగ్రములగు పట్టికలను తయారుచేయుటయే కాక రంగస్థల ప్రయోగ యోగ్యములైన సుమారు 1200 ఉత్తమ నాటకములను గూర్చి వివరములను సేకరించియున్నారు. ఇటీవల దక్షిణ దేశభాషా పుస్తక గ్రంథ మండలి వారు ప్రకటించిన 'తెలుగు సాహిత్య చరిత్ర సంగ్రహము' అనెడి గ్రంథమునందు కె. వి. గోపాలస్వామిగారు నాటక వాఙ్మయముపై రచించిన విపుల వ్యాసము వెలువడినది.

తొలుత నుండియు తెలుగు నాటక విమర్శలో అచ్చటచ్చట భరతుని నాట్య శాస్త్రశ్లోకము లుదాహృతము లగుచుండెడివి. అంతటితో తృప్తినందక కొందరు నాట్యశాస్త్ర సమగ్ర స్వరూపమును తెలుగు ప్రజల కందించుటకు పూనుకొనిరి. పోతుకూచి సుబ్రహ్మణ్య శాస్త్రిగారి నాట్య శాస్త్రానువాదము 'ఆంధ్ర భారతీ' సహితముగా 5 అధ్యాయములు 1951లో ముద్రితమైనది. (అది అంతటితో ఆగిపోయినను, మరల ఇటీవల 'నవభారతి'లో వరుసగా ప్రచురిత మగుచున్నది). భాగవతుల కుటుంబరావు గారి అనువాదములోని తొలి రెండధ్యాయములు మాత్రము త్రిలింగ'లో ప్రకటితములైనవి. జమ్మలమడక మాధవరామశర్మగారు 'నాట్యవేదము' అనుపేర నాట్య శాస్త్రములోని 1-7, 18-21 అధ్యాయములను అభినవ భారతీ సహితముగా ననువదించి ప్రథమ భాగముగా ప్రకటించినారు; రెండవ సంపుటము ఇంకను ప్రకటితము కావలసియున్నది. ఈ వ్యాస రచయిత చేసిన నాట్య శాస్త్రానువాదము సమగ్రముగా 1959లో గ్రంథరూపమున వెలువడినది. ఈ నాట్య శాస్త్రానువాదము లన్నియును నటులలోను నాటక రచయితలలోను జిజ్ఞాసను రేకెత్తించిన వనుట సర్వ సమ్మతమైన విషయము.

తెలుగు నాటక రంగమును గూర్చి ఇతరభాషలలో వెలువడిన రెండు పరిశోధనా వ్యాసములను గూర్చికూడ పేర్కొన వలసియున్నది. పి. వి. పతి (మద్రాసు) అనువారు Telugu Stage 'అను విషయముపై ఫ్రెంచి భాషలో పరిశోధనా వ్యాసమును వ్రాసి Sorbonne విశ్వవిద్యాలయము నుండి డాక్టరేట్ పట్టమును పొంది యున్నారు. ఐ. పాండురంగారావుగారు తెలుగు - హిందీ రూపకములను గూర్చి (ఆంధ్ర - హిందీరూపక) తులనాత్మకమైన పరిశోధనముచేసి, నాగపూరు విశ్వ విద్యాలయము వారి డాక్టరేట్ పట్టమును పొందియున్నారు.

నేడు పలువురు యువకులు దేశ-విదేశములందు శాస్త్రీయ పద్ధతులలో నటన, నాటకప్రయోగము, సాంకేతిక కార్యకలాపములు మొదలగువానియందు శిక్షణ పడయుచున్నారు. కె. వి. గోపాలస్వామిగారు ఆంధ్రవిశ్వవిద్యాలయమున సాంకేతికమైన పరిశోధనలు జరిపించుచున్నారు. ఈ ప్రయత్నము లెల్ల తెలుగు నాటకరంగ పురోభివృద్ధికి అనేకవిధములుగా దోహదకారులు కాగలవు.

ఇంతవరకును పేర్కొనబడినవారేకాక ఇంకను పలువురు ఆ యా సందర్భములందు పెక్కు వ్యాసములను పత్రికలమూలమున వెలయించియున్నారు; అందరును యథాశక్తిగా తెలుగులోని నాటకవిమర్శనా వాఙ్మయము అభివృద్ధి పొందుటకు దోహదము చేసినవారే.

సంగరతృష్ణచే స్వాంతంబు రగులఁ
బటు దురాశావేశ పారవశ్యమున
నధికారదాసులై యవనిఁ బీడించు
మనుజసంతతులార, కనికరములేక
బలహీనజాతులఁ బట్టి చంపెదరు
దేహంబు నలుపైనఁ దెలుపు పసుపైన
నాత్మ బంధులుగారె యఖిల జనంబు ?

— దువ్వూరి.

లగ్గము

(గ్రామ్యము)

వై. వేంకటరావు

ఉ. పోయిన కొయ్యకాల్ల పెదమోసెయె సుమ్మి యియాల కెంతయో
సాయగ జెప్పు సామె పలసాయము పత్తెనియేడు యేుస్యకో
పాయములోము డేత్తె బగవానుడె సూత్తడు వాల్ల మేమెదో
కాయొ పలమ్మొ తింటము, సుకానికి అంతము ఎక్కడుందిలే.

ఉ. లగ్గముకూడ సెప్పయ, మలాపుగ ఎండలు కాసుసుండె నా
పెగ్గెయె నెగ్గజేయమని పెల్లము పానము తీయుచుండె ఈ
యగ్గికి లగ్గ మేందొ తముడైనను లేనిది తెత్త రంటలే
లగ్గము ఉంటెనే యనుము రాచ్చసిమాటల కేమిలేవయా.

ఉ. మానికి మాట యన్నరు తమాము మనింటిది మాట యిందు తా
రాసిన యక్కరమ్మె పలకాలని యంటది కల్కచేరులే
రోసెయ పేరు యిన్నచొ శిరుస్సులు వంచిరి నాడు యాల్ల కో
పాసలమాదిరైతి బగవానుడె శక్రము తిప్పుసుండులే.

ఉ. యాడిది యాడనే యెరుసు యెంపలి తోలగలేదు బూమికిన్
గాడిద శాకిరైంది పిలగాడు జరాన పడిందు కుక్కిలో
కూడును కుమ్మ లేదు అదిగో యన ఆరునెలల్ది సామి, మా
యాడది పత్తె పొన మన యాలకు సూడదు వాడి కైననున్.

తే. గీ. ఎప్పుడున్నదిలేవయ్య యింటిగొడవ
పొత్తకంబును తిరగేసి కాత్తె సూసి
లగ్గమును బెట్టు సామె మాలాపు గుండ
కట్ట ముంచుకోబోములే పెట్టుకాడ.

ప్రబంధాలలో పండుగభోజనాలు

ఉత్పల సత్యనారాయణాచార్య

తెలుగు సాహిత్యమున ఏదో యొక విందునో భోజనమునో పురస్కరించుకొని తెలుగువారి వంటకాలను విస్తరించి వర్ణించిన కవులు కొందరుమాత్రమే గలరు. వారిలో శ్రీనాథుడు, శ్రీకృష్ణరాయలు, పింగళి సూరన్న, తంజావూరు నేలిన విజయ రాఘవ నాయకుడు మున్నగువారలు ముఖ్యులు. ఆ కవులు తమ కులాచారములకును, అభిరుచులకును దగిన భోజనపదార్థములను వర్ణించియుండిరి. రాయలుమాత్రము బ్రాహ్మణ బ్రాహ్మణేతర భోజనముల రెంటిని లెస్సగా నెఱిగినవాడగుట శాకాహార మాంసాహార భోజనముల జక్కగా వర్ణించి సమ కాలపు సాంఘిక జీవనమును మనకు సాక్షాత్కరింపజేసి యున్నాడు.

విస్సనమంత్రి పంక్తిని గూర్చుండి శ్రీనాథుడు హేమ పాత్రాన్న మారగించెడివాడు. అతని భోజనము సాధారణ మైన దై యుండదు. ఒకప్పుడు పల్నాడులో నొకరింట జొన్న న్నము పెట్టి, చింతచిగురు, బచ్చలాకు కలిపిన యుడుకు కూర వడ్డించిరట. కప్పురభోగి వంటకమున కలవాటుపడిన కవిసార్వ భౌమున కది యెట్లు రుచించును?

ఫుల్లసరోజనేత్ర ! యల
　　పూతన చన్నుల చేదు ద్రావి నా
నల్ల దవాగ్ని మ్రింగితి న
　　టంచును నిక్కెద వేమొ తింత్రిణీ
పల్లవయుక్తమౌ యుడుకు
　　బచ్చలి శాకము జొన్నకూటితో
మెల్లగ నొక్కముద్ద దిగ
　　మ్రింగుము నీ పస కాననయ్యెడిన్

అని పరిహాసము చేసినాడు. సన్నన్నము సున్నయైన పల్నాటి సీమను హేళనచేసి 'రసికుడు పోవడు పల్నాడు' అచట 'కుసు మాస్త్రుండైన జొన్నకూడే కుడువవలసి వచ్చు' నని యెఱుక పఱిచినాడు. ఆ కాలమున పూటకూళ్ళ ఇండ్లలో ముఖ్యముగా లక్ష్మణవజ్ఝలవారింట నొక్క రూకకు చక్కని భోజనము లభించెడిదట.

కప్పురభోగి వంటకము
　　కమ్మని గోధుమ పిండివంటయున్
గుప్పెడు పంచదారయును
　　క్రొత్తగ గాచిన యాలనే పెస
ర్పప్పును గొమ్మునల్లనటి
　　పండ్లును నాలుగు నైదు నంజులున్
లప్పలతోడ క్రొంబెరుగు
　　లక్ష్మణవజ్ఝల యింట రూకకున్.

తెలుగువారికి ముఖ్యముగా గుంటూరు మండలవాసులకు గోంగూర తగనియిష్టమను వాడుక యున్నది. ఆ ప్రాంతము వాడే యయిన శ్రీనాథుడేలనో గోంగూరను గొనియాడిన వాడు కాడు. ఇది చింతింపదగిన విషయమే మఱి! ఆ కాలమున భోజనపరాక్రమము గల ఏ రామయమంత్రియో 'గోంగూర వంటి కూరయు గాంగేయునివంటి ధన్వి. నభూతో న భవిష్యతి' యని ప్రస్తుతించియుండవచ్చును. 'మా రామయమంత్రి భోజన పరాక్రమ మే మని చెప్పవచ్చు — ఆ స్వామి యెఱుంగు తత్కబళచాతురి తాళఫల ప్రమాణమున్.' శ్రీనాథుడు, గోంగూరను గొనియాడకపోయినప్పటికి అరవవారి తిండ్లను నిరసించియుండుటచేత నాంధ్రత్వమును నిల్పినవాడైనాడు.

తొలుతనే ఒడ్డింత్రు దొడ్డ మిర్యపుజారు
　　చెవులలో పొగవెళ్లి చిమ్మిరేగ

బ్రహ్మరంధ్రము దాక దాయి నావపచ్చళ్లు మున్నగు అరవ పచ్చళ్లాతనికి నచ్చవు. ఈ కవి సార్వభౌముడు కన్నడదేశమున కరిగి యచ్చట 'రుచులు దోసంబంచు పోనాడి' నిస్పృహ చెందిన వాడు. కావ్యపాకాలలో రమ్యతయు రుచియు దెలిసిన రసికుడు శ్రీనాథుడు. నేటి కాలపు ఇడ్డెనలకు తన కావ్యమున జోటిచ్చిన యీ కవి నేటి నవనాగరిక యుగమున నుండదగినవాడు.

రాయలు ఋతువర్ణనలో నా యా కాలములకు దగిన వంటక ములను పేర్కొనియున్నాడు. బ్రాహ్మణభోజనమును గూర్చి చెప్పుచు రాయలు పోరివిళంగాయలను పేర్కొనెను. పేపుడు బియ్యపు పిండి బెల్లపు పాకముతో జేసిన యుండ లవి. పెరుగు

వడియములు, పచ్చివరుగులు — వాన కాలమున గలమూన్న ముఒల్చిన పప్పు, నాలుగైదు పొగపిన కూరలు — వేసవి కాలమున నులివెచ్చని యన్నము, తియ్యని చారులు, మజ్జిగపులుసులు, పలుచని యంబలి, చెఱకుపాలు, ఎడనీళ్లు, వడపిందెలు, ఊరగాయలు, నీరుచల్ల — ఇక చలికాలమున మిరియపు పొళ్లతో గూడిన వెచ్చ వెచ్చని కూరలు, ఆవపచ్చళ్లు, చేయి చురుక్కను నేయి, ఇపురగాచిన పాలు బ్రాహ్మణు లారగించెడివా రట.

తారుణ్యాతిగ చూతనూత్న ఫల
యుక్తైలాభిఘార స్వన
ద్ధారాధూపిత శుష్యదంబు హృత
మాత్స్యచ్ఛేద పాకోద్గతో
ద్గారంపుంగనరార్చు భోగులకు
సంధ్యావేళలం గేళికాం
తారాభ్యంతర వాలుకాస్థిత హి
మాంత ర్నారికేళాంబువుల్

మాంసాహారులైన ధనికులు వేసవి కాలమున చేపల తునకలలో మామిడి కాయముక్కలు వేసి తాళింపు పెట్టి మధ్యాహ్న వేళలం దల్పాహారముగా బుచ్చుకొనెడివా రట. ఆ పిమ్మట స్నాన శాల దాపున దడియిసుకలో బూడ్చి పెట్టిన కొబ్బరిబొండములు దీసి ఎడనీరు త్రాగి చేపల కనరును పోగొట్టుకొనెడివా రట. శాకాహారపు అల్పాహారముగూడ నింతకు దక్కువైనది కాదు. పనసతొనలు, దోసబద్దలు, తియ్యదానిమ్మలు, రసదాడి అరటి పండ్లు పానకములు బ్రాహ్మణులు సేపడుచుండెడివా రట.

శ్రావణ మాసమున ఆకుకూర అధికము. ఆకాలమున సామాన్యులైన రెడ్లు చెంచలి, తుమ్మి, లేత తగిరిసాకు తఱిగి చింతచిగురు కలిపి నూనెలో వేయించి పొడికూర చేసికొనెడి వారు.

గురుగుం జెంచలి దుమ్మి లేదగిరి
సాకుం దింత్రిణీ పల్లవో
త్కరముం గూడ దొరంటి నూనియలతో
గట్టావి కుట్టారు గో
గిరముల్ మెక్కి తమిన్ బసుల్ పొలము
వో గ్రేపుల్ మెయుల్నాక మే
కెరువుం గుంపటి మంచ మెక్కిరి
ప్రభు త్త్వైకప్తి రెడ్లజ్జకిన్.

పెద్ద నార్యుడు శ్రీనాథుని వంటి అనుభవ రసికు డయ్యును నాతని కేలనో వంటకములపై బుద్ధి పోలేదు. ఆయనకు 'ఆత్మ కింపయిన భోజన' మున్న జాలు. కప్పురభోగి వంటకముకన్న పెద్దన్నకు కప్పురపు విడెమే ముఖ్యము. పారిజాతాపహరణ ప్రబంధమున నంది తిమ్మన్న 'శాక పాకంబుల చవులు వక్కాణించుచు' శ్రీకృష్ణుడు భుజించినట్లు వర్ణించి యుండెనే కాని, ఆ శాక పాకములను మనదాక రానిచ్చిన వాడు కాదు.

కమ్మనై కారమై నేతిను వండంబొల్చి, చేతం దడివినం దుముర్రై పాటుటల్ లేక సద్యోజనితంబుల్ వోలెం జాలం జవులొదవునవి కండచక్కెర పాకమున దయారయినవియు నగు అప్పాలను తెనాలిరామకృష్ణుడు వర్ణించెను. ఇచ్చట కార పునగా ఘాటని అర్థము. పింగళి సూరనార్యుడు తన కథా నాయకుడైన కళాపూర్ణునకు బ్రాహ్మణ భోజనమే పెట్టించెను.

కల వంటకములు బూరెలు తేనె తొలలు చా
పట్లు మండిగలు బొబ్బట్లు వడలు
కుడుములు సుకియలు గడియంపుటట్లు వె
న్నప్పాలు వడియంబు లప్పడాలు
బొంగరములు సొజ్జెబూరె కాగుల సేవె
లుక్కెర లరిసెలు చక్కిలములు.

తంజావు రాంధ్ర నాయకరాజైన రఘునాథ భూపాలుడు శ్రీనాథుని కప్పురభోగి వంటకములను చవిచూచినవా డగుటచే గాబోలు తన కాలపు దొరల భోజనములను గూర్చి రఘునాథ రామాయణమం దిట్లు వర్ణించెను.

కప్పురభోగి వంటకము
కమ్మగనే వడియున్ భుజించి మేల్
దుప్పటులట్లు మూరగల
తోరపు పచ్చడముల్............

కప్పుకొనెడి వారట! ఈ రఘునాథ భూపాలుని కుమారుడైన విజయరాఘవ నాయకుని రఘునాథాభ్యుదయ ద్విపద కావ్యమం దానాటి వంటకములలోని విశేషము లెన్నేనియు గ్రహింప వచ్చును. ఈ కవిరాజు భోజన మిషతో నాటి మహారాజుల మహానసమున ఘుమఘుమలాడు వంటకములను లెక్కింటిని పేర్కొని యున్నాడు.

ఒక వేదండయాన కైదండ యొసగ దిగి బంగరు పీటమీద గూర్చుండిన పట్టపు రాజు పళ్లెరమున దొలుతగా "గిలుకు టందెలు మ్రోయ గీరసల్లాప కులుకుచు పచ్చడులు గొని వచ్చిన దట! వడ్డన మొదలుకొని స్వీయ సంప్రదాయమునే వర్ణించి నాడు విజయ రాఘవుడు.

"అప్పడాల్ నువుపొడి హవణించినట్టి
కప్పురపుకోడి యొక్క లతాంగి తెచ్చె
తురిమిన టెంకాయ తునియలు గూర్చి
కరివేప పొడిచల్లి కమ్మని నేత


పొంకంబుగా దాల్చి పొదిగినయట్టి
కుంకుమకోడి గైకొనివచ్చె నొకతి"

ఈ వంటకములలోని పదార్థములనుబట్టి ఇవి శాకసంబంధములే యనియు, నేటి పకోడీలవంటివే కప్పురపుకోడి మున్నగునవి యనియు, నాటి బ్రాహ్మణులుగూడ నిట్టివి చేయుచుండెడివారనియును జెప్పవచ్చును. కాని బ్రాహ్మణులు వీనిని కప్పురపుకోడి, కుంకుమకోడి, కస్తూరికోడి, పాలకోడి, కట్టుకోడి అని పేర్కొనకపోవచ్చును. పదార్థ మొక్కటి యయ్యును చేతాళమునందును, పేర్లలోను కొద్దిపాటి భేద ముండవచ్చును. నేడా కోళ్లన్నియు బోయి పకోడీలుమాత్రము నిలిచినవి.

నీరుమజ్జిగయనగ మనము సాధారణముగా మజ్జిగతేట యని భ్రమపడుదుము. అది కాదు.

"సారమౌ జంబీర సారంపు రుచుల
మీఱంగ లవణంబు మితముగా గూర్చి
మేలైన సొంటితో మిళితమైనట్టి
ఏలకి పొడిపైచి యింపు దీపింప
దగు పట్టిపేళ్లచే తావులు గట్టి
మగువ యొక్కతె నీరుమజ్జిగ దెచ్చె"

ఇవి కాక మనము మఱచిపోయిన సారసత్తులు, పేణీలు మున్నగు వానిని ఈ కవి తన ప్రబంధమున నిబంధించి మనకు రుచి చూపించుచున్నాడు.



చిన్నమొత్తాల పొదుపు ఉద్యమానికై మన రాష్ట్రంలో అత్యుత్తమ కృషి సల్పిన ముగ్గురికి కేంద్ర ఆర్థికమంత్రి సంతకముగల ప్రశంసాపత్రాలు యియ్యబడినవి. వీటిని 1961 డిశంబరు 16 వ తేదీన హైదరాబాదులో జాతీయ పొదుపు ఉద్యమం రాష్ట్రసలహాబోర్డు సమావేశం జరిగినప్పుడు వారు ముగ్గురూ స్వీకరించారు. చిత్రంలో యెడమ వైపున శ్రీమతి బెలాబ్రహ్మగారు, కుడిప్రక్కన శ్రీ రమణారెడ్డిగారు, (కడపజిల్లా సిద్ధవటం) ప్రశంసాపత్రాలను స్వీకరించడం చూడనగును.

పొదుపు ఉద్యమం

కె. లక్ష్మీనరసయ్య

(క్రిందటియేడు జరిపిన జాతీయ పొదుపు ఉద్యమం 'పాటలు, గేయాల' పోటీలో ఈ గేయానికి ద్వితీయ బహుమతి లభించింది.)

చిన్నలార - పెద్దలార
పేదలార - ధనికులార
భారతి సౌభాగ్య భావి
పౌరులార - పౌరులార
పొందికైనమాట చెబుత వినండీ!
పొదుపు ఉద్యమం పథకం గనండీ!

స్వయంవృద్ధి సాధనకై
సర్వశక్తి సమకూర్చుక
భావిభారతదేశపు సౌ
భాగ్యమార్గమందు నడచి
దేశసంపదలను పెంచుకొనండీ!
దివిని అవనిపైన నిల్పుకొనండీ

మీ రాబడిలోన కొంత
భారత జాతీయనిధికి
ప్రణాళికల విజయమునకు
ఋణరూపముగా నొసంగి
జాతివృద్ధికై సహాయపడండీ!
స్వంతాదాయముల వృద్ధి గనండీ!

దేశంతో మీరుగూడ
మీ శక్తి సమీకరించి
ప్రతిపల్లెను స్వర్లోక
ప్రాయముగా మార్చుటకై
జాతినేత పిలుపు నందుకొనండీ!
సౌభ్రాతృత్వమును పెంచుకొనండీ!

పన్నెండేడుల పరిమితి
"ప్లాన్ సేవింగ్ సర్టిఫికేట్లు"
పదేండ్లలో చెల్లించు - "డి
పాజిట్టుల సర్టిఫికేట్లు"
"ఆన్యూయిటీ సర్టిఫికేట్లు కొనండి!"
"అధిక లాభము లను పంచుకొనండీ!"

భాక్రనంగల్ - నాగార్జున
వంటి గొప్ప ప్రాజెక్టులు
ఉక్కు, ఇనుము, బొగ్గు, నూనె
పెక్కు ఫ్యాక్టరీలు - గనులు
ప్రాతిపదిక విద్య; పెంపుగనండీ!
భౌతికసంపదల పెంచుకొనండీ!

సాంఘిక సంక్షేమమ్మును
సాంస్కృతి కాభ్యుదయమ్మును
సామరస్య భావములను
సమానావకాశమును
స్థాపించుటకై ముందుకు పదండీ!
బాపూజీ బోధ యిదే కదండీ!

పిన్నలార - పెద్దలార
పేదలార - ధనికులార
భారత సౌభాగ్య భావి
పౌరులార - పౌరులార
పొందికైనమాట చెబుత వినండీ!
పొదుపు ఉద్యమం పథకం గనండీ!

మానసికంగా ఆరోగ్యవంతులైన మనుష్యుల ఆశయాలు, ప్రేమ, భక్తి, వివేకం. అటువంటివారు తమ ప్రాణాల్నేకాక తమతోటి మానవుల ప్రాణాలు కూడ గౌరవభావంతో చూస్తారు.

— ఎరిక్ ఫ్రోమ్.

అనర్ఘ భార్గవము

(రూపకము)

మోచర్ల రామకృష్ణ కవి

పాత్రములు

పురుషులు

పరశురాముఁడు
జమదగ్ని
విశ్వావసువు
వసువు
రుమణ్వంతుఁడు
సుషేణుఁడు

(విశ్వావసువు, వసువు, రుమణ్వంతుఁడు, సుషేణుఁడు — పరశురాముని సోదరులు)

స్త్రీలు

చంద్రరేఖ
రేణుక

నాంది

శ్రీలావణ్యవతీ వితీర్ణ దృఢ సంశ్లేష ప్రమోదంబు, లు
ద్వేలాహంకృతి మత్స్యహాస్రకర నిర్భేదంబు, లాశ్చర్య వి
భ్రీలాహ్లాద సమాస్పదంబులు, జగద్గేయంబు, లింపొందు గో
పాలస్వామి కరారవిందములు సర్వశ్రేయముల్ మీ కిడుఁగా!

1

(మాహిష్మతీ నగరోపాంత రణ రంగము.)

(తాపస కన్యకా వేషముతో చంద్రరేఖ ప్రవేశించును)

చంద్రరేఖ: (తనలో) మా కార్తవీర్యార్జున చక్రవర్తి, మా రాజమార్తాండుఁడు అస్తమించినాఁడు. ఆతని తోడి నీడ యగు మనోరమయు మాసిపోయినది. ఇచ్చట నాకింకఁ బనిలేదు.

నా ప్రణయ సామ్రాజ్యమున కెవ్వనిఁ బట్టభద్రునిం గావించితినో ఆ మయూర ధ్వజుఁడు, ఆ మంగళమూర్తి సంగ్రామ రంగమున అసువులం బాసినాఁడు. నే నింక జీవించి యేమి చేయుటకు? నాకింకెవ్వరు దిక్కు? నా యీ సౌందర్య మెందులకు?

అయ్యో, నే నెంత మంద భాగ్యను! మొన్న గదా మా రాజు 'చెలీ, నీ వివాహ మహోత్సవమును ఈ యుద్ధాంతమున జరుగనున్న విజయోత్సవమున కన్న మిన్నగా జరిపింతును.' అని యెంతో సంతసములోఁ జెప్పినది. ఇంకెక్కడి వివాహము, ఇంకెక్కడి యానందము! అన్ని యాశలును అంతరించినట్లే.

ఈ పురమున నాకెంత రావులేదు. నా యాశ్రయ వృక్షము కూలిపోయినది. ఈ నా దుర్గతికి, ఈ నా సంక్షోభమునకు హేతుభూతులైన ఘాతుకులను ఈ వేషములో నా చేతనైనంత ప్రతీకారము చేసినఁగాని నామనంబు చల్లారదు. అటుల నా జీవితమెట్లు పరిణమించునో యేమో! పాప పరిహారమునకు ప్రాయశ్చిత్తములు లేవా? ఏనాఁటి కేది ప్రాప్తమో! ఇదిగో ఉపక్రమింతును.

(తెర)

2

(జమదగ్ని మహర్షి యాశ్రమము.)

(తాపస కన్యకా వేషముతో చంద్రరేఖ ప్రవేశించును-ముని పూజ సేయుచున్న రేణుకకు నమస్కరించును.)

రేణుక: బాలా, నీ వెవ్వతెవు? ఎచ్చటినుండి వచ్చితివి?

చంద్రరేఖ: అమ్మా, నేనొక నిర్భాగ్యురాలను. ఈ విశాల విశ్వమున నా యనువా రెవ్వరును లేని యదృష్టహీనను. ఒక రాజాంతఃపురమున సైరంధ్రినై కొంతకాలము జీవయాత్ర గడపితిని. కాలవశ్య సంయోగమున నా యజమానురాలు చని పోయినది. నా బ్రదుకు దుఃఖభాజన మైనది. ఆయుశ్శేషమును మీవంటి పుణ్యమూర్తుల సేవఁ జేయుచుఁ గడప నెంచి వచ్చి మీ యాశ్రమ సీమఁ జొచ్చితిని. సరే యని యనుగ్రహించి నిలువ నీడ యిచ్చితిరా, మనశ్శాంతిఁగని నా శక్తి కొలఁది మీకుఁ బరిచర్య లాచరించుచుందును. కాదంటిరా...

రేణుక: ఇంతదూరము మముగూర్చి వచ్చినదానవయినా? నాకేమి బరువా నీవు? అటులనే మల్లే. నీ యిష్టము వచ్చినట్లు హాయిగా నెంతకాలమైన మా యాశ్రమములో నివసింపుము. నిన్ను నా కన్నబిడ్డవలెఁ జూచుకొందు నమ్మా. నీకేమియు భయములేదు. నీ పేరేమి తల్లీ!

చంద్రరేఖ: నా పేరు 'వాసంతి'.

రేణుక : అమ్మా. వాసంతీ ! రా, లోనికేగుదము. ఎంతదూరము నడచితివో మిక్కిలి డస్సియున్నావు. (ఇరువురు నిష్క్రమింతురు.)

(తెర)

3

(జమదగ్ని యాశ్రమము.)

(పరశురాముఁడు కార్తవీర్యార్జునుని శిరస్సుం గొని ప్రవేశించును.)

పరశురాముడు : (తనలో)

మ॥ జనకుం డేమని యెంచునో, యతఁ డహింసా సద్వ్రతాచారుఁ, డీ
జననాథాప సదుండు దుర్దముఁడు నిశ్శంకంబుగా వచ్చి స
ల్పిన దుశ్చేష్టకు నా ప్రతిక్రియను దా వీక్షించి హర్షించి మె
చ్చునొ? విప్రానుచితంబుగాఁ దలఁచి దుష్టుండంచు నఁజూడిట్టునో?

(తండ్రిని సమీపించి నమస్కరించును).

జమ : దీర్ఘాయుష్యమస్తు.

పరశు : తండ్రీ, హోమధేనువుం గొనివచ్చి కట్టివైచితిని.

జమ : రామా, నీ చేతనున్న భయంకరవస్తు వెయ్యది ?

పరశు : మన యావు నపహరించిన రాజాధముని శిరస్సు.

(జమదగ్ని సన్నిధి నుంచును)

జమ : ఎంత పాతకము ! అయ్యో, చక్రవర్తి యుత్తమాంగమా యిది ? ఘోరము !

పరశు : పరవిత్త హర్త రాజైనను గురుఁడైనను మఱెట్టివాఁడైనను దండ్యుఁడేకదా తండ్రీ !

జమ : కుమారా, నీవు బ్రాహ్మణుఁడ వన్నమాట మఱచి నట్లున్నది. విప్రులకు క్షమయే భూషణము. తాలిమి మాలి వర్తించిన బ్రాహ్మణులు ఇహపర దూరు లగుదురు.

పరశు : తాలిమి పాటించినచో మనము రాజులవలన రాష్ట్రముల నుండి గెంటింపఁ బడుదుము.

కం॥ మన సురభివలన జనియిం
చిన మధుర పదార్థ చయముచేఁ దృప్తుండై
చను నపుడు గోవుఁ గొంపో
యిన ఱేఁడొక ఱేఁడె ? పూజ్యుఁడే యెన్నండేన్ ?

కృతఘ్నుల శిక్షించుట దోష మగునా ?

జమ : మనకెట్టి విపత్తులు వచ్చినను మన ధర్మములను మనము విడువరాదు. స్వధర్మ దూరములగు కర్మములు తాత్కాలిక శ్రేయోదాయకము లైనను పరిహార్యములే.

పరశు : తండ్రీ, గో సంరక్షణము విప్ర సంరక్షణము వంటిది కాదా ? గో హర్తల శిక్షించుట పాతకమా ?

మ॥ పరివర్తించితి మెన్నడో సకల సంపత్సౌఖ్యముల్, వచ్చి యీ
కరణిన్ దుర్గమ కాననాంతరములన్ గష్టించుచున్ వైదికా
ధ్వర కర్మాదుల నిర్వహించు కొఱ కెద్దానిన్ మహాప్రీతిమైఁ
బరిపోషింతుమొ, దానిపై తముగొనన్ భావ్యంబె యీ వేనికిన్?

జమ : రామా, నీ వింక నాతో వాదోపవాదము లాడకుము. వింటివా, పశ్చాత్తప్తుఁడవై నా యాజ్ఞానుసారము వర్తింపుము.

గీ॥ రాజు ప్రత్యక్షదేవత ప్రజకుఁ గాన
రాజవధ దేవతాపచారంబ యగును;
దానిచే నీకుఁ బాపంబు దవిలెఁ బుత్ర !
తీర్థసేవల దానిని దీర్చుకొనుము.

పరశు : మహాప్రసాదము.

(తెర)

4

(సలిలార్థమై గంగానది కేగుచు మార్గ మధ్యమున వాసంతీ రేణుకలు)

రేణుక : మా రాముఁడు మొన్నఁటికే వచ్చి చేరునని కదా వైర్థి కులు వచించిరి. వాసంతీ, యెచ్చోట నున్నాఁడో !

వాసంతి : పద్మ తీర్థమునఁ బిప్పలాకారులైన నర నారాయణుల సేవించి యచ్చటినుండి బయల్దేఱినాఁడని వారు చెప్పిరిగదా !

రేణుక : తీర్థయాత్రలకు నియమితమైన యేఁడాది గడువుతీరి, యొక వారమైనదిగదా, నేఁడైన వచ్చునో రాఁడో ?

వాసంతి : ఈ నాఁడు సాయంకాలమునకుఁ దప్పక వచ్చునమ్మా.

రేణుక : నీ మాట నిజమైనచో వాసంతీ, నేఁటి మాపటి పూట మన యావు పిచ్చు పాలన్నియు నీ నోటఁ బోయుదునే.

వాసంతి : అవన్నియుఁ ద్రావి జీర్ణించుకొనగలిగిన శక్తిని నీవు ప్రసాదింపవలసినదే కదా.

రేణుక : అదెంతపని వాసంతీ !

వాసంతి : సిద్ధసంకల్పులకు మీకు సాధ్యముకాని దేమున్నది ?... అల్లదిగో, యా మొగలిపొదలరేవున కరుగుదమా. అచ్చట స్నానమునకు మనకు సౌకర్యము బాగుండును.

రేణుక : అంతదూర మరిగినచో ఆలస్య మగునేమో, సరే, పోదము పద.

(పరిక్రమింతురు)

(కొంతదూరము నడచి) ఏమిది? నేఁడు గంగాప్రవాహ మింతక కలుషితమైయున్నది ! (దూరమునఁ జూచి) ఎచ్చటినుండి స్త్రీల కలస్వనములు ?

వాసంతి : అమ్మా, యిటు జూడుము.

రేణుక : ఎవ్వరే వారు, వాసంతీ.

వాసంతి : అగపడలేదా, ఇటు, యిటు, ఈ వైపు. జలక్రీడలం
దేలు నయ్యారి వేణులవే నీవు విన్న కల స్వనములు.

మ॥ చెలువల్ కొందఱు నీట నాయకునిపైఁ జిందించుచున్నారు న
వ్వులు త్రుళ్ళింతలు నివ్వటిల్లఁగ; గరంబుల్ సాచుచున్నారు పు
వ్వులకై కొందఱు; చక్రవాకముల గుంపుల్ దోలుచున్నారు కే
ళలతోఁ గొందఱు మందగాములు రాజచంద్ర బింబాననల్!

ఆ యిప్పుమిన్నల మేనుం చెఱకు విలుకాని యమ్ములవలె
నెట్లు మెఱయుచున్నవో చూచితివా ?

రేణుక : నిజమే నిజమే......కాని, వాసంతీ, మనమింక నిలువ
రాదు. ఎంత జాగుచేసితిమి, ఎంత పరాకు! హోమ సమయము
దాఁటిపోయినదే!

(ఇసుకతోఁ బాత్రము నిర్మింప యత్నించి)

వాసంతీ, అనుదినము నేను క్షణములో నిర్మించుకొను సైకత
పాత్రము నేఁడెంత యత్నించినను సమకూరమికిఁ గారణమేమే ?

వాసంతి : ఏమో, యిప్పటికే ప్రొద్దు తిరిగినది. వేగిరము నీరుఁ
గొని ముందుగా నేను యజ్ఞశాల కరుగుదునా ?

రేణుక : బిడ్డా, నీవు బయల్దేఱుము. కాల్గడియలో నీ వెంట నేనును
వత్తును.

వాసంతి : (నీరు ముంచుకొని నడచుచు) (తనలో) చంద్రరేఖా,
దైవికముగా నీ కొదవిన యీ యవకాశము నెట్లుపయోగించు
కొందువో ?

(నిష్క్రమించును.)

రేణుక : అపచార మయ్యెనా ?...మైల సోకెనా నాకు ? ఓ సూర్య
భగవానుఁడా !

శా॥ నా యుల్లంబు పవిత్రమేనియును బుణ్యంబైన గంగా సరి
త్తోయంబుల్ దురితక్షయక్షమములై రొల్కాఱునేనిన్, త్రయీ
ధ్యేయుండైన పరాత్పరుం డొకరుఁడై యీ విశ్వముంగాచునేన్
నా యీ సైకతపాత్ర నిర్మితమగున్ నాచే యథారీతిగాన్!

(ఇసుకతోఁ బాత్రము నిర్మించుకొనును)

అబ్బ, నా మనస్సిప్పుడు కుదుటఁ బడినది.

(నీరు ముంచుకొని నిష్క్రమించును.)

(తెర)

5

(జమదగ్ని హోమశాల.)

జమ : మట్టమధ్యాహ్న మతిక్రమించినను నేఁడేల రేణుక నది
నుండి రాలేదు ?...వాసంతీ !

(వాసంతి ప్రవేశము)

వాసంతి : ఏమి బాబూ !

జమ : రేణుక వచ్చినదా ?

వాసంతి : రాలేదు.

జమ : నదికి నీ వరిగితివా ?

వాసంతి : వెళ్ళి వచ్చితిని.

జమ : ఇరువురును దోడై వెళ్ళితిరా ?

వాసంతి : అవును.

జమ : రేణుక యెచ్చట నున్నది ?

వాసంతి : అచ్చటనే.

జమ : ఏమి చేయుచున్నది ?

వాసంతి : ....

జమ : పలుకవేమి ?

వాసంతి : ....

జమ : (ఆగ్రహోదగ్రుఁడై) మూఁగదానవా ?...మతిపోయినదా ?

వాసంతి : జలక్రీడా...జలక్రీడా వినోదముం జూచుచున్నది.

జమ : ఏమీ ! ఏమీ !

వాసంతి : ఒక గంధర్వుఁడు నదీ జలములందు స్త్రీలతో జలకేళి
సలుపుచున్నాఁడు...ఆనందముతో ఆవినోదముం దిలకించు
చున్నది.

జమ : ఆహా ! ఆహా !...ఎంత ప్రమత్తత ! రేణుక, రేణుక
జలకేళి చూచుటయా !

వాసంతి : జలము గొనివచ్చుట కనుదినమును దాను గావించు
కొను సైకత పాత్రము నేఁడు నిర్మించుకొనలేక తత్తఱపడుచు,
అచ్చటనే నిల్చిపోయినది.

(రేణుక ప్రవేశించును)

జమ : ...వచ్చితివా, నిజమేనా ?

రేణుక : (స్వ) నేఁడు నా కేదియో కీడు మూడ నున్నది. శాంత
మూర్తియగు నా దయితుఁడు సాక్షాద్దుర్వాసమహర్షి యైనాఁడు.
(వణఁకుచు) (ప్రకాశము) నది కేగునప్పటికి అందెవ్వరో
క్రీడించుచుండిరి. జలము కలుషితమైయుండెను. ఇంచుకసేపు
వాసంతియు నేనును వా రెవ్వరా యని చూచుచు నిలువం బడి
తిమి. ఆలస్యమయ్యెనే అయ్యో, అని వాసంతిని బంపి, యెప్పటి
యట్ల పాత్రము నిర్మించుకొని నీరు ముంచుకొని వడివడిగా
వచ్చితిని.

జమ : ఓసీ, దుశ్శీలా, జలక్రీడా సందర్శనమా నీకు ? ధర్మ
దూరవు, (పండ్లు గొరుకుచు) దండ్యవు నీవు...ఓరీ,
విశ్వావసూ, రమ్మిటు.

(విశ్వావసువు ప్రవేశించును.)

విశ్వా : తండ్రీ, వచ్చితిని.

జమ : నీ సోదరుల నిటు పిల్చి రమ్ము.

(విశ్వావసువు నిష్క్రమించును)

రేణుక : నాథా, నా ప్రవృత్తము పవిత్రము. నన్ను మన్నింపుఁడు.

(వసువు విశ్వావసువు రుమణ్వంతుఁడు సుషేణుఁడు ప్రవేశింతురు)

జమ : మీ తల్లి మహాపరాధ మొనర్చినది. మీలో నెవ్వఁడైనను సరే, ఈమె శిరస్సు ఖండింపవలయును.
మిన్నకున్నారేమి ? చేయరా ? నా యాజ్ఞ నిర్వర్తింపరా ?...
మాటాడరేమి ? పితృద్రోహులారా పుత్త్రులా మీరు ? పొండు.
నా యెదుట నిలువకుఁడు... (వస్వాదులు నిష్క్రమింతురు)
తిరస్కారము... ఛీ. ఛీ !
పరశురాముఁడు లేకపోవుట...

(పరశురాముఁడు ప్రవేశించును)

పరశు : (తండ్రికి నమస్కరించును) తండ్రీ, తీర్థసేవ కావించుకొని వచ్చితిని. ప్రభావ సంపన్నులగు సిద్ధసంఘ మీశ్వరులను సందర్శించి వారి యనుగ్రహము వడసితిని: కృతకృత్యుఁడ నైతిని.

జమ : కుమారా, సంతసించితిని, ఇంకొక్కపని చేయవలయును. ఒనర్తువా ?

పరశు : సందేహమేల ? తప్పక.

మ॥ జనకాజ్ఞా దృఢబంధన తతసదాచాఖండ సంచున్ జగం
బున నా పేరు చిరంబు నిల్వవలె సంస్తావ్యంబుగా — మాట త
ప్పిన, నేఁ దాపక శాపవహ్ని శిఖలన్ నే భస్మమై పోవలెన్
మను నే యీ భృగురాముఁ డొక్కక్షణమైనన్ వీత మర్యాదుఁడై ?

జమ : మంచివాఁడవు పరశురామా ... నీ విపుడే వెళ్లి. మీ తల్లిని సోదరులను వధించి రావలయును.

పరశు : (విభ్రాంతుఁడై)......

జమ : ఏమి, పరశురామా ఆలోచించుచున్నావా ?— పలుకవేమి ? నీ యన్నల నీతియే అలవడెనా నీకు ?

పరశు : మీ యాజ్ఞ శిరసావహింతును.

జమ : ఆలోచన కవకాశములేదు. లెమ్ము. వెంటనే నా యాజ్ఞ నిర్వర్తింపుము.

పరశు : మహాప్రసాదము.

(తెర)

5

(ప్రవేశము — చింతాక్రాంతుఁడైన పరశురాముఁడు)

పరశు : ఔరా, యెంత విషమపరీక్ష !...ఏమపరాధ మొనర్చినదో ?...మా తల్లి నడుగుదునా ?... దోష మత్యల్పమని నా బుద్ధికిఁ దోఁచిన నేనేమి చేయవలయు ? ఆగ్రహించి శపింపఁడా మా తండ్రి? భస్మమైపోవుదును. పోయిన నేమి ?...మా యన్నలను తల్లిని వధించి తానే తన కోపానలము నేల చల్లార్చుకొనరాదు ? ఈ మహాపాతకము నాకేటి కొడిగట్టవలయు ?

...వీరవరులు పల్కిరిగదా ! ఇంతమాత్రమా నా దిటవు? ఎంతచర్చ. ఎన్ని తర్కములు ఎంత సంశయము ! గుండెను రాయిఁ గావించుకొని చేయవలసినదేనా యీ పని ?

తల్లీ, నీ కంఠము నెట్లు ఖండింపగలను ? మాతృదేవతను చేతులారఁ దెగనఱకుటకన్న ఆత్మహత్యయే మేలు... వెట్టియూహ ! ఆత్మహత్య యొనర్చుకొన్నచో నేను దండ్రి యాజ్ఞ పరిపాలించిన ట్లగునా ?

ధర్మవిశారదుఁడు - తపస్సంపన్నుఁడు నాచే దుష్కార్య మేల చేయించుచున్నాఁడు ? వా రేదో మహాపరాధ మొనర్చి యుందురు. సందేహము లేదు.

నాకీ హృదయ దౌర్బల్యమేల ? ఎన్నఁడును లేనిది ...... హృదయమా ! నిన్నూడఁబెఱికి నీ కించుక స్థైర్యము కల్పించి మరల నిన్ను యథాస్థానమున నిలిపెదను వత్తువా ?...

రాననుచున్నావా ? కుఠారమా నా యీ పాడుహృదయము వెలికి రాననుచున్నది. ఈ వక్షఃపీఠము నించుక విదారించి హృత్పిండము వెలికివచ్చునంత దారిఁ గావింపుము.

(పరశువును విసరును. అది క్రిందఁబడును.)

పరశూ, నీవును నాపై నలుకయా ? నా యాదేశము ఆదరణీయము కాదని తలంచితివా ?

పరమ శాంతస్వభావులు — దయామతులు నా యన్నలు. వారిని వధించుటయా ? పరశురామా నీవు పాతకుఁడవు.

అయ్యో, ధైర్యము విచ్ఛిన్నమైనది. ఆహా, దేహము కంపించుచున్నది. కన్నులకుఁ జీఁకటులు క్రమ్ముచున్నవి. నాళముల రక్తప్రవాహము స్తంభించుచున్నది ... దుర్భరము - నిలువఁజాలను - హా ! (మూర్ఛిల్లును — తెప్పిఱిల్లి లేచును)... మూర్ఖుఁడను. భ్రాంతుఁడను ఎంత యవివేకము ! నిగ్రహానుగ్రహ సమర్థుఁడు - అమానుషశక్తి సంపన్నుఁడు నా తండ్రి. అట్టి మహనీయుని యాజ్ఞ నుల్లంఘించుటయా ?

సీ॥ హృదయమా, చెదరక యదనున దిటవూని
నాకు ముందుగ నీవు నడువవలయు,
హస్తమా, యిపుడు సాహసమూని నిస్తంద్ర
వృత్తి ముంగలికిఁ బర్వెత్తవలయు,
నయనమ్ములార, యీ భయదకృత్యమునకు
వెఱచి స్థైర్యమ్మును వీడవలదు,
కనికరంబా, నిల్వఁగా నీకు నాయందు
నలఁతి తావునులేద యవలఁబొమ్ము.

గీ॥ ఓ కుఠారమ, సకలలోకైక చటుల
విక్రమ విహార విధ్వస్త విమత నృపతి
సాంద్ర కాంతారమా, సుంత జంకబోకు
మీవు పితృశాసనము నిర్వహించువేళ.

(నిష్క్రమించును.)

(తెర)

6

(వాసంతి ప్రవేశించును)

వాసంతి : (స్వ) నా పాచిక పారినది. నా కసితీరినది — నామంట చల్లారినది. తల్లిని దోఁబుట్టువులను నరకిన పరశురాముఁ డాత్మహత్యకు సిద్ధపడఁడా ? ... తప్పక. వీనితో నీ భృగు వంశ మంతరింపదా ? సందేహమేల ?... ఆహా, నీ కింకేమి కావలయును ? మనోరమా, నీ ప్రాణసఖి నీ చంద్రరేఖ నీ ఋణము తీర్చినదా ? సంతసించితివా ?... (నిష్క్రమించును)

7

(రక్తసిక్తములగు హస్తములతోఁ బరశురాముఁడు ప్రవేశించును)

పరశు : సీ॥ పున్నెముల్ పూజలు పొనరించి, యెన్నియో
బన్నముల్ వడి నన్ను గన్నతల్లి,
పిన్న నాటంగోలె మన్నించి ప్రేమించు
కొని నన్నుఁ బెంచిన కూర్మితల్లి,
నా కోరికల్ దీర్చుటే కార్యమని, యను
కంపనోమిన మురిపెంపుఁ దల్లి,
యెట్లైన నా తోడిదే లోకమని యెంచి
కడుపున నిడుకొని కాచుతల్లి
గీ॥ ధన్యగుణవల్లి పుణ్య కాంతామతల్లి,
కఱకు గొడ్డలిఁ గైకొని నఱకినాఁడఁ
గదిసి పొదివిన యీ మహాకల్మషంబు
మాసిపోవునె యెన్ని జన్మములకైన ?

సీ॥ భ్రాతృవత్సలత నాపైఁ జూపి, సదయులై
వదలక ననుఁగూడి మెదలు బుధులు,
నవ్వులకైన నెన్నండైన నా మాన
సము నొవ్వఁజేయని విమలమతులు,
ఎవనిచేనైన నాకెపుడైన నపకార
మొదవు టోర్వని గుణాభ్యుదయ నిధులు
భేదభావములేని విశ్వభూతాత్ములు
నా తోడు నీడ చందంబువారు,
గీ॥ మాన్యమూర్తులు పరమసౌజన్యకీర్తి
రమ్యులగు వారి గళముల్ కిరాతుఁడనయి
పరశుకాళికి-బలిపెట్టి కఱకుపెడఁద
నైతి, నా బ్రదుకెంత హేయంబొ, యిస్సి !

చ॥ నిరుపమసాధ్వియైన జననిన్ గుణమాన్యుల నన్నలన్ గృపా
విరహితవృత్తిఁజంపి పృథివీస్థలి నేక్రియ నిల్వనేర్తు సు
స్థిరముగ ? మాతృరక్త పరిషిక్త కఠోర కుఠారధార స
త్వరము మదీయకంఠము మదమ్మునఁ ద్రుంచెద, ముక్తిఁ
గాంచెదన్.

(ఆత్మహత్య కుద్యమించును - జమదగ్ని సరభసముగాఁ బ్రవేశించును.)

జమ : ఆగుమాగుము పరశురామా, మెచ్చితిని-నే మెచ్చుటయేమి, వేలుపులెల్ల మెచ్చిరి. సురదుందుభులు మ్రోయుచున్నవి, వినుము. దేవతలాకసమునుండి విరులవానలు గురియు చున్నారు, చూడుము.

ఉ॥ మెచ్చితినోయి పుత్త్రక, యమేయ భవత్పితృవాక్య పాలనన్
వచ్చె దిగంత విశ్రుత శుభప్రద భవ్యయశమ్ము నీకు - నీ
సచ్చరితాంక మా రవినిశాకర తారకమై వెలుంగు నే
పొచ్చెములేక, యిష్ట పరిపూర్తి యొనర్తు, వరమ్ము వేఁడుమీ !

పరశు : నేఁగోరఁదగిన వర మొక్కటియేకదా తండ్రీ,
కం॥ నీ యానతి నెరవేర్చితి,
మా యమ్మను సోదరులను మాన్యుల నిపుడే
చేయవె లబ్ధప్రాణుల
నా యానందంబు నేఁడనంతముగాఁగన్.

జమ : (విస్మితుఁడై)
(తన కమండలువులోని జలముఁగైకొని)
కం॥ నా విమల యోగబల వి
ద్యా వైశద్యమున వీరు తత్క్షణమ పున
ర్జీవితులై యారోగ్య
శ్రీ విలసిత గతి భువిం జరింతురుగాతన్.
(జలముం జల్లును — రేణుకయుఁ గుమారులును బునర్జీవితు లగుదురు)
వత్సా, యింకేమి కావలయు ?

పరశు :
మ॥ అనుఁగుల్ భ్రాతలు చేతనం బడసి హర్షాన్వీతులై, రార్య స
జ్జన సంస్తుత్య పవిత్రశీలయగు నస్మన్మాతయున్ లబ్ధ చే
తన యయ్యెన్, గృతతీర్థ సేవనలఁ జేతశ్శుద్ధి సంధిల్లె, నిం
కను నాశాస్యములున్నె నాకు జనకా, కల్యాణ సంధాయకా !

జమ : అయిన నిది యగుంగాక !

(భరతవాక్యము)

మ॥ శివునిం బోలెను శిష్యవత్సలత వాసిం గాంత్రుగా కొజ్జ, లు
ర్వివిభుల్ గర్వముమాని సాధువులఁ బేర్మిం బ్రోచె దర్గాత—స
త్కవి వాగ్గుంభన లీసుమాని సరసుల్ గైకొంద్రుగా, తార్యధా
త్రి విచిత్రోరు రమాసవిత్రి యగుచున్ దీపించెడుం గావుతన్ !

(ఓం తత్సత్)

నీలకంఠుని వక్రోక్తి

కుంటిమద్ది శేషశర్మ

అవును; నిజమేమరి ఎందరుకవులు; ఎన్నికావ్యాలు; గ్రంథులు కొన్నిచోట్ల కవిత్వ వాసనావిలసితములైనను, కావ్యములని అనిపించుకొనలేదు గాని, నిజమునకు అవియును లెక్క లేనన్ని కావ్యములే. కాగదములు, కనీసము తాళపత్రములు భూర్జ పత్రములే లేని కాలములో చెవినుంచి చెవికి ప్రసరించు చీకటి చదువుల యుగములలో ఎన్ని యంతరించినవో, అటుపిమ్మట ఆదికావ్యము మొదలు ఎన్ని కావ్యములు విలసిల్లినవో !

దేశీయ రాజులు పోషించు చున్నందువలన వీకు చింతలేని కవి తల్లజులు ఎన్ని గ్రంథములు వ్రాసిరో. ఆసేతు హిమాచలము అనాది కాలమునుండి విశాల భారత వర్షమున గల కవులకు పరిమితి యున్నదా ?

"ఒక్క కాలమున ఆర్యు లిట కెచటినుండియో అవతరించిరి" అను పాశ్చాత్యుల ఆత్మాభిమాన పూరితములగు వ్రాతలు ఆబాల్య మభ్యసించి అదియే నిజమని నమ్మి మనమును, "ఆర్యుల నివాస మే మధ్య ఆసియాలోనో, అక్కడ నుండి దిగుమతియై భారతదేశమున సింధు నదీ తీరమును ఆర్యా వృత్తమును ఆక్ర మించి క్రిందికి వ్యాపించి అతఃపూర్వమున్న ద్రావిడులను పారదోలి"రని వ్రాయుచున్నాము పాశ్చాత్యుల వ్రాతలు పచ్చ పోసినట్టు నిలిచిపోయినవి.

"ఆదిమ ప్రజ జీవిత మార్యులిటకు నరుగుదెంచి పరిస్థితు లన్వ యించు కొనుచు మెల మెల్లగాఁ గుదురుకొనెడి దాక నాదిమ పర్వమై దనరెనిందు. తాము దేవతలుగా ద్రావిడులు రాక్షస బలముగా నార్య కాహళులు మ్రోగె" అని "వికాస భారత మున" గొట్టిపాటి సుబ్బరాయలు వ్రాసిరన్న – పరుల వ్రాతలు దేశాభిమానము గలవారిని గూడ ఎంత కనుమూసినవో గమ నించుడు. సుబోధిని పత్రికయందు నవంబరు మాస సంచిక యందలి వ్యాసమును గమనించిన పై సిద్ధాంత విషయమున పాశ్చాత్యులే యెంత విభిన్న భావము గలవారో విశదమగును. ఆంధ్ర ద్రావిడ భేదములు మన దేశమునకు పట్టించిన చీడలు. వాటిని ఉత్తేజ పరచు వాక్యములు విస్మరణీయములు. అస్తు.

. అనాది కాలమునుండి ఎందరు కవులో ఎన్ని కావ్యములో రచించి రనుట ప్రస్తుతము.

"కతికవయః కతికృతయః కతిలుప్తాః కతిచరంతి కతిశిథిలాః!

అని, నీలకంఠ దీక్షితులు "మరియున్ని కావ్యములుండ నీ కావ్య మెందుకు వ్రాయ నుపక్రమించుట?" అని ప్రశ్న మూహించుకొని,

"తదపి ప్రవర్తయతి మాం శంకర పారమ్య సంకథాలోభః"

అని, స్వేష్ట దేవతయగు పరమ శివుని పారమ్య మందలి ప్రలో భమే తన కావ్యోపక్రమ హేతు వనుచున్నాడు.

శివుడా, విష్ణువా, శక్తియా పర దైవతమను సిద్ధాంత రాద్ధాంతములు మన కనవసరము. సాహితీ రసపిపాసువులకు అందలి చమత్కారమును గ్రహించి ఆనందించుట ప్రధాన విషయము.

ధ్వన్యాలోకమున నానందవర్ధనాచార్యులు :

"నహి వాచస్పతినాపి అక్షరాణి పదానివా కానిచి దపూర్వాణి ఘటయితుం శక్యన్తే. తానితాన్యేవ ఉపనిబద్ధాని కావ్యాదిషు న నవతాం విరుధ్యన్తి" అనుచున్నాడు. అందఱకు నొకే యక్షర ములే. ఒకేపదములే. కవి కవీ క్రొత్తఅక్షరములను క్రొత్త పదములను సృష్టింపడు. ఐనను ప్రతికవి కావ్యమునకూ వైలక్ష ణ్యము గోచరించుచునే యుండును. వస్తుభేద మందమా – ఒక్క రామాయణ వస్తువునే గ్రహించి యెంద రెన్నివిధములుగా రచించుట లేదు.

కాన యితివృత్త మొక్కటియైనను ప్రతికవికీ ఊహాపోహాలు భిన్నభిన్నములు. అంతియగాక ఒక్క భావమునే వెల్లడించు పద్ధతియందు వైవిధ్యము, పదములఁ గూర్చు కూర్పున ప్రత్యే కతయును అనపహార్యము. ఆ రచనావిలాస నానాత్వము వలననే ఎంద రెన్నికావ్యములు రచించినను పౌనరుక్త్యములేదు.

అందున నీలకంఠ దీక్షితుని ఘంటమునకు నొక ప్రత్యేకశక్తి. చెప్పదలచిన విషయమును ఋజువుగా నందరివలె చెప్పడు. సుపరిచిత భావములే అతని గ్రంథాదర్శమున వింతసొబగునఁ

దేజరిల్లుచుండును. వాని నన్నింటిని పాఠకలోకమునకు విశద మొనర్చుట అసాధ్యకార్యము. దిగ్దర్శినీ న్యాయముగ ఒండు రెండు ఉటంకించుటయే ప్రకృత వ్యాసోద్దేశ్యము.

"నీలకంఠస్య, వక్రోక్తిః సాముద్గేందు కలానిభా" అని విద్వద్వతంసు లొసంగిన ప్రస్తుతి. ప్రస్తుతిగాదు యాథార్థ్య కథనము. ఒక్కొక్కనికి యొక్కొకదానియందు సహజ వైదుష్యము. ఆనఁబొడిచినను దాని వారింప నసాధ్యము. "నహి కస్తూరికామోద శ్శపథేన నివార్యతే" అంటాడు పండితరాయలు. అటులనే నీలకంఠ దీక్షితుని వక్రోక్తి వారింప రానిది.

వక్రమైన ఉక్తి వక్రోక్తి. అష్టావక్రునివలె వికారమై జుగుప్సా వహముగాదిది. ప్రస్తుత పునఃపునరావర్తనీయము. చెప్పదలచిన దాని భంగ్యంతరముగ చెప్పుట ఒక వక్రత. విషయమును అసాధారణ విధమున వెల్లడించుట యొకవక్రత. మంగళ శ్లోకమునందే అతని వక్రత పొడగట్టుచున్నది.

కావ్యారంభమున మంగళశ్లోకము నిబంధించుట ప్రాచీ నాచారము. అదియు, "ఆశీర్నమస్క్రియావస్తు నిర్దేశోవాపి తన్ముఖం" అని, దీవనెయో స్వేష్టదేవతకు వందన సమర్పణమో మంగళమని భావించిరి. అదిలేని అస్త్యుత్తరస్యాం దిశిదేవతాత్మా" "నిపీయ యస్య క్షితిరక్షిణః కథాః" అని మంగళశ్లోక రహితముగా కావ్యమారంభించిన మహాకవులను కూడగట్టుకొనుటకు గాబోలు వస్తునిర్దేశము కూడ మంగళములోనే చేరినదిపొమ్మనిరి.

నమస్కార మంగళము చేయువారు స్వేష్టదేవతా వందనము ఋజుమార్గమున నాచరింతురు మన కవియో:

"వందే వాంఛిత లాభాయ; కర్మకిం తన్నకథ్యతే" స్వేష్ట సిద్ధికి నమస్కరించు చున్నాను అనుచున్నాడు. నీవు నమస్కరించుట యెవ్వరికి నయ్యా? అనిన చెప్పడట. ఇదియే అతని వక్రత విషయ మేమిటన్న — స్వేష్టదైవ మర్ధ నారీశ్వరుడు. భార్యాభర్త లేకశరీరులు. అందుచే ద్విత్వములేదు. ఏకత్వమే యేల చెప్పరాదు అనిన, దంపతి శబ్దమునకు ద్విత్వమేగాని ఏకత్వము లేదు. ఏకవచనము చెప్పిన శబ్ద శాస్త్ర విరోధము, ద్వివచనము చెప్పిన అర్థ విరోధము. ఏల నీ బెడద కర్మ రహితముగానే వాక్యము ముగించి, ఆయనిర్వాచ్య దంపతి శబ్ద ప్రతిపాద్యుని పఠితల హృదయ తలావగాహిగా నొనర్చుటలో నెంతటి వక్రత:

"కిం దంపతి మితి బ్రూయా ముతాహో దంపతీ ఇతి" అనుటలో నెంతటి వక్రత! అదియు నెంతరమ్యము!!

మిత్ర సమ్మితములైన పురాణముల కన్న కాంతా సమ్మిత కావ్యములయందు వర్ణనలకు నలంకార చమత్కారములకును ప్రాధాన్యము మెండు. అవి యష్టాదశ వర్ణనలు. అన్నింటిలో నగర వర్ణనము ముఖ్యము. ఏదున్నను లేకున్నను కథానాయకుని కాధారమగు నగర ముండక తప్పదు గదా! కావున తత్ప్రాధాన్యము గమనించి కాబోలు, "నగరార్ణవ శైలర్తు చంద్రార్కోదయ వర్ణనైః" అని నగరముతో ప్రారంభించినారు.

నగరమనిన, అగడ్త, కోటలు, వీథులు, చాతుర్వర్ణ్యము. వేశ్యలు పుష్పలావికలును, అందులో చేరినవియే. మన తెనుగు ప్రబంధముల యందు గ్రంథ ప్రారంభము నందే పట్టింపుగా నీ నగరము వర్ణించునట్లు సంస్కృత కావ్యముల యందు లేదని నైషధ భారవి కుమారసంభవ మేఘసందేశాదుల వలన తెలియుచున్నది. మేఘసందేశమున అడవులలో రామ గిర్యాశ్రమములలో నున్నవాని వర్ణనలో నగర ప్రసక్తి లేదు గాన వర్ణింప లేదు. ద్వితీయ సర్గ ప్రారంభమున పురవర్ణన గల దనవచ్చును. తెనుగువారికున్నట్టు లాదృష్టియే యుండిన, ద్వితీయ సర్గ ప్రారంభ మందలి అలకా వర్ణనమును — "కశ్చిత్కాంతావిరహగురుణా స్వాధికారాత్ప్రమత్తః" అన్నచోటే-అలకాపురినీ — అందలి యక్షుని — తదధికారమును — తత్ప్రమాదమును, వర్ణింపలేకపోయెనా? నైషధమున నలవర్ణనమునకు ముందు తత్పురీ వర్ణనమున కవకాశము లేకపోయెనా? కావున నా కవులకంత పట్టింపులేదు.

"వరణాద్వీపవతీ తటాంచలమునన్ వప్రస్థలీ చుంబితాం
బరమై సౌధసుధా ప్రభా ధవళిత ప్రాలేయ రుఙ్మండలీ
హరిణంబై యరుణాస్పదంబనగ నార్యావర్త దేశంబునన్
బురమొప్పున్ మహికంఠహార తరళ స్ఫూర్తిన్ విడంబించుచున్."

అను ఆంధ్రకవితా పితామహుని మనుచరిత్ర ఆంధ్రకవులకు మేల్బంతియై, అందరును తమ కావ్యముల నగరవర్ణన గావించిరి. సూరన కీ పద్ధతి వెగటై ప్రభావతీప్రద్యుమ్నమున కావ్యపాత్రలను ప్రవేశపెట్టి తన్ముఖమున ద్వారకను వర్ణించినాడు.

"అష్ట త్రింశదుపస్కృత సప్తశతాధిక చతుస్సహస్రేషు
కలివర్షేషు గతేషు గ్రథితఃకిల నీలకంఠ విజయోయం॥"

అని ఇతర కవులు చేయని స్వకాల నిర్దేశ మొనర్చి చారిత్రికుల వాద వివాదములకు అస్పదములేకుండ చేసినాడీ కవి. 4738 కలియుగాబ్దమనగా క్రీ. శ. 1637. అది తెనుగు ప్రబంధయుగము. దాని ప్రాబల్యము కొద్దిగొప్ప ప్రసరించి ఆ ఛాయ ననుసరించి నగరవర్ణన గావించినాడు.

అంతియగాక తెనుగు కావ్యముల పరిపాటియగు కుకవినింద సంస్కృత కావ్యముల మృగ్యము. ఈ కవియో:

యస్సంరంభః కృతి విరచనే దుష్కవీనామభేద్యః
యచ్చైకాగ్ర్యం తదుచిత పదాన్వేషణే చిత్తవృత్తేః
లభ్యంతచ్చేదపి కవయితా మంతతః త్రీణ్యహాని
స్యాదేవం కిం సరసకవితారాజ్య దుర్భిక్షయోగః"

అని అంటాడు. మనుచరిత్రయందు పెద్దన :

"భరమైతోచు కుటుంబరక్షణకుఁగాఁ బ్రాల్మాలి చింతన్ నిరం
తరతాళీదళ సంపుటప్రకర కాంతారంబునన్ దర్భపున్
తెరవాటుల్ దెగఁగొట్టి, తద్ఘనవిశిష్టజ్ఞాత చౌర్యక్రియా
విరసుండై కొఱతంబడన్ కుకవి పృథ్వీభృత్సమీప స్థలిన్"

అని కుకవిని పెద్దార్థచోరునిగా వర్ణింపఁగా, భట్టుమూర్తి :

"భావంబెక్కడ లేక, వృత్తనియమా పాయంబు చింతింప కెం
దే వర్తించి, పరార్థవంచనలచే దీపించి, మూర్ఖాళి నం
భావింపన్ గుకవి ప్రతీతకృతి సామాన్యాకృతిన్ బూని పై
పై వన్నెల్ పచరింప, దానిఁదిలకింపన్ బోరు ధీరోత్తముల్"

అని సత్కృతిని వేశ్యగా వర్ణించినాడు. ఇదియే ఇతరకవులకు మేల్బంతియైనది. ఆ వాసన నీలకంఠ దీక్షితులకు పట్టినది. ఇతని సమకాలికుడు, వేంకటాధ్వరి లక్ష్మీసహస్రమును సుకవి స్తుతియని వాల్మీకి వ్యాసులకు నమ అర్పించినాడు. కాని కుకవి నింద సేయలేదు. కాదనిన, —

"తత్తాదృగ్రచనా విదగ్ధ రసనా కండూతి సిద్ధాతయే
కేచిన్నీచవిచార గోచరగిరో గ్రథ్నంతు మిథ్యాకృతీః,
స్వంవాగ్భిర్హ్మ పురాణజిహ్మగ శిరః కంపావహం పావనీ
కర్తుం దేవి! వయం పునస్తవ కథారంభాయ జృంభామహే ॥"

అంటాడు. దీనికి మదీయాంధ్రాను వాదము, —

"బాలకిసోపమాన రస వక్రవితా రచనా విదగ్ధ మా
నాలుక తీట దీర కుహనా కృతులల్లగ నిమ్ము నీచ భూ
పాలురఁ గూర్చి కొందరఁ గృపామయి! నీస్తుతి సత్పురాణపు
జాలము లల్లలాడఁ గలుషంబు లడంగ రచింపఁ బూనితిన్"

అని. ఇంత మాత్రమున పూర్వార్ధమున కుకవినింద కలదన రాదు. బుభుక్షువులైన ఇతర కవులు ఇతర కృతులు రచించి నంత మాత్రమున వారు కుకవులు గారు. తానే యితః పూర్వము :

"మదాంధక్షోణీ పత్యపళద మనః ప్రీణన కృతే
నమస్కారం బ్రూమో భగవతి చమత్కార వచసే
విధాత్రీ మానందం విపుల మిహచాముత్రచ తవ
స్తుతిం ప్రస్తోత్యంహో భర నిరస నాయాద్య రసనా"

అని. ఇతర స్తుతులొనర్చి విసిగినట్లు వ్రాసినాడు. దీని మదను వాదము.

"చాలు మదాంధ దుర్ముఖ రసాతల నాథుల సంస్తవింప వా
గ్జాల చమత్కృతుల్ నవరస ప్రసరంబుల నమ్మొనర్చుటల్,
నాలుక తత్తరించుఁ గరుణా పరిణద్ధ మనోజ్ఞ మూర్తి ప
ద్మాలయ! నిన్ నుతించుట! కిహంబు పరంబును చూరగొంటకున్"

అని, కావున నితనియందు కనుపించని కుకవినింద నీలకంఠ దీక్షితుని కావ్యమున కనిపించెడిని. అదియును కుకవులకు సుకవులకును శిక్షా రూపమున నున్నది. కాకవులు కావ్య రచనకు

చేయు సంభ్రమము, అనుకూల పదములను పొదుగుటయందు వారికిగల యేకాగ్రత, సుకవులకు రెండు మూడు దినములైన యుండెనేని లోకమున సరస కావ్యములకు దారిద్ర్యము ముండ దనుచు, ఏకైకదినప్రబంధఘటనా సద్యశ్శ్లథగ్రంథిత్వనలుగాక నిలకడఁగల్గి కృతుల రచింప వలయునని బోధించుచు,

"సకల భువనైక మంగళ శంకర గుణ వర్ణన ప్రవృత్తేన!
స్మరణీయాః కుధియో లోకాయతికా ఇవ ప్రతస్థేన ॥"

అని, ప్రశస్థుడు, నాస్తికుడగు లోకాయతికుని స్మరింప రానట్లు ఈయవసరమున కుకవులు స్మరణీయులు గా రనుచున్నాడు.

ఇతని వర్ణనీయ నగరము అమరావతి. కవులైన వారు భూలోక నగరములనే అంతు పొంతు లేక వర్ణించుచుండ నిక నాకపురీ వర్ణన మెట్లుండ వలయును! ప్రబంధముల నగర వర్ణనలు విని వెగటుగల్గిన చెవులకును ఉల్లాసము గల్గించునది. అతిశయోక్తులకు లోక పురాణముల యందు పరిచిత మగు వస్తువులే ఊహా విశేషములతో రమణీయముగ చిత్రింపబడినవి.

సమస్త సురాసురస్తోమవందిత చరణారవిందుడగు మహేం ద్రుని స్థానము; అమృతాంధసుల కాస్థానము: ఆశ్చర్యముల కాయతనము. రత్నముల కాకరము: వైభవము కానంద ముల కవధి: వాచామగోచరమైనది యమరావతి. ఇది సర్వ సాధారణ వర్ణనమే. ఇటుపై నీతని వర్ణనావక్రతను గమనింపుడు.

అది నిరాలంబనమైన యాకసమున నున్నందున నెచ్చట నుండియేని చొరవచ్చును గాన, దానికి 'బునాదిరాయి' వేయఁ బనిలేదు. కావలి వారలనుంచ నవసరములేదు. గోపురముల గట్టు నావశ్యకత లేదు. అగడతలు ద్రవ్వ ప్రమేయము లేదు. ఆచారమున కని ఒక్కకోట గలదు." ఇది యతని పురీవర్ణనము.

"అచటి పౌరులు అమృతాస్వాదతృప్తులు. వారికి తిండి తీర్థములేల? వలసిన గుడ్డ గుడుసులు నగలు నాణెములు సర్వము కల్పవృక్షము లొసంగుచున్నవి. కావున వారికి కొనవలసినవి అమ్మవలసినవి యేవియులేవు. కాన విపణి వీధులతో పనియేమి? ఐనను నవిలేనిదే నగర మనరాదు గాన లాంఛన ప్రాయముగ విపణి వీథు లున్నవట."

"అచటి నగర వాసులు ఇది నాయిల్లు, ఇది నావిమానము, ఇవి నా నగలు వీరు నా భార్యలు అనికూడ మమకారము లేని వైరాగ్యధను" లట.

ఇది బాగనే యున్నది. కాని అందులకు కారణ మూహించు టలోనే ఇతని చమత్కారము.

"మేము అశ్వమేధ యాజులము, మే మగ్ని చయనులము, మేము మాసోపవాసులము, మేమమాంసభక్షకులము, మేము రాజసూయ యాజులము, మేము రణ దుర్మదులము,

మే మన్నదులము, మే మభయదులము, అని బిరుదావళుల నుద్ఘాటించుకొనుచు ముక్కు మొగము తెలియని భూలోకవాసులు ఇటునుండి, అటునుండి వచ్చిపడుచు, బలాత్కరించి విమానముల లాగుకొనుచుండ, మందిరంబుల నాక్రమించుచుండ, ఉంపుడు కత్తెల నీడ్చికొని పోవుచుండ, వైరాగ్యమూనక యేమి చేయగలరు?'' అనుచున్నాడు.

పశుజాతికి చేరి దేవతలు గానందున నమృతము లేక, దొరకనందున గడ్డియు లేక, గాలిమేసియు కోరికల పిండు నావులు, పరాక్రమ వంతములగు నేనుగులు, వాయు వేగములగు వాజులు గల్గి సకలపుర విలక్షణమైన పట్టణ'' మట.

“అచ్చటి పౌరులకు తినుట కమృతము, కట్టుటకు వస్త్రములు పెట్టుటకు సొమ్ములు అన్నియు కావలసినంత యున్నవి: కాని బ్రతుకు తెలివొక్కటి లే''దట. అతడు చెప్పు హేతువిది. ఈ లోకము యాగాది కర్మసాధ్యము. ఎవ్వడొనర్చిన కర్మకు తగిన ఫలితమును పడయగల లోకమును పొందియు వారు ఒక్కరికొక్కరు లొంగవలసిన యావశ్యకత యేమి? అట్లుండియు రాజొక్కడు భటుడొక్క డని వృధా ఆయాసపడుచున్నారట.

“అస్తి స్వాదయితుం సుధాస్తి వసితుం వాసో నభశ్చారిణాం
ధర్తుం సన్తి విభూషణాని శతశో న త్వస్తి ధీర్జీవితుం.
యే నాన్యా నుపజీవ్య సర్వవిభవే కర్మైక లభ్యే పదే
ప్యాయాస్యంతి వృథైవ సేవక ఇతి స్వామీతి దుర్మేధసః ॥”

అని ఇంకను కవి యుత్ప్రేక్షించిన వింత విషయములు :

ఆ లోకమునకు వచ్చినవారిలో పలుతపంబు లొనర్చి లోక వ్యవహారముల విస్మరించిన వారు చిరకాల బ్రహ్మచర్య జీర్ణులగుట కందర్పుని కకాలమృత్యువులు నగు బ్రహ్మర్షిహంతకులు అప్సరసలతో క్రీడింప నుపక్రమించి చేయు చెయిదములు యథామూలము చదివిన గాని ఆ చమత్కారమిట్టిదని చెప్ప సాధ్యముగానిది.

ఆ పట్టణమున దేవేంద్రు డెప్పుడేని యూరేగు నేని చేయు రోడ్డురిపేరీ — నేటి మన అధికార్లు టూరు వెళ్ళినప్పుడు కంట్రాక్టర్లుచేయు రిపేరీలకంటెను పసందైనది. ఖర్చుకందాయము లేనిది.

“ప్రసజతి మహోత్సవేవా ప్రచలతి రథ్యాసు తత్ర శక్రేవా!
నిమ్నాని పూరయంతే పవనమదేయే తాళవృంత పవనేన”
గుంతలు పడినచోట వీవనలతో గాలివింపి బాట సంస్కరింతురట.

అట్టియా యమరపురము త్రిమూర్తుల నగరముకంటె నుత్కృష్టమట.

“లభ్యన్తే శ్రుతిపాఠ పూత వదనా విప్రాః పదే వేధసః
వైకుంఠే తులసి వనాని సులభా న్యద్రావపి శుష్కాణిచ
ప్రేతా భూతగణాశ్చ సంతి శతశః స్థానే భవానీ పతేః
రత్నా న్యప్సరస స్సుధేతిచ పదే యస్యైవ లబ్ధుం క్షమం ॥”

వేదాధ్యయన జడులు బ్రహ్మనగరమునను, పచ్చివో ఎచ్చివో తులసీవనములు వైకుంఠమునను, భూతప్రేత సందోహము కైలాసమునను లభించ వచ్చునట. త్రాగుటకు నమృతము, ధరింపను రత్నములు, క్రీడింప నచ్చరలు నీ సురాలయముననే పొందవచ్చునట. ఇది ఇతని పురవర్ణనా వైదగ్ధ్యము.

ఇట్టి యమరపురీ నివాసులగు సురలు దుర్వాసుని శాపముచే రక్కసులతో యుద్ధమున నోడి దేవేంద్రునితో పాటు మందరగిరి కందరములనుండి వేయివర్షములు తపించిరట. అచ్చట వారి దీనావస్థను వర్ణించు నీతని రచనా విలాసమును పరికించుడు:

“దేవతలకు యజ్ఞహవిర్భాగమాహారము. ఆ హవిస్సులు వ్రేల్చఁబడిన యనుక్షణమే దానవులు దూతల నంపి హరించుకొని పోదురట. వారి నేమియు చేయఁజాలని వీరు, క్రతుకర్తలను అకాలమున యజ్ఞము సేయు డని, యజ్ఞము సేయకనైన ఆ హవిస్సుల రహస్సుల తమ కొసంగు డని, అర్థింతురట. ఐనను శాస్త్రైక శరణ్యులగు నా తాపసులు అందుల కనుమతింప కుంటచే నాకట నీ దేవతలు తపింతురట. తామే అగ్నియందు నాహుతుల వ్రేల్చి అత డొసంగినవి యాహారింతురట. మరికొందరు దేవలోక జిగమిషులను దరిసి, “మిమ్ము బొందితో సబాంధవము దివముఁ బొందింతుము. కాదేని సుర సుందరుల నిచ్చటకే పిలిపించి చూపింతుము.” అని ఆశపెట్టి పశుపక్షి పాయ సాపూపాద్యుపహారములఁ బొందుదురట

మరికొందరు కర్మ క్షయముచే స్వర్గము నుండి యవతరించు కర్మదేవతల చుట్టి ముట్టి, బిక్కిరి చూపుల దిక్కులు పరికించుచు నడుగు చున్నారట.

“దానవు లేమి చేయుచున్నారు? మమ్ము కథా ప్రసంగముల నేమనుకొను చున్నారు? వారిచేతలు పితామహునికి నచ్చుచున్నవియా? లేక ఇంకను నతని చెవి కెక్క లేదా? ఆ సుర జ్యోతిషకు లేమనుచున్నారు? శుక్రుడేమి చేయుచున్నాడు? వైజయంత మేమిగతి పట్టినది? నందనోద్యాన మెవ్వని యధీనమున నున్నది? ఐరావతమునకు మద మెక్కిన దని వింటిమి. ఉచ్చైశ్శ్రవస్సు వార్తలే వినిపించవు” అని.

కొందరు బ్రహ్మలోక యానోన్ముఖులగు మహర్షులను పరివేష్టించి వారికి వర దానములచే ప్రయాణశ్రమనుపశయించుచు, “మాదుర్గతులు బ్రహ్మకు విన్నవించుడు. మీ యాత్మ విచారమున మా సంగతి మరవకుడని'' అని పలుమరు హెచ్చరింతురట.

ఇది ఇతని భావ వక్రత. దేవతల దైన్యము వర్ణింపఁబడుచున్నను పఠితకు దేవతలపై జాలి గలుగుట లేదు. కవి వక్ర భావములతో శ్రుతిస్మృతి పద్ధతులనే యాధారముగా గొని రచించిన పరిహాసోపస్కృత రచనయే అందుకు కారణము. కాన చిత్తవృత్తికి మారు వికాస మొదవుచున్నది.

ఇతని శయ్యా విలాసమును పరికింప రెండు పద్యములుదాహరింతును. బృహస్పతి రక్కసులతో సంధికి పోవుటకు ముందు దేవతులతో మంత్రించు ఘట్టమున —

"గౌఃశ్వాః కరిణః శ్రియో మణి గణాః శస్త్రాణి వస్త్రాణి వా
యాని ప్రాభృత యేమ తాన్యపహృతాన్యా క్రమ్య తైరేవనః।
తద్రిక్తేన కరేణ రిక్త తరయా వాచాపి బాహం కథం
శక్తస్స్వాం దనుజేశ్వరా న్వశయితుం సంద్రష్టు మప్యంతతః॥

సంధి సమానులకు గదా! గుఱ్ఱము లేసుగులు అచ్చరలు మణులు శస్త్రములు వస్త్రములు అన్నింటిని వారే బలాత్కరించి హరించినారు. శూన్య హస్తములతో శుష్కోపచారములతో దానవుల నెట్లు వశీకరింపఁ గలము? ఏ కానుకలు లేక వారి మాడ నేగుటెట్లు?

ఇది బృహస్పతి వచనము. దేవతల దారిద్ర్యమునకు దగినట్లు ఓజోగుణ శూన్యమై అలతి యలతి తునియలతో సాగిపోవుచున్నది.

అదియు శబ్దాలంకార జుష్టమై శ్రుతిపేయమై యున్నది. దేవేంద్రుని గురుప్రశంసా పరమగు నీ పద్యమును గనుడు:

"నిస్సంఖ్య స్ఫుర దుత్తరోత్తర చమత్కారా సుధారాసుతే
వాచా మక్షరమక్షరం త్రిజగత్ పాల్లభ్య సర్వంకషం
శ్రోతుం లాలయితుం పునః ప్రతి సమాధాతుంచ వా కించిద
ప్యర్వాంచః క ఇమే వయం యది పరం దేవ స్స వాచాం నిధిః.

ఇందు ఇంద్రుని ముఖమున బృహస్పతినిగాక స్వకావ్యమును స్వరచనా విచ్ఛిత్తిని వర్ణించినట్లున్నది. తన కావ్యమున అసంఖ్యాకములైన చమత్కారములు పైపై వెల్లివిరియుచున్నవి. ప్రత్యక్షరమును సర్వజనప్రశంసాపాత్రము అనుచున్నాడు. ఇట్టి చమత్కారముల కాకరము గనుకనే, "నీలకంఠస్య వక్రోక్తిః సాముద్గేందు కలానిభా" అన్నారు. ఇట్టి కావ్యముల దుమ్ము దులిపి, తెరిచి, చదివి, ఆనందించు సరసులు కఱవగుచున్నారు.

తెనుగువారికీ యానందమును పంచిపెట్టుటకు అమలాపురము తెనుగుపండితులు శ్రీ రూపావతారము నారాయణ శర్మగారు తలకుమీరిన కరెక్షన్ పనిలోగూడ కొంత తీరిక గలిగించుకొని పై గ్రంథమును తెనిగించినారు. హైదరాబాదునందది ముద్రణ యగుచున్నది. త్వరలో వెలువడ వచ్చునని యాశించుచున్నాను. అందులోని వీ పద్యములు:

"కలదమృతమ్ము మెక్కుటకుఁ, గట్టను గప్ప మహార్హ వస్త్రముల్
కలవు, కొఱంత లేదు మణికాంచన భూషల ఖేచరాళికిన్.
తెలివి యదొక్కటే బ్రతుకుఁదీర్పఁగ లేదని తోచె నొండొరుల్
కలహము. "రాజురౌతు" సని కర్మఫలైక పదానఁబూనుటన్.

ముక్కున తర్జనిన్ నిలిపి, ముజ్జగముల్ గనుచుండ శుభ్రమై
యక్కటః యేమిఘోరమని యక్రిజపూని కరాగ్రమెత్త మా
కిక్కడ నిక్కడింత కమణింపుమునాఁ బ్రమథుల్ విషార్తులై
త్రొక్కిసలాడ చిన్ననవు దొన్కెడు శంభుడు మమ్ముఁగావుతన్.

ఒక్కడ యయ్యుఁనా గలిగియుండు విభూతులు రెండు, మూడుచోట్లిక్కలునయ్యె. వ్యూహముల నేలెడు నాలుగు, నాయుధంబు లింకొక్కటిఁ దాల్చుచుండు, మరియుండెడు నారు గుణంబు లంద్రు, నేనక్క మలాపతిన్ శరణమందితి నార్తశరణ్యు నీశ్వరున్."

మానవ జాతియొక్క మనస్సునకు సంబంధించిన యే విషయమును నీవు ప్రత్యేకముగా పరిశీలించుటకు పూనుకొనినను—భాష, మతము, పురాణగాథలు, తత్త్వశాస్త్రము, ధర్మశాస్త్రము, ఆచారములు, ప్రాచీన కళలు, ప్రాచీన విజ్ఞానము, అను వానిలో నే విషయమును నీవు పరిశీలింప జూచినను భారత దేశమునకే వెళ్లవలసి యుండును. ఎందువల్లననగా మానవజాతిచరిత్రలో మిక్కిలి విలువ గల్గినట్టియు, మిక్కిలి ప్రబోధక మైనట్టియు సామగ్రి భారత దేశములో మాత్రము నిక్షిప్తమై యున్నది.

— మాక్సుముల్లరు.

సంస్కృత కవుల వ్యాకరణ చమత్కారాలు

శ్రీనివాస సోదరులు

విజ్ఞానశాస్త్రవేత్తలు రంపంపొట్టులోంచి పంచదార చేస్తున్నారుట! గాజుకోంచి వస్త్రాలు నెయ్యటానికి నూలుతీస్తున్నారుట! ప్రాభవం కలవారు ఏపని చెయ్యలేరు గనుక? ఒకకవి అన్నాడు, "పాణిని గండాగొండితనం చూడండి. గంగను నది కాదంటాడు, యమునను నది కాదంటాడు. "స్థలీ" (భూమి)ని నది అంటాడు!" అని సంస్కృతవ్యాకరణంలో స్త్రీత్వబోధకాలైన ఈకార-ఊకారాంత శబ్దాలకి 'నదీ' అని సంజ్ఞ. "గంగా" "యమునా" శబ్దాలు ఈకారాంతాలుకావు గనక అవి నదీసంజ్ఞ కలవికావు. "స్థలీ" శబ్దం ఈకారాంతం గనుక నదీసంజ్ఞ కలదైంది. దీన్నే కవి పైవిధంగా చమత్కరించాడు. "అపారే కావ్యసంసారే కవిరేవ ప్రజాపతిః" అనిగదా అభియుక్తోక్తి! కవి దేనిమీద చెయ్యి వేస్తే అది బంగారమై పోతుంది. కాకపోతే అతను మనకు ఏడ్చేవాళ్లని చూపించి ఆనందమే ఎలా కలిగిస్తాడు? అతను బీభత్సం వర్ణిస్తున్నా మనకు చూసినకొద్దీ చూడాలనే అనిపిస్తుం దేమిటి?

చాలామంది నీరసమనుకునేదీ, బూచిని చూసినట్లు చూసేదీ వ్యాకరణశాస్త్రం. అలాంటిదానితో ఎన్నో చమత్కారాలు సృష్టించారు మహాకవులు! కొన్ని వినోదాలు ఈ వ్యాసంలో చూపిస్తాము.

1. "హతాః పాణినినావయమ్".

పాణిని "అసన్తో ద్వ్యచ్కః" (లింగా. 151) అనేసూత్రం చేత 'మనస్' శబ్దాన్ని నపుంసక లింగమని చెప్పాడు. దీన్ని ఒక కవి యిలా చమత్కరించాడు;

"నపుంసక మితి జ్ఞాత్వా
ప్రియాయై ప్రేషితం మనః
తత్తు తత్రైవ రమతే
హతాః పాణినినావయమ్!"

"పాణిని మనస్సును నపుంసకలింగమని చెప్పితే నమ్మి దాన్ని ప్రియురాలికోసం పంపించాను. అదేమో అక్కడే రమిస్తున్నది. చంపేశాడుగదా పాణిని!" అని నాయకుడనుకుంటున్నాడుట!

2. "విప్రతిషేధే పరం కార్యమ్." (పా. 1-4-2)

మొదట చెప్పినవిధీ, తరవాత చెప్పినవిధీ, రెండూ ఒకే శబ్దం విషయంలో తారసిల్లినప్పుడు మొదటి విధిని వొదిలిపెట్టి రెండో విధిని గ్రహించాలి అని ఈసూత్రానికర్థం. దీన్ని ఒక కవి యిలా చమత్కరించాడు.

"నిజపతి రాద్యః ప్రణయీ,
హరిర్ద్వితీయః, కరోమికిమ్ గోపి!"
"శృణుసఖి! పాణిని సూత్రం
విప్రతిషేధే పరం కార్యమ్."

రాధ తన చెలికత్తెతో అన్నది:

"నా భర్త మొదటినించీ నామీద ప్రణయం ఒలికించిననాడు. ఇప్పుడు కృష్ణుడొకడు నా జీవితంలో ప్రవేశించాడు. ఏమి చెయ్యనే?" అని. చెలికత్తె చెప్పిందిట: "ఏముందీ, యిటువంటి వాటన్నిటికీ శాస్త్రకారులు మనకు దారి చూపించే పోయారు. పాణిని సూత్రం వినలేదా 'విప్రతిషేధే పరం కార్యం' అని?" అంటే మొదటివాడైన భర్తను వొదిలేసి రెండోవాడైన కృష్ణుణ్ణే ఆశ్రయించమని సలహా చెప్పింది! పాణిని సూత్రం ఎంత బాగా వుపయోగించింది!

3. సఖి, పతి: అతిసఖి, ఉపపతి.

"శేషో ఘ్యసఖి" "పతిః సమాస ఏవ" (పా. 1-4-7,8) అనే రెండు పాణిని సూత్రాలున్నాయి. పతి, సఖి శబ్దాలు వ్యస్తంగా ప్రయోగించినప్పుడు ఒకేవిధమైన విభక్తి రూపాలు పొందుతాయి. అవి సమాసావయవాలైనప్పుడూ 'ఘి' సంజ్ఞ పొంది హరిశబ్దం మాదిరిగా ఒకే విధమైన రూపాలు పొందుతాయి అంటే "సఖి" "పతి" శబ్దాలు ఒకేవిధమైన రూపాలు పొందుతాయి. అలానే "అతిసఖి" "ఉపపతి" శబ్దాలు కూడా ఒకేవిధమైన విభక్తి రూపాలు పొందుతాయి. ఈ విషయాన్ని ఒక కవి యీ విధంగా చమత్కరించాడు:

"అయిసఖి! శస్తః సఖివత్
పతి రితికిం త్వం న జానాసి?"
"శస్తోఽతి సఖివ దుపపతి
రితి కథం త్వయాపి నా బోధి?"

పరపురుషాసక్తమైన నాయికను మందలిస్తూ ఒక చెలికత్తె యిలా అంది: "చెలీ! పతిని సఖివలె చూసుకోవలెనని పెద్ద లంటారు తెలియదా నీకు? ఉపపతిమీద మోజు మానుకో". ఆ నాయిక ఫెదేలున ఇలా జవాబిచ్చింది. "ఇదేమే? ఉపపతి అతి సఖివలె చూడవలసినవాడని ఆ పెద్దలే చెప్పింది నీ కెందుకు తెలియదే?" అని.

4. అథ శబ్దాను శాసనమ్. (పా 1.1-1)

ఈ సూత్రం చాలామంది భాష్యంలో మొదటివాక్య మను కున్నారు. కాని యిది పాణినీయానికి ఆద్యసూత్రమని అభిజ్ఞులు నిరూపించారు. దీన్ని సమస్యగా యిస్తే ఒకకవి యిలాపూరించాడు:

"గుర్వన్తికే హ్రియా పూర్వమ్
సంజ్ఞయార్థావ బోధనమ్;
కరోతి పత్యుర్యువతి
రథ శబ్దాను శాసనమ్".

"పెద్దలముందు సిగ్గుచేత భర్తకు ఆమె సంజ్ఞలతోనే అభిప్రాయాలు తెలిపింది. వారు చాటుకాగానే ఇంక మాటలతో అతన్ని శాసిస్తున్నది".

5. "అసిద్ధం బహిరంగ మంతరంగే". (పరిభాష. 50)

మనుష్యుడు లేవగానే ముందు తన శరీరానికి సంబంధించిన పనులు చూసుకొని తరువాత నేస్తులకూ యితరులకూ సంబంధించిన పనులు చూస్తాడు. ఇలానే అంతరంగవిధి ముందూ, బహిరంగవిధి తరువాతానూ అని మహా భాష్యకారుడు వివరించాడు. అంతరంగ విధిముందు బహిరంగవిధి పనిచెయ్య దన్న మాట. దీన్ని ఒకకవి యిలా చమత్కరించాడు.

"మన్మథాగ్ని పరితప్త మనస్కా
చన్దనేన కిముళి మ్పసి గాత్రమ్?
కిం నవేత్సి బహిరంగ విధానాత్
అన్తరఙ్గ విధిరేవ బలీయాన్?"

"మన్మథాగ్నిచేత లోపల తపించిపోతున్న ఓ బేలా! ఒంటిమీద చందనం పూసుకుంటున్నావు, ఏమిలాభం? బహిరంగ విధి కంటే అంతరంగ విధి బలీయమైన దని తెలియదా నీకు?"

6. తత్పురుషము — బహువ్రీహి — కర్మధారయము.

రామేశ్వర విగ్రహం ప్రతిష్ఠ అయినప్పుడు నారదుడికి రామేశ్వరపదాన్ని ఏ సమాసంగా చెప్పుకుంటే అర్థం కుదురుతుందీ అని సందేహం వచ్చింది. అతడు త్రిమూర్తుల దగ్గరకూ వెళ్ళి అడిగాడు. వాళ్ళు తలా వొకమాదిరి జవా బిచ్చారుట.

"షష్ఠీ తత్పురుషం రామో
బహువ్రీహిం మహేశ్వరః
రామేశ్వర పదే బ్రహ్మ
కర్మధారయ మబ్రవీత్".

రాముడు ఆపదం షష్ఠీతత్పురుష మన్నాడు. రామస్య ఈశ్వరః రామేశ్వరః — రాముడికి ఈశ్వరుడు (ప్రభువు) అని వివరించాడు. అంటే శివుడు తనకు ప్రభువని చెప్పాడన్నమాట. శివుడు అది బహువ్రీహి సమాస మన్నాడుట. రామం ఈశ్వరః యస్యసః రామేశ్వరః. రాముడు ప్రభువుగా కలవాడు అని భావం; అంటే రాముడు తనకు ప్రభువన్నాడన్నమాట. ఇంక బ్రహ్మదేవుడు అది కర్మధారయ సమాస మన్నాట్ట. రామ ఏవ ఈశ్వరః రామేశ్వరః. రాముడికీ ఈశ్వరుడికీ భేదం లేదని ఆయన భావం.

7. అన్ని సమాసాలూనూ.

ఇంకొక కవి సమాసాల పేర్లతో తన స్థితిని వర్ణించి రాజు మన్నన పొంది భూమి సంపాదించుకున్నాడు.

"ద్వన్ద్వో ద్విగురపి చాహం
మద్గేహే నిత్య మవ్యయీ భావః
తత్పురుష! కర్మధారయ
యేనాహం స్యామ్ బహువ్రీహిః."

"మేము భార్యాభర్తల మిద్దరం (ద్వన్ద్వః). పైగా మాకు రెండు గోవులున్నాయి (ద్విగుః). మా యింట్లో వ్యయమనేది లేదు. వ్యయించటానికేమైనా వుంటేగా మరి? (అవ్యయీభావః) కనక అయ్యా! (తత్పురుష). నేను బహుధాన్యం కలవాణ్ణి (బహువ్రీహిః) అయ్యేపని చెయ్యి. (కర్మధారయ)" "నాకు భూమి అనుగ్రహించవయ్యా మహారాజా!" అని భావం.

8. భూసత్తాయామ్. తను విస్తారే. (పాణి. ధాతుపా. 1-1; 8-1)

ఈ సూత్రాలతో ఒక కవి యిలా చక్కని శ్లోకం చెప్పాడు.

"భూ సత్తాయాం వినష్టాయాం
ధనధాన్యే గతే ఽపి చ
గతే చ తను విస్తారే
వద స్థైర్యే ఽత్రకా కథా?"

"పొలాలన్నీ అమ్మడు పోయినాయి. ధనధాన్యాలు చెల్లి పోయినాయి. చిక్కి శల్యమైనాను. ఇంకా స్థైర్యం ఎక్కడినించి వస్తుంది?"

9. సంధి — విగ్రహం — ఆఖ్యాతం.

ఒక మంత్రిశేఖరుడు రాజులను గురించి చెబుతూ వ్యాకరణ పరిభాష నెలా ఉపయోగించాడో చూపి యీ వ్యాసం ముగిస్తాము.

"మాస్మ సంధిం విజానన్తు
మాస్మ జానన్తు విగ్రహమ్
ఆఖ్యాతం యది శృణ్వన్తి
భూపాస్తే నైవ పణ్డితాః".

ఎవరితో సంధి చేసుకోవాలో, ఎప్పుడు చేసుకోవాలో, ఎలా చేసుకోవాలో తెలియకపోతే మానె. ఎవరికి ఎప్పుడు ఎలా విగ్రహం (మిత్రభేదం) పెట్టాలో తెలియకపోతేనూ మానె. చెప్పినమాటైనా (ఆఖ్యాతం) వింటే ఈ రాజులు నీతి శాస్త్ర పారంగతులైనట్టే." అని రాజులతో తనకున్న అనుభవాన్ని ఈ శ్లోకంలో కాచి వడపోశాడు ఆ మంత్రిశేఖరుడు.

"స్వౌజసా పూరితః సిన్ధుః
శబ్దసిన్ధు రిహ స్థితః
పతితవ్యో వివేకాఢ్యైః
మన్దైరపి పునః పునః." ఇతి శమ్.

హేమంత సంక్రాంతి

పైడిపాటి సుబ్బరామశాస్త్రి

★

దక్షిణాయన పాప దర్పణమ్మై కాల
పురుషుండు పూజలం బొందు ఋతువు
గోవు గోపాలక గోవర్ధనములుగా
గొబ్బిళ్ళఁ దీరిచి కొలుచు ఋతువు
తెలతెల్ల వాఱకే కలకంఠముల దాస
రులు భక్తిగానమ్ము సలుపు ఋతువు
ఉత్తమమ్మయనమ్ము నుత్తరాయణ పుణ్య
కాలమ్ముఁ దనలోనఁ గలుగు ఋతువు

మాసములలోనఁ గృష్ణుడే మాసమనుచు
భక్తతతి కొల్చు రట్టిది పావనమ్ము
మార్గశీర్షమ్ముఁ గలుగు హేమంత ఋతువు
చెలువ మొలికెను వృక్షముల్ చివురుఁదొడగి.

2

పలు సంతతిఁగన్న పరమ గేహినివోలె
తొలకాడె పండిన దోసతోట
బహుళమతిం బొందిన పసిబిడ్డ మేనునాఁ
బరిఢవిల్లెను ముద్దబంతిపూవు
పసపాడు చెలి ముఖభావ భంగిమవోలె
మవ్వమై నిలచె చేమంతిపూవు
రాగమ్ముచేత సరాగమ్ము లాడెడి
తొయ్యలి యయ్యె లొద్దుగ సుమమ్ము

సరసిజమ్ములు మంచుకై వెఱచి వెఱచి
లావులం దక్కిమఱి విరళమ్ము కాగ
ధరణిపై మేల్మిబంగారు పఱచి పఱచి
పండె నేలను వరిపైరు పండిపండి,

3

మహితోజ్జ్వలమ్మైన మణిగోపురము వోలె
ధగధగలాడి శాద్వలపు కొసల
తండ్రి మస్తమ్ముపైనఁ దనయుడట్టుల నిల్చి
గరుడవర్ధనపూవు శిరసు పైన
ఆచారరహితుని యైశ్వర్య మట్టులు
తుమ్మాకు కొన దూటి దుసికిలపడి
చిత్తనిరోధమ్ము జేసిన యోగినా
నీలోత్పలమ్ములో నిలుకడవడి

సాగు కోరిక ముత్తెంపు సరులు నగుచు
తెగిన యాశల నంతంతఁ ద్రెస్సిపోయి
వ్యాఖ్యలై నిల్చు జీవిత పథములందు
మంచుబిందులు ప్రబల హేమంతవేళ.

4

పడతు లంతట ప్రాని పసుపుఁ బూసిరి మేన
కస్తూరి దిద్దంగఁ గాంతు కలిగె
కాయమ్మునకుఁ గ్రొత్త కాంతిఁ గల్పింపగా
నభ్యంగనమ్మునం దాస పుట్టె
బలమైన యాహారభరము వహింపంగ
కుక్షి కొక్కింతగ కోర్కె పుట్టె
'లేయెండ మంచిదిలే' యనిపించె, వీ
చెడి శీతవాతమ్ము చీదరపడ

నల్లగలువలు వికసించె నుల్ల మలర
జక్కవల కూత లంతంత కెక్కువాయె
మునిసి మనిసికిఁ దగులగా మనసు కలిగె
సంతకంతకు హేమంత మతిశయింప.

5

చలిగొంత ముదిరి వెన్నెలరేల మంచులో
పనక్రింద దూరెను పాముపిల్ల
కుడుపలో మంచులోగునిసి పూచెట్టుపై
చెట్టుపల్ విదిలించె చిన్నిపిట్ట

పంటపొలాలకు నింటికి మంచు నే
ర్పడియెను సుఖమైన "బండ్లబాట"
తెలవారకయె లేచి నలిపెంపు వలువపై
సంతరించెను గేస్తు "కనగపులుసు"

గడ్డికడియమ్ములో సూరి కదలడాయె
రాశికావలి కై సట్టి రైతుబిడ్డ
మనిసి మనిసికిఁ దెలియరాచు మలచముగుచు
మాయగా నిల్లమించు, హేమంతవేళ.

6

గొబ్బిళ్లకోసనిల్చు కుడురు గుమ్మడిపూవు
వేయిపూవుల శోభ విలుచు కొనియె
మంచుమేతను మేసి మాహాయి పులకించి
ప్రముదాన 'నేనుగపాడి' బిదికె
పరిమోడు పిలకలో వదిలిన వృషభమ్ము
అంకెకున్ రాక వెన్ అంకెవేసె
పట్టిత్రవ్విన పచ్చిపసుపుదుంప బిరాన
నారవేసె తెల్ల పాతరవిధాన

రైతుకళ్లకు పంటకళ్లమ్ము మెఱసె
మురిసె నరుసమ్మునిండిన గటిసెఁజూచి
ఇచ్చె పేదకుఁ జేతికి నెమ్ము లేక
'మధురసంక్రాంతి' నాడు హేమంతవేళ

ఎంతవృద్ధిగాంచె నేనియు దనసొమ్ము
చేత లోభి సుఖముచెందలేడు
మండుటెండ మాడుచుండు త్రోవరి తన
యొడలనీడ దనువు నొందనట్లు

—గాథాసప్తశతి
(ప్రభాకరశాస్త్రిగారి అనువాదము)

బాపిరాజు కవితామాధురి

ఉదపా రామకృష్ణరావు

మన శిల్పకళాకౌశలం వికసించి వింత సొగసులు పోయిన ప్రసిద్ధ కళాక్షేత్రాలలో లేపాక్షి ఒకటి. లేపాక్షిలోని శిల్పకళా విశిష్టతకు పరమ నిదర్శనంగా ఊరిమొదట కనిపించే గంభీరమైన నందీశ్వర విగ్రహం - లేపాక్షి బసవయ్య - తెలుగునాట అంతటా సుప్రసిద్ధం. లేపాక్షి అనగానే తెలుగు శిల్పులు మలచిన ఆ నందీశ్వరుని మహోన్నతమూర్తి మన కళ్ళలో మెదులుతుంది. వెంటనే

"లేపాక్షి బసవయ్య! లేచి రావయ్య!
కైలాస శిఖరిలా కదలి రావయ్య!"

అని పిలిచే బాపిరాజుగారి మధురగీతం మనకు జ్ఞప్తికి వస్తుంది. శిల్పంలో, చిత్రలేఖనంలో తెలుగువారు వెలయించిన సౌందర్య మూర్తులను లోకానికి చాటి చెప్పిన కళాకేళి అడవి బాపిరాజుగారు. అందుకే ఆయన లేపాక్షి బసవయ్య ఠీవికి ముగ్ధుడై అంత ఆవేశంలో

"హుంకరించిన దెసలు ఊగిపోయేను
ఖురముతో దువ్వితే కులగిరులె వణికేను
ఆకాశగంగకై అర్రెత్తి చూస్తేను
పొంగేటి పాల్కడలి గంగడోలాడేను
నంది పర్వతజాత నవపినాకిని జలము
నీ స్నాన సంస్పర్శ నిలువునా పులకించె.
పెంగోలు భూమిలో పెనుగొండ సీమలో
నీవంశ మీనాడు నిలిచింది గర్వాన
లేపాక్షి బసవయ్య! లేచి రావయ్య!
కైలాస శిఖరిలా కదలి రావయ్య!"

అని ఆహ్వానించాడు. లేపాక్షి ఒక్క శిల్పానికే కాదు - చిత్రకళకు కూడా ప్రసిద్ధమే. అక్కడి శివాలయంలోని గోడలమీది వర్ణ చిత్రాలు విజయనగరయుగంలో విరిసిన మన చిత్ర రచనా నైపుణ్యానికి చక్కని నిదర్శనాలు. ఆధునిక కాలంలో తిరిగి మన చిత్రకళకు ప్రతిష్ఠ నార్జించి యువ చిత్రకారులకు దారి చూపిన మార్గదర్శి బాపిరాజుగారు అందుకే

"అతడు గీసిన గీత బొమ్మై,
అతడు పలికిన పలుకు పాటై,
అతని హృదయములోని మెత్తన
అర్ధ విక్కృతియై"
"ఎట్టి రెక్కలు తొడిగికొన్నట్టి మాట
యేని కలయంచు లందుకోనేని లేదు,
పాటయని పటమని యేదో వ్రాసి గీసి,
యెంత చల్లార్చుకొందువో యీ పిపాస"

అనీ, సమకాలీన మహాకవుల మన్ననలు పొందా డాయన.

బాపిరాజుగారు కవి, కథకుడు, చిత్రకారుడు, నవలా రచయిత, అధ్యాపకుడు, పత్రికా సంపాదకుడు, సినిమారంగంలో కళా దర్శకుడు - ఒక్కటేమిటి, బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆయన జననం 1895 లో, పశ్చిమ గోదావరి జిల్లాలోని భీమవరం స్వస్థలం. తండ్రి గారి ఉద్యోగాన్ని పురస్కరించుకుని బాపిరాజుగారి చిన్నతనం గోదావరి ఒడ్డున కొవ్వూరులో గడిచింది. ఇంగ్లీషు కవి వర్డ్స్‌వర్త్ తన బాల్యం మనోహర ప్రకృతి దృశ్యాల కాటపట్టైన లేక్ డిస్ట్రిక్ట్‌లో గడపడం తన భాగ్యమని, అక్కడి గుట్టలూ, చెట్లూ, వాగులూ, సరోవరాలూ ఆనాడే తన లేత మనస్సు నాకర్షించి వశం చేసుకున్నాయని చెప్పుకున్నాడు. బాపిరాజుగారుకూడా ఆ విధంగానే చిన్నతనంనుంచే గోదావరినీ, పాపికొండల్నీ, పట్టిసం పరిసరాల సుందర ప్రకృతినీ ప్రేమించడం నేర్చుకున్నాడు. ఆయన చిన్నప్పటి నుంచే కవీ, కథకుడూకూడా. రాజమహేంద్రవరం ఆర్ట్స్ కాలేజ్‌లో ఆస్వాల్డ్ కూల్డ్రే వంటి రసజ్ఞుని ఆశ్రయంలో బాపిరాజుగారి కళాభిరతి చక్కగా వికసించింది. అప్పుడే ఆయన మన శిల్ప చిత్రాల అపూర్వ కల్పనా చాతుర్యాన్ని గుర్తించాడు. మన గ్రామీణ జీవితంలోని సొగసులు, పల్లెపదాలలోని అందచందాలు చక్కగా అర్థం చేసుకున్నాడు. విద్యాగురువు ఆస్వాల్డ్ కూల్డ్రే ఆయన యువ హృదయంలో వెలుగుతున్న కళానురక్తిని మరింత ప్రజ్వలింప జేశాడు. ఆనాటినుంచీ ఆయన సౌందర్యలాలస గేయాలలో, చిత్రాలలో, కథలలో, కావ్యాలలో బహుముఖాల వెల్లడి కాసాగింది.

ఇంగ్లీష్ సాహిత్యంతో మనకు కలిగిన పరిచయానికి ఫలితంగా ఆ భాషలోని కాల్పనికోద్యమపు ప్రభావం మన కవులమీద ప్రసరించింది. సంస్కృత వృత్తాలతో కూడిన పూర్వ కావ్యాల పద్ధతిలో

రచనలు మందగించి, భావకవిత విజృంభించింది. దేశికవితకు ఆదరమూ, ప్రచారమూ హెచ్చాయి. బిచ్చగత్తె, గడ్డిపువ్వు, చంటిపాప, గంగిరెద్దు — అన్నీ కావ్యవస్తువు లయ్యాయి. భాషలో, భావనలో, కథనంలో, కవి సమయాలలో, అన్నిటా క్రొత్త బాట లేర్పడ్డాయి. బాపిరాజుగారి కవిత్వంలో ఎంతో వైవిధ్యం కనిపించే మాట నిజమే, కాని ముఖ్యంగా అది ఈ కాల్పనికోద్యమానికి చెందినదని చెప్పవచ్చు.

ఆ ఉద్యమ కాలంలో వెలసిన భావకవుల రచన లన్నిటిలోనూ కనిపించే ముఖ్య లక్షణాలు - ప్రకృతి సౌందర్య వర్ణన. శైశవ సౌకుమార్య చిత్రణ, గ్రామీణ జీవిత వర్ణన, ప్రణయోపాసన, దేశభక్తి ప్రబోధక కావ్య రచన మొదలైనవన్నీ బాపిరాజుగారి గేయాలలో ఎక్కడ చూసినా కనిపిస్తాయి. ఆయన కొన్ని వందల గీతాలు వ్రాశాడు. శృంగార వీరకరుణ హాస్యరసాలు వాటిలో అవిరళంగా వెల్లివిరిశాయి. అంతేకాదు, జంగంకథలూ, వచనగీతాలూ, వ్యంగ్యరచనలూ, అధివాస్తవిక కవిత్వమూకూడా ఆయన స్పృశించాడు. ఆయన పదాలు, పాటలు "తొలకరి", "గోధూళి", "శశికళ" అనే సంపుటాలుగా ప్రకటితమయ్యాయి. ఇంకా ప్రకటితం కాని గీతాలుకూడా చాలావున్నవి. ఆయన గీతాలలో ఇతివృత్తంలో భాషలో, భావనలో ఎంతోవైవిధ్యం కనిపిస్తుంది. ఒక రసార్ద్ర హృదయుడు తన సుందర సుఖస్వప్నాలను వాఙ్మయ ఫలకంమీద పదవర్ణాలతో చిత్రించడానికి చేసే ప్రయత్నం కనిపిస్తుంది.

ప్రకృతి సౌందర్యానికి పరవశంకావడం బాపిరాజుగారికి చిన్ననాటినుంచీ, సహజంగానే అలవడింది. ఆయనబాల్యం గోదావరీ తరంగాల చల్లదనంలో గడిచింది. తరువాత విద్యార్థిదశలో గురువు ఆస్వాల్డ్ కూల్డ్రే ఆయనను గోదావరిలో ఈదించడమే కాదు, పాపికొండలదగ్గర, పట్టిసం ప్రాంతంలో తొణికే ప్రకృతి సౌందర్యాన్ని తనివితీర ఆస్వాదింపజేశాడు. గోదావరితో బాపిరాజుగారి కేర్పడిన ఈ బాంధవ్యానికి ఫలితమే ఆయన రచించిన "వరదగోదావరి" అనే గేయం.

"ఉప్పొంగి పోయింది గోదావరీ ! తాను
తెప్పున్న ఎగసింది గోదావరీ !
కొండల్లొ ఉరికింది కోనల్లు నిండింది
ఆకాశగంగతో హస్తాలు కలిపింది
అడవి చెట్లన్నీను జడలలో తురిమింది
ఊళ్ళు దండలుగుచ్చి మెళ్ళోన తాల్చింది
సుడులలో వడులలో గర్వాల నడలలో
పరవళ్ళు త్రొక్కుతూ ప్రవహిస్తు వచ్చింది
శంఖాలు పూరించి కిన్నెరలు మీటించి
శంకరాభరణ రాగాలాపకంఠియై
నరమానవుని పసులు శిరమొగ్గి పణిరాయి
కరమెత్తి దీవించి కడలికే నడిచింది"

గోదావరినది వరదలు వచ్చినప్పుడు ఎలా ఉప్పొంగిపోతుందో చిత్రించిన ఈ గేయం తెనుగునాట అందరికీ పరిచితమే.

పల్లెప్రజల నిరాడంబర జీవితంలో తొణికే మాధుర్యాన్ని ధ్యేయకవిత పలు విధాల చిత్రించింది. బాపిరాజుగారి గీతాలలో కూడా ఇది కనిపిస్తుంది. కూల్డ్రేతోకలిసి ఆయన పాపికొండలు చూడటానికి వెళ్ళినప్పుడు అక్కడ ఒక పల్లెపడుచు తన భర్తను మన్యాలకు సాగనంపుతున్న దృశ్యం కనిపించింది ఆ ప్రాంతపు రైతులు తొలకరి జల్లులు పడగానే తమ పశువులను మేతకోసం చోడవరం, కూనవరం మొదలైన అటవీప్రాంతాలకు తోలుకు వెడతారు. ఆ విధంగా భర్త పశువులను తోలుకుని మన్యాలకు వెళ్ళబోతున్నాడు. జాలిగా చూస్తూ ఆ పల్లెపడుచు భర్తను సాగనంపుతున్నది. అప్పుడా పడుచు మనస్సులో చెలరేగే ఊహాలకు రూపమిస్తూ బాపిరాజుగారు మరువరాని ఒక మధురగీతం వ్రాశాడు.

"ఎల్లావుకు గడ్డిలేదు
నల్లావూ చిక్కినాది
దోరావూ బట్లావూ
తూలిపోయిన గొడ్లయ్యె
　　　మన్నెనికి పోయివస్తువా
　　　　　ఓ నా
　　　వన్నెల వీరన్నబావ !
శీతకట్టు తిరిగేదాకా
చేమంతులు పూసేదాకా
దూళ్ళన్నీ తోలుకుంటూ
కళ్ళాకి కనబడరావా !"

మన్యప్రాంతంలోని కొండవాగులలో, చీకటడువులలో బండరాళ్లు, పెద్దపులులూ, పెనుపాములూ తటస్థపడతాయి, జాగ్రత్త సుమా అని హెచ్చరిస్తుందా యిల్లాలు. అంతేకాదు :

"కోయబాపలు మంత్రకత్తెలు
కుక్కచేసి గూడెం పోదురు
మెళ్లోవేసిన తాయెత్తు
కళ్ళ కద్దుకుని దణ్ణంపెట్టు"

అని తన అమాయకత్వాన్ని, సహజభీతిని వెల్లడిస్తుంది. ఎడబాటు ఎటూ తప్పదు. ఐతే మనస్సులోమాత్రం తనను తలచుకుంటూ ఉండవలసిందని కోరుతుంది :

"నీకు నాకూ దూరమైతే
నీలికొండ లడ్డమైతే

ఇంటికాడ నీ సిన్నాదాన్ని
కంటికెదుర తలపావోయీ"

అని దీనంగా అడుగుతుంది. గోదావరిమీది గేయం, ఈ పల్లె పడుచు వీడ్కోలుపాట — ఈ రెండూ బాపిరాజుగారింకా రాజమహేంద్రవరం కళాశాల విద్యార్థిగా ఉన్నప్పుడే రచించిన గేయాలు. అప్పటికే ఆయన కవితాలత ఎలా విరిసి పరిమళించిందో గ్రహించడానికివి ప్రమాణాలు.

కవి భావాకాశంలో యథేచ్ఛగా ఎంత విహరించినా, ప్రపంచంతో సంబంధాన్నిమాత్రం త్రెంచుకోడు. వర్డ్స్‌వర్త్ వర్ణించిన స్కైలార్క్‌పక్షివలె విహాయసవీథిలో గానంచేస్తున్నా, నడుమ నడుమ దివినుంచి భువికి దిగివస్తూనేఉంటాడు. సమకాలీన సంఘస్థితి అతని కావ్యాలలో తప్పక ప్రతిఫలిస్తుంది. ఆనాటి ప్రజల ఆశలూ, ఆశయాలూ అతని కవితలో ప్రతిధ్వనిస్తాయి. బాపిరాజుగారి కవిత్వ రచనాకాలంలో మనదేశం పారతంత్ర్యంతో అణిగిపోయివుంది. అప్పుడే దేశంలో రాజకీయ చైతన్యం పొడచూపుతూవుంది. ప్రజలలో ఉదయించిన జాతీయాభిమానం, దేశభక్తి సాహిత్యక్షేత్రంలోకూడా చిగిర్చి మొగ్గ తొడిగాయి. చదువుకుంటున్న రోజులలోనే బాపిరాజుగారు స్వరాజ్యోద్యమపు తాకిడికి సంచలించాడు. 1922 లో ఆయన స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని ఒకసంవత్సరంపాటు జైలులో ఉన్నాడు. ఆయన ఎన్నో దేశభక్తిగీతాలు రచించాడు. వాటిలో గాంధీమహాత్ముని మీద వ్రాసిన గేయం తలమానిక మనవచ్చు.

"హిమాలయోత్తుంగ శృంగం
నీ బ్రతుకు
ఉమాపతి నృత్యరంగం
దేశాల వాంఛలు ఆశాహృదయములు
నేలాదిలి పోలేని శీతల తలాలలో
జీమూతపంక్తిపై వ్యోమవర్త్మము చొచ్చు
హిమాలయోత్తుంగ శృంగం
నీ బ్రతుకు
ఉమాపతి నృత్యరంగం"

అని ఆయన మహాత్ముణ్ణి సంబోధించాడా గీతంలో. తన ఆంధ్రాభిమానమంతా ఒలికిస్తూ.

"గజపతిదేశం రాయలసీమా
కళింగరాజ్యం కాకతిభూమీ
ఆంధ్రులందరూ ఒకటౌతారని
ఏకకంఠమున పాటనిండునని
మోగింపమ్మా జయజయఢంకా"

అని విశాలాంధ్రావతరణాన్ని ఆనాడే ఊహించుకుని మురిసిపోయాడు.

బాపిరాజుగారి కావ్య ప్రపంచంలో ప్రత్యేకంగా పేర్కొనవలసినవి ఆయన ప్రణయ గీతాలు. మొదటినుంచీ కవులకు శృంగారరసమంటే అభిమాన మెక్కువ. ఎన్నో జగత్ప్రసిద్ధ కావ్యాలకు ప్రణయం ఇతివృత్తమై భాసించింది. ఐతే కాల్పనికోద్యమ ఫలితంగా వెలసిన భావకవితలో ప్రణయం విశిష్టతను పొందింది. ఈ కవులు తమ రచనలలో అమలిన శృంగారాన్ని ఆరాధించారు. వీరి ప్రణయం ఒకవిధంగా వైష్ణవ సంప్రదాయంలోని ప్రేమభక్తి వంటిదని చెప్పవచ్చు. వీరి ప్రణయానికి ప్రేరణ కలిగించే ప్రేయసులు తరచుగా స్వాప్నిక జగత్తునకు చెందిన ఊహానాయికలు. బాపిరాజుగారుకూడా తన సాటి భావకవులవలె "శశికళ" అనే ఒక ఆరాధ్యదేవతను కల్పించుకుని, శశికళా పరంగా ఎన్నో రసవంతమైన ప్రణయ గీతాలను రచించాడు. తన ఆశయమూర్తి, ఆత్మపూజాపీఠస్థ శిల్పకళా లక్ష్మి అయిన శశికళను సూర్యసుతగా, చంద్రరేఖగా, గంధర్వబాలగా, యోగినిగా, దేశికగా - బహువిధాల చిత్రించుకుని, తన గాఢ ప్రణయాన్ని ప్రకటించుకున్నాడు.

"ఓ చెలీ నీ వెవరు ?
ఓ చెలీ నీ వెవరు ?
కలలోని పాపవా ?
కలలోని బాలవా ?
మధురమందానిల పరీమళమవో !
మధుమత్త శారదాత్మిక సుషమవో !
సుందరాప్సరసాంగనా కంఠ
కుందిలము మందారమాలవో ! ఓ చెలీ !"

అని ప్రశ్నిస్తా డొకప్పుడు.

"చంద్రలోకం తూర్పుదెసలో
సూర్యలోకం పశ్చిమంలో
చిన్నిలోకం ఒకటి ఉన్నాదే !
ఓనా వెన్నెల చిన్నారి పడుచా !
ఆలోకమేలే
కన్నెరాణివి నువ్వే నువ్వేనే !"

అని తానే సమాధానం చెప్పుకుంటాడు మరొకసారి.

బ్రతుకంతా నిరీక్షణము
మతి అంతయు వీక్షణమై
ఈనిశిలో గాటపు తమి
నేను వేచియుంటి నొంట
ఈ నిశిలో రొదలు లేవు
ఈ నిశిలో సొదలు రావు
వేచియుంటి ఎవరికొరకొ ?
కాచియుంటి ఏ ఘటనకొ ?"

అని చెప్పుకుంటా డొక గీతంలో.

మరొకమాటు ప్రసిద్ధ గ్రీక్ ప్రేమికుడైన ఎండిమియాన్‌తో తాదాత్మ్యం పొంది

"కొండ తిరిగి, కోన తిరిగి
కోనమధ్యను కొండవాగులు
బండరాళ్ళను పతనమయ్యే
పండువెన్నెల పరుగులెత్తే
లోయ చేరానే !
ఓ నా వెన్నెలదాలా !
సోయగాల లోయ చేరానే !"

అని పాడుకుంటాడు.

బాపిరాజుగారు కేవలం కవి మాత్రమే కాదు. సుప్రసిద్ధుడైన చిత్రకారుడుకూడా. చిత్రకారుడి మాటలలో ఏదైనా వర్ణిస్తే, ఆ వర్ణనలో ఒక విశిష్టత ఉంటుంది. వర్ణింపబడిన దృశ్యం స్పష్టంగా మన కళ్ళయెదుట సాక్షాత్కరిస్తుంది. రోజెటీ అనే ఆంగ్ల కవి చిత్రకారుడుకూడా కావటంచేత The Blessed Damozel అనే అతని కావ్యాన్ని "a painter's poem" అని విమర్శకులు ప్రశంసించారు. బాపిరాజుగారి వర్ణనలలోకూడా ఈ రమ్యత కనిపిస్తుంది. ఒకచోట పసిపాప నోటిని "కనరు మొగ్గల ఎరుపు కంపించు నోరు" అని ఆయన వర్ణించాడు. "అవతరణము" అనే గీతంలో తన ప్రణయాధి దేవత నిద్ర మేల్కొంటున్న సన్నివేశాన్ని ఆయన వర్ణించిన విధం కూడా ఇందుకు చక్కని ఉదాహరణం.

"నీలిమను పవళింపు
నిదురించు నీ సొంపు
తేలిపోయూ దిగెను
వేలతే వెలిగేను
తొంగలించే వయసు
నింగినంతా ఒలసె
బంగారు మంచాన
పవళించె నీ సొగసు
... ...
జన్మ జన్మల రాణి
రమ్మయుడనే జాణ
మేలుకొలుపులు నిన్ను
జాలిగా పిలిచెనట
అలనల్ల నాపించి
అరవిచ్చె నీ కనులు
దరిసినది నీ సొగసు
విరిసినది నా మనసు
విరుచుకొను నీ మేను
వికసించు కల్పకము
అత్రమై ఆశతో
చిత్రమై దరి నేను
వాలుచూపుల చూచి
మేలుకొనె నీ వలపు
తొలిప్రొద్దు కిరణమై,
చెంగలువ అరుణమై"

ఇలా ప్రేయసి నిద్ర మేలుకొంటున్న దృశ్యం ఎంతో స్పష్టంగా, సరసంగా చిత్రించాడు.

"వేలా సంవత్సరాల్ వెనకాల కవినోయ్ !
వేయి సంవత్సరాల్ వెడుతూనె కవినోయ్ !"

అన్నాడు బాపిరాజుగారు. నిజమే. కవికూడా మర్త్యుడే కనుక, కాలం తీరిన తరువాత అతడు కనుచాటవుతాడు, కాని కవిత్వానికి మరణ మెక్కడిది ? రొదలూ, సొదలూ లేని రాత్రివేళల ఏదో ఒక కంఠం ఎక్కడో

"పాడకే నారాణి పాడకే పాట
పాట మాధుర్యాల ప్రాణాలు మరిగెనే"

అనో,

"మరచిపోవబోకె బాల
మరచిపోవకే !" అనో,

"సంగీత మేలనే
పొంగేటి లయలేల
సంతోషమే లేని జన్మకిక
సంగీత మేలనే !" అనో,

సన్నగా, బరువుగా పాడుతూనే ఉంటుంది. అక్కడ బాపిరాజుగారి మధురాత్మ విహరిస్తూనే ఉంటుంది.

బహుమతి బాండ్లు

కేంద్ర ప్రభుత్వ ప్రైజ్ బాండు పథకం క్రింద తొలి మూడు నెలల 'డ్రా' లోను ఆంధ్రప్రదేశ్‌లో బహుమతులు వచ్చిన వారి వివరాల జాబితా దిగువ యివ్వబడినది.

వరుస సంఖ్య	పేరు, చిరునామా	బాండు నెంబరు	బహుమతి మొత్తం రూ.
1.	శ్రీ శివడాల కిష్టయ్య, వ్యాపారి, జడ్చర్ల, మహబూబ్‌నగరం జిల్లా	ఎ ఎ — 777370	500/—
2.	శ్రీ ఎస్. ఎమ్. స్వామి, మోటార్ [illegible] కంపెనీ, [illegible], ఆం.ప్ర.	ఎ ఇ — 953196	500/—
3.	శ్రీ మోటూరు వెంకటసుబ్బారావు, సబ్-పోస్టుమాస్టర్, విజయవాడ.	ఎ ఎ — 458552	50/—
4.	శ్రీ పరిగె సయ్యద్ మదర్సాబ్, రిటైర్డ్ పోస్టుమాన్, కదిరి, అనంతపురం జిల్లా	ఎ బి — 802575	50/-
5.	శ్రీ పురుషోత్తం శెట్టి, కేరాఫ్ జవేరి బ్రదర్స్, అబిడ్ రోడ్డు, హైదరాబాద్.	ఎ ఎ — 849640	100/—
6.	శ్రీ చిట్టమూరి మునికృష్ణారెడ్డి, పొటెన్‌గల్ పోస్టు, నెల్లూరు.	డి — 029308	500/—
7.	శ్రీ గ్రంధి రామకృష్ణారావు, కేరాఫ్ ఇమ్మిడిసెట్టి రామకృష్ణయ్య, సన్స్, అనకాపల్లి.	డి — 023959	500/—
8.	శ్రీ యూసఫ్ అలీ, కేరాఫ్ హైదాబిల్డింగ్, [illegible]ఆలం, హైదరాబాద్, ఆం. ప్ర.	ఎ ఎ — 854885	500/—
9.	శ్రీ కోట సత్యనారాయణగుప్త, కేరాఫ్ కోట నారసింహయ్య, బి. ఎ. జనరల్ మర్చెంట్, బార్ స్ట్రీట్, కదిరి.	ఎ సి — 085123	500/—
10.	శ్రీ దారరాజు, పేర్లవారివీధి, విజయనగరం.	ఎ ఎ — 825619	2,500/—
11.	శ్రీ ఎ. రమేష్, ఎమ్. ఎ. బి. ఇ. డి., స్కూల్ అసిస్టెంటు, గవర్నమెంటు, బేసిక్ ట్రైనింగ్ స్కూల్, హిందూపురం, అనంతపురం జిల్లా.	ఎ జె — 041578	100/—

హైదరాబాదులో బహుమతి బాండ్ల డ్రా

ద్వితీయ త్రైమాసిక బహుమతి బాండ్లు రు. 100లకు చెందిన జి వరుసకు, రూ. 5 లకు చెందిన ఎ—ఇ వరుసకు డిసెంబరు 1 న ఉదయం హైదరాబాదు జూబిలీ హాల్సులో డ్రా వేయబడింది.

అనివార్య కారణాల వల్ల ముఖ్యమంత్రి హాజరు కానందున, ఆర్థికమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి డ్రాను ప్రారంభించారు. క్లుప్తంగా బహుమతి బాండ్ల పథకాన్ని గురించి వివరిస్తూ జాతీయ పొదుపు ఉద్యమంలో భాగమైన ఈ పథకాన్ని విరివిగా ప్రచారం చేసేట్లు సమావేశమయిన వారంతా ప్రయత్నించాలని ఆయన ఉద్బోధించారు.

అంతకు ముందు డ్రా పర్యవేక్షక సంఘం అధ్యక్షుడైన గుంటూరు వాస్తవ్యుడు శ్రీ పి. దశరథ రామరెడ్డి, డ్రా వేసే పద్ధతి, బహుమతులు పొందే నంబర్లను నిర్ణయించేది ఎలాగు అన్న విషయాలను గురించి వివరించారు. పుర ప్రముఖులు, ప్రజలు అనేకమంది హాజరయ్యారు. రు. 100 ల వాటికి 40 బహుమతులు, రు. 5 ల వాటికి 278 బహుమతులు వుంటాయి.

రు. 100 ల జి వరుసలో రు. 25,000 ల ప్రథమ బహుమతి 012328 నంబరుకు, రు. 5 ల ఎ ఇ వరుసలో రు. 7500 ల ప్రథమ బహుమతి 548924 నంబరుకు వచ్చాయి.

తృతీయ ప్రణాళిక ఆశయాలు

"ఆర్థిక పరిపుష్టిలేనిదే ఏ దేశమైనా అభివృద్ధి పొందజాలదు. ఇక ఇండియావంటి వెనుకబడినదేశం సంగతి సరేసరి. ఆర్థిక సౌష్టవం చేకూరడానికి విదేశీ సహాయంపై ఆధారపడటమో లేదా లోటు బడ్జెటులను తయారుచేసుకోవడమో అవసరమవుతుంది. కొద్దిపాటి లోటుబడ్జెటులకు స్థైర్యం భయపడిపోయి ఏ మాత్రం త్యాగానికికూడా ముందుకు రాకపోయినట్లయితే ఇంకమనం ఎంత మాత్రం అభివృద్ధి పొందలేము. మనపరిస్థితి 'ఎక్కడున్నావే గొంగళీ అంటే వేసినచోటే' అన్నచందంగా పరిణమిస్తుంది. ఈ సంగతి అందరికీ తెలిసిందే. ద్రవ్యోల్బణం అంటే మనం భయపడకూడదు. అయితే ఆ పరిస్థితి ఎల్లకాలం కొనసాగి మనం ఇబ్బందులు పడకుండామాత్రం చూసుకోవాలి. పరిస్థితులు మన అదుపులో వున్నంతకాలమూ, ధరల పెరుగుదలను మనం అరికట్టకలిగినంతకాలమూ, ఋణగ్రస్త ఆర్థికవిధానాన్ని అనుసరించడంవల్ల మనకు ప్రమాదమేమీ వుండదని నా అభిప్రాయం", అని రాష్ట్రప్రణాళికా, సమాచారశాఖల మంత్రి శ్రీ పిడతల రంగారెడ్డి, ఆంధ్రప్రదేశ్ శాసనసభలో మూడవప్రణాళిక ముసాయిదాపై మూడురోజులపాటు జరిగిన చర్చకు సమాధానమిస్తూ 1960 డిశెంబరు 8 వ తేదీన అన్నారు.

బోధన్‌లో న్యూస్‌ప్రింటు ఫ్యాక్టరీ స్థాపనకు సంబంధించిన ప్రతిపాదన, విశాఖపట్నంలో మెరైన్ డీసెల్ ఇంజను ఫ్యాక్టరీ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదన, హైద్రాబాదులో భారీ విద్యుత్పరికరాల కర్మాగారం నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదన కేంద్రం ఆమోదం పొందలేదని శ్రీ రంగారెడ్డి తమ సమాధానంలో తెలియజేశారు. రాష్ట్రప్రభుత్వానికి ఈ పరిస్థితి తెలుసుననీ, ఈ విషయం కేంద్రప్రభుత్వంతో చర్చిస్తుందనీ, ప్రస్తుత పరిస్థితిలో తాను అంతకంటే నిర్దుష్టంగా ఏమీచెప్పలేననీ ఆయన అన్నారు. ఆంధ్రప్రదేశ్ పారిశ్రామికంగా వెనుకబడివున్న సంగతిని గమనించి కేంద్రప్రభుత్వం కనీసం మూడవ ప్రణాళికా కాలంలోనైనా రాష్ట్రంలో కొన్ని పరిశ్రమలు స్థాపించగలదని శ్రీ రంగారెడ్డి ఆశాభావం ప్రకటించారు.

ఎరువుల ఫ్యాక్టరీ :

ఎరువుల ఫ్యాక్టరీని కేంద్రరంగంలో చేర్చడానికి సంబంధించిన రిపోర్టును తాను చూశానని మంత్రి అన్నారు. భారతదేశ తృతీయప్రణాళిక ముసాయిదాలో మొదట్లో ఇలావుండని ఆయన వివరించారు. కొత్తగూడెంవద్ద ఎరువుల ఫ్యాక్టరీని రాష్ట్రప్రభుత్వ పథకంగా నెలకొల్పాలన్న దృష్టి ఉన్నప్పటికీ దానికి సంబంధించిన కేటాయింపు ప్రస్తుతానికి కేంద్రరంగంలోనే చేర్చబడిందని దీనిలో ఉన్నది.

ఈ ఫ్యాక్టరీ పెట్టుబడి ఖర్చును రాష్ట్రప్రణాళికా పెట్టుబడిలో చేర్చకుండా ఈ పథకాన్ని రాష్ట్రప్రణాళికలోనే ఉంచవచ్చునని పరిశ్రమల వర్కింగ్ గ్రూపు ఢిల్లీలో సూచించిందని మంత్రి అన్నారు. ఈ ఫ్యాక్టరీ విషయం చూడడానికి నియమింపబడిన ప్రత్యేకోద్యోగి, కేంద్రప్రభుత్వోద్యోగులతో సంభాషణలు జరిపే నిమిత్తం కొత్తఢిల్లీ వెళ్లాడనికూడా శ్రీ రంగారెడ్డి చెప్పారు.

రాష్ట్రంలో పరిశ్రమల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని చూస్తే ఈ ఫ్యాక్టరీ రాష్ట్రరంగంలో నిర్మించినా, కేంద్రరంగంలో నిర్మించినా లేదా ప్రయివేటు రంగంలో నిర్మించినా పెద్ద వ్యత్యాసముండదనీ, కేంద్రం కొంత ఆర్థిక సహాయానికి అంగీకరిస్తే రాష్ట్ర ప్రభుత్వం భారం కొంతవరకు తగ్గగలదని, కేంద్రంనుంచి ఫ్యాక్టరీకి రు. 12 కోట్లు లభించగలవన్న సూచనకూడా ఉన్నదని మంత్రి వెల్లడించారు.

తలసరి ఆదాయం :

రాష్ట్రప్రభుత్వం అంచనాల ప్రకారం, ఆంధ్రప్రదేశ్‌లో మొదటి ప్రణాళిక ప్రారంభంలో తలసరి సగటు ఆదాయం రు. 231 ఉన్నదనీ, మొదటి ప్రణాళికాంతానికి అది రు. 278 కి పెరిగిందనీ, రెండవ ప్రణాళికాంతానికి రు. 302 వరకు ఇది పెరగవచ్చునని శ్రీ రంగారెడ్డి చెప్పారు. వ్యవసాయం వల్ల లభించే ఆదాయం ఎప్పుడూ తక్కువే వుంటుందనీ, ఆంధ్రప్రదేశ్ ప్రధానంగా వ్యవసాయక రాష్ట్రం కాబట్టి ఇక్కడ ప్రభుత్వాదాయం లేదా తలసరి ఆదాయం ఎక్కువగా వుండడానికి వీలులేదన్న సంగతిని గమనించవలసిందిగా మంత్రి సభ్యులను కోరారు. ఈ విషయాన్ని సోదాహరణంగా విశదీకరిస్తూ ఆయన ఇలా అన్నారు :

ఉదాహరణకు బెంగాల్‌లో 1960–61 వ సంవత్సరంలో రు. 437 ల తలసరి ఆదాయంలో వ్యవసాయంవల్ల లభించింది రు. 133 అంటే నూటికి సుమారు 30 వంతులు మాత్రమే. అదే విధంగా మహారాష్ట్రంలో రు. 336 లలో వ్యవసాయంవల్ల లభించిన ఆదాయం రు. 111 లు అంటే నూటికి 33 వంతులు మాత్రమే. ఆంధ్రలో రు. 231 ల తలసరి ఆదాయంలో వ్యవసాయంనుంచి లభించింది రు. 231 లు. అంటే నూటికి సుమారు 49 వంతులు.

వ్యవసాయోత్పత్తులకంటే పారిశ్రామిక వస్తువుల విలువ ఎక్కువ కాబట్టి పరిశ్రమలు అధికంగా వున్న రాష్ట్రాల ఆదాయం హెచ్చుగా వుంటుందన్న విషయం సభ్యులకు తెలిసిందేనని ఆయన అన్నారు.

ఆంధ్రప్రదేశ్ స్థాయి, ఆర్థికపరిస్థితి, ఇక్కడికంటే తలసరి ఆదాయం రెట్టింపుగావున్న బెంగాల్‌లోకంటే చాలా అధ్వాన్న స్థితిలో వున్నాయనుకోవడం సమంజసంకాదు. ఈ వ్యత్యాసం, ఆంధ్రప్రదేశ్‌లో ప్రణాళికాబద్ధమైన అభివృద్ధికి కృషి జరుగవలసి వుందన్న విషయాన్ని వెల్లడిస్తున్నది. సందేహమేంలేదు. అంత మాత్రంచేత ఆందోళన చెందవలసిన అవసర మేమీ లేదని శ్రీ రంగారెడ్డి సభ్యులకు విన్నవించారు.

రాష్ట్ర ఆదాయాల అంచనాల విషయమై ప్రస్తావించి, అవి ఉజ్జాయింపు అంకెలు మాత్ర మేననీ జాతీయాదాయాన్ని లెక్కకట్టే పద్ధతికూడా పూర్తిగా శాస్త్రీయమైనది కాదని ఆయన అన్నారు.

తృతీయ ప్రణాళికాకాలంలో 94.68 లక్షల టన్నుల ఆహార ధాన్యాలను ఉత్పత్తిచేయడానికి పెట్టుకున్న లక్ష్యం ఏమంత పెద్దదికాదని ఆయనఅన్నారు.

పబ్బు పెట్టుబడులు :

1957–58 వ సంవత్సరంలో జాయింట్‌స్టాక్ కంపెనీల పెట్టుబడుల విలువ రు. 23 కోట్లనీ, రాష్ట్రం జనాభాదృష్ట్యా ఇక్కడ వుండవలసిన పెట్టుబడి విలువలో ఇది నాలుగోవంతు మాత్ర మేనని మంత్రి అన్నారు. చాలావరకు జాయింట్‌స్టాక్ కంపెనీలను, బొంబాయి, కలకత్తా, మద్రాసు వంటి నగరాలలోనే స్థాపించడం జరుగుతున్నది. దీనికి చారిత్రక, తదితర కారణాలు వున్నాయి. రాష్ట్ర ప్రయోజనం దృష్ట్యా. జాయింట్‌స్టాక్ కంపెనీలను నెలకొల్పగల ధనికులైన భూస్వాములు రాష్ట్రంలో కొందరున్నారు. అయితే సంప్రదాయరీత్యా వున్న కొన్ని అలవాట్లవల్ల వీరు ముందుకురాలేరు. కాని ఒకసారి ధైర్యంచేసి ముందుకు వచ్చినట్లయితే పరిస్థితులు చక్కబడతాయి. ఈ విషయంలో బయటి ప్రాంతాల పారిశ్రామికవేత్తలు కొందరు మనకు తప్పకుండా సహాయపడతారు. ఇలా ప్రోత్సాహం లభిస్తే, అభివృద్ధి చెందిన ఇతరరాష్ట్రాలస్థాయికి మనం చేరడం దుస్తరం కావచ్చుగాక, మన స్థాయిని మాత్రం అవశ్యం పెంపొందించుకొనగలుగుతామని ఆయన అన్నారు.

శ్రీశైలం ప్రాజెక్టు :

శ్రీ శైలం జలవిద్యుచ్ఛక్తి ప్రాజెక్టుకు రు. 54 కోట్లు ఖర్చు కాగలదని మొదట్లో అంచనావేసిన సంగతి నిజమేననీ, కాని తరువాత రు. 49 కోట్లకు మార్చబడిందనీ. ముసాయిదా ప్రణాళికలో ఇచ్చిన ఖర్చు రు. 35 కోట్లు మాత్ర మేననీ. ప్రసారలైనులకు ఖర్చుకాగల రు. 14 కోట్లను, పథకానికి అయ్యే ఖర్చులోనుంచి మినహాయించవలసిందిగా ప్రణాళికా సంఘం కోరినందువల్ల ఇలా చేయడమైనదని మంత్రి వెల్లడించారు.

దక్షిణభారత విద్యుచ్ఛక్తి సరఫరా సంస్థ :

దక్షిణభారత విద్యుచ్ఛక్తి సరఫరా సంస్థకు రాష్ట్రప్రభుత్వం రు. 4 కోట్లు ఇచ్చిందనీ, దీనివల్ల మన విద్యుచ్ఛక్తి సరఫరా యంత్రాలు పొరుగురాష్ట్రాల సరఫరా యంత్రాలతో కలిపివేయడానికి వీలుంటుందనీ, ఈ లైనులన్నీ మన రాష్ట్రంలోనే వేయబడినవనీ అవి ప్రధానంగా మన రాష్ట్రంలో విద్యుచ్ఛక్తి సరఫరాకొరకే ఉద్దేశింపబడినాయని, కాబట్టి కేవలం ఇతరరాష్ట్రాలకు విద్యుచ్ఛక్తి సరఫరాచేయడానికే రు. 4 కోట్లు ఖర్చుచేయబడిందనడం యదార్థంకాదనీ, దీనివల్ల ఆంధ్రప్రదేశ్‌కు మొట్టమొదట లాభం కలుగుతుందనీ, అంతరరాష్ట్ర సరఫరాలకు ఇది ఉపయోగపడటం కేవలం అయాచితంగా జరిగినదేనని శ్రీ రంగారెడ్డి తెలిపారు.

నాగార్జునసాగర్ :

నాగార్జునసాగర్ ప్రాజెక్టు మొదటిదశను తృతీయ ప్రణాళికా కాలంలోనే పూర్తిచేయాలనీ, అవసరమైతే వంశధార, పోచంపాడుప్రాజెక్టులకు చేసిన కొద్దిపాటి కేటాయింపులను దీనికి వినియోగించాలని ఒక సభ్యుడు చేసిన సూచనను ప్రస్తావించి, ఇది సాధ్యయోగ్యం కాదని మంత్రి అన్నారు. వంశధార, పోచంపాడు వంటి ప్రాజెక్టులను కనీసం మూడవ ప్రణాళికలోనైనా చేపట్టనిదే, అవి నాలుగవ ప్రణాళికలో పూర్తికావని సభ్యులకు తెలిసిందేనని అన్నారు.

ఒకే ప్రాజెక్టుకు అన్ని మొత్తాలను ఖర్చుచెయ్యడం సిద్ధాంత రీత్యా ఆచరణీయమే. అయితే దాన్ని ప్రత్యక్షంగా ఆచరించడంలోనే ఇబ్బందులు పొటమరిస్తాయి. నిర్మాణంలోవున్న ప్రాజెక్టులను త్వరితగతిని పూర్తిచేయడానికి రాష్ట్రప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని ప్రణాళికామంత్రి తెలిపారు. విత్తనాల క్షేత్రాలు, పరిశోధన పథకాలు మొదలైనవాటికి చేసిన కేటాయింపులను తగ్గించి, చిన్నరకం నీటివనరుల పథకాలకు కేటాయింపులను హెచ్చించాలని ఒకసభ్యుడు చేసిన సూచనను ప్రస్తావించి, చిన్నరకం నీటివనరులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నది నిజమే అయితే, అధికోత్పత్తికి మంచి మేలిరకం విత్తనాలు, ఎరువులు మొదలైన వాటి అవసరంకూడా వుంటుందన్న సంగతినికూడా సభ్యులు విస్మరించకూడదని మంత్రి అన్నారు.

ప్రాథమిక విద్య :

తెలంగాణా ప్రాంతంలో విద్యాసౌకర్యాలు తగినంతగా పెంపొందనందువల్ల రాష్ట్రంలో ప్రాథమిక పాఠశాలల విద్యార్థుల సంఖ్య ఎక్కువ పెరగలేదని శ్రీ రంగారెడ్డి వెల్లడించారు. ఇందుకొరకు ప్రణాళికలో చేసిన కేటాయింపు అన్ని అంశాలను, అవసరాలను పరిగణించిన మీదటనే జరిగిందన్నారు. ప్రాథమిక దశలో ప్రైవేటు విద్యను నిలుపు చెయ్యకూడదని ఒక సభ్యుడు చేసిన సూచనను మంత్రి తిరస్కరించారు. ప్రాథమిక విద్యకు ప్రణా

శికలో రు. 12 కోట్లు కేటాయింపబడినవనీ, 6-11 సంవత్సరాల మధ్య వయస్కులైన బాల, బాలికల కొరకు నిర్బంధోచిత విద్య ప్రవేశపెట్ట నుద్దేశింపబడింది కాబట్టి ఈ మొత్తం చాలునని మంత్రి అన్నారు.

డాక్టర్ల కొరత :

రాష్ట్రంలో సుశిక్షితులైన డాక్టర్ల కొరత వుందనీ అయినప్పటికీ ప్రభుత్వం కనీసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో డాక్టర్లను నియమించడానికి ప్రయత్నిస్తున్నదనీ, ఈ విషయంలో, రాష్ట్ర ప్రభుత్వం కృషి చాలావరకు ఫలించిందనీ డాక్టర్లులేని కేంద్రాలు ఇప్పుడు కొన్ని మాత్రమే వున్నాయని శ్రీ రంగారెడ్డి తెలిపారు. ఇప్పుడున్నట్లుగా బ్లాకుకి ఒకటి చొప్పున కాక 20,000 మంది జనాభాగల ప్రాంతానికి ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తెరవాలని చేసిన సూచన సుసాధ్యం కాదని మంత్రి అభిప్రాయపడ్డారు.

నీటి సరఫరా పథకాలకు చేసిన కేటాయింపులు తక్కువేననీ, మంజీరా, విశాఖపట్నం నీటి సరఫరా పథకాలకు ప్రణాళికలో చేసిన కేటాయింపుకూడా చాలదని మంత్రి అంగీకరించారు. అయితే ఈ రెండునగరాల స్థానిక సంస్థలు. ఈ పథకాలకు అయ్యే పూర్తి వ్యయాన్ని భరించడానికి ప్రజలనుంచి ఋణాలుపొందడానికై అనుమతించడానికి ప్రభుత్వం ఉద్దేశించిందని కూడా మంత్రి తెలిపారు.

సరిఅయిన పద్ధతిలో ప్రణాళికా విధానం కొనసాగటం లేదన్న విమర్శ సమంజసమైంది కాదని ఆయన అన్నారు. తృతీయ ప్రణాళిక, జాతీయ స్థాయిలోను, రాష్ట్ర స్థాయిలోను ఎన్నో విషయాలు సాకల్యంగా పరిశీలించిన మీదటనే సిద్ధం చేయబడిందనీ, ప్రతి పథకాన్నీ జాగ్రత్తగా పరిశీలించిన తరువాతనే అమలు పరచడం జరుగుతున్నదని ప్రణాళికా మంత్రి అన్నారు.

సభ్యులనుంచి వాటా ధనం వసూలు చేసిన తరువాతకూడా పంచదార ఫ్యాక్టరీ నిర్మాణంలో కొంచెం ఆలస్యం జరిగిందని మంత్రి అంగీకరించారు. దేశంలో తయారైన యంత్ర పరికరాలను మాత్రమే ఉపయోగించాలని భారత ప్రభుత్వం నిర్బంధపరిచిందనీ, దేశావసరాలకు సరిపోను యంత్ర పరికరాలను మన కంపెనీలు సరఫరా చేయలేక పోతున్నాయని ఆయన అన్నారు.

చిన్న చెరువులు, చిన్నతరహా ప్రాజెక్టుల పనులను చేపట్టకుండా భారీ ప్రాజెక్టులపై పెద్ద మొత్తాలను ఖర్చుచేయడం భావ్యం కాదని కొందరు సభ్యులుచేసిన విమర్శలను ప్రస్తావించి, ఆర్థికదృష్ట్యానూ, ప్రయోజనం దృష్ట్యాను లాభసాటివి అయిన చిన్నరకం నీటి వసరులను వీలైనంతవరకు అభివృద్ధి పరచడమే ప్రభుత్వ విధానమనీ, అయితే భారీప్రాజెక్టులు ఎక్కువ లాభసాటి అయిన చోట్లల్లా అవే చేపట్టబడతాయని అన్నారు. ఈ విషయంలో కచ్చితమైన నియమ నిబంధనలేవీ లేవనీ, చిన్నరకం నీటివసరుల అభివృద్ధి . ముఖ్యంగా గ్రామీణ సంస్థలకు సంబంధించినదని ఆయన అన్నారు.

లోటు బడ్జెటు:

ఉద్యోగ సిబ్బందిపై జరుగుతున్న ఖర్చు ఏటేటా పెరిగి పోతున్నదనీ, ఏ అభివృద్ధి పథకాన్నయినా అమలుపరచడానికి అయ్యే మొత్తం ఖర్చులో సిబ్బందిపై చేస్తున్న ఖర్చు నూటికి 60 వంతుల వరకు వుంటున్నదనడం యదార్థం కాదని మంత్రి ఖండించారు. ద్రవ్యోల్బణం, జీవితావసర వస్తువుల ధరల పెరుగుదల లోటు బడ్జెటుల మూలంగా ఏర్పడతాయనడాన్నికూడా ఆయన ఖండించారు.

అదనపు పన్నులు :

తృతీయ ప్రణాళికా కాలంలో పన్నులభారం తీవ్రంగా వుండవచ్చునేమోనని కొందరు సభ్యులు వెలిబుచ్చిన సందేహాలను ప్రస్తావించి, మూడవ ప్రణాళికలో 38 కోట్ల రూపాయలమేరకు మాత్రమే అదనపు పన్నులు వుండగలవనీ ఈ మొత్తంలోను ఇప్పుడు అమల్లోవున్న పన్నులలో సర్దుబాట్లవల్లనే రు. 23 కోట్ల వరకు లభించగలదనీ, పోతే కొత్త పన్నుల ద్వారా రు. 13 కోట్లు మాత్రం సేకరించవలసి వుందనీ, పన్నులవిధింపు ఏ విధంగా వుండాల్సిందీ మూడవ ప్రణాళికా కాలంలోనే నిర్ణయింపబడుతుందనీ, మనముందు వున్న బృహత్తర కార్యక్రమాన్ని దృష్టిలో పెట్టుకుంటే ఇదేమంత పెద్ద భారంగా వుండదని శ్రీ రంగారెడ్డి అన్నారు.

పన్నులద్వారా అదనంగా లభించే రు. 38 కోట్లు పోను ఇంకా రు. 15 కోట్లు భర్తీచేసుకోవలసి వస్తుంది. అదనపు పన్నుల అవసరం లేకుండానే రాష్ట్ర ఆర్థిక వనరులు అభివృద్ధి కాగలవని ఆశిస్తున్నానని ఆయన అన్నారు.

"రు. 305 కోట్లు ఖర్చుకాగల మన ప్రణాళికా వ్యయంలో సుమారు మూడింట రెండువంతులు అంటే రు. 200 కోట్లు భరించడానికి కేంద్రం అంగీకరించింది. ప్రణాళికకు కావల్సిన మిగతా పెట్టుబడిని సంపాదించడానికి రాష్ట్రప్రభుత్వం ప్రయత్నం చేయాల్సివుంది."

అయిదు ఎకరాల పైబడి భూములున్న వారందరిపై ఆదాయాన్ని అనుసరించి పన్ను విధించాలన్న సూచన సరైనది కాదన్నారు. రాష్ట్రంలో అయిదు ఎకరాలకంటే తక్కువ భూమి ఉన్నరైతులు నూటికి సుమారు 55 వంతులమంది వున్నారన్న సంగతిని సభ్యులు గుర్తించాలన్నారు.

తమ ప్రసంగాన్ని ముగిస్తూ మంత్రి ఇలా అన్నారు "మన రాష్ట్రం పారిశ్రామికంగా శీఘ్రగతిని అభివృద్ధిజెందడానికి వీలుగా తృతీయ ప్రణాళిక పెట్టుబడి మొత్తాన్ని హెచ్చించడానికి ఏ మాత్రం అవకాశం వున్నా మేము భారతప్రభుత్వాన్ని కోరుతామని సభ్యులకు హామీ ఇస్తున్నాను. ఐతే రాష్ట్రప్రజలు మాత్రం ఇక్కడ పరిశ్రమలు విరివిగా స్థాపించడానికి ముందుకు రావాలి". ★

ప్రగతి పథంలో

(జిల్లాలనుంచి అందిన, వివిధ అభివృద్ధి కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం ఇక్కడ పొందుపరచబడినది)

ఆదిలాబాదు

మంచినీటి బావులు

వచ్చే సంవత్సరంలో మంచినీటి బావులను నిర్మించడానికై జిల్లాపరిషత్తు బడ్జెటులో సుమారు రు. 5 లక్షలు కేటాయించబడినవి.

ప్రాథమిక ఆరోగ్యకేంద్రం

అదనంగా ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తెరవడానికి [illegible] గ్రామస్థులు రు. 25,000 ల విరాళం ఇచ్చారు. స్త్రీల వార్డు నిర్మాణానికి అయ్యే ఖర్చు భరించడానికి బ్లాకు ప్రజాభివృద్ధి సమితి మాజీ ఉపాధ్యక్షుడు శ్రీ ఎస్. వి. రాంరెడ్డి వాగ్దానం చేశాడు.

విద్యుచ్ఛక్తి సరఫరా

చెన్నూరు సమితి బ్లాకులోని భీమారం గ్రామానికి 1960 నవంబరు నెల చివరివారంలో విద్యుచ్ఛక్తి సరఫరా చేయబడింది. రామగుండం విద్యుచ్ఛక్తి కేంద్రం ద్వారా విద్యుచ్ఛక్తి సరఫరా జరిగిన మొట్టమొదటి గ్రామం ఈ బ్లాకులో ఇదే.

మంచినీటి బావులు

సిర్పూర్ పంచాయతీ సమితి బ్లాకులో 1960 వ సంవత్సరంలో 15 మంచినీటి బావులు నిర్మించబడినవి. మరో 8 బావులు మరమ్మతు చేయబడినవి.

అనంతపురం

పఠనాలయం

కుదేర్ పంచాయతీ సమితిలోని కదరకుంట గ్రామంలో 1960 నవంబరు నెలలో పఠనాలయం ఒకటి తెరువబడింది. దీనిలోనే ఒక రేడియోకూడా ఏర్పాటు చేయబడింది. దీని నిర్మాణానికి అయిన ఖర్చంతా గ్రామస్తులే భరించారు.

పశు ప్రదర్శనం

కదరకుంట గ్రామంలో 1960 నవంబరు 28 వ తేదీ నుంచి 30 వ తేదీవరకు పశు ప్రదర్శనం జరిగింది. ఉత్తమమైనవిగా ఎన్నిక చేయబడిన ఎద్దులకు, పొట్టేళ్లకు బహుమానాలు పంచిపెట్టబడినవి.

గుంటూరు

బహుమతి బాండుల పథకం

1960 డిసెంబరు మొదటివారంలో ప్రముఖులైన స్థానిక మహిళలు సమావేశమై, పెద్ద పెద్ద విద్యా సంస్థలకూ, ఫ్యాక్టరీలకూ, క్లబ్బులకూ, కార్యాలయాలకూ జట్లు జట్లుగా వెళ్లి బహుమతి బాండ్లు విక్రయించడానికి తీర్మానించారు.

మధ్యాహ్న భోజనం

సంతనాగులూరు బ్లాకులో మధ్యాహ్నం భోజనం పెట్టే పథకం అమలుపరచబడింది. మల్లాయిచెర్వు, పెదకొండ్రువారిపాలెం, కామేపల్లి, ఎల్లమంద, [illegible] అయిదు మధ్యాహ్న భోజన కేంద్రాలు తెరువబడినవి.

హైద్రాబాదు

శిక్షణ శిబిరం

చేవెళ్లలో 1960 నవంబరు 25 లగాయతు 27 వ తేదీవరకు జరిగిన గ్రామనాయకుల ప్రత్యేక శిక్షణ శిబిరంలో యాభై మంది శిక్షణ పొందారు.

బాలల దినోత్సవం

1960 నవంబరు 14వ తేదీన బాలల దినోత్సవం సందర్భంగా, వికారాబాదులో సుమారు 1000 మంది పిల్లలకు పాలు, ఆహారం పంచిపెట్టబడినవి.

కరీంనగరం

సంగీతనాటక గోష్ఠి

1960 సెప్టెంబరు నెలలో జరిగిన జిల్లా సంగీతనాటక గోష్ఠిలో పది ఉన్నత పాఠశాలలు, బహుళార్థ సాధక పాఠశాలలు పాల్గొన్నాయి. పెద్దపల్లి ఉన్నత పాఠశాలకు మొదటి బహుమతి లభించింది.

ఉపాధ్యాయినులకు ఇండ్లు

ఈ జిల్లాలో 1960-61వ సంవత్సరంలో దిగువ విధంగా, ఉపాధ్యాయినుల నిమిత్తమై 11 ఇండ్లు నిర్మించడానికి ప్రభుత్వం మంజూరీ ఇచ్చింది. (నిర్మల్-1, కరీంనగరం-2, భీమదేవరపల్లి-2, మంథని-3. హుస్నాబాద్-3).

ఖమ్మం

సంగీతనాటక గోష్ఠి

స్థానిక ఆంధ్ర బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు ప్రదర్శించిన "కనువిప్పు" అనే నాటిక, జిల్లా స్థాయి సంగీతనాటక గోష్ఠి అంతిమ పోటీలలో ఖమ్మం డివిజనుకు ప్రాతినిధ్యం వహించడానికై ఎన్నిక చేయబడింది. ఖమ్మం రెవెన్యూ డివిజనల్ ఆఫీసరు, జిల్లా విద్యాశాఖాధికారి, రాజ్యసభ సభ్యుడు శ్రీ కోట పున్నయ్య న్యాయమూర్తులుగా వ్యవహరించి, ఎనిమిది ఉన్నత పాఠశాలలకు వెళ్లి నాటికలను చూశారు.

కృష్ణా

ప్రాథమిక పాఠశాల భవనం

చింతలపాడులో ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణం 1960 నవంబరు రెండవ పక్షంలో ముగింపబడింది. నిర్మాణ వ్యయంలో సగం భాగాన్ని అంటే రు. 3,000 లను పంచాయతీ, ప్రజలు భరించారు.

మహబూబ్‌నగరం

ధన్వాడ సమితి

రాష్ట్ర ప్రణాళికా, సమాచారశాఖల మంత్రి 1960 నవంబరు 19 వ తేదీన ధన్వాడ పంచాయతీ సమితిని ప్రారంభించారు.

అప్రోచ్ రోడ్డు

పొన్నకల్ గ్రామంనుంచి అప్రోచ్ రోడ్డు నిర్మించడానికై జిల్లాపరిషత్తు 1960 నవంబరు 29 వ తేదీన రు. 5,360 లు మంజూరు చేసింది. గ్రామప్రణాళికా పథకం క్రింద వ్యయంలో సగం భాగాన్ని భరించడానికి స్థానిక ప్రజలు అంగీకరించారు.

నాటక పోటీలు

నాగర్‌కర్నూలులో 1960 డిశెంబరు 2 వ తేదీన జరిగిన ప్రాంతీయ సంగీతనాటక పోటీలలో అచ్చంపేట జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాలకు ప్రథమస్థానం లభించింది.

నల్గొండ

శ్రమదానం

పంచాయతీరాజ్య ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఆలేరు సమితి బ్లాకులో 52,000 మంది పురుషులు, 11,00 మంది స్త్రీలు, 600 మంది పిల్లలు శ్రమదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

మూసీ ప్రాజెక్టు

మూసీ ప్రాజెక్టుక్రింద పని చురుగ్గా కొనసాగుతున్న దనీ, ఈ సంవత్సరంలో ఈ ప్రాజెక్టుక్రింద 5869 ఎకరాల ఆయకట్టు అభివృద్ధి పరచబడిందని, 1960 నవంబరు 30 వ తేదీన జరిగిన జిల్లా నీటిపనరుల అభివృద్ధి బోర్డు సమావేశంలో జిల్లాకలెక్టరు తెలియజేశారు. వచ్చే సంవత్సరం 30,000 ఎకరాల ఆయకట్టును అభివృద్ధి పరచడానికి తలపెట్టబడిందని కూడా ఆయన వెల్లడించారు.

భూరివిరాళం

సూర్యాపేట కాపురస్థుడు శ్రీ ఉప్పల వెంకన్న, సూర్యాపేటలో ప్రసూతి, శిశుసంక్షేమ కేంద్రాన్ని నిర్మించడానికి రు. 20,000 ల విరాళం ఇచ్చారు. ఈ కేంద్రానికి ఆయన తల్లిగారైన శ్రీమతి కనకమ్మగారి పేరు పెట్టబడుతుంది.

జాతీయ గీతాలాపన

జాతీయ గీతాన్ని సక్రమ పద్ధతిలో పాడినందుకు, విద్యాశాఖ డైరెక్టరు నల్గొండలోని ప్రభుత్వ బహుళార్థ సాధక ఉన్నత పాఠశాలకు రాష్ట్ర (ప్రథమ) బహుమతిని బహూకరించారు. అనంతపురంలోని శారదా మునిసిపల్ బాలికల మాధ్యమిక పాఠశాలకు రెండవ బహుమతి లభించింది.

విశాఖపట్నం

గవర్నరు రాక

విశాఖపట్నంలో జిల్లా పరిషత్తు, మునిసిపల్ కౌన్సిలు సభ్యుల సమావేశంలో ప్రసంగిస్తూ, పరిపాలనా విషయాలలో దుబారాను నిర్మూలించవలసిన ఆవశ్యకత చాలా వున్నదని నొక్కి చెప్పారు.

వరంగల్

టేబుల్ టెన్నిస్ టోర్నమెంటు

కార్మికులలో సహకార, సుహృద్భావాలను పెంపొందించే నిమిత్తం వరంగల్ కార్మిక సంక్షేమ కేంద్రం 1960 నవంబరు 27 నుంచి 29 వరకు టేబుల్ టెన్నిస్ టోర్నమెంటు నిర్వహించింది. 62 మంది దీనిలో పాల్గొన్నారు

ప్రశ్నోత్తరావళి

ప్రశ్న : 137 టి. రామాచార్యులు, తెనాలి.

గుంటూరు సీమలో దగ్గుపాడు కాల్వపథకమును వెంటనే అమలు పరచుటకు ప్రతిబంధకము లేమైనా ఉన్నవా ? ఉన్న యెడల అవియేవి ? ప్రస్తుతము ఈ పథకం యేదశలో ఉన్నది?

సమాధానం : దగ్గుపాడు కాల్వపథకమును మూడవ పంచవర్ష ప్రణాళికలో అమలు జరుపుటకు ప్రయత్నములు జరుగుతున్నవి.

ప్రశ్న : 138 ఎం. చక్రపాణి, మంచిర్యాల, ఆదిలాబాదు జిల్లా.

మంచిర్యాల నుండి కడెం ప్రాజెక్టువరకు తారు రోడ్డు వేయుటకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము ఎంత మొత్తము కేటాయించినది ? పని ఎప్పుడు ప్రారంభించ బడుతుంది ?

మంచిర్యాల పట్టణములో సిమెంటు రోడ్డు కొరకు ప్రభుత్వం రూ. 50 వేలు ఇచ్చినట్లు విన్నాము. నిజమా అబద్ధమా ? పని ఎప్పుడు ప్రారంభింప బడుతుంది ?

సమాధానం : కడెంనుంచి మంచిర్యాల వరకు రోడ్డుపై తారు వేయడానికి ప్రభుత్వం రూ. 6 లక్షలు మంజూరు చేసింది. పని ప్రారంభింప బడుతున్నది. పని పూర్తి చేయడానికై అదనంగా రూ. 6.50 లక్షల గ్రాంటును కోరడమైనది.

మంచిర్యాల పట్టణంలో సిమెంటు రోడ్డునికి గ్రాంటేమీ కేటాయింప బడలేదు.

ప్రశ్న : 139 "ఒక పాఠకుడు", నర్సారావుపేట.

ఆంధ్ర ప్రాంతమునకు ఒక పశువైద్య కళాశాల ఏర్పాటు చేసెదరా ? తెలంగాణా ప్రాంతమునకు హైద్రాబాదులో, రాయలసీమ వారికి తిరుపతిలో పశువైద్యశాలలు ఉన్నవి. కాని ఆంధ్ర ప్రాంతము వారికి అవసరమైన పశువైద్య కళాశాలలను తృతీయ ప్రణాళికలో చేర్చినారా ? చేర్చిన యెడల ఆ కళాశాల ఎక్కడ స్థాపించెదరు ? బాపట్లలో మరల స్థాపించవలెనని ఆలోచనలో ఉన్నదా ?

సమాధానం : రాష్ట్రంలో మరో (మూడవ) పశువైద్య కళాశాలను తెరవ నవసరం లేదని భావింపబడింది. కాబట్టి తృతీయ ప్రణాళికా పథకాలలో, మూడవ పశువైద్య కళాశాల స్థాపనకు సంబంధించిన ప్రతిపాదన ఏమీలేదు. ★

పెద్ద దిక్కు

మధుశ్రీ

వెంకట్రావుది చాలా పెద్దకుటుంబం. అతని సంపాదన ఏ మూలకీ అందడంలేదు. ఆరుగురు కూతుళ్ళు. "జీతము గొర్రెతోక. పనిచేతకు గాడిదమోత" అన్న సామెత ఉండనే ఉంది. అదే అతని ఉద్యోగం. పెద్దకూతుళ్లిద్దరూ పెళ్లి ఈడుకు వచ్చినవాళ్ళు. సరిగ్గా చెప్పాలంటే తల్లితండ్రుల గుండెలమీద కుంపట్లు. తరువాతివాళ్లు అంతగా ఎదిగి కూర్చోలేదు. మామూలు గృహిణుల్లాగ అతనిభార్య సుబ్బలక్ష్మికూడా వెంకట్రావు చెవిలో ఇల్లుకట్టుకుని పోరుతూనేఉంది. "కనీసం కుముదానికైనా ఏదో సంబంధం చూడండీ" అని. వెంకట్రావుకి క్లాసులో పిల్లలూ ఇంట్లో పిల్లలూను. అతని కన్నీ సమస్యలే!

కుముదం, ముకుంద ఇద్దరూకూడా హైస్కూలు చదువులు ముగించారు. రెండేళ్లుగా ఇంట్లో ఖాళీగా కూర్చున్నారు. ముకుందకి అంతగా ఇంటిబాధ్యతలు తెలియవు. కాని కుముదం తల్లికి చేదోడువాదోడుగా ఉంటూ, ఆమెలేకపోతే ఇల్లు ఒకక్షణంకూడా గడపదేమోననే స్థితికి తీసికొనివచ్చింది.

అసలు కుముదం తరహాయే వేరు. తనకోసం తల్లీ తండ్రీ ఎంతగా కుళ్లిపోతున్నారో ఆమెకు అర్థమయింది. ఆమాత్రం విచక్షణాజ్ఞానాన్ని సముపార్జించుకుంది.

ముకుంద పద్ధతి అందుకు కేవలం విరుద్ధం. ఇంటిపనులేవీ తనకి పట్టనట్లు ఏవోపుస్తకాలు చదువుకుంటూ కూర్చుంటుంది. కుముదానికి ముకుందంటే ఇష్టం. తనకంటె చిన్నదేననే భావం చేతేకావచ్చు. తల్లి ఎప్పుడైనా ముకుందని కేకవేస్తే—

"అమ్మా నే ఉన్నానుకదా - నాకు చెప్పకూడదూ అదేవిటో? కుర్రపిల్లదాన్ని చదువుకోనియ్యవమ్మా" అంటుంది.

"ఊరుకోవే నీకేం తెలుసును. రేపొద్దున్న అత్తవారింటికెడితే ఏంజేస్తుందీ అంట!" అంటే.

"పోనీ అమ్మా - అప్పు డెలాగా చెయ్యాలి!" అని సద్ది చెబుతుంది.

కుముదం హృదయమే అలాంటిది! పొద్దునలేచింది మొదలు నిద్రపోయేవరకూ వంచిన నడుం ఎత్తకుండా ఏదో పనిచేస్తూనే ఉంటుంది. చంటిపిల్లలకు నీళ్లుపోస్తుంది. తలలు దువ్వి బట్టలు కట్టి బళ్లోకి పంపుతుంది. వాళ్ల కేవేం కావాలో తల్లికన్న తనకే ఎక్కువ తెలుసును. అంచే తనకేంకావలసినా "అక్కా నా కదియ్యవూ. ఇది ఇయ్యవూ" అనే అడుగుతుంటారు.

కుముదం వయసులో చిన్న అయినప్పటికీ మాటల్లో, మంచి తనంలో తలనెరసింది. సాధారణంగా పట్టుదల ఉన్నచోట తెలివితేటలూ, తెలివితేటలున్నచోట పట్టుదలా ఉండడం అరుదు. ఆ రెండూ ఈమెలో మూర్తీభవించాయి. కనుకనే స్కూల్ ఫైనల్ స్కూలుకల్లా ఫస్టుగా ఉత్తీర్ణురా లయింది.

ఆమె మనసులో ఒక్కటేబాధ - నిత్యం అనుక్షణం తనని వెంటాడుతూంటుంది. తండ్రికి 'రిటైర్‌మెంటు' దగ్గరపడుతూంది. ప్రస్తుతం అంత జీతం వస్తూంటేనే రోజులు గడ్డుగా గడుపుకోవడం అవుతోంది. అలాంటిది రేపు తండ్రి రిటైర్ అవుతే ఇంక తమ సంసారం గతేవిటి? గంపెడు పిల్లలు. ఒక్క చేతికంది వచ్చిన మగ సంతానంలేదు. అప్పుడు తమఇల్లు ఎలా గడుస్తుంది? ఉన్న రెండెకరాలమీది గింజలు ఏడాది పొడుగునా సరిపోవు. ఇలాంటి విషయా లెన్నో ఆమె ఆలోచిస్తుంది. ఎన్నో ఊహాలు పోతాయి ఆమె మనసులో. తనే మొగాడయి పుడితే తండ్రి కెంత సాయపడి ఉందునో కదా అనుకుంది. ఒక్కొక్కప్పుడు విచిత్రమైన ఆలోచనలెన్నో ఇలా అల్లుకుంటూ ఉంటుంది.

తనే చచ్చిపోతే!

అవును అది సులువే!

కాని హమ్మయ్యో - పిల్లలగతేంకాను. అక్కా అక్కా అని పలవించిపోరూ? బెంబేలుపడిపోరూ?

ఎందుకు చచ్చిందో అని ఊళ్లో రకరకాలుగా పుకార్లు లేవదీయరూ?

చిరునవ్వు నవ్వుకుంది - నారు పోసినవాడు నీరు పోయడా అని అనుకుని హోరుగాలికి దీపంపెట్టి ఊరుకోలేం కదా! ఏదోవిధంగా తండ్రికి సాయపడడం తన కనీస ధర్మంగా భావించుకుంటుంది. కాని అదెలాగ? ఏం చెయ్యగలదు తను? ఉద్యోగం. అదొక్కటే

కనిపిస్తోంది. డిగ్రీలు పట్టుకుని ఉద్యోగాల కోసం ఎంతమంది వేటాడడంలేదు? తను పాస్ అవుత స్కూల్ ఫైనలే కదా?

ఏవేవో ఆలోచనలు ఆమె మదిలో మెదులు తున్నాయి. వీధిలోకి వచ్చింది తండ్రిని భోజనానికి పిలుద్దామని. వెంకట్రావు స్తంభానికి జేరగిలబడి కూర్చుని ఎక్కడికో చూస్తున్నాడు. తండ్రి బాధేమిటో తనకి తెలుసును.

"నాన్నా కాళ్లుకడుక్కో వచ్చు...." అంది.

వెంకట్రావు తువ్వాలు దులిపి భుజంమీద వేసుకొని ఒక్క నిట్టూర్పు విడిచి లోపలకు నడిచాడు. అతని పరిస్థితిని చూసి ఆమె ఏమీ మాట్లాడలేక పోయింది.

చిట్టిచెల్లెలు హాయిగా కడుపారా పాలు తాగి కేరింతాలు కొడుతూ వసారాలో ఆడుకొంటున్నది. అబ్బ! ఆ పసిహృదయా లెంత ఆనందమయ మైనవి! పెద్దవాళ్ల బాధలు వాళ్లకేం అక్కరలేదు. అమ్మ ఒళ్లగా ఉంటే చాలు. ఆమె దానికేసి చూస్తూనే వంట ఇంటి వైపు నడిచింది.

రెండవ కూతురు ముకుంద ఇంటిగొడవ లేమీ అంతగా పట్టించుకోదు. చిలిపిపిల్ల. ఆ చిలిపితనం. ఆ కళ్లల్లోనున్నటి ఆనోగ కళ్లలో కనుపిస్తుంది. దోసగింజలాటి ముఖం అందంగా సున్నితంగా ఉంటుంది. సంపెంగ మొగ్గలాటి ముక్కు ఎగురవేస్తుంటే ఎంతో ఆకర్షణీయంగా ఉంటుంది. నిజం చెప్పాలంటే ఏ మొగాడూ ఆమె అందాన్ని కాదని తప్పించుకు తిరగలేడు. అలాగని చెప్పి కుముదం అందవిహీన కాదు. సంసారపక్షంగా ఉంటుంది. ఆ మంచిమనసే ఒక అందం కదా! ముకుందకి కుముదం ఎంత చెబితే అంత. మారు చెప్పదు.

విచక్షణాజ్ఞానం కలిగిన కుముదం ప్రతీ విషయాన్ని తీసుకొని తర్కించుకుంటూంది. తర్కవితర్కాలల్లో తనకెన్నో ఆలోచనలు తట్టుతాయి. ఒకనాడు ఒకస్థిర నిశ్చయానికి రాగలిగింది.

"అమ్మా నేనిలా వెళ్లిపోయేనని మీకు బాధగాఉండడం సహజమే. బాధ పడతారు. కాని నేనేమీ చెడిపోయి ఎక్కడికీ పోవడం లేదని మీరు గ్రహించగలిగితే ధన్యురాల్ని. నేను చెయ్యగలిగిన సాయమేదైనా ఉంటే అది చేసేస్థితిలోనే తిరిగివస్తాను."

సెలవు

కుముదం.

ఆ ఉత్తరం చదువుకున్న వెంకట్రావు నిలువునా నీరయిపోయాడు. చైతన్యం తప్పింది. తన పరువంతా సిబ్బెట కలిసిపోయిందని ఏడిచాడు. తను వీధిలో నలుగురికీ ఏముఖం పెట్టుకుని కనుపించ నని వాపోయేడు.

సుబ్బలక్ష్మి కూడా తల కట్టు కట్టుకుని వల వలా ఏడిచింది ఇల్లంతా బావురుమంది. ఎంతమంది ఉన్నా కుముదం లేని లోటు కొట్టొచ్చినట్లు కనుపిస్తూనేఉంది. ఇంటిల్లిపాది విషాద సాగరంలో కొట్టుకు పోతున్నారు. ఇల్లు నిద్రపోయి నట్లుంది.

అప్పుడే ఊళ్ళోకి పాకిపోయిం దీవార్త. గుసగుసలు రకరకాలుగా బయిలుదేరాయి పేట పేటంతాను. ఎవరికి తోచినట్లు రకరకాలుగా చిలువలూ పలువలూ పెట్టుకుని చెప్పుకుంటున్నారు.

వెంకట్రావు వీధివెంట వెడుతుంటే అందరూ తనను చూసి నవ్వుతున్నట్లు, పళ్లు ఇకిలిస్తున్నట్లూ అనుకుంటాడు. కృంగిపోయాడు. ఎన్నాళ్ళని బాధపడతాడు? తనకైదుగురే కూతుళ్ళనుకున్నాడు. తన కసలు కుముదం అనే కూతురు లేదను కున్నాడు. ఆమెకోసం ప్రయత్నించడం అవివేకం అనుకున్నాడు. ఒక్క ఏడుపు ఏడిచి మళ్ళీమామూలుగా తన విధి నిర్వహణలో లీనమైపోయేడు. ముకుంద బెంగెట్టుకు పోయింది! ప్రస్తుతం కొస్త సద్దు మణిగింది.

* * *

ఇల్లువిడిచింది కుముదం. తెల్లవారుఝామునే బస్ ఎక్కింది. బస్సు కదిలింది. ఎన్నెన్నో ఆలోచనలు పోతున్నాయి. తను తన ఆత్మీయులకూ ఇంటికీ దూరదూరంగా వెళ్ళిపోతున్నానని బాధపడింది. ఈసరికే ఊరంతా గొడవలూ, చెవులు కొరుక్కోవడాలూ బయలుదేరతాయి. తాయారమ్మ ఇంటింటికీ వెళ్లి చెబుతుంది, గోరంతలు కొండంతలుచేసి. తను తప్పుచేసిందా? ధైర్యం చేసిందా? అప్రయత్నంగా కన్నులు నీరు కారుస్తున్నాయి. లేతబుగ్గలు తడిసిపోయాయి. కన్నీరు తుడుచుకుంది. కారు హోరుపెట్టుకుంటూ పోతూంది. తనకున్నదల్లా చిన్న చేతిసంచీ నాలుగు చీరలూ అందులో స్కూలుఫైనల్ సర్టిఫికేటు. దానిమీదే తన ఆశంతా. తన జీవనాధారం అదే.

మనసులో వెయ్యిదేవుళ్లకు మొక్కుకుంది. తన ప్రయాణం సరిగ్గా సాగాలనీ, తనకోరికలు సరిగ్గా నెరవేరాలనీ, పట్నం చేరింది బస్సు. బస్సుదిగింది. నలువైపులా దృష్టి సారించింది సంచి చేత పట్టుకుని. ఇప్పుడెక్కడికి వెళ్లాలి? ఏంచెయ్యాలి? పట్నం దిశలే తెలియడంలేదు. ప్రతిమనిషీ మోసగాడంటారు. ఏమో? ఎంత వరకూ నిజమో? ఏదో ఒకవిధమయిన భయం ఆవహించింది. దగ్గర పదిరూపాయలనోటూ బస్సువాడిచ్చిన చిల్లర తప్పించి మరేమీలేదు.

''అమ్మా రిక్షా కట్టమంటారా?''

''వొద్దు'' అంది తలపుల తాపల్లోంచి తేరుకుని.

ఎక్కడకు వెళ్లాలి? అదేప్రశ్న. బయలుదేరింది ఒక గమ్యస్థానం లేకుండానే!

ఎండ అప్పుడే చుర్రు మంటోంది. గొంతు ఆరుకుపోయింది. ముఖమంతా జిడ్డుగా ఉన్నట్లుంది. వీథికుళాయిదగ్గరకెళ్ళి ముఖం

కడుక్కుంది. కడుపునిండా నీరు తాగింది. ఎంతో తేలిగ్గా,సుఖంగా ఉన్నట్లు అనుకుంది. ఈసారి చురుగ్గా అంగలు వేసింది. చేతిలో సంచీ దిగ లాగుతున్నా చకచక అడుగులు సాగించింది.

కొంతదూరం వెళ్లేసరికి వెలకం హోటల్ కనబడింది. కొందరు వెడుతున్నారు లోపలికి. కొందరు మూతులు తుడుచుకుంటూ వస్తున్నారు ఇవతలికి. ఆ హోటల్లో భోజనం చేద్దామనుకుంది. పెద్ద తరగతి హోటలు. తనదగ్గరున్న డబ్బు రెండు రోజులకైనా రాదేమో ననుకుంది. అసలే ఆడబ్బు జాగ్రత్తగా దాచుకుంది. ఇంటికి చూడ్డానికి వచ్చిన పిన్తల్లి ఒకసారి తనకి చేతిలోపెట్టింది. "కుముదం చీర కొనుక్కోవే!" అంటూ. ఆ డబ్బు నెలాగో దాచుకుంది. సమయాని కాడబ్బు అందివచ్చింది. కనీసం ఐదారు రోజులైనా ఈ డబ్బుతో గడుపుకోవాలి!

హోటల్ బోర్డ్ కేసి చూస్తూ అలాగే నిలబడిపోయింది. ఆమె వెనుకనుంచి ఎన్నో కార్లు దూసుకుంటూ వెళ్లిపోయాయి. పట్నం అంటే ఏమిటో ఊహించుకోగలిగింది. కేవలం డబ్బుమీద అక్కడి మనుషులు యంత్రాల్లాగా నడుస్తున్నా రనుకొంది. అక్కడ ప్రతిక్షణం డబ్బుతోటే పని.

ఆమెను చూసి ఎవళ్లో ఇద్దరు కాలేజీ విద్యార్థులు కాలర్లు సద్దుకున్నారు. కనుబొమ ఎగరేశారు. వాళ్ళను చూస్తే అసహ్యం వేసింది తనకి. ఏమిటి వీళ్ళ పద్ధతు లనుకొంది. పైకిమాత్ర మేమీ అనలేకపోయింది.

ఈపూట కక్కడే భోజనం చేద్దామనుకొంది. లోపలకు వెళ్లింది. అందరూ విచిత్రంగా తనకేసే చూస్తున్నారనుకొంది. భోజనం పూర్తయ్యేక సంచితో ఊరంతా తిరగడం కష్టమనుకొంది. సంచి ఎక్కడ పెట్టుకోవాలి! హోటల్ మేనేజర్ కి ఇద్దామనుకుంది. అతనిని అడిగింది. అతను సరేనన్నాడు. వీధిలోకివచ్చి ఇటూ అటూ చూసింది. తనకు తోచినదిక్కుగా నడకసాగించింది.

ఉద్యోగం సంపాదించాలి తను. ఉద్యోగం ఇమ్మని ఎవర్ని అడుగుతుంది? అయినా ఉద్యోగాలు ఖాళీగా ఎక్కడ కూర్చున్నాయి ఇవ్వడానికి? తాలూకా ఆఫీస్ ఎక్కడని వాకబుచేసుకొంటూ అక్కడికి వెళ్లింది. దాన్నిండా గుమస్తాలు ఎవరి పనుల్లో వాళ్లు నిమగ్నులై ఉన్నారు. నిలువెత్తు ఫైళ్ల గుట్టలు. ఇంకా ఇంకా బంట్రోతులు కాగితాలు పట్టుకువచ్చి పోగులు పెడుతున్నారు. హెడ్ క్లార్కు కాబోలు తన అధికారం చెలాయిస్తున్నాడు. గుమాస్తాల్లో చాలామంది ముసలివాళ్లే. అయినా పత్రతనపు ఉత్సాహం వాళ్లలో కనబడ్డంలేదు. నౌకరీ మాటలా? వాళ్లంతా ఊరికే యాంత్రికంగా రాసుకుపోతున్నారు. కుముదానికి వాళ్లనుచూస్తే కళ్లుతిరిగి పోయాయి. ఎవ్వడూ ఊపిరికూడా తీసికొంటున్నట్లు లేదు. తాలూకా కచేరీ వసారామీద లోపలికి చూస్తూ నిలుచుండిపోయింది. ఎవర్ని అడగాలో తెలియదు. బిళ్లబంట్రోతు మాత్రం పలకరించాడు.

"ఉద్యోగం,..."నాన్చేసింది.

"ఇక్కడ ఉద్యోగాలు తేరగా ఉన్నాయా?" అన్నాడు. దాంతో నిలువునా కృంగిపోయినట్లు అయిపోయింది, కుముదం.

అదే సమయంలో ఒక కుర్ర గుమస్తా ఇవతలికి వచ్చాడు చేతులు ఝాడించుకుంటూ. అతను తనకేసే చూస్తున్నాడు. తను ఎలాగా పలకరించడం అనుకుంటూంది.

"ఏం ఎవరికోసం?" అన్నాడు.

"ఉద్యోగం కావాలటండి" అన్నాడు ఇందాకటి బిళ్ళ బంట్రోతు.

చిరునవ్వు నవ్వాడు గుమస్తా, ఆమెముఖం చూస్తే కరిగిపోని వాళ్ళుండరు. రోడ్డుదుమ్ము కొట్టుకు పోయింది ముఖమంతా. జుట్టు రేగి ముఖంమీద పడుతోంది. జాలిచూపులు. దిక్కులేని తనం అంతా తనలోనే ఉన్నట్లుగా ఉంది. అతివినయంగా చేతిలో కాగితాలు పట్టుకుని నిలబడింది.

"మీపేరు?" అన్నాడు గుమాస్తా.

"కుముదం" అంది బుర్రవంచుకునే. అతనికి జవాబు చెబుతూంటే గుండెలు గుబగుబలాడి పోయాయి.

"ఏం చదివారు?" కేవలం తనే ఉద్యోగం ఇచ్చే వాడిలా ఇంటర్వ్యూ చెయ్యడం మొదలు పెట్టాడు.

"ఎస్. ఎస్. ఎల్. సి."

"ఇక్కడ ఉద్యోగాలేం ఉన్నాయమ్మా!" అని ఏదోజ్ఞాపకం తెచ్చుకుంటున్నట్లు ముఖం పెట్టాడు. తనని రెండు నెలలుగా తాసిల్దారుగారు తనకూతురుకి ప్రైవేటు చెప్పమని వేపుకుతింటున్నాడు. ఆప్రైవేటు ఈమెకి అప్పచెపితేనో అనుకున్నాడు.

"మీరు థర్డ్ఫారం పిల్లకి చదువు చెప్పగలరా?" అన్నాడు.

"చెప్పగలను!" అని బుర్ర వూపింది.

"క్రమంగా మరోరెండు ప్రైవేట్లు చూసుకుంటే అదే సరిపోతుంది" అన్నాడు.

ఈ ఆలోచన దాగానే కనబడింది. ఎంతో ఆప్యాయత కనబరిచాడనుకుంది. బహుశః తనలాగే బ్రతుకుబరువులు దాగా అర్థమైనవాడయి ఉండాలి. లేకపోతే అంత సానుభూతి వాక్యాలు అనునయవాక్యాలు పలకలేడు. దీనినిబట్టి పట్నంలో ఎంతచెడ్డవాళ్ళుంటారో అంతా మంచివాళ్ళుంటారనుకుంది. ఎంతో విలువయిన సలహాలిచ్చాడతను. తను ఆజన్మాంతం కృతజ్ఞురాలిగా ఉండాలతనికి అనుకుంది. పెద్ద వయసువాడు కాదు. అతన్నిగూర్చి తెలిసికోవాలనుకుంది. కాని తెగించి అడగడానికి సిద్ధపడలేకపోయింది.

"అయితే!..." అని నాన్చేసింది.

''ఊ అడగండి — సందేహిస్తారేం ?"

"అబ్బే అదికాదు ఆ ప్రైవేటు మాట!''

"అదా ? నాకు సాయంత్రం ఐదింటికి ఆఫీస్ అయిపోతుంది. అప్పుడు మనం వెడదాం...'' అన్నాడు.

సరేనంది.

నిట్టూర్చింది తనమీంచి ఎన్నో బస్తాలబరువు దిగిపోయినట్లుగ.

సాయంత్రంవరకూ అక్కడే కాలక్షేపం చేసింది.

అతన్ని పేరడగలేక పోయానే అనుకుంది.

ఆ క్షణకాలంలోనే అతనంటే ఒకవిధమైన పూజ్యభావం ఏర్పడింది. ఏ జన్మాంతర సుకృతంవల్లనో కాకపోతే తన కత నా సమయంలో అక్కడ తటస్థపడడు. కనబడినా తనకన్ని సలహాలు ఇవ్వాలనీ, సాయం చెయ్యాలనీ ఎక్కడ ఉంది ? దైవి కాలు అంటారు వీటినే కామోసు అనీ అనుకుంది. ఏమైనప్పటికీ తనకొక దారి కనబడుతోంది. ఆయన్నడిగి పేరు తెలిసికోవాలి అని నిశ్చయించుకుంది.

వసారామీద ఉన్న మేజాబల్లమీద కూచుని తన భవిష్యత్తుని గూర్చి ఎన్నో కలల్ని కంటుంది. ఎన్నో ఆశలరాగాన్ని పాడు కుంటూంది. మళ్లీ తను ఇంటినుండి వచ్చాననే సంగతి జ్ఞాపకానికి రాగానే బెలయిపోతూంది.

అయినా మళ్లీ ధైర్యం కూడగట్టుకుంటూంది. ఇంతట్లోకే అతను ఇవతలకి వచ్చాడు. ఒక్కొక్కగుమాస్తా నీరసంగా వాడిన ముఖాలతో చేతినిండా ఫైళ్లతో బరువుగా అడుగులు వేస్తున్నారు.

''వీళ్ల జీవితాలు నిత్యం ఇంతే కామోసు'' అనుకుంది. అతను ఎచ్చి "రండి'' అన్నాడు.

ఇద్దరూ కదిలారు.

రోడ్డుమీదకు వచ్చారు.

అత నేవేవో చెబుతున్నాడు.

కాని ఆమె అతన్నిగూర్చి అడగా లనుకుంటూంది.

కాని ఆ సమయం అతను ఇవ్వడం లేదు.

జీవితం అంటే ఏమిటో జీవితంతో ఎలాపోరాడాలో వివరిస్తున్నా డతను అతని సౌశీల్యానికి ఆమె 'ఓహో' అనుకుంది మనసులో.

తాసిల్దార్‌గా రింటికివెళ్లారు. ఆయన హాల్లో కూర్చునే ఉన్నారు. ఆయనతో పాటుగా కుముదం కూడా నమస్కరించింది ఆయనకు.

ఏం అన్నట్లుగా చూశాడు.

''అమ్మాయికి ప్రైవేటు చెప్పమన్నారు నన్ను....''

"ఔను...,"అన్నాడాయన. కూర్చోండి అని కుముదానికి కుర్చీ చూపిస్తూ. కుముదం కూర్చుంది.

ఇల్లంతా పరిశీలనగా చూస్తూంది.

"అందుకని ఈమెని తీసికొనివచ్చాను !'

నమస్కరించింది కుముదం వినయంగా.

"ఈమె... ?" అని ఎవరన్నట్లుగా చూశాడు.

"మా స్నేహితురాలు" అన్నాడు.

"ఏం చదువుకుంది ?"

"స్కూల్ ఫైనల్" అన్నాడు.

"సరే అయితే ముందర పదిహేనిస్తాను. తరువాత ఆమె శక్తిని బట్టి జీతం పెంచుతాను!" అన్నాడు తాసిల్దారుగారు.

కుముదం బుర్ర ఊపింది.

సరేనన్నా డతను.

"రేపటినుంచే రండి" అన్నాడాయన.

ఆయనవద్ద సెలవు తీసికొని కుముదం, గుమాస్తా ఇవతలికి వచ్చారు.

కుముదానికి ఇప్పుడు ఒకటే సమస్య.

తనెక్కడ ఉండడం?

హోటల్లో అయితే డబ్బు చాలదు.

ఇలా ఆలోచించుకుంటూండగానే "మీ రెక్కడ ఉంటున్నారు?" అని అడిగా డతను.

"హోటల్లో సంచీ పెట్టుకుని వచ్చాను - గది చూసుకోవాలి!" అంది.

''ఇవేళకి హోటల్లోనే ఉంటారా?"

''అదే అనుకుంటున్నాను." అంది.

ఇద్దరూ నడుస్తూండగానే ఒక ఇంటి వీధి గదికిటికీకి 'టులెట్' అనే బోర్డు కట్టబడింది.

''ఈగది అద్దె కిస్తారా?'' అని అంది.

"కనుక్కుందాం ఉండండి'' అని అతను మెట్లెక్కి ఇంటా యన్ని కనుక్కున్నాడు. ఆయనవచ్చి గదితలుపులు తీసి చూపాడు. గదిచిన్నది. ఉన్నంతలో శుభ్రంగా ఉంది. అద్దె ఆరు రూపాయలు.

వెంటనే ఆగదిని మాటాడకుండా తీసికొంది కుముదం. రెండు రూపాయలు అడ్వాన్సుకూడా ఇచ్చింది. ఇదొక సమస్య తీరినట్లు తేలిగ్గా నిట్టూర్చింది.

"మీపేరు." అని అడిగింది గుమాస్తాని.

''శంకర్రావు''

"ఎక్కడ ఉంటున్నార" ని అడిగింది.

ప్రక్క వీధిలోనే గది తీసికొని ఉంటున్నానని చెప్పాడు.

"మీ ఉపకారాన్ని జీవితంలో మరచి పోలేను..."

"ఆ అదెంత లెండి..." అని సెలవు తీసుకొన్నాడు.

ఆమె నమస్కరించింది.

*　*　*

అతను వెళ్ళేదిక్కుగా చూస్తూ నిలబడి పోయింది. అతని ప్రవర్తనని తల్చుకుంది. ఇల్లాంటి గొడుగు లాంటి మనుషు లుంటారని తను కలలోకూడా అనుకోలేదు. ఒంటరిగా ఉన్న స్త్రీని అని గాని చనువుతీసి కొంటున్నాడా? అబ్బె కాదు కాదు...

తనకిలాంటి సహాయం చెయ్యడంలో అతని అంతర్యమేమిటి? అతని కేమైనా ఊహాలున్నాయా? అనుకుంటూనే హోటల్‌కి బయలుదేరింది సంచి తెచ్చుకునేందుకు.

యాదృచ్ఛికంగా జరిగిన ఈ సంఘటనలు తల్చుకుంటే తనకే ఆశ్చర్యంగా ఉంది. శంకరరావు గదిలో ఉంటున్నానని చెప్పాడు. అంటే?

పెళ్లి కాలేదేమో!

మనిషి జీవితభారాలు మోస్తున్నట్లు కనబడ్డంలేదు.

ఓ చిన్నా చింతా ఉన్న మనిషిలా లేడు.

ఒకవిధమైన ప్రశాంతతే తాండవిస్తుంది అతని ముఖంలో!

మాటల్లో కల్మషం ఎక్కడా కనబడదు.

ఇలాగే ఏవేవో శంకరరావుని గూర్చి ఆలోచించుకుంటూ హోటల్‌లో పెట్టిన సంచి తీసికొని తనగదికి చేరింది. గదికి వచ్చింది కాని తనదగ్గరేం ఉన్నాయి వంటచేసికొందుకు? మళ్ళీ అదొకసమస్య ఎదురైంది.

డబ్బుకూడా తనదగ్గర ఏమైనా కొనడానికి సరిపోయేదిలేదు. గదిలోకెళ్ళి ఒకమూలగా కూర్చుండిపోయింది. ఏంచెయ్యడానికీ తోచడంలేదు.

తన సంసారంఅంతా ఆ చేతిసంచియే.

అనాలోచనగా కూర్చుండిపోయిన తనదగ్గరికి ఇంటాయన వచ్చాడు

"ఏం చదువుకున్నావమ్మాయి?" అని అడిగాడు.

చెప్పింది.

ఏవూ రన్నాడు.

జవాబిచ్చింది.

ఏవేవో వివరాలన్నీ అడిగాడు.

అన్నింటికీ సమాధానా లిచ్చింది.

ఆయన జాలి ప్రకటించాడు.

ఆమె ధైర్యానికి మెచ్చుకున్నాడు.

"నీలాంటివాళ్లు ఇంటికొకళ్లుంటే చాలమ్మాయ్" అన్నాడు కళ్ళజోడు పైచెంగుతో తుడుచుకుంటూ. ఏభయ్యేళ్లు పైబడ్డప్పటికీ ఆయన విశాల భావాలకి అంజలు లర్పించుకుంది మనసులో. సాధారణంగా తన ఊళ్ళో అయితే తనని అవమానంగా మాట్లాడేవారు

ఏవేవో మాట్లాడి ఆయన వెళ్ళిపోయారు.

మళ్ళా తన ఆలోచనలూ తన సమస్యలూ తన కెదురయ్యాయి.

ఎన్ని ఆలోచించినా ఆలోచనలు తెగలేదు.

ఒక్కటే మార్గం కనబడుతోంది.

"మెడలోఉన్న చిన్న గొలుసు."

చిన్నప్పుడు తాతయ్య చేయించినది.

అది అమ్మేసి కావలసినవి కొనుక్కుంటే.

ఔను. అదే పరిష్కార మార్గం.

* * *

ఇంకా చీకటి పడలేదు —

గొలుసు తీసికొని బయలుదేరింది. వెండి బంగారుకొట్లు అన్నీ తిరిగింది. నకలీ బంగారం అన్నారు. కరిగితే ఎంతోరాదు మంచి బంగారం అన్నారు. ఒక సెట్టి మూలిగి మూలిగి తొంభయి రూపాయలు చేతిలో పెట్టాడు.

అవునని కాని, కాదని కాని దెబ్బలాడలేదు కుసుమం. అదే తనకి పది వేలనుకుంది.

ఆడబ్బు తీసికొని వస్తూంటే తన కన్నులు చెమ్మగిలాయి. మెడ దిన్నగా బోసిపోయినట్లు అనుకుంది. ఏదో బాధ ఆమెని కుదిపి వేసింది. తాతయ్య చేయించాడు. ఇరవై ఏళ్లగా తనని అంటిపెట్టు కున్న చిన్నగొలుసు వెళ్లిపోయింది.

అయితే తన కష్టపడి చేసినప్పుడు అదొక లెక్కా అని సమాధానపడింది.

అందులో ఇరవైరూపాయలు పెట్టి తనకి కావలసిన చిన్న చిన్నగిన్నెలు కొనుక్కుంది. బియ్యం పచారీసామానూ కొనుక్కొని గదికి చేరేసరికి ఏడెనిమిదయింది

"ఎక్కడి కెళ్లావమ్మాయ్" అన్నాడు ఇంటాయన.

"బజారుకండీ!" అంది తలుపు తీస్తూ.

"ఔనుకానీ - ఇవ్వేళకి మాఇంట్లో భోజనం చెయ్యి" అన్నాడు.

ఆయన ఔదార్యం తల్చుకోగానే తండ్రి జ్ఞాపకానికి వచ్చాడు. తనకోసం నాన్న ఎంత బాధపడుతూంటాడో! అమ్మ కుళ్లి కుళ్లి ఏడుస్తూంటుంది. పిల్లల్ని ఎలాసర్దుకుంటుందో?

"ఎందుకండీ?"

"అలా అనకు మా అమ్మాయి లాంటిదానవు."

కాదనలేకపోయింది ఆయన మాటను.

ఆ ఇంటాయనకి భార్యలేదు. పెద్దకొడుకు భార్యే ఇంట్లో సమస్తమూ చేయాలి. అతనెక్కడో ఆఫీస్ మేనేజర్ చేస్తున్నాట్ట. ఆమెకీ నలుగురుపిల్లలు. రెండోకొడుకు ఇంకా చదువుకుంటున్నాడు.

వాళ్లింట్లో ఆపూట భోజనం చేసింది. ఆయన మాటంటే ఇంట్లో అందరికీ గౌరవం. కోడలుకూడా నెత్తినపెట్టుకుని చూసు కుంటోంది. ఆయన కూతురు అత్తింటకాపరం చేస్తోంది.

భోజనం అయ్యాక సంచీలోంచి బొంత తీసికొని నడుం వాల్చింది. ఏవేవో ఆలోచనలు ముసురుకుంటున్నాయి. ఆలోచనల్లో ఉండగానే నిద్రపట్టేసింది!

మర్నాడు పొద్దున్నే కాలకృత్యాలన్నీ తీర్చుకొని తాసిల్దార్ గారింటికి వెళ్ళింది. ఆయన కూతురు ఫస్ట్‌ఫారం చదువుతోంది. పిల్ల చురుకైనదే, కాని నిలకడలేదు. కుముదం పాఠం చెబుతూంటే ఆ పిల్ల ఎక్కడికో చూస్తూ.... పెనిసిలుతో చాపమీద పిచ్చిగీతలు పెట్టడం పరధ్యానంగా ఉండడం చేస్తోంది. కుముదం పాఠం అంతా చెప్పి ప్రశ్నలు వేసింది. ఒక్కదానికీ జవాబు సరిగ్గా చెప్ప లేదు. ఇంత సేపూ తను కంఠశోషపడి చెప్పినది నిష్ఫలమేనా అని ఒక్కుమ్మడిగా విచారం కోపంకూడా వచ్చాయి. ఇప్పుడే తెలిసింది మేష్టరు ఎంత కష్టపడి చెబుతాడో, చెప్పినపాఠం సరిగ్గా విని జవాబులు చెప్పకపోతే ఉపాధ్యాయుడి కెంత కష్టంగా ఉంటూందో!

ఆనాడు "కుర్రాళ్లు విని సరిగ్గా చదివితే మేష్టరు కంతకంటే కావలసిం దేముంది. పంచభక్ష్యాలతో కడుపారగా భోజనం చేసినట్లే ఉంటుంది" అన్నారు శ్రీనివాసరావు మేష్టారు. తన కిప్పటికి దాని లోని అంతరార్థం బోధపడింది. ఆ అమ్మాయి సరిగ్గా వినలేదు. తను ఆకర్షవంతంగా పాఠంచెప్పలేక పోతూందా? తనకి పాఠం చెప్పే పద్ధతులు తెలియవా? సరిగ్గా వివరించలేదా? అని అనేక రకాల ఆలోచనలు తలలెత్తాయి.

కొద్దిగా చిరాకు పడింది. వినకపోతే ఎలాగంది. ఇలాగయితే నువ్వు పాస్ అవ్వవు అని హెచ్చరించింది.

ఆ పిల్ల చిన్నముఖం వేసింది.

ఆ పద్ధతి కాదనుకుంది. కథలు చెప్పినట్లు చెప్పడం ప్రారంభించింది మర్నాటినుంచి; పుస్తకం మరొకపైపుని పెట్టి. చెబుతూ మధ్యలో ప్రశ్నలు వేసేది. ఆ పిల్లకి ఈ పద్ధతి పనిచేసింది. శ్రద్ధగా వింటూ జవాబులివ్వడం మొదలుపెట్టింది. ఆ పిల్లపేరు శారద. శారదకి కుముదం దగ్గర బాగా చనువేర్పడింది.

"మా మేష్టారు బాగాచెబుతారని పక్కింటి కమలంతో గొప్పలు చెప్పింది శారద. తాసిల్దార్‌గారు కూడా ఒకటి రెండు రోజులు ఆమెపాఠం చెప్పే విధానాన్ని ప్రక్కగదిలో ఉండి విన్నాడు. ఆయనకూ నచ్చింది. కుముదానికి మరోపని లేదు. శారదకి స్కూల్ టైమ్‌అయ్యేవరకూ ఏదో ఒకటి చెబుతూనే కూర్చుంటుంది. కమలం కూడా ఒకటి రెండు రోజులుగా వచ్చి కూర్చుని పాఠం వింటూంది.

"నాకు కూడా చెబుతారా మేష్టారూ?" అంది అమాయకంగా కమలం.

"చెబుతానమ్మా" అంది కుముదం గెడ్డంపుణుకుతూ. కమలంకి ఎంతో గౌరవ ప్రపత్తు లేర్పడ్డాయి కుముదం మీద. ఆమె ఏం చెబితే అది చేస్తుంది. ఎలా చదవమంటే అలా చదువుతా రిద్దరూ.

శారదకీ కమలానికీ స్కూల్లో మొదటి మార్కులు వస్తున్నాయి. క్రమంగా కుముదం పట్ల వాళ్లాదరానికి అలవాటు పడ జొచ్చింది. ఇవి ఏవకటి ఆలోచనలు వచ్చాయి. రోజు రోజుకీ తన శక్తి వంచన లేకుండా ఆపిల్ల లిద్దరికీ తన స్వంత చెల్లెళ్లకి చెప్పినట్లు పాఠాలు చెబుతోంది. కమలం తనంతటానైవచ్చి అభ్యర్థించింది చదువు చెప్పమని? ఎంతో ముద్దువచ్చింది. అందు కనే ఆట్టే జీతం గొడవ ఎత్తకుండా చెబుతోంది.

నెలాఖరు వచ్చింది.

ఆ మర్నాడు పాఠం చెబుతూంటగా తాసిల్దారుగారు ఇరవై రూపాయలు పట్టుకువచ్చి కూతురు చేత ఇప్పించాడు. ఇరవై ఎందు కిచ్చారన్నట్లు చూసింది.

"నీకేం నేనెక్కువ ఇవ్వలేదు....కష్టపడి చెప్పావు నీకెంత ఇస్తే తీరుతుంది?" అన్నారు.

"అమ్మయ్య" అనుకుంది కుముదం.

అదిచూసి వెంటనే కమలం లేచి పరుగుపెట్టింది ఇంటికి తమ మేష్టారికి జీతం ఇవ్వాలని చెప్పింది. వాళ్ళనాన్న నడిగి పదిహేను రూపాయలు పట్టుకొచ్చి మేష్టారిచేతిలో పెట్టి నమస్కరించింది.

"ఎందు కమ్మాయ్ నీకేం నేను ప్రత్యేకం చెప్పటం లేదుగా" అంది.

"అలా కాదండి అమ్మిగారూ" అని వినయపూర్వకంగా బుర్రవొంచుకుని "మేం పదిహేనే ఇవ్వగలం అండి" అంది అమాయకంగా, తక్కువ ఇచ్చాననే బాధగా.

"మరేం ఫరవాలేదు... నే నన్నానా?" అని వీపు నిమిరి కూర్చో పెట్టింది.

* * *

ఆరోజు ఆమెకి పర్వదినం. ముప్పయి అయిదు రూపాయలు కష్టార్జితం; నెలతిరిగే సరికి చేతికి వచ్చాయి. ఎంతో గర్వించింది తనుకూడా సంపాదకురాలు కాగలిగాననీ, తనకాళ్ళమీద తను నిల బడడం నేర్చుకోగలిగాననీ. ఆ వీధిలో ఈమె పాఠం బాగా చెబు తుందనే పేరుకూడా వచ్చింది. తనలో ఏం ఆకర్షణ ఉందో పిల్ల లంతా తన చుట్టూ చేరుతున్నారు. పొత్తిగా చిన్న పిల్లలైతే పాటలు కూడాపాడి చెబుతూంది. రెండవ నెలనుంచి ప్రైవేటు పెరిగాయి. మొత్తం ఎనమండుగురికి చెబుతూంది. ఆమెకి తీరికనేది ఉంటే అదిపొద్దున్న పది మొదలు సాయంత్రం నాలుగు వరకూ, తరవాత తీరిక ఉండదు.

మధ్యమధ్య ఎప్పుడైనా శంకరరావుని కలుసుకుంటూంది. అతనంటే తనకెందుకో ఏదో తెలియని ఆకర్షణ బయలుదేరింది. అది అతని సుహృదయత్వానికే కావచ్చు. అతన్ని కేవలం ఒక దేవుడిగా భావిస్తూంది. అతను కనబడ్డప్పుడల్లా కృతజ్ఞతా భావాన్ని

వ్యక్తం చేస్తుంది. క్రమంగా పరిచయం వృద్ధి కాసాగింది కుముదానికీ శంకరరావుకీ మధ్య.

శంకరరావు తన ఇంటిగొడవలూ చిన్నప్పటినుండీ తనుపడ్డ కష్టాలు వివరించాడు. అతని చరిత్ర విని ఆమె నిట్టూర్చింది. అతను పెళ్లి చేసికోకపోవడానికి కారణం ఆమెకి విశదమయింది. అతనికి నా అనేవాళ్ళెవరూ లేరు. ఎక్కడో వేలువిడిచిన మేనమామ ఉన్నాడు. ఆయనే ఎప్పుడైనా వచ్చి పెళ్లి మాటలు సంప్రదిస్తాడు. "అక్కడ మంచి సంబంధం ఉందనీ, ఆ పిల్లని చూసిరా ఆ తర వాత నేను చూసుకుంటాననీ" ఆయన వచ్చినది మొదలు వెళ్ళే వరకూ శంకరరావుని ఒక్కక్షణం ఊరుకోనివ్వడు. శంకరరావు పెళ్లి బాధ్యతంతా తన భుజస్కంధాలపైనే ఉందని మాట్లాడుతాడు.

శంకరరావుకి నచ్చిన పిల్ల దొరకలేదంటే ఆశ్చర్యపడనక్కర లేదు. అతని ఆదర్శాలువేరు. తన ఆదర్శాలకి తగిన పిల్లకోసం వెతికాడు. అయినా ఒకటిరెండేళ్లుగానే పెళ్లిచేసికోవాలని ప్రయత్నాలు చేస్తున్నాడు.

అతని విషయాలన్నీ విని కుముదం అతనికి మనసులో అంజలు లర్పించుకోకుండా ఉండలేకపోయింది.

అతన్ని చూస్తుంటే తన కెన్నెన్నో ఆలోచనలు కలుగు తున్నాయి. అతనికి నచ్చవచ్చు. ఆ ప్రసక్తి తేవడానికి తగ్గధైర్యం తనదగ్గరలేదు.

ఒకనాడు శంకరరావు తన ఆఫీస్‌లో తనతోకూడా పనిచేస్తున్న సుబ్బారావుకి కుముదాన్ని పరిచయంచేశాడు. పరస్పరం నమస్క రించుకున్నారు. సుబ్బారావు ప్రకృతిపద్ధతి తనకంత నచ్చినట్టుగా కనబడలేదు. శంకరరావు చూసేచూపు వేరు, సుబ్బారావు చూసే చూపువేరు. సుబ్బారావుకూడా ఇంచుమించుగా శంకరరావు వయసువాడే. అలంకరణ విషయంలో మంచిశ్రద్ధ తీసికొంటాడు. అతను చూస్తుంటే ఏమిటో తనవొళ్లంతా ములుకుల్లా గుచ్చు కుంటున్నట్లు బాధపడింది. ఆకొన్న పులిలాంటి చూపులు. ఆ నవ్వులోకూడా సరైనఅర్థం తనకి కనుపట్టలేదు.

మనుషులందరూ ఒక్కలా ఉంటారా? ఒక్కొక్కడిది ఒక్కొక్కపద్ధతి, ఒక్కోచూపు... ఒక్కోనవ్వు....ఎవరి పోలి కలు వాళ్లవి. తను సుబ్బారావుని తప్పుగా అర్థంచేసుకుంటూందా? ఆ నాడు తను శంకరరావునీ ఇలాగే అనుకుంది....అదీకాక మనం చూసే చూపులోనే ఉంటుంది తేడా ... రంగుటద్దాలు పెట్టుకుని చూస్తే ప్రపంచంఅంతా రంగుగానే కనుపిస్తుంది. తరవాత కాని శంకరరావుని అర్థంచేసుకోలేక పోయింది. మానవులనందర్నీ సమానంగా చూసి అర్థంచేసికోగల విశాలదృష్టి, హృదయం తనకి లేదా?

ఏవో వెర్రి మొర్రి ఆలోచనలతో ఇంటికి వెళ్ళింది. గదితలుపు తీసికొని తన భావి కార్యక్రమంగూర్చి ఆలోచనలు ప్రారంభించింది.

స్త్రీ అబల అనీ, ఆమె ఏమీ చెయ్యలేదనీ అంటారు. కాదు మనదేశ సాంప్రదాయం అంటూ ఏవో పెట్టి స్త్రీ ఏమీ చెయ్యలేదనీ, ఎంటిల్లే తనకి స్వర్గమనీ ఏవేవో కల్పించారు. స్త్రీ నమ్మింది. తనకి అదే పరిమితం అనుకుంది. వెలుగు చూడలేదు. స్త్రీ మాత్రం మనిషికాదూ? తను చెయ్యలేని దేమిటి? అందులోనూ ప్రస్తుతం సమానహక్కులు కూడా ఉన్నాయి. ఆ హక్కుల పట్ల తన కమిత మైన గౌరవం ఉంది. తను కూడా ఉద్యోగం కోసం ఇక్కడికి వచ్చింది. ఒక్కమొగాడేనా తండ్రికి చేదోడు వాదోడుగా ఉండే వాడు? స్త్రీ ఎందుకుండలేదు? ఔను. తను ఇప్పుడేలాంటి సాయం చేయాలి నాన్నకి? తను చెయ్యగలిగిన సాయం ఏమిటి? డబ్బు సాయం చెయ్యడానికి తగ్గ స్తోమతు తనకి లేదు.

మరి....? మరి ...?....

ఏం జెయ్యాలి?....

ఆలోచించుకుంటూ ఆనాటికి నిద్రపోయింది.

* * *

ఆ మర్నాటి సాయంకాలం తన చిన్న సంసారానికి కావలసిన అవసరాలు కొనుక్కోవడానికి సంచీపట్టుకుని బజారుకెళ్లింది. దార్లో సుబ్బారావు కనబడ్డాడు. ముసిముసినవ్వులు చిందరించాడు. పలకరించాడు, తనతోకూడా నడుస్తూ.

ఆమె అతన్నీసారి మరోలా భావించలేదు. కాని ఏదోభావం మాత్రం ఆమె మనసులో నాటుకుపోయింది. గౌరవార్థం పెద్ద మనిషి తరహాగా చిరునవ్వుతోటే జవాబిచ్చింది. అతను అడిగే వాట్లన్నింటికీ ముక్తసరుగా నో, ఊఁ అంటూనో జవాబులిచ్చింది. అతనేవేవో చెప్తూనే పోతున్నాడు, చేతులు తిప్పుకుంటూను; అభినయాలతోటీని.

ఒకమూల నవ్వువచ్చినా మరోమూల వీడెప్పుడు వదలిపోతాడా అనే అసహ్యభావంకూడా ఉంది. కాని ఓపిక పట్టింది. మనిషంత మనిషిని పట్టుకుని ఏమనగలదు కనక! బజారువరకూ కూడా వచ్చాడు. తరవాత అక్కడనుంచి వనుంది. మళ్ళీ కలుద్దాం అంటూ ఎదటకి నడిచాడు.

"హమ్మయ్య!" అనుకుంది.

వేయిదేవుళ్ళకి మొక్కుకుంది.

బజారు పనులన్నీ చూసుకునేసరికి చీకటిపడింది, నల్లగా విషపు నవ్వు నవ్వేవాడి ముఖంలా; కుటిలుని మనస్సులా; కన్ను పొడుచు కున్నా కనబడని కటిక చీకటి....

ఇంటిదారి పట్టింది.

అడుగులు గబగబ సాచివేస్తోంది.

వెలుగుతూన్న దీపాలు అప్పుడే లేచిన ప్రళయపు గాలికా అన్నట్లు ఒక్కసారి ఆరిపోయాయి...నల్లటి చీకటి...చినుకడం ప్రారంభమయింది. ముసుగువేసుకున్న రిక్షాలు తడి రోడ్డుమీద జర్రుమని దొర్లుపోతున్నాయి, మువ్వలు చప్పుడు చేసికొంటూ.

వర్షం హోరు హెచ్చుతోంది.

పెద్దపెద్ద చినుకులు టప్‌టప్‌మని ముఖాన్ని కొడుతున్నాయి. చలికి జిస్వ్వ మంటూంది.

రివ్వుమని గాలి కొడుతూంది.

ప్రక్కనున్న చెట్టుక్రిందికి వెళ్ళి ఆగింది.

ప్రకృతి అంతా తనని పరీక్షిస్తున్నట్లుగా అనుకుంది.

ఈ పరీక్షలో తను నెగ్గాలి !

అనుకోకుండానే భయం ఆవహించింది. ఆ చెట్టుక్రింద నిల బడ్డప్పుడు.

ఆ చెట్టుక్రింద ఒకతను ఎవరో ఉన్నట్లు పసికట్టింది. కదల కుండా నిలబడ్డాడు.

మఫ్లర్ చెవులకి చుట్టేశాడు.

రోడ్డుమీద జనం పల్చపడ్డారు. ఉండుండి ఒక్కోరిక్షా టిక్‌టిక్ మనుకుంటూ వెడుతోంది.

అతను తనవైపే కదలుతున్నాడు.

హామ్మయో....!

గుండెలు బిగబట్టుకుంది.

గుబగుబ లాడుతున్నాయి.

గొంతుపూడుకు పోతూంది....

చరచర అతనువచ్చి చెయ్యి పట్టుకున్నాడు. ఏదో గొణుగు తున్నాడు. ఏవో ప్రతిజ్ఞలు చేస్తున్నాడు. ఆ కంఠం ఎక్కడో విని నట్లుగానే ఉంది. గిజగిజ లాడింది. అతను బాహువుల్లో బలంగా బంధించాడు. కదలడానికి వీల్లేకుండాను....శక్తికొద్ది విసిరికొట్టింది.

పట్టు విడిపించుకుంది.

గూబమీద బలంగా వడవడవాయించింది....

మెరుపు మెరిసింది....

ఎవరూ....

సుబ్బారావే !

"సుబ్బారావ్....ఇంత నీచుడ వనుకోలేదు ...జాగ్రత్త" అంటూ ఆ చినుకుల్లోనే పరుగుపెట్ట నారంభించింది. ఆయాసపడుతూ రొప్పుతూ రొజుతూ వచ్చి తన గదితలుపులు తీసింది. లోపలికి పోయింది.

ఎన్నెన్నో తిట్టుకుంది.

శాపనార్థాలు పెట్టింది.

విసురుగా తలుపువేసికొని బొంత పరుచుకొని పడుకుంది. ఏడిచింది. కన్నీరుమున్నీరుగా విలపించింది. తనని తనే నిందించు కుంది. కాస్త చనువియ్యబోయేసరికి మగవాడెంత నీచంగా ప్రవ ర్తిస్తాడో ఆ క్షణంలో అర్థం చేసికోగలిగింది.

ఆ రాత్రామెకు సరిగ్గా నిద్రపట్టలేదు. కలతనిద్ర. నిద్రలో కలలు. సుబ్బారావు తనని చెయ్యిపట్టుకుని లాక్కుపోతున్నట్లు....

తనని పాడుచేస్తున్నట్లు....

శంకరరావుకి తన ముఖం ఎలాగ చూపడం ?

* * *

ఆమె లేచేసరికి ఏడయింది.

మామూలుగా తెల్లవారుఝాము నాలుగింటికే లేచేది. వెలుగు వచ్చేసరికి అన్నిపనులు తెముల్చుకుని ప్రైవేట్లు చెప్పడానికి వెళ్ళి పోయేది.

ఎండ చూడలేక పోతోంది.

తనకి తనే సిగ్గుపడిపోతోంది....

కళ్ళెర్రగా ఉబ్బివున్నాయి. చల్లటినీళ్ళతో ముఖం కడుక్కుంది. ఏ పని చెయ్యటానికి తోచడంలేదు. ఏది చేయటానికైనా ఆలోచన. చేద్దామనుకున్న ఏ పనీ జరగటంలేదు. ప్రక్కఎత్తి మడతపెడదా మనుకుంది. అలాగే కూర్చుండిపోయింది. కిటికీతలుపులు తెరి చింది. మళ్ళీ మూసివేసింది. ఆ రోజేం హుషారుగా లేదు.

ఎందుకు వచ్చాననుకుంది. ఇల్లు జ్ఞాపకానికివచ్చింది. చెల్లెళ్లు.... చంటిచెల్లాయిలు. అమ్మా నాన్న ఏంజేస్తున్నారో కన్నీరు గిర్రున తిరిగింది.

మనిషిజీవితంలో అనుకోని సంఘటన లెన్నోజరుగుతాయి. వాటినన్నింటినీ తప్పించుకుని నిగ్రహించుకుని రావాలి ! వారే ఈ జీవిత మహాసంగ్రామంలో నెగ్గినట్లు. వారే కృతకృత్యులు !

రాత్రి జరిగిన సంఘటనే గుర్తుకొస్తుంది. ఉత్సాహం నశించింది....తనేం తప్పుచెయ్యలేదు. తగినబుద్ధి చెప్పింది. ఆత్మ గౌరవం ఉన్నవాడైతే ఇకమీదైనా బుద్ధిగా నడుచుకుంటాడు.... తనెందుకు సిగ్గుపడాలి !

"నేనేం తప్పుచెయ్యలేదు...." అని నిర్ధారించుకుంటేనేగాని కుముదం వీధిలోకి వెళ్లలేకపోయింది. వెళ్లినా అంత సంతోషంగా లేదు. దిగులు దిగులుగానే ఉంది. పాఠాలుచెప్పింది తనకే తృప్తిగాలేదు. పిల్లలుకూడా కనిపెట్టారు.

"మేష్టారూ ఒంట్లోబాగాలేదా ?" అని అడిగింది కమలం.

"లేదమ్మాలేదు. బాగానేఉంది...." అని లేని ఉత్సాహం తెచ్చు కుని హుషారుగా పాఠం చెప్పడానికుపక్రమించింది.... ఎంత

దాచుకుందామన్నా స్త్రీసహజమైన అహం పెల్లుబికి కంఠంలో సుళ్లుతిరిగిపోతోంది. తను చెప్పదల్చుకున్న విషయాలు వివరించలేకపోతుంది.

అపుకుందామన్నా ఆపుకోలేక పోతూంది.

ముఖంచాటుచేసికొని కన్నీరు తుడుచుకుంది. తను కంటినీరు పెట్టుకోవడం పిల్లలుకూడా చూడకూడదనుకుంది. ఆమెవంతా విచిత్రమైన మనస్తత్వం....పిల్లలయెదుట ఎప్పుడూ ఉత్సాహంగా కనబడాలంటుంది. వాళ్లు వినకూడనిమాటలు పైకి అనకూడదు.... అశ్లీలమైన పదాలువాడదు. కూడనితిట్లు తిట్టదు. ఇవన్నీ వయసు చిన్నదైనా అనుభవం తనకి నేర్పిన పాఠాలు. మనం ఏం అంటే పిల్లలుకూడా అవే అంటారు. పిల్లల అనుకరణశక్తి అమోఘమైనది. మనం మాట్లాడేప్పుడు నవ్వేప్పుడు, ఏం చేస్తున్నప్పుడూ కూడా వాళ్లు పరీక్షగా చూస్తారు. అవే వెంటనే అనుకరిస్తారు. చుట్టూ ఉన్న వాతావరణం మీదే ఆధారపడి ఉంటుంది వాళ్లబాగూ ఓగూను. ఈ విషయాల్లో చాలా జాగ్రత్తలు తీసికొంటుంది కుముదం....తను పాఠాలు చెప్పిన పిల్లలు ఆదర్శవంతమైనవాళ్లు కావాలి. సంకుచిత స్వభావం, భావాలు ఉండకూడదు. ప్రతీదీ హెచ్చు స్థాయిలోనే ఊహించుకోవాలి ! పెద్దపెద్ద ఆశలే ఉండాలి. ఇదీ ఆమె సిద్ధాంతం.

అవే అమె పాఠాలతో కలిపి చదువులో వివరిస్తుంది. అందుకనే అమె అంటే పిల్లలకి ఆకర్షణ. అందుకనే గౌరవం....జీతం రాళ్లకోసమని అన్నట్లుగా కాలక్షేపం చెయ్యదు....కష్టపడి సంపాదించుకుంటుంది.

అందుకనే పిల్లల ఎదురుగుండా తను విచారాన్ని కూడా వ్యక్తపరచదు. ఎంతో ఆనందంగా ఉన్నట్లు....చాలా హాయిగాఉన్నట్లు నటిస్తుంది.

ఏమయినా ఆరోజు ఆమె చెప్పినపాఠం అంతగా తనకే తృప్తి కలగలేదు. ఆ రోజున ఆమె కేం తిన్నకడుపు నిండినట్లుండదు. ఏదో వెల్తిగా ఉన్నట్లుగానే భావిస్తుంది.

మొత్తంమీద ఆరోజు అంతా మందంగానే గడిచిపోయింది.

* * *

మర్నాడు ఆదివారం...

ఆరోజు తను పిల్లలకి పాఠాలు చెప్పదు. సాయంకాలం అప్పుడు మాత్రం ఏ పార్కుకో వాళ్ళని తీసికెడుతుంది. సాయంత్రంవరకూ కాళీయే. పొద్దునే వంట పూర్తి చేసుకుంది. కిటికీకి వారగా బొంత పరచుకుని కూర్చుని ఏవో ఆలోచనలు ప్రారంభించింది. ఆలోచనలు వలయాలుగా తిరిగి తిరిగి శంకరరావు మీదికి వచ్చాయి.

శంకరరావుకి పెళ్ళెందుక్కాలేదు? అతను చెప్పినవన్నీ నిజమే అయితే తనెందుకు ప్రయత్నించకూడదు? కొద్దిగా చనువేర్పడింది. కనక ఆ విషయాలు తను ప్రస్తావించగలిగిన ధైర్యం వచ్చింది.

అతని గుణగణాల్ని తర్కించుకుంటూంది.

"కుముదం" అని పిల్చాడు రోడ్డుమీంచి శంకరరావు.

ఒక్కసారి ఈలోకంలోకి వచ్చింది.

కిటికీలోంచి చూసింది.

"రండి.రండి..." అంటూ తలుపు తీసింది. కూర్చోమని గౌరవించింది.

"తీరిగ్గా కూర్చున్నారే !" అన్నాడు కూర్చుంటూ.

"సెలవురోజు కదా" అంది కుముదం గోడవారగా నిలబడి.

ఆ విషయం కదపడం ఎలాగాని సందేహిస్తోంది. కాని కనుక్కోవాలి. ఎంత కనుక్కుందామన్నప్పటికీ పెళ్లికాని స్త్రీ పెళ్లికాని పురుషుణ్ణి వైవాహిక విషయాల్లో ప్రస్తావన సాగించడంకు సందేహిస్తుంది. ధైర్యం చాలదు. కాని తన ధ్యేయం నెరవేరాలంటే ?...తన ధర్మం నిర్వహించుకోవాలంటే ? తప్పదు... అడగాలి....

"అయితే మీరు పెళ్లిచేసికొనే ఉద్దేశ్యాన్ని వొదులుకున్నట్లేనా ?" అని అడిగింది వ్యంగ్యార్థం స్ఫురించే ధోరణిలో. కుముదం ముఖంలోకి చూసి మందస్మితం చేశాడు శంకరరావు.

"అంటే ?"అని కనుబొమలు దగ్గరకి జేర్చాడు అర్థంకానట్లు.

"ఆ ఉద్దేశ్యం లేదా ?" రెట్టించింది.

"ఉంది" అన్నాడు ఆ నాటి వింత సంభాషణకి ఆశ్చర్యపడుతూ శంకరరావు.

'మరివుంటే ఊరుకున్నారేం అన్నట్లు' చూసింది.

"ఆ సమయం రావాలి....వస్తే ఎలాంటిపిల్లయినా నాకు నచ్చవచ్చు...." అన్నాడు ఆమెవైపు చూస్తూ.

ఔనన్నట్లు నవ్వింది.

ఆమె ఆంతర్యం సరిగ్గా అర్థంకాలేదు శంకరరావుకి. కాని అంతగా ఏ విషయాన్నీ తర్కించుకునే రకంకాదు.

"పిల్ల నచ్చుతుందనుకోండి.... కట్నం ఇవ్వలేకపోతే ?"

ఈసారి పూర్తిగా ఆమె అభిప్రాయం అర్థంచేసికో గలిగాడు.

"అంత పశువునా ?" అనేశాడు.

చకిత అయింది కుముదం. అతనినుండెప్పుడూ అంతటి సమాధానాన్ని ఆశించలేదు.

తను తెలివితక్కువగా ప్రశ్నించా ననుకొంది.

"క్షమించాలి !" అనేసింది.

"ఏముంది క్షమించడానికి" తేలిగ్గా నవ్వివారేశాడు.

"అయితే మా ఊరు ఎప్పుడు వస్తారు ?"

"మీ ఇష్టం నా అభ్యంతరం లేదు...."

"అయితే మధ్యాహ్నం బయలుదేరుదాం"

"సరే" నన్నాడు. మధ్యాహ్నం వస్తానంటూ వెళ్ళిపోయాడు.

ముందుముందు ఎలా మాట్లాడ్డం, కార్యం ఎలా సాధించాలో ప్రణాళికలు వేసుకుంటూ మధ్యాహ్నంవరకూ గడిపింది.

* * *

గుర్రబ్బండి వెంకట్రావుగారింటిముందు ఆగింది. ఆ వీధిలోకి వచ్చాక కుముదం బుర్ర ఎత్తలేదు. తను గుమ్మంలో శంకరరావుతో అడుగుపెట్టే సరికి ఎలాటి పరిస్థితులకు తను గురికావలసివస్తుందో నని ఆందోళన చెందుతోంది. శంకరరావు ఆమె ముఖంలోని మార్పులు గమనించలేదు. ఎక్కడికో చూస్తున్నాడు.

గుర్రబ్బండి దిగాలి.

నాన్న ఏమంటాడో.

ఇంకా చీకటి పడటానికి గంట పైముంది.

బండి దిగింది. శంకరరావుని కూడా రమ్మంది.

బండిచప్పుడు విని చంటిచెల్లెలు "అక్క అక్క" అంటూ పరుగున వచ్చింది.

ఎన్నాళ్ళకి చూశానో అనుకుంది.

ఎత్తుకుని ముద్దు పెట్టేసుకుంది.

ఆ పిల్ల చేతులు కుముదం మెడకి చుట్టేసింది.

ముకుంద 'అక్కా' అంటూవచ్చి కావలించుకుని బోరుమంది.

సుబ్బలక్ష్మి అమాంతం కుముదాన్ని చేతుల్లోకితీసికొని "నాతల్లీ" అంటూ ఏడిచింది. వీపు నిమిరింది తల నిమిరింది. మూర్ధాఘ్రాణం చేసింది.

వెంకట్రావు కొయ్యబారి నట్లయి పోయాడు.

కూర్చున్న చోటునుండి కదల్లేక పోయాడు.

"కుముదం....!!"

"నాన్నా" అంటూ కాళ్ళకి నమస్కరించింది.

వెంకట్రావు ప్రక్కకి తిప్పుకున్నాడు ముఖం. ఏమీ అనలేక పోయేడు.

"ఆయనెవరు?" అని మాత్రం అడిగాడు.

"స్నేహితులు...."

"కూర్చోపెట్టవే" అంది తల్లి.

శంకరరావు చాపమీద కూర్చున్నాడు. కుముదాన్ని అందరూ తలోరకంగాను విశేషాలడుగుతున్నారు, చుట్టూకూర్చుని. కథలాగే చెప్పింది. అందరూ ఆశ్చర్యాన్ని ప్రకటించారు. తను తెచ్చిన తెల్లటి గ్లాస్కోచీరా, పచ్చటిసిల్కుజాకెట్టూ తీసి ముకుందకిచ్చింది. ముకుంద ముఖం అంతయింది - కట్టుకోవే అంది. చెల్లెళ్ళందరూ ముఖాలు ముడుచుకున్నారు.

"ఈ సారి మీకు తెస్తా." అంది.

కొత్తబట్టలు కట్టుకొనివచ్చి అక్కకి నమస్కరించింది.... నిజంగా చెల్లెలు తనకళ్లకే రంభలా కనబడింది.

అసలే అందమయింది ముకుంద, దానికి తోడు ఆ బట్టల్లో అందం మరింత ద్విగుణీకృతమయింది.

సన్నగా ఏదో రాగం పాడుతూంది.

"ఎవరు పాడుతూంట?" అడిగాడు శంకరరావు అప్రయత్నంగా ఆ పాటకి తాళంవేస్తూ.

"మా చెల్లి....ముకుంద..." అంది.

"బాగా పాడుతూందా ?" అని అడిగింది.

నవ్వాడు శంకరరావు.

"చెల్లాయ్" అని పిల్చింది.

పెళ్లికూతురులా అక్కడికి వచ్చింది ముకుంద.

సిగ్గులో మూతి ముగ్గలా ఉంది.

"కూర్చో" అంది కుముదం.

"మా చెల్లి....బాగుందా ?" అని అడిగింది కుముదం.

ఆశ్చర్యపడ్డాడు శంకరరావు.

నిజంగా బాగుంది. తను చెప్పడానికేం ?

"బాగానే ఉంది...."

పశ్చిమాన్ని సూర్యాస్తమయం, తూర్పున చంద్రోదయం అవుతున్నాయి.

రెండు చిలకలు పశ్చిమాని కెగిరిపోతున్నాయి.

వెన్నెలలు పాలవెల్లువలా ప్రవహిస్తున్నాయి.

"మా చెల్లిని పెళ్లాడ్డానికి మీ కభ్యంతరమా ?"

అంగీకార సూచకంగా నవ్వాడు.

చకిత అయింది ముకుంద. సిగ్గు ఆ ముఖానికి బంగారపు పూత పెట్టింది. చిరునవ్వులు మెరుగులు దిద్దింది.

"అక్కా...." అంటూ హొకరిలింది ముకుంద. పెరటిలో చెట్టుమీద కూర్చున్న చిలక దగ్గరికి జేరింది గోరింక.

"నేనుకూడా ఒక మంచిపని చేశాను. నాన్నకి నేనూ సాయపడ్డాను; ఏదోఒకవిధంగా" అనుకుని తృప్తిగా నిట్టూర్చింది.

కుముదం మనసంతా కౌముదితో నిండింది. "అమ్మాయ్! నువ్వు నాకు పెద్దకొడుకువి" అని వెంకట్రావు ఆనందబాష్పాలు రాల్చారు.

పుష్యలక్ష్మి

బొద్దు బాపిరాజు

★

హేమంతము కృషికజన
శ్రీమంతము హిమకణాభిషిక్త లలితా
సీమంతము దరహాసిత
శ్యామంతము తెన్గుసీమ శరణము సలిపెన్

౨

గాలి వాలున తీయగా కదలివచ్చె
పొలము కాపుల పొలిగాని పిలుపు పాట
అవని కరుదెంచు సంక్రాంతిలక్ష్మి యెక్కి
వచ్చు పల్లకీబోయీల పదము లగుచు

౩

తళుకు 'బంగారు తీగ' రాసులను మరయు
పంటకళ్లమ్ములన్ బసవన్న పొంగి
అంకె వేసెను గంభీరరావ మడర
సరస సంక్రాంతి లక్ష్మికి స్వాగతముగ.

౪

జనపదముల్ సుధాధవళసంపద - మంగళ రంగవల్లి క
ల్పనల గృహాంగణంబు లభిరామము లయ్యెను; ఆంధ్రకన్య లిం
పున సవరించు క్రొంబసిడి పూజల పొల్చిరి గొబ్బిదేవతల్
తనుగుల యింట పేరటము దీర్చగ వచ్చిన కాంచనాద్రులై.

౫

ఉదయానిలమునందు సూరేగ బుడబుడక్కలవాని డబుడక్క కలరవమ్ము
పంచ పందిట వ్రేలు వరికుచ్చుపై పిచ్చుకలు సేసె విందుల కలకలమ్ము
కిరణాలలోగిట గంగిరెద్దులవాని సన్నాయి పాడె పసందు మిగుల
జాళువా నిగ్గు సవరించుకొన్న యందముల గుమ్మడి పువ్వు నవ్వుకొనియె
పంటముత్యాల సొగసుల నించు రాణి, కృషికజనయత్నసత్ఫలకేంద్ర, మఖిల
భువన సౌభాగ్య పర్వము పుష్యలక్ష్మి అవతరించిన శుభచిహ్న లగుచు మెరసి.

★

పారిశ్రామిక విశేషాలు

(1960 నవంబరు)

(రాష్ట్ర పారిశ్రామిక రంగంలో అనుదినం అభివృద్ధిపథకాలు ప్రవేశపెట్టబడుతున్నాయి. వాటినిగూర్చి తెలుసుకోవడం, పారిశ్రామికవేత్తలకూ, ప్రజలకూ ముఖ్యం. కాబట్టి ముఖ్యపారిశ్రామిక విశేషాలను ఈ శీర్షికక్రింద ఇవ్వడానికి తలపెట్టబడింది.)

పారిశ్రామికాభివృద్ధి కార్పొరేషను :

రాష్ట్రంలో, భారీ, మధ్యరకం పరిశ్రమల అభివృద్ధికి తోడ్పడే నిమిత్తం ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధి కార్పొరేషనును నియమిస్తున్నది. మొదట్లో రు. 1 కోటితో ఇది ఏర్పాటు చేయబడుతుంది. పెట్టుబడి క్రమేణా రు. 3 కోట్ల వరకు పెంచబడుతుంది. త్వరలోనే ఈ సంస్థ రిజిస్టరు చేయబడుతుంది.

లఘుపరిశ్రమల పారిశ్రామిక కార్పొరేషను :

లఘు పరిశ్రమల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక కార్పొరేషనును ఏర్పాటు చేస్తున్నది. భారత కంపెనీల చట్టం క్రింద ఇది రిజిస్టరు చేయబడుతుంది. దీని పెట్టుబడి రు. 50 లక్షలు వుంటుంది.

ఖనిజముల అభివృద్ధి కార్పొరేషను :

రాష్ట్రంలో ఖనిజ సంపద అభివృద్ధికి కంపెనీ నొకదానిని స్థాపించడానికి ప్రభుత్వం తలపెట్టింది. ఈ విషయంలో ప్రాథమిక చర్యలు తీసుకోబడుతున్నవి.

ఆంధ్ర కాగితం మిల్లులు, రాజమండ్రి :

ఆంధ్ర కాగితం మిల్లులకు యంత్ర పరికరాలు సరఫరా చేయడానికి, నవంబరు నెలలో ఒడంబడిక పత్రంపై సంతకం జరిగింది. బహుశా 1962 వ సంవత్సరం మధ్యలో యంత్రాలను అమర్చడం పూర్తయి ఉత్పత్తి ప్రారంభమవుతుంది. ప్రస్తుతం ఈ మిల్లులలో రోజుకు 10 టన్నుల చొప్పున ఉత్పత్తి జరుగుతున్నది. కొత్త యంత్రాలు పనిచేయడం ప్రారంభించే నాటికి రోజుకు 70 టన్నులు మొదలు 75 టన్నుల వరకు ఉత్పత్తి పెరుగుతుంది. యంత్రాల ఖరీదు సుమారు రు. 293 లక్షలు.

కొత్త కాగితం ఫ్యాక్టరీ :

రోజుకు 100 టన్నుల కాగితాన్ని ఉత్పత్తి చేయగల ఫ్యాక్టరీ నొకదానిని నిజామాబాదు జిల్లా ఒగస్సేలో, స్థాపించే విషయం ప్రభుత్వం పరిశీలిస్తున్నది.

సింగరేణి బొగ్గు గనులు :

సింగరేణి గనులలో బొగ్గు ఉత్పత్తి పెరిగింది 1960 అక్టోబరు నెలలో వీటిలో 2,13,766 టన్నుల బొగ్గు లభించింది. క్రిందటి సంవత్సరం ఇదే నెలలో 1,85,716 టన్నుల బొగ్గు మాత్రం లభించింది. 1961 మార్చినాటికి 265 లక్షల టన్నుల ఉత్పత్తిని సాధించి తమ లక్ష్యాన్ని చేరుకోగలమని గనుల నిర్వాహకులు ఆశిస్తున్నారు.

ఎరువులు :

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొత్తగూడెంలో ఎరువుల ఫ్యాక్టరీని స్థాపిస్తున్నది. విశాఖపట్నంలో మరో ఎరువుల ఫ్యాక్టరీని నెలకొల్పే విషయం భారతప్రభుత్వ పరిశీలనలో వుంది.

ప్రభుత్వ ముద్రణశాల :

ప్రభుత్వ ముద్రణశాల పునర్నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యేకాధికారిని నియమించింది. అదనంగా యంత్ర పరికరాలను కొనడానికి, మరో షిఫ్టు పనిచేయడానికి సంబంధించిన ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయి.

ఉక్కు కర్మాగారం :

కొత్తగూడెం సమీపంలో చిన్నతరహా ఉక్కు కర్మాగారాన్ని స్థాపించడానికి గల అవకాశాలను పరిశీలించడానికై భారత ప్రభుత్వంచే నియమింపబడిన అధికార్లబృందం హైదరాబాదుకు వచ్చి ముఖ్యమంత్రితోనూ, పరిశ్రమలు, వాణిజ్యశాఖ సీనియర్ అధికార్లతోను చర్చలు జరిపారు.

కొత్తగూడెం ప్రాంతంలో లభించే బొగ్గు, ఇనుము నమూనాలను పరిశీలనార్థం జమ్షెడ్‌పూర్‌లోని జాతీయ లోహముల పరిశోధనశాలకు పంపించడానికి వీరు నిశ్చయించారు. కర్మాగారం స్థాపించే స్థలాన్ని చూడడానికి, కర్మాగారం స్థాపనకు సంబంధించిన విషయాలను చర్చించడానికి వీరు డిశెంబరు ఆఖరు వారంలో మళ్లీ హైద్రాబాదుకు వస్తారు.

భారీ విద్యుత్పరికరాల కర్మాగారం :

భోపాల్‌లోని భారీ విద్యుత్పరికరాల సంస్థ అధ్యక్షుడు శ్రీ కె. వి. మాథుర్, కేంద్ర జలవిద్యుత్ సంఘం అధ్యక్షుడు అహమద్ గారలతో భారత ప్రభుత్వం నియమించిన సంఘం 1960 నవంబరు 26 వ తేదీన హైద్రాబాదుకు వచ్చింది. వారు పరిశ్రమలు, విద్యుచ్ఛక్తి, పబ్లిక్ వర్క్స్ శాఖల సీనియర్ అధికార్లతో కలిసి లింగంపల్లిలో కర్మాగారం స్థాపించ ఉద్దేశించిన స్థలాన్ని పరిశీలించారు.

తరువాత వారు ముఖ్యమంత్రిని, ప్రధాన కార్యదర్శిని, పరిశ్రమల శాఖ కార్యదర్శిని, ఇతర సీనియర్ అధికార్లను కలుసుకొని చర్చలు జరిపారు. ఈ పథకం పెట్టుబడి బహుశా రు. 40 కోట్లకు పైగా వుంటుంది.

లఘు పరిశ్రమలు; పారిశ్రామిక ఎస్టేట్లు (కొత్తవి):

పారిశ్రామికఎస్టేట్లను విరివిగాస్థాపించే ఉద్దేశంతో పరిశ్రమల శాఖ,సహాయక పారిశ్రామిక ఎస్టేట్లకై పథకం రూపొందించింది. ఈపథకాన్ని అనుసరించి ప్రభుత్వం భూమి, సాధారణ సర్వీసుల ఖర్చును భరించగా, పారిశ్రామిక వేత్తలు భవనాలు, యంత్ర పరికరాల ఖర్చును భరించవలసి వుంటుంది. వీటికి కూడా, ప్రభుత్వం, పారిశ్రామిక ఆర్థిక కార్పొరేషనుల నుంచి ఋణం పొందడానికి వీలుంటుంది. ఇటువంటి ఎస్టేటు ఒకటి నిజామాబాదులో తెరవబడుతుంది. గుంటూరు, ఏలూరులలో ఈ సంవత్సరంలో రెండు ఎస్టేట్లను స్థాపించడానికి తలపెట్టబడింది.

చర్మగార పరిశ్రమ :

రాష్ట్రంలో చర్మగార పరిశ్రమాభివృద్ధికి, తృతీయ ప్రణాళికలో ఒక కోటిరూపాయలు కేటాయించడానికి ప్రభుత్వం ఉద్దేశించింది. చట్టబద్ధమైన చర్మగార బోర్డు నొకదానిని కేంద్ర తోళ్లపరిశోధనసంస్థ డైరెక్టరు డాక్టరు నాయుడమ్మ అధ్యక్షతన స్థాపించే విషయంకూడా ప్రభుత్వం పరిశీలిస్తున్నది.

"పొదుపు గ్రామం"

ఖమ్మం జిల్లా కిష్టాపురం బాలలు, బాలల దినోత్సవం నాడు అమూల్య బహుమతి పొందారు. ఆ నాడు ఆ గ్రామంలోని 128 కుటుంబాలలోనూ ప్రతి కుటుంబానికీ సేవింగ్స్ బ్యాంకు ప్యాస్ బుక్ లభించింది. ఆ వేళ కిష్టాపురంలో ఈ పథకాన్ని ప్రారంభించి ప్యాస్ బుక్కులు పంచిపెడుతూ, జిల్లా కలెక్టరు ఈ సంగతి ప్రకటించారు.

కిష్టాపురం రెండవ "పొదుపు గ్రామం". మొదటిది తనికెళ్ల. నవంబరు 2 వ తేదీన అక్కడ ఈ పథకానికి ప్రారంభోత్సవం జరిగింది. "పొదుపు గ్రామం"లో ప్రతి కుటుంబమూ, జాతీయ పొదుపు పథకానికి ఎంతో కొంత పెట్టుబడి పెడుతుంది.

ఇక్కడ ముఖ్యంగా గమనింపదగిన విశేషమేమిటంటే, 128 మంది డిపాజిటర్లలో చాలామంది స్త్రీలు.

సమితి అధ్యక్షుడు శ్రీ లక్కినేని నర్సయ్య ఈ సందర్భంలో మాట్లాడుతూ, తమ బ్లాకులోని మరో ఆరు గ్రామాలను "పొదుపు గ్రామాలు"గా చేయగలమని అన్నారు.

ప్రభుత్వ నిర్ణయాలు

పరిపాలనా సంస్కరణల సంఘం నివేదికను, పరిశీలనార్థం, మంత్రివర్గ ఉపసంఘానికి నివేదించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిశ్చయించింది.

రాష్ట్రంలోని మూడు విశ్వవిద్యాలయాలు, వాటి వాటి ఆస్తుల హామీపై ఋణం పొందడానికి అధికారాన్నిస్తూ బిల్లు తేవడానికి ప్రభుత్వం నిశ్చయించింది. ఈ విశ్వవిద్యాలయాలకు ప్రధాన పథకాల నిర్వహణకై ఋణాలు ఇవ్వడానికి విశ్వవిద్యాలయ గ్రాంటుల సంఘం సంసిద్ధత తెలిపింది. అయితే విశ్వవిద్యాలయాలకు ఋణాలు చేసే అధికారం లేదు. విశ్వవిద్యాలయాలకు ఈ వీలు కలుగజేయడానికి ఇప్పుడు ఈ బిల్లు ఉద్దేశింపబడింది.

రసాయనిక ఎరువుల కొనుగోలుకై స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా నుంచి హైద్రాబాదు స్టేట్ బ్యాంకు పొందగోరిన రూ 20 లక్షల ఋణానికి హామీగా వుండడానికి ప్రభుత్వం నిశ్చయించింది. కడప జిల్లా సహకార బ్యాంకుకు మరో రు. 6 లక్షలకు హామీగా వుండడానికికూడా ప్రభుత్వం నిర్ణయించింది. హామీని రు. 7½ కోట్ల నుంచి రు. 10 కోట్లకు పెంచడానికికూడా సహకార కేంద్ర భూమితనఖాబ్యాంకు లిమిటెడ్‌ను ప్రభుత్వం అనుమతించింది. ★

ముఖ్య వార్తలు

21—11—1960

కేంద్ర ఆర్థికశాఖమంత్రి, ఈ వేళ లోక్‌సభలో ప్రసంగిస్తూ తృతీయ ప్రణాళికకు విదేశ సహాయం రు. 750 కోట్ల వరకు లభించగలదని అన్నారు.

22—11—1960

సిడ్నీ న్యూసౌత్‌వేల్స్ విశ్వవిద్యాలయం తాలూకు గొర్రెలు, ఉన్ని టెక్నాలజీపాఠశాల అధిపతి ప్రొఫెసర్ మెక్‌మహన్, విజయవాడలో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, గొర్రెలు, ఉన్ని పరిశ్రమ ప్రధాన కేంద్రంగా చక్కగా అభివృద్ధిచెందే అవకాశం వుందన్నారు.

రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి, కేంద్ర ఆహార ప్రమాణాల సంఘంవారి సప్తమ సమావేశాన్ని ఈవేళ హైద్రాబాదులో ప్రారంభించారు.

23—11—1960

భారత, పాకిస్తాన్ దేశాల ఆర్థికమంత్రులు ఈరోజు క్రొత్తఢిల్లీలో సమావేశమై, ఉభయదేశాలమధ్య పరిష్కారం కావలసి వున్న ఆర్థిక విషయాలను చర్చించారు.

24—11—1960

భారత ప్రభుత్వం, ఐక్యరాజ్యసమితిలోని ఇండియా శాశ్వత ప్రతినిధికి వర్తమానం పంపుతూ, సమితి ప్రధానకార్యదర్శినీ, జనరల్ అసెంబ్లీ అధ్యక్షుడిని తక్షణమే కలుసుకొని, కాంగో సైనికులు ఇండియా ఉద్యోగులపై జరిపిన అత్యాచారాలపట్ల ఇండియా పక్షాన తీవ్రఅసమ్మతిని తెలియజేయవలసిందిగాను, ఈ విషయంలో వారు ఏమి చర్య గైకొంటున్నదీ తెలుసుకోవలసిందిగాను కోరింది.

25—11—1960

యూనియన్ వాణిజ్య, పరిశ్రమలశాఖ ఉపమంత్రి ఈ వేళ లోక్‌సభలో ఒక సభ్యుడు అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ, విశాఖపట్నంలో బహుశా ఒక భారీ ఎరువుల కర్మాగారం ప్రైవేటు యాజమాన్యంక్రింద స్థాపించబడవచ్చునని అన్నారు.

26—11—1960

సికింద్రాబాదులోని గాంధీ ఆసుపత్రిలో క్రొత్తగా నిర్మింపబడిన భవనానికి, ఇ. ఎన్. టి. బ్లాకుకి ముఖ్యమంత్రి నేడు ప్రారంభోత్సవం చేశారు.

ప్రథమ ఆసియా సమైక్యత ఆంధ్రప్రదేశ్ మహాసభలను, ఘనా హైకమీషనరు నేడు హైద్రాబాదులో ప్రారంభోత్సవం చేశారు.

27—11—1960

గోదావరి డెల్టాలో రెండవపంట నీటిపారుదలకు క్రొత్త షెడ్యూలు, మొదట ప్రకటించినట్లుగా 1961 వ సంవత్సరంనుంచి గాక 1962 జనవరితో ప్రారంభమయ్యే రెండవ పంటకాలంనుంచి అమలుపరచబడుతుందని రాష్ట్ర పబ్లిక్‌వర్క్స్ శాఖ మంత్రి ఈ వేళ హైదారాబాదులో వెల్లడించారు.

28—11—1960

రాష్ట్ర శాసనసభ శీతాకాల సమావేశం నేడు ప్రారంభమైంది.

ప్రభుత్వశాఖలలో అవినీతి నిర్మూలనకై, ప్రధానకార్యదర్శి ఆధ్వర్యముక్రింద ప్రత్యేకంగా ఒక శాఖను ఏర్పాటుచేయడానికి ప్రభుత్వం నిశ్చయించింది.

29—11—1960

పరిపాలనా సంస్కరణల సంఘం నివేదికను ఈ రోజు సాయంత్రం విడుదల చేశారు. పరిపాలనా వ్యవహారాలలో జాప్యం జరుగకుండావుండి, సామర్థ్యం పెంపొందడానికి అవసరమైన సూచనలు చేసే నిమిత్తం క్రిందటి జూన్‌లో ఈ సంఘం నియమింపబడింది.

రాష్ట్ర విద్యాశాఖమంత్రి ఈ రోజు శాసనసభలో ప్రసంగిస్తూ, ఆంధ్రప్రదేశ్ అంతటా, 1961 జూన్ 1 వ తేదీనుంచి 'నిర్బంధోచిత ప్రాథమిక విద్య దశలవారీగా ప్రవేశపెట్టబడుతుం దన్నారు.

30—11—1960

హైద్రాబాదు గృహనిర్మాణ బోర్డు కార్యకలాపాలు ఆంధ్ర ప్రాంతంలోని 11 జిల్లాలకు కూడా విస్తరింప బడడానికి వీలుగా ఈ బోర్డు చట్టాన్ని సవరించడానికి ప్రభుత్వం నిశ్చయించిందని ముఖ్యమంత్రి తెలియజేశారు.

1—12—1960

ప్రైవేటు పెట్టుబడి లభించినా, లభించకపోయినా కొత్తగూడెంలో ఎరువుల కర్మాగారం అవశ్యం స్థాపించబడగలదని ముఖ్యమంత్రి నేడు శాసనసభలో ప్రకటించారు.

1951 లో కుదుర్చుకున్న కృష్ణా, గోదావరి నదీజలాల పంపిణీ ఒప్పందాన్ని తిరగదోడడానికి పొరుగు రాష్ట్రాలుచేస్తున్న ప్రయత్నాల పట్ల, తీవ్ర అసమ్మతిని ప్రకటిస్తూ, రాష్ట్రపబ్లిక్ వర్క్సు శాఖ మంత్రి ఈ వేళ శాసనసభలో ఒక తీర్మానం ప్రవేశపెట్టారు.

2—12—1960

రాష్ట్రతృతీయ ప్రణాళిక పెట్టుబడి రు. 305 కోట్లు కాగా దానిలో రాష్ట్ర ఆదాయవనరుల ద్వారా లభించేది రు. 90 కోట్లనీ, కేంద్రం ఇచ్చేది రు. 200 కోట్లని ఈ వేళ ప్రకటించిన ప్రణాళిక ముసాయిదాను బట్టి తెలుస్తున్నది.

3—12—1960

ఈ వేళ రాష్ట్రపతి డా॥ రాజేంద్రప్రసాద్ 76 వ జయంతి ఉత్సవాలు దేశమంతటా జరిగాయి.

4—12—1960

పదేండ్లలో ఏడవసారి రోవర్సు కప్పును గెల్చుకోవటంద్వారా ఆంధ్రప్రదేశ్ పోలీసు జట్టు ఫుట్‌బాల్ చరిత్రలోనే ఒక నూతన అధ్యాయాన్ని సృష్టించింది.

5—12—1960

లోక్‌సభ ప్రివెంటివ్ డిటెన్షన్ (కొనసాగింపు) బిల్లును ఆమోదించింది.

6—12—1960

వీలయినంత త్వరలో తెలుగును అధికారభాషగా ప్రవేశపెట్టాలని ప్రభుత్వం ఆతురత పడుతున్నట్లు నేడు శాసనసభసమావేశంలో ముఖ్యమంత్రి అన్నారు.

7—12—1960

శ్రీ సి. బి. గుప్తా నాయకత్వాన నేడు లక్నోలో ఉత్తరప్రదేశ్ నూతన మంత్రివర్గం ప్రమాణం స్వీకరించింది.

8—12—1960

మొదటి రెండు ప్రణాళికల్లో యీ రాష్ట్రానికి తగిన మొత్తాలు కేటాయించనందువల్ల, ఇప్పుడు మూడో ప్రణాళికకు ఆమోదించిన రు. 305 కోట్లతోపాటు, కేంద్రం, ప్రైవేటు రంగాలనుండి కనీసం జనాభా నిష్పత్తి ప్రకారమయినా మరికొంత కేటాయించనుని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తిచేస్తూ, రాష్ట్ర శాసనసభ తృతీయ ప్రణాళిక ముసాయిదాను ఆమోదించింది.

9—12—1960

విజయవాడ, హైదరాబాదు పాలపొడి ప్రాజెక్టులకై యునిసెఫ్ వారిచ్చే 16 లక్షల డాలర్లను ఆమోదించామని నేడు లోక్‌సభలో వ్యవసాయశాఖ ఉపమంత్రి ప్రకటించారు.

10—12—1960

1960 ఆంధ్రప్రదేశ్ కౌలుదారి బిల్లుపై నియమించిన జాయింటు సెలెక్టుకమిటి నివేదిక సమర్పించడానికి తేదీని 1961 జూలై 31 వరకు పొడిగిస్తూ రాష్ట్ర శాసనసభ తీర్మానించింది.

11—12—1960

కాలనిర్ణయం లేకుండా నేడు రాష్ట్రశాసనమండలి సమావేశం వాయిదా వేయబడింది.

12—12—1960

అమెరికా అధ్యక్షుడుగా ఎన్నికయిన కెన్నెడీ డీన్‌రస్క్‌ను విదేశాంగశాఖ మంత్రిగా పేర్కొన్నారు.

13—12—1960

ఈ సంవత్సరం ఆహారధాన్యాల ఉత్పత్తి 750 లక్షల టన్నులవుతుందని కేంద్ర ఆహారమంత్రి లోక్‌సభ సలహాసంఘసమావేశంలో పేర్కొన్నారు.

14—12—1960

1962 సాధారణ ఎన్నికలలో ద్విసభ్యనియోజకవర్గాలను చీల్చివేయాలన్న నిర్ణయాన్ని కేంద్రం పునరుద్ఘాటించింది.

15—12—1960

నేపాల్‌రాజు మహేంద్ర నేడు ఒక ప్రకటనద్వారా ప్రథమంగా ఎన్నికయిన మంత్రివర్గాన్ని రద్దుపరచారు.

16—12—1960

భారత, పాకిస్థాన్ దేశాలమధ్య వున్న సరిహద్దు వివాదాల విషయంలో నెహ్రూ - నూన్ ఒప్పందాన్ని అమలుపరచే నిమిత్తమై నేడు ప్రధానమంత్రి లోక్‌సభలో రెండు బిల్లులు ప్రవేశపెట్టారు.

17—12—1960

రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాలలో యేర్పాటుజేసిన అఖిల భారత సమిష్టివ్యవసాయగోష్ఠిని కేంద్ర సమాజాభివృద్ధిమంత్రి ప్రారంభించారు.

18—12—1960

దేశానికి గణనీయమైన సేవచేసినందుకు ఆంధ్రప్రదేశ్‌నుంచి ఐదుగురితో సహా మొత్తం 71 మంది ఉపాధ్యాయులకు జాతీయ అవార్డులను రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్ బహూకరిస్తారని క్రొత్తఢిల్లీలో ప్రకటించారు.

19—12—1960

అఖిలభారత మలేరియా, ఫైలేరియా నిర్మూలనోద్యమ కార్యకర్తల వార్షికసమావేశాన్ని రాష్ట్రగవర్నరు ప్రారంభించారు.

20—12—1960

తృతీయ ప్రణాళికా పథకాలకు అందజేసే సహాయ కార్యక్రమాలను గురించి చర్చించడానికి ప్రపంచబ్యాంకు సభ్యులిరువురు నేడు క్రొత్తఢిల్లీ చేరుకున్నారు.

★

రచయితలు

1. డా. బూర్గుల రామకృష్ణారావు. (ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర గవర్నరు).
2. శ్రీ పోతుకూచి శ్రీరామావధాని(హోల్కారు [ప్రభుత్వ]కళాశాలలో ఆంగ్ల భాషోపన్యాసకులు, ఇండోరు, మధ్యప్రదేశ్).
3. శ్రీ రాయప్రోలు సుబ్బారావు (ప్రఖ్యాతకవి, మారేడుపల్లి, శికింద్రాబాదు—3).
4. శ్రీ రోణంకి అప్పలస్వామి, (విజయనగరం మహారాజావారి కళాశాలలో ఆంగ్లభాష శాఖాధ్యక్షులు).
5. శ్రీ శనగన నరసింహస్వామి, (తెలుగు లెక్చెరరు, ఆంధ్ర లయోలా కళాశాల, గుణదల).
6. శ్రీ నండూరి రామకృష్ణమాచార్య, (అనంతపురం. ప్రభుత్వ కళాశాలలో తెలుగు శాఖాధ్యక్షులు).
7. శ్రీ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి (వి.టి.హైస్కూల్, రాజమహేంద్రవరము, తూర్పు గోదావరి జిల్లా)
8. శ్రీ చిలుకూరి పాపయ్యశాస్త్రి (తెలుగు లెక్చెరరు, ప్రభుత్వ పి. ఆర్. కళాశాల, కాకినాడ).
9. శ్రీ మిన్నికంటి గురునాథశర్మ (బ్రాడీపేట, గుంటూరు).
10. శ్రీ ఎ. మురళీధర్ (లాకళాశాల, హైద్రాబాదు—7).
11. శ్రీ కందుకూరి రామభద్రరావు (భూపయ్య అగ్రహారం, అమలాపురం, తూర్పు గోదావరి జిల్లా).
12. శ్రీ శ్రీపాదలక్ష్మీనారాయణమూర్తి, (ప్రధానోపాధ్యాయులు, పి. హెచ్. స్కూలు, సీతానగరం, శ్రీకాకుళం జిల్లా).
13. శ్రీ మునిమాణిక్యం నరసింహారావు (విఖ్యాత రచయిత, హైద్రాబాదులో నివాసం).
14. శ్రీ పోణంగి శ్రీరామ అప్పారావు (స్పెషల్ ఆఫీసర్, పెన్షనర్స్, హైద్రాబాదు).
15. శ్రీ వై. వెంకటరావు (తెలుగు పండితుడు, పరిషత్ హైస్కూలు, ఎఱ్ఱగొండపాలెము, మార్కాపురం తాలుకా, కర్నూలు జిల్లా).
16. శ్రీ ఉత్పల సత్యనారాయణాచార్య (తెలుగు పండితుడు, సీతాఫల్‌మండి, శికింద్రాబాదు).
17. కా. లక్ష్మీనరసయ్య. (సహాయ ఉపాధ్యాయుడు, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, సిరిసిల్ల, కరీంనగరం).
18. శ్రీ మోచెర్ల రామకృష్ణకవి (కవితానికేతనమ్. అత్తిలోట అగ్రహారం, నెల్లూరు).
19. శ్రీ అడపా రామకృష్ణరావు, (ఉస్మానియా విశ్వవిద్యాలయం లో ఆంగ్లోపన్యాసకులు).
20. శ్రీ పైడిపాటి సుబ్బరామశాస్త్రి (భారతీనికేతనం, మాచవరం, విజయవాడ—3).
21. శ్రీ కుంటిమద్ది శేషశర్మ (అనంతపురం జిల్లా ధర్మవరంలోని హయ్యర్ సెకండరీ స్కూలులో తెలుగు పండితులు).
22. శ్రీ విశ్వనాథకవి (ఆంధ్రసాహితీ ప్రచారసభ, తాల్పుకూరు, 24- పరగణాల జిల్లా, పశ్చిమ బెంగాలు).
23. శ్రీ శ్రీనివాస సోదరులు (శతావధానులు, శికింద్రాబాదు).
24. శ్రీ బొడ్డు బాపిరాజు, ఏలూరు.
25. శ్రీ యం. వెంకటేశ్వర్లు, పల్లిపాలెం, వయా యానాం, కాకినాడ తాలూకా, తూర్పు గోదావరి జిల్లా.

చిత్రకారులు :

1. శ్రీ మారేమండ శ్రీనివాసరావు (గుంటూరు).
2. శ్రీ వీరిశెట్టి అచ్యుతరావు. (పుల్లేటికుఱ్ఱు).

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం

వైశాల్యం	....	1,06,041 చదరపు మైళ్ళు
జనసంఖ్య	....	3,12,60,133
పురుషులు	....	1,57,42,912
స్త్రీలు	....	1,55,17,221
సగటు వర్షపాతం	...	35.65"
అరణ్య ప్రదేశం	....	1,40,26,000 ఎకరాలు
జిల్లాలు	....	20
తాలూకాలు	....	183
రెవిన్యూ సర్కిళ్లు	....	1,000
పట్టణాలు	....	293
గ్రామాలు	...	26,450
పంటలక్రింది ప్రదేశం	...	2,93,81,000 ఎకరాలు
కొళ్ళ సంఖ్య	....	42,42,655
1958-59 లో నీటి పారుదలను పొందిన ప్రదేశం	....	68 లక్షల ఎకరాలు
1958-59 లో వుత్పత్తి అయిన ఆహారధాన్యాలు	....	61.56 లక్షల టన్నులు
పాల వుత్పత్తి	....	15.5 లక్షల గాలన్లు
రైలు మార్గాలు	....	3009.13 మైళ్ళు
జాతీయ రహదార్లు	....	1,415 ,,
రాష్ట్ర రహదార్లు	....	3593 ,,
జిల్లా పెద్ద రోడ్లు	....	8220 ,,
జిల్లా ఇతర రోడ్లు	....	2852 ,,
గ్రామాల రోడ్లు	....	3442 ,,
పాఠశాలలు	...	34,157
కళాశాలలు	....	69
వృత్తి విద్యా కళాశాలలు	....	36
ద్వితీయ పంచ వర్ష ప్రణాళిక ప్రమాణం	రూ.	179.89 కోట్లు

1960-61 బడ్జెటు:

ఆదాయం	రూ.	82.18 కోట్లు
వ్యయం	.... ,,	81.98 ,,
పెట్టుబడి ఖర్చు	.... ,,	82.44 ,,

